# గ్రీకు తత్త్వవేత్తలు

శ్రీవిరించి







# గ్రీకు తత్త్వవేత్తలు

శ్రీ విరించి

జయంతి పబ్లికేషన్స్
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.

# GREEK THATHAVAVETHALU

By :
SRI VIRINCHI

**JAYANTHI PUBLICATIONS**
KARL MARX ROAD
VIJAYAWADA - 520 002.
Ph : **0866-2577828**
Mobile : **8978261496**

First Edition : **2012**

Ó **PUBLISHER**

Title Design :
GIRIDHAR

Price : ₹ : **100-00**

DTP :
**SRI SRINIVASA GRAPHICS**
Ph : 9440397989

Printers :
**NAGENDRA ENTERPRISES**
VIJAYAWADA - 520 002.
Ph : **0866 - 2442001.**

## సోక్రటీస్ 469-399 క్రీ. పూ.

ప్రస్థావన ........................................ 4
సోక్రటీస్ ........................................ 7
జీవితతత్త్వం ........................................ 11
వ్యక్తిత్వం ........................................ 17
అభియోగం ........................................ 22
సమాధానసరళి ........................................ 25
పలాయనం తప్పు ........................................ 49
తత్త్వదర్శనం ........................................ 54

## ప్లేటో 427-347 క్రీ. పూ.

ప్లేటో ........................................ 105
రచనలు ........................................ 112
ఆదర్శం - యదార్థం ........................................ 114
రాజ్యాంగం ........................................ 122
ఆంతరిక శాస్త్ర ప్రమాణాలు ........................................ 149
స్త్రీలు - సంసారాలు ........................................ 153
వేదాంత విషయాలు ........................................ 154
పునరవలోకనం ........................................ 157

## అరిస్టాటిల్ 384-322 క్రీ. పూ.

అరిస్టాటిల్ ........................................ 160
రచనలు ........................................ 167
శాస్త్రీయ వర్గీకరణం ........................................ 169
ప్రథమ తత్త్వశాస్త్రం ........................................ 191
భౌతికశాస్త్రం ........................................ 204
అనుష్ఠాన తత్త్వశాస్త్రం ........................................ 209
పునరవలోకనం ........................................ 231

# ప్రస్తావన

**త**త్త్వశాస్త్రం, వేదాంతం – అంటే మామూలు మనుషులకు కాస్త చిన్న చూపే కాకుండా వెటకారం కూడా ఉంటుంది. జీవితానికి, దీనికి అంత సాపత్యం లేదనుకుంటారు చాలామంది. నిజానికి జీవితాన్ని పూర్తిగా, క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే 'తత్త్వశాస్త్ర దర్శనం' కొంతలో కొంత అయినా ఉండి తీరాలని విజ్ఞుల అభిప్రాయం. అంతేకాదు, జీవిత గమనం సుగమం – సుకరం అవటానికి తత్త్వశాస్త్ర పరిచయం ఉపకరిస్తుంది.

తత్త్వశాస్త్రంలో యేదో అలౌకికమయిన ఆనందం ఉంది. వేదాంతంలో జీవితపు ఎడారిని మిలమిల మెరిపించే మరీచికలు ఉన్నాయి. 'మానసిక ఆనందాన్ని, ఉల్లాసాన్ని కలుగచేసే ప్రియతమ నేస్తం' అన్నాడు తత్త్వశాస్త్రాన్ని ప్లేటో.

మనలో ప్రగాఢంగా, ప్రక్షిప్తంగా ఉన్న వెలుగు, తేజస్సు వెలికి రావటానికి వాటి సంరక్షణలో జీవితం సార్థకతను సంతరించుకొనటానికి తత్త్వశాస్త్రం అవసరం. ఒక రష్యన్ నవలలో ఒక పాత్ర అంటుంది. 'నీవు యివ్వచూపే లక్షలు, కోట్లు విలువయిన ధనం నాకు అవసరం లేదు: నేను జీవితాన్ని గురించి అడిగే ప్రశ్నలకు నికార్సయిన, సూటి అయిన సమాధానాలు కావాలి' అని. అనంత ఆకాశ పరిధిలో చిన్న వస్తువులు, పెద్ద వస్తువులు దేనికవి విడిగా మనం చూడగలగాలి, అవగాహన చేసుకోవాలి.

తత్త్వవేత్త అవటానికి, యేవో కొన్ని ఉదాత్తమయిన ఆలోచనలు ఉండడం, ఒక పాఠశాలను ప్రారంభించగలగడం చాలదు. జ్ఞానాన్ని ఉపాసించగలగాలి; ఆ వెలుగులో జీవించగలగాలి. సరళము స్వతంత్రము, ఉదారము, విశ్వాస పాత్రము అయిన జీవనం తత్త్వవేత్తకు తప్పనిసరి. 'సత్యం' మనిషిని శ్రీమంతుడిని చేయకపోవచ్చును. కాని అతడిని 'స్వేచ్ఛాజీవి'ని చేస్తుంది.

చదరంగం ఆటలా తత్త్వశాస్త్ర పఠం కూడా కాలక్షేపానికే, గాని యింకెందుకూ కొరగాదు అనుకొంటారు కొందరు. ప్లేటో, అరిస్టాటిల్ వంటి మహనీయుల మాటలు ఈ రోజున పుస్తకాలకు, పరీక్షలకు మాత్రమే పరిమితమయి ఉన్నాయని అధిక్షేపం చేస్తారు. శాస్త్రపరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ తత్త్వ దర్శన ప్రాముఖ్యం తరుగుతున్నట్లు భావిస్తారు. కాని యిదంత 'మనిషి' గురుతర బాధ్యతను గుర్తుకు తెస్తోంది. తెలియని విషయాలను గురించి కొంతమటుకయినా శక్తివంచన లేకుండా కృషి చేసి – ఊహల ద్వారా ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకుంటూ తెలుసుకోవడానికి చేసే ప్రయత్నం తత్త్వ శాస్త్రం. అన్నిటిని

సమన్వయ పరిచి మనుషులముందు ఉంచే అద్దం యిది. విలువలు, ఆదర్శాలు, పూర్ణతలో వీటికి ఉన్న స్థానం, జ్ఞానాన్ని అనుభవానికి రంగరించుకుని ముందుకు వెళ్ళడం, విశ్వాన్నంతటినీ చదవటానికి ప్రయత్నం చేయడం... యిదీ తత్త్వశాస్త్రం చేసే పని.

తర్కము, రసము, నీతి, రాజనీతి, వేదాంతం – ఇవి అయిదూ తత్త్వశాస్త్రంలోని సాధారణ విభాగాలు, అన్నీ కలిపి సమగ్రంగా చూచినప్పుడే సౌందర్యం మనకు అందుతుంది. 'తత్త్వశాస్త్రజ్ఞులు మంచివాళ్ళా, చెడ్డవాళ్ళా అన్న విషయం తర్కించుకుంటూ కాలం వృథా చేయకు; తత్త్వాన్ని తరచి తరచి చూచి నిజం తెలుసుకోవటానికి ప్రయత్నించు. ఆ నిజం నిన్ను ముగ్ధుడిని చేస్తుంది. ఆ నిజం నలుగురితో పంచుకోవటానికి ప్రయత్నం చేయి' అన్నాడు సోక్రటీస్ క్రిటోతో.

గ్రీస్ దేశ తత్త్వ చరిత్ర బహు పురాతనమయినది. ప్రకృతి ఆ దేశాన్ని భూమి, నీరుల కలయిక, ఎడబాటులతో బహు సుందరంగా తీర్చిదిద్దింది. ఆ లోయలలో మతము, సంస్కృతి, సంప్రదాయము విలసిల్లినాయి. ఏథెన్స్ నగరం గ్రీస్ రాజ్యంలో ప్రధాన మయినది. ఆసియా మైనర్‌కు చేరుకోవలెనంటే గ్రీసువాసులకు ఇదే ద్వారం. బయటి దేశాలు గ్రీసు దేశాన్ని పునీతం చేయవలెనన్నా ఇదే ప్రవేశద్వారం క్రీస్తుకు ముందు (బి.సి.) 490–470లలో స్పార్టా, ఏథెన్స్‌లు తమ తమ అంతఃకలహాలు మరిచిపోయి, ఒక్కుమ్మడిగా సమీకరించుకొని పర్షియన్లతో పోరాడాయి. యుద్ధానంతరం, ఏథెన్స్ తన నౌకలను వాణిజ్యానికి ఉపయోగించుకుంది. పురాతన ప్రపంచంలో విస్తృత వాణిజ్య రీతులను ప్రవేశ పెట్టింది. ప్రపవచంలోని ఇతర నాగరికతలు, ఆచార వ్యవహారాలు, ఆలోచనా ధోరణులు ఎలా ఉంటాయో సేకరించడం ప్రారంభించింది. క్రమంగా 'సోఫిస్టులు' తయారయ్యారు. జ్ఞాన ప్రసారం చేస్తూ ప్రపంచ పర్యటన జరిపే తత్త్వవేత్తలు వీళ్ళు. తరువాత సోక్రటీస్ ప్రభవించాడు. శిలవంటి మనిషి. నవనీత సదృశమైన మనసు, కరుణరసం హృదయమంతా నింపుకున్నవాడు. ఆడంబరం, వేషభాషలు ఎరుగని సాధారణ మనిషి. యువకులు అతని చుట్టూ బెల్లం చుట్టూ ఈగలు మూగినంత చేరేవారు. యువకులను 'పాడు' చేస్తున్నాడన్న మిషమీద 'విషం' యిచ్చి చంపేశారు అతన్ని. ఈయనతో సాన్నిహిత్యం ఉన్న ప్లేటో, అరిస్టాటిల్ ఈ తాత్త్విక చింతనను కొనసాగించారు. అనేక సమకాలీన విషయాలపైన కొత్త వెలుగులు చల్లడమే కాకుండా, ముందు తరాల వారికి ఆదర్శ ప్రాయమైన ఆలోచనలు అనేకం వదిలి వెళ్ళారు. మానవ చరిత్ర కొనసాగినంత వరకు తత్త్వదృష్టి దీనికి అనునయంగా ఉండనే ఉంటుంది. తత్త్వ దార్శనికుల ప్రవచనాలు సర్వదేశ దశ కాలాలకు చెందిన దివ్యాజ్ఞలుగా ఉండిపోతాయి. ●

గ్రీకు తత్త్వవేత్తల జీవిత, తత్త్వదర్శనాలను

సరళమైన తెలుగులో అందిస్తున్న

**"శ్రీ విరించి"**

దివ్యజ్ఞాన తత్త్వదర్శన ఆచార్యులు

సర్వదేశ దశా కాలాలకు చెందిన

కథానిక, తత్త్వదర్శనములలో ప్రత్యేక

పరిశీలన, పరిశోధన చేస్తున్న వారు.

# గ్రీకు తత్త్వవేత్తలు

## సోక్రటీస్

**క్రీ**స్తు పూర్వం ఆరవ శతాబ్దం నుండి క్రీస్తు అనంతరం ఆరవ శతాబ్దం వరకు గ్రీకు తత్త్వచింతన ప్రపంచ భావనాపటిమను సుసంపన్నం చేసింది. ఎందరో మహానుభావులు వరుసగా అవతరించి కొత్త కొత్త ఆలోచనా ధోరణులను ప్రజలకు పరిచయం చేశారు. దేశ రాజకీయ వాతావరణం, ప్రజల మానసిక ప్రతిభ వికసనం ఇందుకు తగినంతగా దోహదం చేశాయి.

పర్షియన్ దండయాత్ర విఫలం అయిపోయిన మీదట, ఈ కొత్త ఆలోచనా సరళి బహు చురుకుగా ముందుకు నడిచింది. జీవితంలోని ప్రతి రంగంలోనూ ఈ చురుకుదనం అగుపిస్తుంది.

గ్రీస్ దేశంలో ఈ నూతన వాతావరణానికి ఏథెన్స్ నగరం కేంద్రస్థానం. పెరిక్లిస్ (Pericles) ఆధ్వర్యం క్రింద వాణిజ్య రాజకీయ వైభవం వెల్లివిరిసింది. కళలు, సాహిత్యము కొత్త ఆకులు తొడిగాయి. ఏదో సరికొత్త జ్ఞాన ప్రసారాన్ని అందుకోవాలని ప్రజల మనసులు ఊరటతో నిండిపోయాయి. క్రొత్త ప్రయోగాలు ప్రారంభం అయినాయి. ప్రతిదీ పరీక్ష పెట్టుకు చూచుకోవడము, ఆలోచనకు పదును పెట్టుకోవడము, ఆత్మగతమైన స్థితికి సరిగా కనిపిస్తున్నదా లేదా అని చూచుకో వడము – క్రమంగా అలవాటు అయిపోయాయి.

శాస్త్ర విజ్ఞానము, తత్త్వచింతనము (Science, Philosophy) ప్రముఖమైన మార్పులు తీసుకువచ్చాయి ప్రజల మనసులలో. అప్పటికి  అవి ప్రత్యేక శాస్త్ర విభాగాలుగా పుట్టి పరిగణన పొంది కేవలం నూటయాభై సంవత్సరాలే అయినా, ఈ రెండు విద్యలూ మనిషిని ముందుకు తీసుకుపోగల చాకచక్యం ఉన్న క్షేత్రాలుగా ఆమోదం పొందాయి.

ముఖ్యంగా భౌతికశాస్త్రంలో వచ్చిన మార్పులు చెప్పుకోదగినవి. మైక్రోస్కోపుల వంటి సూక్ష్మాతి సూక్ష్మమైన పరికరాలు లేకపోయినా, గ్రీకు ఆలోచనాపరులు తమ

పరిశీలన, తర్కము, శోధనల మూలంగానే అణు సిద్ధాంతానికి దాదాపు దగ్గరకు వచ్చేశారు.

ఎంతో విషయ వివరణం, పరిశీలన అంశాలు, ఫలితాల ప్రకటనలు... ఇవన్నీ జరిగినా వీటన్నిటినీ గ్రంథస్థం చేసి సమీకరించే పని జరగలేదు చాలా కాలం వరకు. ఎవరికివారికి తమ సిద్ధాంతాలలో, ఆలోచనాక్రమంలో నవ్యత, సవ్యత ఉన్నట్లు నిర్ధారణ అవడాన్ని మించి మరింత మేలు ఏమీ జరగలేదు. తమ అభిప్రాయాలపట్ల మక్కువ, అచంచల విశ్వాసంతో పాటు – ఇతరుల అభిప్రాయాలు, ఆలోచనల పట్ల నిరాదరణ, ఏహ్యాభావం కూడా అంకురించసాగాయి. వాగ్వివాదాలు ఖండన మండనాలు అనుసరించాయి. సామాన్య జనుల మనసులలో ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు మిగిలిపోయాయి తప్ప, పరిష్కార మార్గాలు అనువుగా అగుపించలేదు. ఆలోచన రేకెత్తుతుందే తప్ప, అధిగమించడం లేదు – అన్న ధోరణి. ఏది నమ్మాలో, ఏది విసర్జించాలో మామూలు మనిషికి తెలియకుండా పోయే పరిస్థితి ఏర్పడింది.

జ్ఞానులు లేక సోఫిస్టులు (Sophists) అనే తెగవారు బయలుదేరారు ఆలోచనాపరుల కోవలో. వీరు వృత్తిపరంగా విజ్ఞాన శాస్త్రవేత్తలో, తత్త్వచింతనా పరులో కాదు. ప్రయాణాలు చేసి, ప్రజలను కలుసుకుంటూ, వారి ఆలోచనా క్రమాన్ని "చురుకు" పరచడమే వీరి పని. సంఘంలో వీరికి మంచి గౌరవం, ప్రతిష్ఠ. వీరిలో చాలమంది భావసంపన్నులు. ప్రజలకు చెప్పవలసిన సంగతులు వాళ్ళ వద్ద చాల వుండేవి. కొందరు మాత్రం – ప్రజలలో అవిశ్వాసాన్ని మటుకే రేకెత్తించేవారు. అంటే, వారి వద్ద ప్రతి సమస్యకు "రెండువేపుల నుంచీ సమాధాన సరళి" ఉండేది. అవును – కాదు లలో దేనినీ ఇతమిత్థంగా చెప్పరు వీళ్ళు. రెండు పక్షాల వాదనలను ప్రజల ముందు ఉంచి, మీరే ఆలోచించుకోండి అంటారు. ఆలోచించడం చాతకాని వారికి ఇది విపత్కరమైన పరిణామం. నిజమైన విలువపట్ల అనుమానాన్ని రేకెత్తించటం ఈ సందిగ్ధ పరిస్థితి నుంచి బయట పడటానికి అవసరం అయిన 'సరంజామా'ను సక్రమంగా అందించలేకపోవడం – జరుగుతూ వచ్చింది. వారి వైఖరి పైపై మెరుగులు దిద్దేదిగాను, ప్రయోగాత్మకంగాను ఉండేది. 'జ్ఞానం' అంటే ఏమిటో మాకు తెలియదు; కాని మీరు మీ స్థితిగతులను పరిశీలించుకుని మంచి మార్గాన్ని ఎంచుకుందుకు అవసరం అయిన వాతావరణం మాత్రం సృష్టిస్తాము – అంటారు. జ్ఞానము, మంచితనములకు బదులుగా తర్కము, నైపుణ్యము ప్రవేశపెట్టారు వాళ్ళు. అంతేకాకుండా మరో విచిత్రమైన అంశం,

వాళ్ళు ప్రవేశపెట్టింది ఏమిటంటే ఈ సోఫిస్టులు తమ సేవా కార్యాలకు, సంభాషణా రీతులకు హాజరయ్యే ప్రజల దగ్గర 'డబ్బు' వసూలు చేసేవాళ్ళు. రకరకాల 'ఫీజులు' నియోగించే వాళ్ళు. ఈ ధోరణి తత్త్వవేత్తలకు కంటకం, అసహనకారకం అయింది. అయితేనేం, సోఫిస్టులు ప్రజల మనసులు – వాటిలోని వికారాలు బాగా ఎరుగుదురు. ఊరికే వచ్చిన వస్తువు, ఎంత విలువ అయినదైనా కావచ్చును, ప్రజలకు నిరుపయోగంగా, అయోగ్యంగా కూడా కనిపిస్తుంది. తాము 'డబ్బు' పెట్టి కొనుక్కున్న వస్తువు–ఆలోచన పట్ల ప్రజలకు గౌరవం, అభిమానం ఎక్కువ. దానిపట్ల ఎంతో శ్రద్ధతో, అనురాగమయులై పని చేస్తారు. ఇదీ సోఫిస్టులు కనిపెట్టిన సూక్తి. అందువల్లనే వాళ్లు జనరంజకులు కాగలిగారు.

వెనుకటి మతపరమైన ఆలోచనలు, నైతిక సిద్ధాంతాలు సడలిపోతున్నాయి. 'కనిపించినది మాత్రమే నమ్ముతాము' అనే ధోరణులు ప్రబలుతున్నాయి. అటువంటి తరుణంలో ఓ తత్త్వదార్శనికుడు, మహాపురుషుడు అవతరించవలసిన అవసరం ఉన్నది.

ఈ అవసరం సోక్రటీస్ (Socratees) జననం ద్వారా ఫలించింది.

* * * * *

సోక్రటీస్ జీవితాన్ని గురించి, తాత్త్విక ధోరణులను గురించి తెలుసుకోవటానికి ఆయనంత ఆయన వ్రాసిన సమాచారం ఏమీ మన ముందు లేదు. ఆయన బాల్యం, యవ్వన దశలను గురించి ఎక్కువ సమాచారం తెలియదు. వృద్ధాప్యాన్ని గురించి మటుకు అనేక వివరాలు ఉన్నాయి.

పెరిక్లిస్ మరణించేనాటికి సోక్రటీస్ నలభై సంవత్సరాల వయసువాడు. ఆ రోజుల్లో ఏథెన్స్ నగరవాసులు పుస్తకాలు వ్రాసేవాళ్ళు కాదు. విషాదాంత రచనలు ఎక్కువ తప్ప, గద్య రచనలు – జీవిత వివరణలు పుస్తక రూపం ధరించేవి కాదు.

అరిస్టోఫేన్స్ (Aristophanes), అమిపియస్ (Amipisias), యూపోలిస్ (Eupolis) అనే పద్యనాటక కర్తలు (జానపద రీతులలో) – సోక్రటీస్‌ను తమ రచనలలో పాత్రగా, మూలపురుషుడుగా వాడుకున్నారు.

అరిస్టోఫేన్స్ అనే అతను, నాటకకర్త మేఘాలు (The Clouds) అనే నాటకం వ్రాశాడు. అందులో సోక్రటీస్‌ను ఇతర అనుయాయులను పాత్రలుగా చిత్రించాడు. ఈ నాటకం ఒక్కటీ పరిశీలించి చూస్తే, ఎవరైనా సోక్రటీస్ 'సోఫిస్ట్' అనే నిర్ణయానికి

వస్తారు. ఇతని దృష్టిలో సోఫిస్టులకు నైతికము, మతపరము అయిన అభిప్రాయాలు ఏమీ ఉండవు. సోక్రటీస్‌ను ఇలాగే ఒక బాధ్యతారహితమైన వ్యక్తిగా చిత్రించాడు, చూపించాడు.

తరువాత ప్లేటో (Plato) ఈయన రచనలు, తత్త్వచింతనము గ్రంథస్థం చేశాడు. అలాగే జెనోఫన్ (Zenophon), ఇషైన్స్ (Aeschines) అనేవారు కూడా సోక్రటీస్‌ను 'పాత్రగా' వాడుకుని అతనికి ప్రచారం తీసుకువచ్చారు. అయితే వీరందరూ సోక్రటీస్‌కు సమకాలికలు కాదు. ఉదాహరణకు ప్లేటో, సోక్రటీస్ కంటె నలభైమూడు సంవత్సరాలు చిన్నవాడు. తతిమ్మా ఇద్దరూ ప్లేటోకు సమకాలికులు.

జీవిత చరిత్రలు వ్రాయడం అనేది గ్రీకు సంప్రదాయంలో క్రీస్తు పూర్వం మూడవ శతాబ్ధంలో మటుకే ఆరంభం అయింది. కవులను గురించి సామాన్య జనంలో ఉత్సాహం, వారి జీవిత వివరాలను తెలుసుకోవాలనే కుతూహలం ఉండేది గాని, తత్త్వవేత్తలను గురించి ఎరుగవలెననే ఆలోచన అంతగా లేదు. అందువల్లనే వచ్చిన కొద్దిపాటి పుస్తకాలు సైతం త్వరలోనే మటుమాయం అయిపోయినాయి.

తరువాత తరాలవారు వ్రాసిన జీవిత చిత్రణలలో పరస్పర విరుద్ధమైన విషయాలు కూడా చోటు చేసుకోవడం తప్పనిసరి అవుతుంది. సోక్రటీస్‌ను గురించి చెప్పిన పై ముగ్గురు చరిత్రకారులు మూడు విధాలుగానూ చిత్రించారు ఆయన రూప లావణ్యాలను.

ప్లేటో చిత్రించిన సోక్రటీస్ హాస్యప్రియుడు, గొప్ప తత్త్వవేత్త, వేదాంత పరమైన ప్రాతిపదిక ఉన్న వ్యక్తి. సమకాలిక వ్యవహారాలు, ఆలోచనా ధోరణులు ఎరిగినవాడు. శాస్త్ర పరిజ్ఞానంలో దిట్ట.

చరిత్ర పురుషుడుగా సోక్రటీస్‌కు ఒక రూపం ఉంటే, తత్త్వవేత్తగా మరో రూపం దొరుకుతుంది మనకు, ఆనాటి రచనలు పరిశీలించినప్పుడు.

'సోక్రటీస్ సంభాషణలు' (Socratic Dialogues) అనే సాహిత్య రూపకల్పన ప్లేటో చేసినది. విషయాలను సంవాద (సంభాషణ) రూపంలో ఎక్కువగా విశద పరచవచ్చును అన్న అభిప్రాయం ప్రారంభమైన రోజులు అవి.

ప్లేటో ఇంకా తనకై తాను ఒక తత్త్వదర్శనాన్ని కనుగొనినప్పుడు, సోక్రటీస్‌ను పాత్రగా చేసుకొని ఆ మహాపురుషుని ఆలోచనలను, అభిప్రాయాలను చదువరుల ముందుకు తీసుకురావడానికి, ఆయన స్మృతి చెరగకుండా ఉండటానికి ఇటువంటి ప్రయోగం చేసినట్లు అగుపిస్తుంది. ప్లేటో రచనలు లేకపోయినట్లయితే సోక్రటీస్ ఆలోచనా సరళి ప్రపంచానికి అందకుండానే పోయేది.

# జీవిత తత్త్వం

**సో**క్రటీస్ ఏథెన్స్ నగరంలో 469 (క్రీ.పూ.) సంవత్సరం జన్మించాడు. చారిత్రక ఆధారాలు లేకపోవడం వల్ల కొందరు ఈ సంవత్సరం 470 అంటారు. ఆయన తండ్రి సోఫ్రొనిస్కస్ (Sophroniscus), తల్లి ఫనరెట్ (Phaenarete)

తండ్రి రాతి విగ్రహాలు తయారుచేసే వృత్తిలో ఉండేవాడు. తల్లి మంత్రసాని.

సోక్రటీస్‌కు ప్రత్యేకమైన వృత్తి అంటూ ఏదీలేదు. మధ్య వయసులో ఆయన 'సైన్యం'లో పనిచేసినట్లు కొన్ని దాఖలాలు ఉన్నాయి.

వృద్ధాప్యంలో మటుకు బీదతనం ఆయనను క్రుంగదీసింది.

క్సాంతిపె (Xanthippe) అనే ఆమెను సోక్రటీస్ తన యాభైవయేట వివాహమాడాడు. ఈమె అతనికి రెండవ భార్య అని చెబుతారు. బహు గయ్యాళి మనిషిగా ఆమెకు పేరు వచ్చింది. నాటకకర్తలు ఆమెను అలా రూపొందించారు. అయితే అందుకు దోహదం చేయగల ఆధారాలు మటుకు మనకు ఎక్కడా కనిపించవు. ప్లేటో రచనలలో ఈ విషం సూచనగానైనా లేదు. అంతే కాదు. సోక్రటీస్ వంటి పరమ అలౌకికమైన భర్తతో కాపురం చేసి నెగ్గుకు వచ్చినందుకు మనం ఆమెను అభినందించి, ఆమెపట్ల సానుభూతి చూపాలి.

సోక్రటీస్‌ది భారీ శరీరం, అందవికారమైన ముఖ కవళికలు; చప్పిడి ముక్కు; దట్టమైన కనుబొమల కిందుగా తేజోవంతమైన కళ్ళు, వెడల్పాటి నోరు, పొడువాటి గడ్డం ఉండేది. దరిమిలా అతనికి బట్టతల కూడా ఏర్పడింది. భౌతికంగా బహు బలవంతుడు, సహనశీలుడు. నడుస్తూ వున్నప్పుడు ఒక పక్కకు వొరిగేవాడు. పాదరక్షలు ఉపయోగించేవాడు కాడు. మార్గ మధ్యంలోనే "సమాధి" స్థితికి వెళ్ళిపోయి ఎంతోసేపు మంత్రముగ్ధుడిగా నిలబడి ఉండిపోయేవాడు.

ఇదీ అరిస్టోఫేన్స్ తన క్లౌడ్స్ (Clouds) అన్న పుస్తకంలో సోక్రటీస్‌ను గురించి ఇచ్చిన వర్ణన.

అయితే అతని మనసు ఇంకా సృజనాత్మకత సంతరించుకొనని రోజులలో కూడా – చాల స్పష్టంగా, చురుకుగా, ఉత్సుకతతో నిండి ఉండేది. అతనికి కృతకత, మాయలు, మర్మాలు రుచించేవి కాదు. నమ్మకాలు ఎంత స్థిరంగా ఉండేవో సంకల్పం కూడా అంత అచంచలంగానూ, అపరిమితంగానూ ఉండేది. అతడి ఆలోచనా క్రమం

ఎలా శుద్ధంగా, సజావుగా వుండేదో ఆచరణ రీతులు కూడ అలాగే అసందిగ్ధంగా ఉండేవి. తార్కికత అతని ఆలోచన, ఆచరణలలో తొనికిసలాడుతూ ఉండేది.

ప్రతీదాన్ని శంకిస్తున్న సందిగ్ధయుగంలో నైతికత, మంగళకరము అయిన ఆలోచనలకు ఆయన నాంది పలికాడు. ఈ ఆలోచనలకు, ప్రాతిపదిక జ్ఞానం అన్నాడు. మంచి ఏమిటో చేయకుండా, దానిని చూడాలని అభిలషించడం సాధ్యమయ్యే పని కాదని ఆయన వాదం. అంటే ఆలోచనలకు, ఆచరణకు నడుమ "ఎడం" వుండటానికి వీల్లేదన్నమాట. ఆయనంత ఆత్మనిగ్రహము, నిజాయితీ ఉన్నవాళ్ళు బహు అరుదు. ఈ లక్షణాలను ఆయన నొక్కి చెప్పడం, మానవ వర్తనంలో ఇది 'తప్పనిసరి' అని వక్కాణించడం, ఎక్కువ మంది శత్రువులను అయిష్టపరులను తయారు చేసింది.

సోక్రటీస్ కేవలం నైతిక తత్త్వవేత్త అనుకోగూడదు. ప్రగాఢమైన మత తత్త్వవేత్త కూడా. మత నైష్ఠికత ఆయనలో మూర్తీభవించి ఉండేది.

వర్తమాన సమాజంలో ఉన్న మౌఢ్యాన్ని, సంకుచిత తత్త్వాన్ని ఆయన అంగీకరించలేదు. 'చిల్లర దేవుళ్ళ'ను సరకు చేయవద్దన్నాడు. భగవత్ తత్త్వానికి ప్రతీకలుగ ఇలాంటి దేవతామూర్తులు ఉంటే ఉండవచ్చును గాని – వారి వెనుక పరుగులు తీసి జీవితాలను మరింత దుఃఖభాజనం చేసుకోవడం కూడదన్నాడు.

సోక్రటీస్‌లకు 'అంతర్వాణి' (Supernatural Voice) లో నమ్మకం. అదే ఆయనను నడిపించేది. తప్పుదారిని పోతూ ఉన్నప్పుడు హెచ్చరికలు చేసేది. అయితే ఇది కేవలం అంతర్వాణి యేనా, లేక బహిరంగ ప్రలోభమా, తాదాత్మ్యం వల్ల కలిగే భారమా – అనేది విడదీసి చూడగలగడం కష్టం. ఆయన ఆ వాయిస్‌ను నమ్మేవారు. దానికి, ప్రత్యేకించి ఏ భగవత్ రూపానికి సంబంధం కలిపేవాడు కాదు. "ప్రబోధం" తప్పనిసరి అయినది. ప్రవర్తనకు అదే గీటురాయి, మార్గదర్శనం.

సోక్రటీస్ ప్రజలకు – ఆ తరం వారికి, ముందు తరాల వారికి కూడ రకరకాలుగా కనిపించవచ్చు.

అవివేకి –

ప్రలోభపరుడు –

సుజ్ఞాని –

వేళాకోళం మనిషి –

అర్థం కాని వ్యక్తి.

అయితే, ఆయనలో కొట్టవచ్చినట్లు కనిపించే లక్షణాలు :

దయామయమైన హృదయ వర్తనం,

అతి సూక్ష్మంగా విషయాల వివరాలను గమనించగలగడం

సమయానికి ఆసరాగా నిలచే యుక్తి, స్ఫూర్తి, అణకువ, మెలకువ.

సదా సంతోషమూర్తిమత్వం.

– ఇవన్నీ వేళాకోళం, అపహాస్యం ఆయన మాటలలో మరుగుపడిపోయేవి.

హాస్య ప్రవృత్తి ఆయనకు మెండు.

ఎంత గంభీరమైన విషయాన్ని అయినా, కాస్తో కూస్తో "హాస్యాన్ని" జోడించి తప్ప చెప్పేవాడు కాదు.

మంచి స్నేహశీలి.

మాటలు ఈటెలుగా వాడేవాడు.

అతని ధోరణి చుట్టూ ఉన్న వారికి 'కంపరం' పుట్టించేది. ఎందుకంటే కృతకత, 'ముసుగు వ్యవహారాలు' పైకొకటి – లోపల మరొకటి – ఇలాంటి స్థితిగతులు సోక్రటీస్‌కు సుతరామూ గిట్టేవి కాదు.

సత్యాన్ని యధాతథంగా చూడగలగడం, దర్శించడం, దానిలో నిమగ్నులవడం... ఇదే ఆయన ఆచరణ మార్గాలు ప్రజలకు.

ఏమాత్రం కృతకత, బాహ్యాడంబరం లేని తత్త్వ దార్శనికులు సోక్రటీస్ అంటే అభిమానంగా ఉండేవారు, గౌరవంగా చూచుకునేవారు. ఆయన అంతరంగ మిత్రులైతే చెప్పనే అక్కరలేదు. విపరీతంగా ప్రేమించేవారు, ఆరాధించేవారు.

సోక్రటీస్ మానవ భావ ప్రపంచాన్ని అప్పుడు ఇప్పుడు ఇక ముందు కూడా ప్రభావం చేయగలిగిన వాడు.

అతని సూటితనం నచ్చనివాళ్ళకు కొంత ఏహ్యభావం ఏర్పడేది. ఏమి ఇతని గొప్పతనం అని నిరాదరణ కూడా చూపేవారు.

ఇతరులకు ఇతడు 'నడుస్తున్న భగవంతుడు'

సోక్రటీస్ అమరుడైన వ్యక్తి.

తాను నమ్మిన సిద్ధాంతానికి బలి అయిన మహాపురుషుడు.

అంతేకాదు, ప్రవక్త, భావితరాల వారి అభిప్రాయసరళిని విపరీతంగా ప్రభావితం చేసిన ఆలోచనాపరుడు.

* * * * *

ఏథెన్స్‌లో ఆర్చెలస్ (Archelaus) అనే ఒక తత్త్వవేత్త ఉండేవాడు.

సోక్రటీస్ ఇతనికి అనుయాయి. ప్రారంభదినాలలో, అనాక్సగొరస్ (Anaxagoras) అనే తత్త్వవేత్త ఆలోచనాధారలను, సిద్ధాంతాలను ఇతను ఎక్కువగా ప్రచారం చేస్తూ ఉండేవాడు.

అనాక్సగొరస్ (500–428) ఆ యుగంలో ఉత్తమ భావుకుడు. ముప్పయి సంవత్సరాల పాటు ఏథెన్స్‌లో ఉన్నాడు. 450లో పెర్షియాతో షరీకు అయినాడనే అభియోగం మీద మరణశిక్ష విధించారు ఇతనికి. అయితే పెరిక్లిస్ సహాయంతో తప్పించుకొని లాంప్సాకస్ (Lampsacus) వెళ్ళి స్థిరపడ్డాడు. రాజకీయ వ్యవహారాలు అనేకం ముడిపడి ఉన్నాయి ఇతనిపైని అభియోగాలలో.

సోక్రటీస్ మానసిక పరిణామాన్ని గమనించడం ప్రత్యేకత సంతరించుకున్న విషయం.

ఏథెన్స్ నగరాన్ని దర్శించిన తత్త్వవేత్తలు, ఆలోచనాపరులందరినీ అతను కలుసుకుంటూ ఉండేవాడు. ఆలోచనా పరుడుగా కనిపిస్తున్న ఏ వ్యక్తినీ అతను కలుసుకోకుండా ఉండేవాడు కాదు.

డెల్ఫిలో ఓ దేవాలయం ఎపోలో (Appollo) అక్కడ దేవత.

దేవాలయంలో ప్రశ్న వేశాడు ఓ మామూలు పౌరుడు.

"ఎవరైనా సోక్రటీస్ కంటె తెలివైన వారు ఉన్నారా ?" అని...

"లేదు" అన్నది జవాబు, దేవత నుండి.

మతము, రాజకీయము, నైతికము అయిన ప్రశ్నలకు ఈ దేవత జవాబులు ఇస్తూ ఉండడం పరిపాటి.

ఈ కథను మనం ఎలా తీసుకున్నా, ఇది ముందుగా సోక్రటీస్‌ను కూడా కలవరపరిచింది.

'నాకేమీ తెలియదు అన్న సంగతి నాకు స్పష్టంగా తెలుసును' అని సోక్రటీస్ అభిప్రాయం, తనను గురించి.

తన అజ్ఞానాన్ని గురించి 'ఎఱుక' ఉన్నవాడే నిజమైన 'జ్ఞాని' అని గమనించగలగడానికి, గుర్తించటానికి సోక్రటీస్‌కు కొంత సమయం అవసరం అయింది. దేవాలయంలో ప్రశ్నలకు సమాధానాలు ఎలా వస్తాయో, ఎంత సాధికారంగా ఉంటాయో అదంతా పరమరహస్యం, విచిత్రం.

తర్కము, నీతిశాస్త్రము ఆయనను ఎక్కువగా ఆకర్షించాయి.

ప్రశ్నలు వేయడం, రకరకాల జవాబులు రాబట్టటం, ఈ జవాబులను వింగడించడం, వాటి స్వారస్యాన్ని పరిశీలించడం, అవసరమైతే ఖండించడం – విపులీకరించడం ప్రశ్నల మీద ప్రశ్నలు, ఉప ప్రశ్నలు – ఇదీ అతని పద్ధతి.

ఇతరుల మనసులలో ఉన్న 'అస్పష్టత'లను పరిహరించటానికి ఇది మంచి మార్గం. సోక్రటీస్ దీని వల్ల జనసామాన్యులలో ఎక్కువ పలుకుబడి, ప్రాచుర్యం సంపాదించాడు.

'సాహసం' అనే మాట వినబడింది – అనుకుందాం.

సాహసం, అంటే ఏమిటి ? ఎలా ఉంటుంది ? దానిని నిర్వచించడం ఎలా ? నిర్వచనాలు సరిపోతాయా ? మరింత విపులీకరిస్తే ఈ లక్షణం ఎలా పరిణామం చెందుతుంది ?... ఇటువంటి ఉపప్రశ్నలు అవతరించేవి.

సాహసం అంటే అనేకులు అనుకుంటున్న అభిప్రాయాలు తెలిసి వచ్చేవి.

అభిప్రాయాలలో స్పష్టత, నిదానము తీసుకురావటానికి ఇది సులభ సూత్రం.

ఈ రోజున మనం ఇది 'అలవాటు అయిపోయిన ప్రక్రియయే' అనుకోవచ్చునుగాని, సోక్రటీస్ ప్రారంభం చేసిన రోజులలో ఇది రకరకాల ప్రతిస్పందనలు తీసుకు వచ్చింది.

గుణము, లక్షణము, సారము, రూపము, లావణ్యము, మూలము, శీలము – ఇలాంటి అనేక రీతులు ఈ పద్ధతి నుండే బయలు వెడలినాయి.

'నేను గురువును కాదు' 'బోధకుడిని కాదు' అనేవాడు సోక్రటీస్ అతి తరచుగా. 'నాకో చాకచక్యం ఉన్నది. ఇతరుల మనసులలో స్పష్టంగానో, అస్పష్టంగానో ఓలలాడుతున్న అభిప్రాయాలను యుక్తాయుక్తంగా బయటకు లాక్కురావటం నాకు చేతనైన విద్య.'

తల్లి మంత్రసాని అవడం వల్ల ఆ వృత్తి శారీరక లక్షణం కాక – మానసిక కార్యంగా తనకు అలవడిందని సోక్రటీస్ చెపుతూ ఉండేవాడు.

అతడి ప్రశ్న పరంపరలు ఇతరులకు వేళాకోళం చేస్తున్నట్లుగా, ఎకసక్కెంగా చూస్తున్నట్లుగా, అపహాస్యంపాలుగా కనిపించేవి. కాని వాటి వెనక ఉన్న 'విజ్ఞత' చాలా దూరం పోయిన తరువాత గాని తెలిసి వచ్చేది కాదు.

సోక్రటీస్ నాలుగు బజార్ల కూడలిలో నిలబడేవాడు, అనుయాయులతో కలిసి. అటువంటి స్థలం అయితే నలుగురిని కలుసుకోవటానికి, మాట్లాడటానికి అవకాశం ఉంటుంది. ఆయనకు ప్రత్యేకించి ఏమీ పనిలేదు. బజారులో నలుగురినీ ప్రశ్నించటానికి, వారి నుంచి తన అనుమానాలకు, సందేహాలకూ సమాధానాలు రాబట్టవచ్చునని ఆయన ఉద్దేశ్యం.

అతడి చుట్టూ ఎప్పుడూ కొందరు మిత్రులు, అనుయాయులు గుమిగూడి ఉండేవారు. నాలుగు బజార్ల కూడలిలో అతని స్థావరం – ఏదో సన్నివేశాన్ని, మాటను, మనిషిని, తీరుతెన్నులను విశ్లేషిస్తూ – సంభాషిస్తూ నిలుచోవడం వల్ల జనానికి కొంత ఆకర్షణ, 'తమాషా చూస్తున్న ధోరణి' ఉత్పన్నం అయ్యేది.

వివేకంగా మాట్లాడడం, ఒకరిని మరొకరు బోల్తాకొట్టడానికి ప్రయత్నించడం, పని – పాట లేని వాళ్ళందరూ ఈ సంభాషణలకు చిలువలు, పలువలు అల్లి చెప్పుకుంటూ ఉండడం – ఇదంతా సోక్రటీస్ మీద 'అభియోగం' తీసుకురావటానికి దారి తీసింది.

ప్లేటో మేనమామ, మాతామహుడు ఈ 'సోక్రటీస్ సర్కిల్'లో సభ్యులు. అందువల్ల అతి చిన్న వయసులోనే ప్లేటో, సోక్రటీస్‌కు శిష్యుడుగా రూపొందాడు. రాజకీయ వాతావరణంలో ఇమిడి పోవటానికి ప్రయత్నం చేస్తూనే, ప్లేటో తత్త్వజ్ఞుడుగా కూడా రూపొందడం జరిగింది.

సోక్రటీస్ మరణం... అందునా శిక్షాపూర్వకమైన మరణం – ప్లేటోను చాలా చింతింపచేసింది. ఆ మహాపురుషుడి స్మృతిని నియమబద్ధంగా చదువరుల ముందు ఉంచాలనే ధోరణిలో, ఆ సంభాషణలను యధాతథంగానూ, తన ఊహలు జోడించి రచనలుగా మలిచాడు.

# వ్యక్తిత్వం

**వృ**ద్ధాప్యంలో సోక్రటీస్ దరిద్రాన్ని వరించవలసి వచ్చింది. ఇందుకు కారణం ఆయన తన 'కర్తవ్యం'లోనే మునిగిపోయి, ఎలాంటి వృత్తిని చేపట్టలేకపోవడం. అయితే 45, 46 సంవత్సరాల వయసు వచ్చేంతవరకు అతనికి డబ్బుకేమీ లోటు లేదు.

మరణశిక్ష పొందినప్పుడు ఆయన వయసు 70 సంవత్సరాలు. చనిపోయేటప్పుడు ఆయనకు ముగ్గురు పిల్లలు. చంకలో పిల్లవాడితో ఆయన భార్య క్సాంతిపై (Xanthippe) చివరిరోజు ఆయనను జైలులో చూడటానికి వచ్చిందని ప్లేటో రచనలలో సమాచారం దొరుకుతుంది.

తిండిపుష్టి ఉన్న మనిషి, సారాయం ఎంత తాగినా వివశుడైపోయే వాడు కాదు.

దుస్తులు వేసుకోవడంలో గూడా ఆయనకు ప్రత్యేకత ఉంది. ఒక జత ధరించాడంటే, వాటిని మార్చటానికి సంవత్సరాలు పట్టేది. పాదరక్షలు చేసేవాళ్ళ మీద పగ తీర్చుకోవడానికి అన్నట్లు ఆయన చెప్పులు వేసుకోకుండానే తిరిగేవాడు. ఆయన ఆకారం, వాలకం చూడముచ్చటగా ఉండకపోగా, కొంత బీభత్సం కలిగించేదిగా కూడా ఉంటుందని చెప్తారు.

మానసికంగా చాలా చురుకైనవాడు. ఆయనకు వినిపించే 'ధ్వని' అంతర్వాణి – ఎన్నో సూచనలు, సలహాలు ఇస్తూ ఉండేది. ఈ సూచనలను పెడచెవిన పెట్టిన వాళ్ళు అనేక అనర్థాలకు ఆలవాలం అయిపోయినట్లు సంఘటనలు 'రికార్డు' అయినాయి. ఈ సూచనలన్నీ అంతఃస్ఫూర్తి నుండే వచ్చాయనటానికి లేదు. కొన్ని దేవతల ఆదేశాలు మంచిచెడ్డల గురించి, నైతిక వర్తనం గురించి ఇవి మాట్లాడేవి కాదు. ఈ ధ్వనిని వినడం, ఈ ఆదేశాలను ఇతరులకు తెలపడం, ఆ ప్రకారమే తానూ – తన అనుచరులు నడుచుకునేటట్లు చూడడం – ఇదంతా సోక్రటీస్ బహు సంయమనంతో చేసేవాడు.

ఆయనలో మరో విశేషం ఏమిటంటే – ఎన్నోసార్లు 'సమాధి' స్థితిలో ఉండిపోవడం. ఈ వ్యవధి బహు తక్కువే కావచ్చును. కాని ఒకమారు – పగలు, రాత్రి – ఒక రోజంతా ఉండిందని ప్లేటో వ్రాశాడు. ఆయన వ్యవహార సరళిలో ఎంతో మార్మికత, తాదాత్మ్యత ఉన్నాయని చెబుతాయి ఈ సంఘటనలు.

ఆయన వర్తనం వల్ల ఎప్పుడూ తన కంటె ఎక్కువ తెలిసినవారి 'పాదసన్నిధి'ని కూర్చుని జ్ఞానం పొందాలనే ఉత్సాహం ఉన్నట్లుగా కనిపిస్తున్న సోక్రటీస్ అందరికంటె

తానే ‘జ్ఞానవంతుడు’గా రూపొందినట్లు అగుపించడం – ఒక రకంగా పరస్పర విరుద్ధమైన విషయం అంటారు కొందరు. ఇతరుల దోష ప్రకటనల కోసమే ఈయన ఎదురుచూస్తూ ఉన్నాడా – గొప్ప ‘రంధ్రాన్వేషి’ తప్ప ఇంకేమీ కాడా సోక్రటీస్ అనిపిస్తుంది ఒక్కోమారు.

జ్ఞానానికి ఒక పరాకాష్ట ఉన్నది. ఆ పరిమితి ఏమిటో ఆయనకు తెలుసును. తాను, ఇతరులు ఆ పరిమితి నుంచి ఎంత ‘దూరం’లో ఉన్నారో తెలుసుకుంటూ ఉండటమే సోక్రటీస్ చేస్తున్న పనిలాగ కనిపిస్తుంది. మనుషులు చెబుతూ ఉండే సూక్తులు, ఆచరణలో అవలంభించే కుయుక్తులు – ఈ రెండిటినీ సరిపోల్చి చూచుకుని సరదాగా నవ్వుకోవడం ఆయనకు స్ఫూర్తి ఇస్తుంది, బహుశ.

తాను చెబుతున్న విషయాలు పూర్వపు ఆర్ఫిక్ మతం (Orphic Religion) లో ఉన్నాయని, ఆత్మ అవినాశి అనే విషయం అక్కడ నొక్కి చెప్పినారని సోక్రటీస్ పదే పదే గుర్తుచేస్తూ ఉంటాడు. ముందు రాబోయే జన్మలు – కర్మఫలం వల్ల మంచి, చెడు జరుగుతూ ఉండడం – ఇలాంటి ఆలోచనలు ఆయన ఆ ‘పాత’ మత సంప్రదాయాల నుండి తీసుకున్నాడు. సోక్రటీస్ నాటికే ఆర్ఫిక్ మతంలో కొన్ని దుస్సాంప్రదాయాలు, అవలయాలు ఆరంభం అయినాయన్న మాట. సోక్రటీస్ అతి చిన్న వయసులోనే ఆర్ఫిక్ మత ‘దీక్ష’ తీసుకున్నాడు. ఈ మత పద్ధతులు ఆయనకు అమిత ఆమోదయోగ్యంగా హత్తుకుపోయినాయి. చట్టానికి అనుయాయిగా విధేయుడుగా ఉండడం, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించకుండా ఉండడం వంటి లక్షణాలు ఆయనకు ఇందుమూలంగానే ఏర్పడినాయి.

ఆనాటి సాంఘిక మానసిక స్థాయిని గురించి, దాని ప్రభావం సోక్రటీస్‌పై ఎలా ముద్రితమయినదీ తెలుసుకోవడం కూడా అవసరం.

ఏథెన్స్ నగరం గొప్ప వాణిజ్య కేంద్రంగా రూపొంది ఉన్నది. రాజకీయ కేంద్రస్థానం కూడా. ఆలోచనా పరులకు, విజ్ఞానులకు రాజధాని. అన్ని రకాల ఆలోచనలు, అభిప్రాయాలు అక్కడ నుండే ‘వికేంద్రీకరణ’ పొందుతాయి. ఈ సౌకర్యాలన్నీ ఉన్నాయి గనుకనే తరువాత శతాబ్దంలో ప్లేటో ఇక్కడ తన ‘ఎకాడమీ’ని స్థాపించగలిగాడు. పైథోగరస్ ఏర్పరచిన తాత్త్విక చింతన తగిన వాతావరణాన్ని కూర్చింది. నైతిక విలువలు, రాజకీయ అవసరాలు క్షణక్షణానికీ మారిపోతున్న స్థితులలో ‘మనిషి’కి ప్రాధాన్యం ఇచ్చే సంస్కృతి ఏర్పడవలసిన తరుణం ఆసన్నం అయిందని సోక్రటీస్ ముందుగానే గ్రహించాడు.

ప్రకృతి సూత్రాలవల్ల పరిశోధన భావం, వస్తువులు ఎట్లా ఏర్పడుతున్నాయి. తిరిగి ఎట్లా విడిపోతున్నాయి ? – అనే తాత్త్విక వేదాంత విషయాలపై ప్రాక్ పశ్చిమ పరంపరల అభిప్రాయాలను సోక్రటీస్ ముందుగా అధ్యయనం చేశాడు.

అనాక్సగోరస్ (Anaxagoras) అనే పూర్వ తత్త్వవేత్త రచనలలో ఒక అభిప్రాయం సోక్రటీస్‌ను బాగా ఆకర్షించింది. అది :

మనసు సహజమైన ధర్మానికి, క్రమతకు మూలమైన వస్తువు.

క్రమతకు, మానవ వర్తనంలోని తీరుతెన్నులకు మనసే కారణం, ఆధారం.

ఇది వ్యక్తి సంబంధమైన విషయంగా చెప్పినా, సోక్రటీస్ దీనిని విశ్వస్వరూప అవగాహనకు వాడుకున్నాడు. విశ్వం అంతటి వెనుక ఏదో తార్కికము, సహేతుకము అయిన ప్రణాళిక ఉండి ఉండాలి. 'మనసే' విశ్వానికి మూలాధారం అయితే, ఈ విశ్వంలోని వస్తువులన్నీ తనకు తగిన ఉచితమైన రూపాన్ని, గుణాన్ని, స్థితిని పొంది ఉండాలి.

సోక్రటీస్ అనాక్సగోరస్ రచనలు క్షుణ్ణంగా చదివాడు. అయితే 'మనను' అనే మాటను ఆయన కేవలం సూచనాత్మకంగా, ప్రతీకగా ఉపయోగించాడన్న సంగతి అర్థం అవడంతోటే – సోక్రటీస్‌కు తన భ్రమ వదలిపోయింది. అందుచేతనే తనకు ప్రకృతి శాస్త్రాలు (Natural Sciences) అర్థం చేసుకునే బుర్ర లేదు అని నిర్ధారణకు వచ్చేశాడు. తన కొత్త పద్ధతి పరిశీలనను కొనసాగించాడు.

ఆన్టిఫనే (Antiphon) అనే సోఫిస్ట్ (Sophist) సోక్రటీస్‌ను రెండు రకాలుగా నిందించి, అతని అనుయాయులందరినీ చిన్నాభిన్నం చేసి వారు తన దగ్గర చేరేందుకు వీలవుతుందేమోనని ప్రయత్నం చేశాడు. ఒకటి సోక్రటీస్ సన్యాసి లాంటివాడు : బట్టల విషయం, మనిషి వాలకం – ఇవన్నీ భయంకరంగా ఉంటాయి. రెండు – అతను తాను చెప్పే విషయాలకు ప్రతిఫలంగా అనుయాయుల వద్ద డబ్బు తీసుకోడు. డబ్బు తీసుకోకుండా చేసే ఉపదేశాలన్నీ వృథా!

సోక్రటీస్ ఈ రెండు అభియోగాలకు తిన్నగా సమాధానాలు ఇచ్చాడు.

సోక్రటీస్‌కు నలభై సంవత్సరాల వయసు వచ్చేసరికి, అత్యంత 'వివేకవంతుడు'గా పేరు వచ్చి ఉండాలి. ఆయనకు సోఫిస్టులతో పరిచయం సాంగత్యం ఈ వయసుకు చాలా ముందుగానే జరిగింది. ప్రొటాగొరస్ (Protagoras) అనే సోఫిస్టుతో సోక్రటీస్ వాగ్వివాదాన్ని, ప్లేటో తన సంభాషణలలో గుదిగుచ్చాడు.

* * * * *

యూరపు దేశాల తాత్త్విక సంపదను సమకూర్చి పెట్టినవాడు సోక్రటీస్. మామూలు నైతిక విలువలపట్ల ప్రజలను హెచ్చరిస్తూ ఉండడమే కాదు ఆయన చేసిన పని. అంతమాత్రమే అయినట్లయితే – మరణశిక్ష విధించవలసిన అవసరం ఉండేది కాదేమో!

అనిటస్ (Anytus) ఈయనను అపార్థం చేసుకున్నాడు.

ప్లేటో (Plato) కు ఈయన ఆదర్శం.

అరిస్టోఫెన్స్ (Aristophanes) ఈయనకు వక్రభాష్యాలు చెప్పాడు.

అయితే ఈ మూడు సందర్భాల వెనుక, ఏదో అసాధారణము, విశిష్టము అయిన వ్యక్తిత్వం ఉండి ఉండాలి.

తాత్త్విక సంపదకు సోక్రటీస్ కూర్చిన మణులు ఇవి :

ఆత్మ – దాని అమృతత్వము.

రెండువేల సంవత్సరాలుగా 'ఆత్మ' (Soul) అనే పదం పరిచయమైనదే అయినా, మామూలు మనిషికి ఇది జాగ్రదావస్థలో కేంద్రస్థానం; వివేకానికి, నైతిక వర్తనానికి కారణభూతం.

ఈ వాతావరణాన్ని తయారు చేసి ప్రాచుర్యం సాధించాడు సోక్రటీస్.

గ్రీకు సాహిత్యంలో – హొూమర్ (Homar) అనే సాహిత్యవేత్తలగాయితు – సైకి (Psyche) అనే పదం తరచుగా కనిపిస్తూ ఉంటుంది. హొూమర్ రచనలలో యీ 'సైకి' అనేది – మనిషి చనిపోతున్నప్పుడు చివరిమారుగా ఈ ప్రపంచానికి వదలి వెళ్ళబోయే 'భూతం' Soul-Self-Psyche-Body అనే మాటలు తత్త్వ పదజాలంలో రకరకాలుగా పరిణామం చెందుతూ వచ్చాయి. వీటి పరస్పర ఆశ్రయ సంబంధం రకరకాలుగా వర్ణితం అయినాయి.

సోక్రటీస్ ప్రయోగంలో ఆత్మ సిద్ధాంతం కేవలం మానసిక శాస్త్రానికి సంబంధించినది కాదు. భౌతిక శాస్త్రానికి సంబంధించినదీ కాదు. 'ఆత్మ' అంటే ఏమిటో ఎక్కడా నిర్వచనం కనిపించదు. అది మనలో ఉన్నది. అది ఏమి అయితే – నేమి మన మంచి చెడ్డలు వివేక అవివేకాలు ఆ ప్రాతిపదిక మీదనే నిర్ణయం అవుతున్నాయి. మనకు అదే గీటురాయి. దానిని ఇంద్రియాలలో చూడడం, కొలవడం సాధ్యం కాదు. ఆత్మ గుణాలు ఏమిటో మనకు తెలియదు. మనిషిలో ఉన్న ఈ 'దైవాంశ' మంచిని – చెడ్డను వింగడించి తెలుసుకోవటానికి ఉపకరిస్తోంది. ఉన్నత నైతిక జీవనం గడపటానికి దోహదం చేస్తుంది.

కేవలం సిద్ధాంతీకరించకుండా, ఈ 'ఆత్మ' అనే దానిని నైతిక ప్రమాణాల ఉన్నతికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టడం సోక్రటీస్ ఉద్దేశ్యం.

సుగుణములు (Virtues) - నైతిక వర్తనానికి కీర్తిపతాక. అన్ని సుగుణాలూ ఒకే సుగుణంలోకి ముడుచుకుపోతాయి.

దుర్గుణములు (Vices) – వీటికి మూలం అజ్ఞానం, అవివేకం వల్ల కలిగే భ్రమలు.

తప్పు చేయడం అనేది మనఃపూర్వకంగా జరగదు. 'మంచి' అనేది ఏమిటో స్పష్టంగా తెలిసినపుడు 'చెడు' చేయడం అన్నది అసంభవం. నైతిక బలహీనతలకు అంతగా ఆస్కారం లేదు. అంటే మనిషి తనకు 'మంచిది' ఏదో తెలిసినప్పటికీ దానిని చేయకుండా ఉంటాడు. 'చెడు' ఏదో తెలిసినప్పటికీ దానిని చేయకుండా ఉండలేక పోతాడు... అన్న స్థితిని సోక్రటీస్ నిరాదరించాడు అనుకోగూడదు.

చెడును మంచిగా భ్రమించడం వల్ల తాత్కాలికంగా ఆ చెడ్డ పనులలో ఇరుక్కు పోతున్నాడు.

అందరిలోనూ ఒక అచంచలమైన ప్రవృత్తి ఉంది. సుఖాపేక్ష, శ్రేయోభిలాష.

చెడు చేయడం అన్నది మంచిని గురించి పూర్తిగా తెలియకపోవడం వల్ల తప్పుగా తెలియడం వల్ల జరుగుతుంది. చెడ్డపని చేసినా దానివల్ల ఏదో మంచి ఫలితం వస్తున్నదనే భ్రమలవల్ల మనిషి కొన్ని దుష్కార్యాలు చేస్తున్నాడు.

నిజమైన మంచి

నిజమైన జ్ఞానం

నిజమైన శ్రేయస్సు.

వీటిని తరచి తరచి తెలుసుకున్నందువల్లనే మనిషి నిజమైన విలువలకు ఆశ్రయం ఇవ్వగలుగుతాడు.

# అభియోగం

**సో**క్రటీస్ జీవిత చరిత్ర వివరాలు యధాతథంగా మనకు ఎక్కడా దొరకవు అన్న విషయం ముందే ప్రస్తావించుకున్నాం.

ఆయనను గురించి ప్లేటో తన సంభాషణలలో ఇచ్చిన వివరాలు చాలా మటుకు సంపూర్ణంగా ఉంటాయి. వీటి నుంచే సోక్రటీస్ చరిత్ర మనం అవగాహన చేసుకోవలసి ఉంటుంది.

సోక్రటీస్ తత్త్వసంపద ఏమిటి ? అన్న ప్రశ్న కన్నా ఆయనను ఇప్పటికీ మనం మరచిపోలేక పోవటానికి ముఖ్యమైన కారణం ఏమిటి ? అన్నది ముందుగా జవాబు చెప్పుకోవలసిన ప్రశ్న.

సోక్రటీస్ మీద కొందరు పౌరులు అభియోగం తెచ్చారు.

ఈ అభియోగానికి ఆయన సమాధానం చెప్పుకున్నాడు.

తీర్పుదారులు అభియోగాన్ని, సమాధానాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఆయనకు మరణశిక్ష విధించారు.

ఆ తీర్పు చెబుతూ ఉన్నప్పుడు వాళ్ళ కంఠాలు గద్గదం అయినాయి. పెదాలు వణికాయి, మాటలు తడబడ్డాయి.

"మరణశిక్ష అనుభవించవలసిన నా కన్నా మీరే ఎక్కువగా భయపడుతున్నట్లున్నారే!" అని చమత్కరించాడు సోక్రటీస్ వారిని.

ఈ శిక్షను తప్పించుకొనేందుకు ఆయనకు అవకాశం లభించింది.

అయినా 'దొంగచాటు'గా పారిపోవడం ఇష్టం లేక ఆ పని చేయలేదు సోక్రటీస్.

చివరిక్షణం వరకు జాగరూకంగా ఉండి 'మృత్యువు'ను గురించి ఆషామాషీగా సంభాషిస్తూనే – విషపాత్రను ఆనందంగా అందుకుని గడగడ తాగేశాడు, ఇదేదో అతి సామాన్యమైన విషయం అయినట్లుగా.

'అభిప్రాయాల కోసం బాధలు భరించేవాళ్ళ' కోవకు చెందినవాడు సోక్రటీస్.

తనకు సంభవిస్తున్న అవలయలకు ఎవరినో నిందారోపణ చేయకపోవడం, తన సిద్ధాంతాలను ధైర్యంగా ప్రకటించడం.

ప్రాణాపాయ స్థితిలో సైతం – ఎలాగయినా బతుకు కొనసాగించాలని ఆపేక్ష పడకుండా వుండడం.

– ఈ లక్షణాలన్నీ సోక్రటీస్‌ను 'అమృతమయుడి'ని చేస్తాయి.

❊ ❊ ❊ ❊ ❊

399 (క్రీ.పూ.) సంవత్సరం.

మెలెటస్ (Meletus), అనిటస్ (Anytus), లైకన్ (Lycon) అనే ముగ్గురు ఏథెన్స్ పౌరులు సోక్రటీస్ పైన అభియోగం తెచ్చారు.

మెలెటస్ యువకుడు. సోక్రటీస్ అంటే ఇతనికి వ్యక్తిగతంగా ఇష్టం లేదు. పైగా స్పర్థలు కూడా ఉన్నాయి. ఈ విరోధభావాన్ని విస్తృతపరుస్తూ, సోక్రటీస్‌పై అభియోగం తీసుకువచ్చాడు. ప్రాసిక్యూషన్‌కు ఇతనే నాయకుడు.

అనిటస్ డెమోక్రాటిక్ వ్యవస్థకు సంబంధించినవాడు. ఇతనికి 'సోఫిస్ట్'లు అంటే ద్వేషం. సోక్రటీస్ కూడా 'సోఫిస్ట్' అని ఇతని అభిప్రాయం. అందుకనే అభియోగదారులలో ఒకడుగా చేరాడు.

లైకన్ బాగా చదువుకున్నవాడు. ధారాళంగా మాట్లాడగల వ్యక్తి.

మొదటి అభియోగం :

సోక్రటీస్ అపప్రచారాలు చేస్తున్నాడు (Heresy).

తన అంతర్వాణి (Divine Voice) ప్రబోధిస్తున్నదనే ప్రేరణతో అనేక 'అసంగత'మైన విషయాలను ప్రచారం చేస్తున్నాడు.

రెండవ అభియోగం :

సోక్రటీస్ యువతరాన్ని – దుర్గుణాలతో, అపోహలతో వారి మనసులు నింపి పాడుచేస్తున్నాడు.

ఈ అభియోగాలు మత సిద్ధాంతాలకు, రాజకీయ వాతావరణానికి సంబంధించినవి.

సమాజంలో పెద్ద మనషులుగా చెలామణి అవుతున్న అనేక మంది తాలూకు 'అహంభావ' ధోరణులను వెలికిలాగి వాటికి సూదులు గుచ్చి అప్పటికే సోక్రటీస్ ఆ వర్గాలలో సుస్థిరమైన 'అపప్రధ' పొంది ఉన్నాడు.

తాను తప్పులు చేస్తున్నానని ఒప్పుకోమని 'జ్యూరీ' ఆయన్ను అడిగింది. "నేను తప్పులు చేస్తేకదా!" అన్నది సోక్రటీస్ ధోరణి...

జ్యూరీలో పెద్దలు తమంతవారు మరి వేరెవరూ లేరనుకుంటారు. వారికి పొగడ్తలు కావాలి. సోక్రటీస్ అలాంటి 'మంచి' మాటలను, కీర్తనలను అందించలేదు.

అభియోగానికి సంబంధించినంత వరకు ఆనాటి కోర్టు పద్ధతి ఇది.

అభియోగం తీసుకు వచ్చిన వారు ముందుగా తమ అభిప్రాయాలు, సాక్ష్యాధారాలతో చెబుతారు. వారు న్యాయవాదుల మద్దతు తీసుకోగూడదు.

ఫిర్యాదీ చెప్పడం అయిన తర్వాత, అభియోగం పొందినవారు – ప్రతివాది సమాధానం చెబుతారు.

ఆనాటి జ్యూరీలో అయిదువందల మంది పౌరులు సభ్యులుగా ఉన్నారు.

సమాధానం విన్న తర్వాత, అధ్యక్షుడు లేక జడ్జి ఎలాంటి ముక్తాయింపు చేయనవసరం లేకుండానే తమ తీర్పును ఓటు ద్వారా తెలియపరుస్తారు. జ్యూరీ అభియోగానికి అనుకూలంగా, ప్రతికూలంగా సరిసమానమైన సంఖ్యలో ఓట్లు వచ్చినట్లయితే, ఆ అభియోగం వీగిపోయినట్లు లెక్క.

అభియోగానికి అనుకూలంగా ఓట్లు ఎక్కువ వచ్చినట్లయితే, న్యాయస్థానం 'శిక్ష' ప్రతిపాదించదు: ఫిర్యాదు చేసినవారే ఓ శిక్ష సూచిస్తారు. నేరస్థుడు మరో 'శిక్ష' సూచిస్తాడు. అప్పుడు 'జ్యూరీ' మధ్యే మార్గంగా శిక్షను నిర్ణయిస్తుంది.

సోక్రటీస్ జీవితంలో గడిచిన ఈ ఉత్కృష్ట పరిణామాన్ని ప్లేటో సమాధానం (Appology) అన్న పేరుతో గ్రంథస్థం చేశాడు.

ఈ సమాధానంలో మూడు భాగాలు స్పష్టంగా కనిపిస్తాయి.

1. సోక్రటీస్ తనపై వచ్చిన అభియోగానికి ఇచ్చిన సమాధానం.
2. సోక్రటీస్ తనకు విధించమన్న 'శిక్ష'.
3. సోక్రటీస్ కోర్టును హెచ్చరిస్తూ చేసిన ప్రకటన.

ఈ 'సమాధానం' కేవలం అభియోగానికి పరిమితం అయినది కాదు. సోక్రటీస్ యొక్క భావనా బలం, తాను చేసిన పనులను గురించి తనకున్న అభిప్రాయాలు, మానవ మనస్తత్వంలోని వికారాలు.. ..ఇవన్నీ ఇక్కడ సాక్షాత్కరిస్తాయి.

ఈ సమాధానాన్ని యధాతథంగా చదవడం వల్ల సోక్రటీస్ భావపటిమ అవగాహన అవుతుంది.

# సమాధాన సరళి

**నా**పైన నేరారోపణ చేసినవారు మిమ్మల్ని ఎంతగా నొప్పించగలిగారో నాకయితే తెలియదుగాని, నేను మాత్రం వారి వాదనలకు పూర్తిగా వశుడిని అయిపోయాను. ఆ వాదనలు అంత నిక్కచ్చిగా, సూటిగా, ఫలవంతంగా ఉన్నాయి. అయితే ముఖ్యమైన మరో సంగతి ఏమిటంటే వాళ్ళు చెప్పిన దానిలో ఒక్క అక్షరం అయినా నిజం లేదు! ఒక్క అభిప్రాయమూ 'యథార్థ'మైనది కాదు. వాళ్ళు చెప్పిన మాట ఒకటి నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. అదేమిటంటే నేను మిమ్మల్ని తప్పుదారి పట్టించకుండా మీరు చాలా జాగ్రత్తపడాలి – అని అంటే అక్కడికి నేను గొప్ప – ప్రతిభావంతమైన వక్తనన్నమాట! వారు ఈ మాటలు అనటానికి స్వాభిమానాన్ని కొంతవరకు చంపుకునే ఉండాలి. నేను అంత ప్రతిభావంతమైన వక్తను కాను. కాకపోతే – ఆ మాటకు 'ఎప్పుడూ నిజం చెప్పేవాడు' అని అర్థం చేసుకుంటే, నేను తప్పకుండా అటువంటి వక్తనే. 'యుక్తా యుక్తమైన భాషణకారుడు' అని వారు ఉపయోగించిన పదానికి 'సత్య సంధుడు' అని అర్థం చెప్పుకుంటే – ఆ విశేషం నాకు తప్పనిసరిగా నప్పుతుంది. వాళ్ళమాదిరి 'వాచలత్వం' మటుకు నాకు లేదనే సంగతి ముందుగా జెప్పడం అనవసరం అనుకుంటున్నాను.

నాపైన నేరారోపణ చేసినవారు మచ్చుకు ఒక 'నిజ'మైనా చెప్పలేదు : మీరు నిజం వినాలి; తెలుసుకోవాలి. అందుకోసం నేను ఈ సందర్భంలో ఇమిడి ఉన్న 'నిజం' అంతా మీ ముందు ఉంచుతాను. అయితే ఆ ప్రత్యర్థుల మాదిరి వాగాడంబరంతో, తేనె పూసిన కత్తుల వంటి మాటలతో కాదు. నా మనసుకు ముందుగా వచ్చే మాటలు మీ ముందు ఉంచుతాను. వాటికి మర్మము, మాయ వంటివి పులమను. మీరు న్యాయం చేస్తారనే నా నమ్మకం. అంతకంటే మీరు మరేమీ అనుకోవద్దు. మీలాంటి వాళ్ళను – నా వయసులో మనిషి ఏదో కుతుకమైన భాషలో స్కూలు కుర్రవాడి లాగానో లేక ఉపన్యాసకుడి మోస్తరుగానో పదజాలాన్ని వెదుక్కుని ప్రయోగిస్తూ మాట్లాడడం యోగ్యమైన పని కాదని నా అభిప్రాయం. ఒక్క విషయం మాత్రం మీ ముందు ఉంచుతున్నాను. నాకు అలవాటు అయిన ధోరణిలో – నాలుగు బజార్ల కూడలి స్థలంలో నన్ను నేను సమర్థించుకుంటూ మాట్లాడే పద్ధతి నేను అవలంభిస్తాను. దాన్ని మీరు క్షమించి అనుమతించాలి. నా మాటలకు, ధోరణికి మధ్యలో అడ్డు రాకండి. న్యాయస్థానం ముందు నిలబడడం అనేది నా జీవితంలో ఇదే మొదటి మారు. నాకిప్పుడు డెబ్బయి సంవత్సరాలు అందుచేత ఈనాటి మాటలకు, భాషకు

నేను అపరిచితుడిని. నేను విదేశీ పౌరుడిని అయినట్లయితే నా మాట్లాడే పద్ధతిని మీరు తప్పకుండా మన్నిస్తారు కదా. అలాగే అనుకుని నేను ఉపయోగించే మాండలికాన్ని మీరు అనుమతించాలి. నేను పుట్టి పెరిగిన భాషలోనే మాట్లాడుతాను. అదే సహేతుకమైన సంగతి కూడా. మంచిదైనా, కాకపోయినా మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఒక విషయం మీద మటుకు దృష్టి కేంద్రీకరించండి. అదేమిటంటే – నేను చెబుతున్న వాదనలు సజావుగా ఉన్నాయా లేదా అని ఆలోచించి గమనించండి. న్యాయమూర్తుల ప్రథమ కర్తవ్యం ఇదే గదా! న్యాయవాది అయినవాడు నిజాన్నే పలకాలి గదా !

న్యాయ విచారణ కోసం ఆయత్తమైన జ్యూరీ సభ్యులారా! నామీద తీసుకు వచ్చిన అభియోగాలను గురించి, ఈ అభియోగం చేసినవారిని గురించి ముందుగా మాట్లాడడం నా కర్తవ్యం అనుకుంటాను. అది అయిన పిమ్మట తతిమ్మా సమాచారం ప్రస్తావిస్తాను. ఎందుకు ఇలా విభాగం చేస్తున్నానంటే – నన్ను గురించి అనేకులు నిందాపూర్వకంగా మాట్లాడడం మీరు ఇప్పటికి ఎన్ని సంవత్సరాల నుంచో వింటూనే ఉన్నారు. ఆ ఆరోపణలలో ఒక్కటైనా నిజం లేదు. నాకు అనిటస్ అతని స్నేహితులు కంటె కూడా ఆ వెనుకటి ఆరోపణ దారులంటేనే ఎక్కువ భయం. అనిటస్, అతని స్నేహితులు బహు బలవంతులు, దృఢ నిశ్చయులు. అయినా పూర్వపు ఆరోపకులు అంతకంటే మిన్న అయినవారు, ఆ పూర్వ ఆరోపకులు ఎవరో మీరు ఎరుగుదురు గదా. చిన్నతనం నుంచి మీకు నన్ను గురించి ఎరుక పరుస్తున్న వాళ్ళు. మీ చిన్న మనస్సులలో నన్ను గురించి వృధాలాపాలు పలికి అసత్యాలు నింపినవాళ్ళు. వాళ్ళు ఏం చెప్పారో మీకు గుర్తు ఉండే ఉంటుంది.

– సోక్రటీస్ అని ఒక జ్ఞాని ఉన్నాడు. ఆయన దగ్గర అన్ని విషయాలను గురించి సిద్ధాంత పరమైన సత్యాలు ఉన్నాయి. స్వర్గాన్ని గురించి, నరకాన్ని గురించి సాధికారంగా మాట్లాడుతాడు. వాదనలో బలహీనులను తన బలం వల్ల ఓడించి ఎగతాళి చేస్తాడు. తన విపరీత జ్ఞానాన్ని ప్రదర్శిస్తాడు.

వీళ్ళు – ఈ మాటలు చిన్నతనం నుంచి మీకు నూరిపోస్తున్న వాళ్ళు – నా పైని నిజమైన నిందారోపకులు. ఇటువంటి పుకార్లు విన్న వాళ్ళందరూ – నేనో నిరీశ్వర వాదినని, ప్రతి మనిషిలోను – విషయంలోను రంధ్రాన్వేషణ చేస్తూ ఉంటానని అనుకుంటారు.

నన్ను ఇలాంటి నిందలకు గురి చేస్తున్న వాళ్ళు అసంఖ్యాకంగా ఉన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ పనిని విడవకుండా చేస్తున్నారు; అంతకంటే ముఖ్యమైన విషయం, వాళ్ళు మిమ్మల్ని బాల్యంలోనో, కౌమారంలోనో దగ్గరకు చేర్చుకుని ఈ

మాటలన్నీ చెప్పారు. వాళ్ళు గెలుపొందారు. ఎందువల్లనంటే, నన్ను గురించి నేను సమర్థించుకుందుకు గాని, సంజాయిషీ చెప్పుకుందుకు గాని అక్కడ అవకాశం లేదు. ఏకపక్షంగా నన్ను గురించి మీ మనసులలో నిర్ణయం జరిగిపోయింది. అలాంటి వాళ్ళ పేర్లు, వివరాలు చెప్పగలగడం గూడా ఈ రోజున నాకు సాధ్యం కాదు.

కేవలం అసూయ, నిందారోపణలు చేయడంలో ఉన్న ఉత్సాహం కొద్దీ అనేకులు నన్ను గురించి మీ మనసులు పాడుచేశారు. వాళ్ళు చెప్పిన మాటలన్నీ వాళ్ళకు స్పష్టంగా తెలుసుననుకోవడానికి కూడా వీలులేదు. ఎందుచేతనంటే చాలా మంది చెప్పుడు మాటల మీదనే ఆధారపడతారు. వాళ్ళందరినీ ఇక్కడికి సాక్ష్యం కోసం గాని 'క్రాస్ ఎగ్జామినేషన్' కోసం గాని తీసుకురావడం కుదరని పని. కేవలం నా వాదనను నేను చేసుకోవాలి. కనిపించని శత్రువులను ఖండిస్తూ మాట్లాడాలి. అంతే ! అందుకనే ముందుగా చెబుతున్నాను. నా మీద నిందారోపణ చేసిన వాళ్ళు రెండు తెగల మనుషులు.

ఎదురుగా ఇక్కడ నిలచిన వాళ్ళు.

ఇక్కడకు రాకుండానే దుమ్మెత్తి పోసే వాళ్ళు.

ఇక్కడ నిలచిన వాళ్ళకంటె రెండో తెగ మనుషులు నాకు, మీకు ఎక్కువ అపకారం చేశారు.

అనేక సంవత్సరాలుగా నా పైని జరుగుతూ ఉన్న నిందారోపణ కార్యక్రమాన్ని ఇప్పుడు నేను ప్రతిఘటించాలి; మీ మనసులను వాటి ప్రభావం నుండి వేరు చేయడానికి ప్రయత్నిస్తాను. ఇది చాలా కష్టమైన పని అని నాకు తెలిసిన విషయమే. అయినా తప్పదు. నా శక్తివంచన లేకుండ మీముందు విషయప్రస్తావన చేస్తాను. ఈశ్వర సంకల్పం నెరవేర్చటానికి ప్రయత్నిస్తాను. న్యాయ సూత్రాలకు అనుగుణంగా వర్తించటానికి పూనుకుంటాను.

ముందుగా 'మెలెటస్' నా పైన ఆరోపణ ఎందుకు చేశాడో చెబుతాను, నా మీది అభియోగం ఒక మారు పునశ్చరణ చేస్తాను, వినండి.

'సోక్రటీస్ స్వర్గ నరకాలను గురించి – ఆకాశంలో ఉన్న దేవతామూర్తులు, భూగర్భంలో ఉన్న జీవరాశులు అన్నీ తనకే క్షుణ్ణంగా తెలిసినట్లు మాట్లాడుతాడు. బలహీనుల వాదనలను తిరస్కరిస్తాడు. అందరూ తనను అనుసరించాలని నొక్కి చెబుతాడు.'

– ఇది వాళ్ళ మాట !

అరిస్టోఫెన్స్ నాటకంలో సోక్రటీస్ ఎలా గిరగిర తిరుగుతాడో మీరు చూచారు. గాలిలో ఎలా తిరుగుతాడో, నాకు తెలియని అనేక విషయాల గురించి ఎలాంటి అభిప్రాయ ప్రకటనలు చేస్తాడో మీరు బాగా చూచి ఉన్నారు. అటువంటి మాటలపైని నాకు నమ్మకం లేదని కాదు. కాని నాకు అలాంటి విషయాలలో యేమాత్రం ఆసక్తి లేదు. మీలో చాలామంది ఇదివరలో నా సంభాషణలు విని ఉన్నారు. నేను అటువంటి ప్రకటనలు చేశానో, లేదో మీకు కూడా బాగానే తెలుసును. మీరే నాకు సాక్షులు. నేరారోపణలో యేమాత్రం నిజం కాదనే విషయం మీరే ఇతరులకు చెప్పాలి. అసంబద్ధమైన విషయాలను గురించి నేను ప్రస్తావించినట్లు మీరు ఎప్పుడైనా విన్నారా ? ఇలాంటిది ఎన్నడూ జరగలేదని మీరే వారందరికీ చెప్పాలి. ఇదే మాదిరి, ఇతర ఆరోపణలలో గూడా అంతంత మాత్రమే నిజం ఉంది.

నేను యువతరానికి దుర్బోధలు చేస్తున్నానని, వారి నుండి ఇందుకు ప్రతి ఫలంగా డబ్బు వసూలు చేస్తున్నాని నేరం. ఈ పని నేనెప్పుడూ చేయలేదు. ఈ సంగతి మీకు బాగా తెలుసును.

ఇతరులకు 'బోధ' చేయగలగడం మంచి పనే, అసలు అలా 'బోధ' చేయగల జ్ఞానం కలిగి ఉండడం గొప్ప విషయం కూడా. వియోటినికి చెందిన జార్జియస్, కేయోస్‌కు చెందిన ప్రొడికస్, ఎనిస్‌కు చెందిన 'హిప్పియాస్' మాదిరి అలా బోధ చేయగలిగితే జన్మ సార్థకం అయినట్లే. వీళ్ళు దేశంలో ఏ నగరానికైనా వెళ్ళగలరు, యువకులను తమ కార్యకలాపాల్లో, నగర స్నేహితాలు వదిలివేసి తమ వెంట తిరగమని చెప్పగలరు, తమకు డబ్బు ఇచ్చి పోషించమని అడగగలరు. మరో మహానుభావుడు ఉన్నాడు. 'హిప్టోనికస్ కుమారుడైన 'కారియస్'కు బోధనలు చేసి సోఫిస్టులందరూ కలిసి వసూలు చేసినంత డబ్బు అతనొక్కడి దగ్గరే తీసుకున్నాడు. కారియస్‌తో నేను ఇతడిని గురించి మాట్లాడాను. నాకు ఆ పోకడ ఏమీ అర్థం కాలేదు.

అయితే మరొక ప్రశ్న వేయవచ్చును. 'సోక్రటీస్! మరి నీవు ఏం చేస్తున్నావు! అందరూ నిన్ను గురించే ఎందుకు చెడ్డగా మాట్లాడుతున్నారు ? నీవు అందరితోపాటు మామూలు వ్యవహారాలు, పనిపాటలు చూచుకుంటూ ఉంటే ఎవరూ నిన్ను గురించి చెడ్డగా మాట్లాడరు గదా ? నీ ప్రవర్తన వింతగా, విడ్డూరంగా ఉన్నది గనుకనే అందరూ రకరకాలుగా మాట్లాడుతున్నారు. దీనికి నీ సమాధానం ఏమిటి ? చెప్పు' అని.

మీరు అడుగుతున్నది యుక్తమైన ప్రశ్నే. నాకు ఇలాంటి అపప్రథ ఎందుకు వచ్చిందో మీకు చెప్పటానికి ప్రయత్నిస్తాను. శ్రద్ధగా వినండి. మీకు పూర్తి నిజాన్ని, సాకల్యమైన యదార్థాన్ని చెబుతున్నాను వినండి.

ఈ అవసరమైన మాటలన్నీ రావటానికి ఒకే కారణం ఉన్నది. అది ఏమిటంటే–

నాకు ఒక రకమైన 'జ్ఞానం' ఉన్నది.

ఎలాంటి జ్ఞానం అనుకుంటున్నారు ?

'మనిషికి – మానవ వర్తనానికి సంబంధించిన జ్ఞానం' అది.

బహుశ ఇందాక నేను ప్రస్తావించిన నలుగురు పెద్ద మనుషులూ, ఈ మానవ వర్తనానికి అతీతమైన జ్ఞానాన్ని సంపాదించుకున్న వాళ్ళు అయిఉంటారు. అంతకంటె ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు. నాకు అటువంటి జ్ఞానం లేదు. అలాంటి జ్ఞానం నాకు ఉన్నదీ అని చెప్పేవాడు, తప్పనిసరిగా అబద్ధాల కోరు అయిఉండాలి. వృథా ప్రసంగి అయిఉండాలి. నేను అసంబద్ధంగా మాట్లాడుతున్నా ననుకోకండి. నేను చెబుతూ ఉన్నది కేవలం నా అభిప్రాయం కాదు. తిరుగులేని, తిరస్కరించజాలని ఒక ఉదాహరణ. సాక్ష్యం – మీ ముందు ప్రవేశపెడుతున్నాను. నాకు ఉన్న జ్ఞానానికి సాక్ష్యంగా డెల్ఫిలోని భగవంతుడిని – దేవతను – చూపుతున్నాను.

ఫారీహాన్ (Phaereahon) మీకు అందరికీ తెలిసిన వాడే . నాకు చిన్నతనం నుంచి అతను స్నేహితుడు. ఇటీవలి కార్యకలాపంలో అతను తన పాత్రను నిర్వహించడం మీరంతా చూచే ఉన్నారు. త్రాసిబూలస్ (Thrasybulus) నాయకత్వం కింద జరిగిన దండయాత్రలో ఎదుర్కొని అతను తిరిగి మన నగరంలో 'డెమోక్రసీ' వ్యవస్థాపన అవడానికి సహకరించాడు గదా! అతను ఎంత చురుకైనవాడో, ఏ పనయినా చేపట్టితే తుదివరకూ ఎలా నైపుణ్యంగా నిర్వహిస్తాడో మీకు తెలుసును. అతను ఒకనాడు డెల్ఫి వెళ్ళాడు. అక్కడి దేవతను అడిగాడు : ప్రశ్న : 'సోక్రటీస్ కంటె తెలివైన వాడు – జ్ఞాని – ఎవరైనా ఉన్నారా? అన్నది ఆ ప్రశ్న. అక్కడి దేవతా స్వరూపం సమాధానం చెప్పింది. 'ఎవరూ లేరు' అని. ఫారీహాన్ ఇప్పుడు మన మధ్య లేడు. అతడు చనిపోయాడు కనుక సాక్ష్యం ఇవ్వలేడు ఈ సంఘటనకు. అయితే అతని సోదరుడు, ఈ కోర్టులోనే హాజరై ఉన్నాడు. అతడు నా మాటలకు తగిన సాక్ష్యం, ఆధారం చూపించగలడు. ఛారక్రేటిస్ (Chaeraecrates) మీ కందరకూ పరిచయమైనవాడే. ఇంతకంటే నేనేం చెప్పలేను.

ఈ సంఘటన మీ దృష్టికి ఎందుకు తీసుకువస్తున్నానో గమనించండి. నా మీద నిందారోపణలు, అనవసరమైన ప్రస్తావనలు అసలు ముందులో ఎలా ప్రారంభమైనాయో మీరు గమనించాలని నా విజ్ఞప్తి.

దేవత చెప్పిన మాటలు విన్నప్పుడు నేను ఎలా నిర్ఘాంతపోయానో మీరు ఎరుగరు! దేవత ఇలా ఎందుకు చెప్పినట్లు ? సరళమైన భాషలో ఎందుకు మాట్లాడ లేదు ? నాకు ఏ మాత్రం 'జ్ఞానం' లేదనే విషయం నాకు క్షుణ్ణంగా తెలుసును. అటువంటప్పుడు నాకంటె ఈ ప్రపంచంలో ఎవరూ జ్ఞానవంతుడు లేడు అని చెప్పడంలో దేవత అభిప్రాయం ఏమిటి ? దేవత అబద్ధం చెప్పినట్లు అనుకోగలమా ? అలా అబద్ధం చెప్పడం సబబు కాదని దేవతకు తెలియదా ?

– ఇలా కొంతసేపు నాలో నేను వితర్కించుకుని దేవత సమాధానాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. దేవత సమాధానం సరైనది కాదా అని పరీక్షించటానికి సైతం పూనుకున్నాను. జ్ఞానమూర్తిగా పేరు ప్రతిష్టలు పొందిన ఒక మహాపురుషుడిని సందర్శించాను. ఆయన్ను పలుకరించి దేవత చెప్పిన విషయం అబద్దం అని తేల్చుకుందామని చూచాను. 'నేను జ్ఞానవంతుడిని అన్నావు. ఇదుగో, ఈ మహా పురుషుడు మరింత జ్ఞానవంతుడు. నీవు చెప్పినది అబద్ధం' అని దేవతకు చెప్పాలనుకున్నాను.

చాలాసేపు ఆలోచించిన మీదట ఆ పెద్దమనిషి దగ్గరకు వెళ్ళాను. ఆయన పేరు ఇప్పుడు చెప్పడం ఎందుకులెండి – ఆయన గొప్ప రాజకీయవేత్త. చతురుడు. ఆయనతో మాట్లాడిన మీదట నాకు అనిపించింది ఏమిటంటే – గొప్ప తెలివిగల వాడుగా ఈయనకు పేరు ప్రఖ్యాతులైతే వచ్చినాయిగాని, నిజానికి ఇతను ఏ మాత్రం తెలివి అయినవాడు కాడు అని. ప్రజల అభిప్రాయంలోను, తన మటుకు తాను – ఆయన ఎంతో 'జ్ఞానవంతుడే!' కాని నేను ఈ విషయాన్ని వెలికి తీసి, 'అందరూ అనుకోవడంలో మటుకే నీవు తెలివిగల వాడివి కాని – నిజానికి ఏ మాత్రం జ్ఞానివి కాదు' అని నిరూపించబూనుకునే సమయానికి ఆయన, ఆయన అనుయాయులు ఈ ప్రయత్నాన్ని నిరసించారు. అందుచేత నేను విఫల మనోరథుడనై తిరిగి రావలసి వచ్చింది. 'నా మటుకు నేను ఇతనికంటె తెలివి అయిన వాడిని. అందులో ఏం సందేహం లేదు. కాకపోతే ఆయనమటుకు అందరికంటె జ్ఞానవంతుడినని అనుకుంటున్నాడు. తనకు తెలియని విషయాలన్నీ, తెలుసుననే భ్రమలోనే ఉన్నాడు. నాకు మత్రం తెలియని విషయాలు 'ఇవి నాకు తెలియవు సుమా!' అని నిశ్చితంగా తెలుసును. నా అజ్ఞానం నేను బాగా ఎరుగుదును. అందుచేత నేను ఈయనకంటె మెరుగైన వాడినే. నాకు తెలియని విషయాలను గురించి 'నాకు తెలుసులే' అనే దుర్భ్రమ నాకు లేదు' అనుకున్నాను.

ఆ తరువాత మరో జ్ఞనదీపకుడి దగ్గరకు వెళ్ళాను. అక్కడ కూడా ఇటువంటి అనుభవమే సంప్రాప్తమైంది నాకు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పక పోగా... నిరసన చేయడం, హేళనగా మాట్లాడటం చేశారు – ఆయన, ఆయన అనుయాయులూను.

అప్పటినుంచి నేను కనిపించిన ప్రతి ప్రాజ్ఞుడిని ప్రశ్నించడం మొదలు పెట్టాను. ఈ పనివల్ల నాకు చెడ్డపేరు, అపఖ్యాతి వస్తున్నాయని తెలుసుకున్నాను. అయితే మటుకేం, వ్యక్తిగతంగా నాకు ఎలాంటి మచ్చలు, మరకలు ఏర్పడినా మతపరంగా నేను చేయవల్సిన కర్తవ్యం ఉండనే ఉంది. నా విధిని చక్కగా నిర్వహించడంలో ఏలాంటి ఒడుదుడుకులు వచ్చినా వెనుకంజ వేయకూడదు. అందుచేత ఈ దేవతా ప్రశ్నలకు సమాధానం ఏమిటి అని కనుక్కోవడం కొనసాగించాను. కాస్త తెలివితేటలైన వాడు అని పేరుపొందిన ప్రతి మనిషినీ ప్రశ్నిస్తూ వచ్చాను. నా అనుభవం మటుకు ఇది. మీకు అరుచికరంగానే ఉండవచ్చును. ఇష్టం కాకపోవచ్చును. కాని అనేకులను ప్రశ్నించిన మీదట నేను ఏర్పరచుకున్న అభిప్రాయం మటుకు ఇది! "బాగా ప్రజ్ఞావంతులు, నిపుణమతులు అని పేరు పొందిన వారందరూ... అతి లోపభూయిష్టులు, నిజానికి, ఇలాంటివారి దగ్గర ఉన్న అనుయాయులు శిష్యులలాగ వర్తించే వారు, గురువుల కంటె మిన్న అయినవారు, తెలివి తేటలలో."

దేవతా స్వరూపం చెప్పిన సమాధానాన్ని, సూక్తిని నిజమా – కాదా అని ధృవీకరించుకోవడం కోసం నేను ఎంతో యాతనపడి, శ్రమదమాదులకు వెరవక, యాత్ర పూర్తి చేశాను. రాజకీయ వేత్తలతో సంభాషణలు అయిపోయిన మీదట నా దృష్టి, సమయం కవులవైపు మళ్ళించాను. నాటక కర్తలను, గేయకారులను, ఇంకా ఇలాంటి వ్యవృత్తులలో మునిగివున్న వారిని కలుసుకున్నాను. ఎలాగైనా దేవతా మూర్తి చెప్పిన విషయం కాదనడానికి అనువైన సమాధానం దొరుకుతుందేమోనని నా తపన.

రచయితలు, కవులు వ్రాసిన పుస్తకాలలో అత్యంత ప్రాచుర్యం పొందినదీ, మిన్న అని పేరు పొందినదీ అయిన ఒక రచన తీసుకునేవాడిని. 'ఇక్కడ ఇలా వ్రాశారు. దీని అర్థం ఏమిటి ?' అని అడిగేవాడిని. నా జ్ఞాన విస్తృతి సంపాదించడం కోసమే ఇలా అడుగుతూ వచ్చాను. ఎలాగైనా అనేక సంగతులు పలువురి నుండి వినాలని, తెలుసుకోవాలని నా అభిలాష. ఈ ప్రయత్నాల ఫలితం మీకు చెప్పవలెనని ఉంది. కాని చెప్పడానికి కొద్దిపాటి సందేహం కూడా ఉంది. ఎందుకంటే, నేను చెప్పినది విని మీరు అతిశయోక్తిగానో, అత్యుక్తిగానో భావిస్తారు తప్ప ఇందులోని యదార్థాన్ని గమనించరు. ఓ రచన చేసిన మనిషి తనంత తాను దానిలోని అర్థాన్ని విశేషాంశాలను చెప్పలేడు. అతని కంటె, ఏ దారిన పోయేవాడైనా ఈ పని చాకచక్యంగా, అర్థయుక్తంగా చేస్తాడని నాకు అవగాహన అయిపోయింది. అందువల్ల నాకు కవుల పట్ల భ్రమలు కూడా త్వరగానే తీరిపోయినాయి. వాళ్ళు విజ్ఞానవంతులు గనుక, మేధావంతులు గనుక ఇలాంటి ఉత్తమ కవిత్వం వ్రాయగలుగుతున్నారు' అని నేను ఇన్నాళ్ళు పడుతున్న భ్రమ తొలగించుకున్నాను. ఏదో రకమైన స్ఫూర్తీ,

అంతరాలోచన వాళ్ళను నడిపిస్తూ వచ్చింది గాని 'జ్ఞానం' మటుకు కాదు అని నాకు నిర్ధారణ అయిపోయింది. తమకు తెలియకుండానే, దాని పూర్తి అర్థం అవగాహన కాకుండానే ఏదో సందేశాలు, ఆశీర్వచనాలు ఇచ్చే ప్రవక్తల, మహర్షుల కోవకు చెందినవాళ్ళు వీరంతా. అంతేకాదు, మరో విషయం కూడా నాకు అవగాహనకు వచ్చింది. కవులు గనుక, మంచి కవిత్వం వంటిది వ్రాస్తూ ప్రచారం చేసుకోగలిగారు గనుక, వీళ్ళు తమకు తెలియని ఇతర అనేక విద్యలుగూడ తెలుసుననే భ్రమలో పడిపోతున్నారు. అందువల్ల, రాజకీయ వేత్తలను సంభాషణలోనికి దింపి నేను పొందిన నిరాశే, కవుల విషయంలోనూ నాకు సంప్రాప్తం అయింది.

తరువాత – చివరకు – నేను కళానైపుణి ప్రదర్శించిన వారివైపు దృష్టి మరల్చాను. నా మటుకు నాకు సాంకేతికమైన పరిజ్ఞానం లేదని బాగా ఎరుగుదును. నాకు తెలియని అనేక విషయాలు వాళ్ళకు తెలిసి ఉంటాయని భావించాను. ఇక్కడ నాకు నిరాశ ఎదురు కాలేదు. అంత వరకు వాళ్ళు నా కంటే తెలివైన వాళ్ళే అనడానికి ఏమీ సందేహం లేదు. అయితే వీళ్ళలో, కవులలో నేను గమనించిన లోపాలే విస్తృతంగా అగుపించ సాగాయి, తమ సాంకేతిక పరిజ్ఞానం వల్ల వాళ్ళు ముఖ్యము – ఆ ముఖ్యము అయిన అన్ని వస్తువులను గురించి విశదీకరించగలుగుతున్నారు. తమ విశదీకరణను మించి ఇంకా తెలుసుకోవలసింది ఏమీ లేదనుకుంటున్నారు. ఇదే తప్పు, అందుకని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. వాళ్ళు మాదిరిగా వస్తు పరిజ్ఞానాన్ని అధికం చేసుకోవడమా లేక అవివేకిగా ఉండిపోవడమా అని. ఈ రెండూ రంగరించుకుపోయి ఉండడం మంచిదా అని కూడ ఆలోచించాను. ఇదేమీ కాకుండా, నేను ఎలా ఉన్నానో అలాగే ఉండిపోవడం మంచిదనే అభిప్రాయానికి వచ్చాను.

నా ఈ పరిశోధనల కన్నిటికీ ఒక్కటే ఫలితం అగుపించింది. అదేమిటంటే నన్ను అందరూ తిరస్కరించసాగారు. అయిష్టంగా చూడడం, నిందా వాక్యాలు పలకడం ఆరంభించారు. నన్ను పరిపూర్ణమైన జ్ఞానిని అని వేళాకోళం, యెద్దేవా చేయడం గూడ ఆరంభించారు. ఇది ఎలా సాధ్యమైందో వినండి. ఇతరులు తాము 'దిట్టలం' అనుకుంటున్న విషయాలలో వారికి ఏ మాత్రమూ పరిపూర్ణమైన జ్ఞానం లేదని నేను నిరూపించడం వల్ల చూస్తున్న వారందరూ నేను ఆ విషయాలలో గొప్ప జ్ఞానిని అయి ఉంటానని ఏకపక్ష తీర్మానానికి వచ్చేశారు.

అయితే అసలు విషయం ఏమిటో గమనించండి, మహాశయులారా! నిజమైన జ్ఞానం అనేది భగవంతుడి సొత్తు. మనుషులు సంపాదించగల జ్ఞానం క్షుల్లకమైనదీ, ఏ మాత్రం విలువ లేనిదీని. దేవత నేను జ్ఞానిని అని చెప్పినప్పుడు 'సోక్రటీస్' అనే

పేరు నాకు అన్వయించి చెప్పడం లేదు అనుకున్నాను. నా పేరును కేవలం ఉదాహరణగా, సంకేతంగా తీసుకుని, ఇలా చెప్పినట్లు అనిపిస్తుంది. 'మనుషులందరిలోకి తెలివి అయినవాడు – అత్యంత వివేకి ఎవరంటే – సోక్రటీస్ మాదిరిగా జ్ఞానసంచయానికి సంబంధించినంత వరకు తనకు ఏమీ తెలియదు సుమా, అని గమనించగలవాడే అందరిలోకి వివేకి.'

అందుచేతనే నేను దైవాజ్ఞను అనుసరిస్తూ ఇంకా అన్వేషణ సాగిస్తూ తిరుగుతున్నాను. తాను వివేకవంతుడనని ఏ పండితుడు, పురజనుడు అనుకుంటూ ఉన్నా – నేను ఆయన్ను కలుసుకుని ఆ అభిప్రాయం సరైనదని కాదని నిరూపిస్తూ వచ్చాను. దైవాజ్ఞను ఇలా నిర్వర్తిస్తున్నాను. ఈ పనిలో మునిగిపోయినందువల్ల, నేను రాజకీయాలలోను, ఇతర కార్యకలాపాలలోను పాల్గొనేందుకు మరేమీ సమయం మిగలలేదు. నా వ్యక్తిగత విషయాలు చూచుకునేందుకైనా విరామం లేకుండా పోయింది. భగవత్ కైంకర్యం చేసుకుంటూ, కడు బీదవాడై మిగిలాను.

నాకు చెడ్డపేరు రావడానికి మరో కారణం కూడా ఉంది. అనేక మంది యువకులు, ఇతర కార్యకలాపాలలో మునిగి డబ్బు సంపాదించుకోవలసిన అవసరం లేని శ్రీమంతుల కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళు – నా చుట్టూ చేరసాగారు. రకరకాల మనుషులను నేను ప్రశ్నలు వేస్తూ ఉండడం, జవాబులు రాబట్టటం; తిరుగు ప్రశ్నలు వేయడం, వాళ్ళ అజ్ఞానాన్ని వెలికితీయడం.... ఇదంతా వాళ్ళకు వినోదప్రాయంగా తయారైంది. ఈ 'తమాషా' సన్నివేశాలను చూచి ఆనందించడం కోసం నా చుట్టూ చేరుతూ వచ్చారు. వాళ్ళు నన్ను 'ఆదర్శ పురుషుడు'గా చూచుకుంటున్నారు. వాళ్ళు కూడా ఇతరులను ప్రశ్నలు వేయడం – సమాధానాలు రాబట్టటానికి ప్రయత్నించడం విరివిగా చేశారు. వీళ్ళ దాడికి తట్టుకోలేని జనం... చిరాకుతో ఈ ప్రక్రియ నంతటినీ అసహ్యించుకోసాగారు. వాళ్ళ మీద కాకుండా, నా మీద కోపం తెచ్చుకోసాగారు. నన్ను గురించి దుష్ప్రచారం చేయడం ఆరంభించారు. సోక్రటీస్ అనేవాడు ఉన్నాడు – వాడు యువకుల బుర్రలలో తప్పుడు అభిప్రాయాలు ప్రవేశపెట్టి అందరినీ అపమార్గంలో తీసుకు వెడుతున్నాడు అని పదే పదే చెప్పుకు తిరగసాగారు. వాళ్ళను మీరు అడిగారనుకోండి. సోక్రటీస్ ఏం చెబుతున్నాడు. కుర్రవాళ్ళను ఎలా పాడుచేస్తున్నాడు – అని అడిగారనుకోండి, అప్పుడు వాళ్ళ దగ్గర ఈ ప్రశ్నలకు ఎలాంటి సమాధానం లేదు. తమ గందరగోళ పరిస్థితికి కారణం తమ అజ్ఞానమేనని వాళ్ళు ఎరుగరు. ఏ తత్త్వవేత్త గురించి అయినా వాడుకగా వేసే అపనిందలు వేయసాగారు.

స్వర్గ నరకాలలో ఉన్న అనేక వస్తువులను గురించి మాట్లాడుతున్నాడు.

దేవుళ్ళను నిరసిస్తున్నాడు.

బలహీన వాదనలు బలమైన వాదనలతో లొంగదీసుకునేందుకు దోహదం చేస్తున్నాడు.

వాళ్ళకు నిజాన్ని ఒప్పుకోవడం అంటే ఇష్టం కాదు, అసహ్యం. ఆ నిజం ఏమిటంటే !

వాళ్ళకు ఏమీ తెలియదు! ఏ విషయమూ కూలంకషంగా తెలియదు.

అలా తెలియదనే విషయం కూడా వాళ్ళకు తెలియదు.

తమ కీర్తిప్రతిష్టల పైన, గౌరవ మర్యాదల పట్ల అచంచల విశ్వాసంతో ఈ రకమైన అపప్రథలు ప్రచారం చేస్తారు.

సంవత్సరాల తరబడి నా పైన వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు.

మెలెటస్, అనిటస్, లైకన్‌లకు ప్రత్యేక కారణాలు ఉన్నాయి, నా పైన అభియోగం తీసుకురావడానికి.

మెలెటస్ కవులకు ప్రతినిధి.

అనిటస్ రాజకీయ నాయకుల తరఫు మనిషి.

లైకన్ వక్తల నాయకుడు.

వారు అనేక సంవత్సరాలుగా మీ మనసులలో నా పట్ల నింపిన ద్వేష భావాలను, నేను ఈ కొద్దికాలంలో పరిహరించగలనని అనుకోవడం లేదు.

ఉన్నది ఉన్నట్లుగా – కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడుతాను నేను. అందుకనే 'జనవిరోధిని' అయినాను.

ఇప్పుడు ప్రత్యేకంగా మెలెటస్ తీసుకువచ్చిన అభియోగాలకు సమాధానం చెబుతాను.

'సోక్రటీస్ యువకుల మనస్సులు కల్మషమయం చేస్తున్నాడు. రాజ్యాంగ పరమైన దేవుళ్ళను, దేవతలను కాదని కొత్త దేవుళ్ళను, దేవతలను ప్రతిపాదిస్తున్నాడు' – ఇదీ అభియోగం.

యువకులు మంచి ప్రభావాలలో ఎదగవలెనని అతని ఉద్దేశం. అవును కదా. మరి, ఎటువంటి ప్రభావాలకు వాళ్ళు లోనవుతున్నారో పరీక్షించి చూద్దాం.

యువతరాన్ని చక్కని దారిలో తీర్చిదిద్దేవి ఏమిటి ?

'న్యాయసూత్రాలు, చట్టాలు'

ఈ సూత్రాలు, చట్టాలు ముందుగా తెలుసుకోవలసిన వారు ఎవరు ?

'ఇక్కడ చేరినవారు, జ్యూరీ సభ్యులు'

వీరందరికి యువతను నడిపించగల తెలివితేటలు, చాకచక్యం ఉన్నాయను కుంటున్నారా ?

ఇక్కడ చేరన వారందరికీ ఈ పరిజ్ఞానం ఉన్నదంటున్నాడు మెలెటస్.

వీరందరికీ యువతను ప్రభావితం చేయగల అవకాశం, స్తోమత ఉన్నాయనా నీ అభిప్రాయం ?

అలా అయితే ఏథెన్స్ నగరంలో అందరికీ – నా కొక్కడికే తప్ప – యువతను నడిపించగల స్తోమత, యోగ్యత ఉన్నాయన్నమాట. నే నొక్కడినే వాళ్ళను అపమార్గంలో నడిపిస్తున్నానన్నమాట.

ఉదాహరణకు – గుఱ్ఱాల సంగతి తీసుకుందాం. అందరికీ వాటికి తరిఫీదు ఇవ్వగల శక్తి ఉంది. ఒక్క మనిషికి తప్ప! ఈ తరిఫీదు ఇవ్వగల శక్తి గుఱ్ఱాలకైఫీయతు తెలిసిన వాళ్ళకే చేతనవుతుందని ఒప్పుకుంటారా... లేక అందరికీ సర్వసామాన్యంగా తెలిసి ఉంటుందంటారా? గుఱ్ఱాల విషయమైనా, ఇతర జంతువుల సంగతి అయినా ఇంతేకదా. ఇక చూడండి. ఈ నగర యువతకు మంచి మాటలు చెప్పగలవాళ్ళు ఎందరో ఉన్నారు. చెడ్డమాటలు చెప్పేవాడు సోక్రటీస్ ఒక్కడే. ఇదేగదా అభియోగంలో తేలిన సంగతి.

మెలెటస్ ఎప్పుడైనా యువత సంగతి, వారికి ఏం కావాలి ? ఏం ఇవ్వాలి అన్న సంగతి ఆలోచించాడా ?

యువతను పాడుచేస్తున్నానని ఇప్పుడు నా పైని అభియోగం తీసుకువస్తున్న మనిషి ఇంత వరకు యువత కోసం తనకై తాను ఏమీ చేయలేదు. కాలు కదపలేదు; చేయి విదపలేదు.

మరో సంగతి గమనించండి.

మెలెటస్ ఒక సంగతి స్పష్టంగా చెప్పాలి.

మంచి వాతావరణంలో పెరగడం మంచిదా, కాదా ?

చెడ్డవాళ్ళు తమ చుట్టూ చెడ్డతనాన్నే ప్రసరిస్తారు కదూ!

తన సహవాసుల వలన చెడిపోవాలని కోరుకునేవాళ్ళు ఎవరైనా వుంటారా ?

ఒకవేళ చెడిపోవాలని ఎవరైనా ప్రయత్నం చేస్తారా ?

నేను యువతను చెడగొడుతున్నానని గదా అభియోగం. ఈ పని నేను ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నానా... లేక నిరుద్దేశ పూర్వకంగానా ?

'ఉద్దేశ్య పూర్వకంగానే, కావాలనే '

ఇరుగు పొరుగుల మీద చెడ్డవారు చెడ్డ ప్రభావాన్ని... మంచివారు మంచితనాన్ని ప్రసరిస్తారని ఒప్పుకున్నారు గదా, పక్కవాళ్ళను చెడగొడితే ఆ చెడ్డతనం నన్ను కూడా లోగొంటుందనే సంగతి తెలియనంత అజ్ఞానినా నేను ? ఉద్దేశ్యపూర్వకంగా ఈ పని చేస్తానా ?

నేను కాదు, ఎవరూ ఇలా చేస్తారని నమ్మను.

అందుచేత ఈ అభియోగం అబద్ధం.

నాకు చెడు చేయటం చేతకాదు; లేక ఉద్దేశ్యపూర్వకంగా ఆ పని చేయడం లేదు.

చెడ్డ చేయడం నిరుద్దేశ్య పూర్వకంగా జరుగుతున్నప్పుడు ఇలా కోర్టులు, అభియోగాలు అవసరం లేదు, ఆ మనిషిని పక్కకు పిలిచి మందలిస్తే చాలు. నా కళ్ళు తెరిపించినట్లయితే ఇంక అటువంటి పని చేయకుండా ఉండిపోగలుగుతాను. కాని మెలెటస్ ఇన్నాళ్ళు ఇటువంటి ప్రయత్నమే చేయలేదు. నన్ను తప్పించుకు తిరిగాడు తప్ప, కలుసుకుని మాట్లాడే ప్రయత్నమే చేయలేదు. ఈ కోర్టు శిక్ష అవసరమైనవారి కోసం కాని – నాలా తెలివితేటలు, వికాసం అవసరమైన వారి కోసం కాదు.

మెలెటస్ ఈ విషయంలో ఇంతవరకూ ఎలాంటి ఉత్సాహము చూపించలేదు.

సరే, నేను యువకుల మనసులు ఎలా కలుషితం చేస్తున్నానో చెప్పమనండి అతడిని.

నేను కొంతమంది దేవతలను విశ్వసిస్తున్నాను. వాళ్ళనే నమ్ముకోమని చెబుతున్నాను అందరికీ, రాజాధికారులు చెప్పిన దేవతలన్నిటినీ నేను నమ్మడం లేదు. నేను నిరీశ్వరవాదిని కాదే !

'కాదు. నీకు దేవుళ్ళంటే నమ్మకం లేదు' అంటాడు మెలెటస్.

ఈ మాట విచిత్రంగా ఉంది. నాకు దేవుళ్ళలో విశ్వాసం లేదా ? నేను సూర్యుడిని నమ్ముతున్నాను. సూర్యోపాసనే (Appollo) దేవతోపాసనగా రూపొందించింది. చంద్రుడిని నమ్ముతున్నాను.

మెలెటస్ ఏమంటాడో వినండి. సూర్యుడు బండరాయి; చంద్రుడు మట్టి ముద్ద అని నేను చెప్పానంటాడు.

ఐతే అనాక్సగొరస్ (Anaxagoras) ను కూడా మీరు అభియోగం పాలు చేస్తారు అన్నమాట! ఇవన్నీ – ఇంక ఇటువంటి అభిప్రాయాలు ఎన్నో – ఆయన వెలిబుచ్చాడు. తన పుస్తకాల నిండా వ్రాశాడు. ఈ అభిప్రాయాలు నాతో ప్రారంభం కాలేదే !

నేను నిజంగా నిరీశ్వరవాదినని మెలెటస్ అభిప్రాయమా ?

మానవుల కార్యకలాపాలలో తప్ప, మానవులతో ఏ మాత్రం సంబంధం లేని వారు ఉంటారా ?

అతీత శక్తులపై నాకు విశ్వాసం.

అతీతశక్తులకు మూలమైన దేవతలను నేను విశ్వసిస్తున్నాను.

కేవలం తన వినోదం కోసం, తన కుతూహలాన్ని తీర్చుకోవడం కోసం మెలెటస్ ఈ అభియోగం తీసుకువచ్చినట్లు కనిపిస్తుంది.

అతని అభియోగానికి ఇంతకంటె ఎక్కువ సమాచారం అవసరం లేదనుకుంటాను.

జీవితాన్ని అంతం చేసే శిక్ష విధిస్తారని నీకు భయం వేయడం లేదా అని ఎవరైనా అడగవచ్చును. మనిషి జీవితంలో ముఖ్యమైన భాగం – జీవితం. మృత్యువు అనే వాటిని బేరీజు వేసుకుంటూ వాటిని గురించి ఆలోచిస్తూ గడపడమే అనుకుంటాను. మంచిపని చేస్తున్నానా – చెడ్డపని చేస్తున్నానా – మంచిమనిషిగా వ్యవహరిస్తున్నానా, దుర్మార్గుడిలా ప్రవర్తిస్తున్నానా – ఇవే ప్రశ్నలు, మనిషి వేసుకోవలసినవి. మీ ఉద్దేశ్యంలో తెటిస్ (Thetis) కుమారుడు అచిలెస్ (Achilles) ట్రాయ్ నగరంలో చేసిన పని మంచిది అయి ఉండదు. అతడు ఇలాంటి మరణభయాన్ని జయించే ప్రవర్తించాడు.

విషయం ఏమిటంటే, మహాశయా! ఒక మనిషి ఒక నిర్ణయం తీసుకున్న తరువాత ఏది ఏమైనా దానికే కట్టుబడి ఉండాలి. ప్రతి క్షణము తన నిర్ణయానికి జంకుతూ, భయపడుతూ ఉండడంలో అర్థం లేదు. అగౌరవం, మృత్యుభయం అతన్ని వెనక్కు నడిపించగూడదు.

ఇదివరలో మీరు నిర్ణయించినట్లుగా నేను యుద్ధక్షేత్రాలలో నిర్భయంగా నిలబడి నా పాత్ర అవిచ్ఛిన్నంగా నెరవేర్చాను.

తరువాత భగవన్నిర్ణయం ప్రకారం, తాత్త్విక జీవనం గడుపుతూ జీవితం తాలూకా మంచిచెడ్డలు పరామర్శిస్తూ మనుషులను పరీక్షిస్తూ కాలక్షేపం చేస్తున్నాను.

మరణభయం వెనక్కు లాగినట్లయితే నేను వెనుక ఎప్పుడో ఇక్కడ నుండి పారిపోయి ఉండేవాడిని.

మరణ భయంతో తారట్లాడడం అంటే, తెలివితేటలు అసలు ఏమాత్రం లేనప్పుడు నేను మహాజ్ఞానినే సుమా! అనుకోవడం అన్నమాట! తెలియని విషయాలు తెలుసును అనుకోవడం అన్నమాట! మనిషికి సంభవించే అనేక పరిణామాలలో 'మరణం' అత్యున్నత మైనదేమో ఎవరికి తెలుసును ? అయితేనేమి, జనం తమకు అన్నీ తెలుసునన్నట్లుగా – మరణం అనేది మహా భయంకరమైన విషయం అని భయపడుతూ, బాధపడుతూ ఉంటారు. దాని నుంచి దూరంగా పోవటానికి ఏమేం చేయగలరో అవన్నీ చేస్తూ ఉంటారు. ఇంతకంటే గొప్ప అజ్ఞానం ఇంకేదీ లేదు. నా పొరుగువాడి కంటే నేను ఏ విధంగానైనా కాస్త తెలివిగల వాడిని అనుకుంటే అందుకు కారణం ఇది : మరణానంతరం ఏం జరుగుతుందో నాకు తెలియదు; నా పొరుగువానివలె నాకు దానిని గురించి ఎలాంటి ఊహాపోహలు లేవు. నాకు 'మరణానంతర జీవితం' గురించి ఏమీ తెలియదని క్షుణ్ణంగా తెలుసును. ఒక్క విషయం మటుకు నాకు స్పష్టంగా తెలుసు. అదేమిటంటే, నాపై వాళ్ళు, భగవంతుడు ఇచ్చిన ఉత్తర్వులను నేను వ్యతిరేకించగూడదు.

అనిటస్ ఏం చెబుతున్నాడో చూడండి. అతను స్పష్టపరిచింది ఏమిటంటే నేను ఇప్పుడు ఇలా ఈ కోర్టు ముందుకు వచ్చి ఉండవలసింది కాదు, తప్పించుకు ఉండవలసిందీ అని. నేను ఎలాగూ వచ్చాను గనుక, నాకు మరణశిక్ష విధించి నా బారి నుంచి మీ యువతరాన్ని అంతటినీ రక్షించవలసి ఉంటుందని అతను చెబుతున్నాడు. మీరు అనిటస్ సిఫారస్‌ను వ్యతిరేకించి నాకు మరణశిక్ష విధించనట్లయితే మీరు నాకూ ఇలా ఆదేశం ఇచ్చినట్లయితే – 'సోక్రటీస్, జరిగిందేదో జరిగింది. నీకు, మరణశిక్ష వేయము. ఇక ముందు మాత్రం నీవు ఈ యాత్ర ప్రశ్న పరంపరలు, విచారణలు మానివేసి తత్త్వవేత్తలా జీవితం గడపకుండా, నిదానంగా ఉండు – అంటారనుకోండి. అంతేకాకుండా 'నీవు ఇదే పద్ధతిలో శేషజీవితాన్ని గడుపుతున్నట్లుగా ఆచూకి దొరికినట్లయితే నిన్ను మరణశిక్ష పాలుచేస్తాం.' అని గూడా చెబుతారనుకోండి. ఈ షరతుల మీద నన్ను వదిలివేయదలచుకుంటే నేను ఒక్కటే సమాధానం చెబుతాను. 'అయ్యా! మీరు చూపుతున్న ఆదరానికి కృతజ్ఞుడిని, కాని ఇది నాకు సాధ్యమయ్యే పని కాదు. ఈ రకమైన జీవితం నాకు నేను విధించుకున్నది కాదు. భగవన్నియామకంగా ఈ పని చేస్తున్నాను. అందుచేత ఇందునుంచి విరమించుకోలేను' అంటాను. ఊపిరి ఉన్నంత వరకు తాత్త్విక చర్చలు, ప్రశ్న పరంపరలు; పరీక్షలు నడపడం తప్ప ఇంకో పని లేదు నాకు. ఎదురైన వారి నుంచీ సత్యదర్శనం పొందడానికి ప్రయత్నిస్తాను తప్ప మానను.

కనిపించిన వాళ్ళందరితోను ఇదివరకటి మోస్తరుగానే ఇలా మాట్లాడుతాను:

'మీరు ఏథెన్స్ నగరానికి చెందినవారు. విశ్వవ్యాప్తంగా ఈ నగరానికి ఖ్యాతి ఉన్నది. బలానికి, జ్ఞానానికి ఈ నగరం పుట్టినిల్లు. ఇలాంటి నగరంలో పుట్టి పెరిగి మీరు కేవలం డబ్బు, కీర్తి, గౌరవము వెనుకనే పరుగులు తీస్తున్నారు గాని 'జ్ఞానం' వైపు దృష్టి సారించడం లేదు. సత్యం పట్ల, ఆత్మాశ్రయమైన విషయాల పట్ల నిర్లక్ష్యం చూపటం తప్పు కదూ ?'

కేవలం అడిగి ఊరుకోను. అనేక ప్రశ్నలు, పరీక్షలు చేసి ఎలాగైనా ప్రజలు తమ లోపాలను తెలుసుకుందుకు సహాయపడతాను. ముసలివాడైనా, యువకుడైనా, స్వదేశీయుడైనా, విదేశీయుడైనా – ఎవరినీ నేను ఈ ప్రశ్న పరంపరలు వేయకుండా వదలను, ముఖ్యంగా నా స్వదేశీయులను అసలు వదలను. ఇది నాకు భగవంతుడు ఇచ్చిన ఆదేశంగా భావిస్తున్నాను. కేవలం ఆస్తిపాస్తులు, సిరిసంపదలు సంపాదించడం కాదు. ఆత్మోన్నతికి సర్వతోముఖ సౌభాగ్యానికి దోహదం చేసే ప్రతి కార్యకలాపం వైపు శ్రద్ధ వహించమని అందరినీ హెచ్చరిస్తాను.

భోగ భాగ్యాలు మంచితనాన్ని తీసుకురావు, మంచితనం మటుకు సిరిసంపదలను, ఆశీర్వచనాలను తీసుకువస్తుంది. వ్యక్తులకే కాదు, దేశాలకు కూడా ఇదే శ్రేయో మార్గం.

ఈ రకమైన నా ప్రవర్తన, యువతను తప్పుదారికి మళ్ళిస్తున్నదనేనా మీరు అంటున్నది ? మీ ఇష్టం. అనిటస్ చెప్పే విషయాలు వింటారో, నేను చెబుతున్నవి వింటారో మీ ఇష్టం. నా ప్రవర్తన మాత్రం నేను మార్చుకునేది లేదు. వందమార్లు చావవలసి వచ్చినా, నేను నమ్ముకున్న కర్తవ్యాన్ని నెరవేర్చకుండా ఒక్క క్షణమైనా మానలేను.

దయచేసి గందరగోళం చేయకుండా – నేను చెప్పదలచుకొన్నది వినండి. ఇప్పుడు నేను చెప్పబోతున్న సమాచారం మీకు రుచికరమైనది కాకపోవచ్చును. నేను చేస్తున్న పనిని వివరించాను – ఎందుకు చేస్తున్నానో చెప్పాను. అయినా ఈ సంగతి సరకుగొనక నన్ను మరణశిక్ష పాలు చేశారంటే, ఆ చర్య వల్ల నా కన్నా మీకే ఎక్కువ నష్టం. మెలెటస్ గాని, అనిటస్ గాని నాకు అపకారం చేయలేదు. వాళ్ళకు ఆ శక్తి లేదు. ఎందుకంటే భగవంతుడు ఎప్పుడూ చెడ్డవారి వల్ల మంచి వారికి అపకారం జరగకుండా చూస్తాడని నా విశ్వాసం. నాకు ఉరిశిక్ష వేయవచ్చు. దేశ బహిష్కారం జరగవచ్చును. పౌరహక్కులు లేకుండా పోవచ్చును– ఇవన్నీ గొప్ప ప్రమాదాలుగా నేను భావించడం లేదు. అమాయకుడిని, ఏమీ నేరం చేయని వాడిని మరణశిక్షకు

గురి చేయడం చాల ద్రోహకరమైన సంగతి. అందుచేత, నేను నా కోసం – నా ప్రాణాలు కాపాడుకోవడం కోసం వాదన చేస్తున్నాననుకోకండి, నేను చేస్తున్న ఈ వాదన అంతా మిమ్మల్ని తప్పు మార్గం నుంచి రక్షించటానికి, మీరు దురాగతం చేయవద్దని చెబుతున్నాను. నాకు మరణశిక్ష విధించడం తేలికే. అయితే నా తరువాత నా వంటి మనిషి మీకు దొరకడు. మీకు వేళాకోళంగా అనిపించినా, ఇది అక్షరాల సత్యం; భగవంతుడు నన్ను ఈ మహానగరంలో మహత్తర కార్యసాధన కోసం నియమించాడు. దృఢమైన అశ్వం సోమరితనంతో నిద్రపోతున్నప్పుడు, ఓ సూక్ష్మజీవి – ఈగ–దానిని భంగపరచి, మేల్కొల్పేటట్లు చేస్తుంది – నా పాత్ర ఈ 'ఈగ' వంటిది. నిద్రాణితమైన శక్తులను మేల్కొల్పడమే నా పని, అందుచేతనే నేను ఒక్క నిమిషమైనా విరామం తీసుకోకుండా, విశ్రాంతి కోరుకోకుండా అందరినీ హెచ్చరిస్తూ తిరుగుతున్నాను. నా వంటి వైతాళికుడు మీకు దొరకడు. మీరు నన్ను చంపితే – పొందే నష్టం అపారమైనది. నా సలహా విని నన్ను బతకనివ్వండి! నా పని నన్ను చేసుకోనివ్వండి. అచిరకాలంలోనే, మీరు గాఢనిద్ర నుంచి లేచి జాగరూకులై లేస్తారని ఆశ. అలా కాకుండా  అనిటస్ సలహా మేరకు నాకు మరణదండన విధిస్తారా – మీరు ఇంక జీవితాంతం, కల్పాంతం, ఆ గాఢనిద్రలోనే, సుషుప్తిలోనే కూరుకుపోయి ఉంటారు. భగవంతుడు నా వంటి వ్యక్తిని మరొకరిని పంపవలసి ఉంటుంది మీ భద్రత కోసం.

నేను భగవన్నియామకమైన కార్యకలాపంలోనే మునిగిపోయి ఉన్నాననే విషయం మీకు ఇంకా అనుమానాస్పదంగా ఉన్నదా ? కాస్త ఆలోచించండి, నేను నా కుటుంబము, సంపాదన, గౌరవమర్యాదలు ఇవన్నీ పరిత్యజించి – వాటి కోసం పాకులాడకుండా – ఇలా దేశమంతా తిరుగుతున్నాను. రకరకాల అమర్యాదలు, నిరసనలు, త్రోసివేతలు ఎదుర్కొంటూ  రోజులు దొర్లిస్తున్నాను. ఎందుకోసం అనుకుంటున్నారా ? నా స్వంత పనులు అంటూ ఏమీ లేకుండా, నిరంతరము మీ యోగక్షేమాల కోసం మీతో మాట్లాడుతూ తండ్రిలా, పెద్ద అన్నలా మీతో వ్యవహరిస్తూ మంచితనాన్ని, మంచితనపు ఆలోచనలను పంచుకున్నాను. ఆ పనివల్ల నాకేదైనా ఒరిగేది ఉందా ? ఇందుకు ప్రతిఫలంగా నేను డబ్బు వసూలు చేసుకుంటున్నానా!... ఆలోచించండి. నా మీద అభియోగం తెచ్చిన వాళ్ళు కూడా, ఎన్ని మాటలైనా అంటున్నారు. ఎన్ని ఆరోపణలైనా చేస్తున్నారు. కాని నేను నా ఉపదేశాలకు, ఉపన్యాసాలకు డబ్బు, శుల్కం వసూలు చేస్తున్నాని చెప్పడం లేదు గదా! నేను ఎలాంటి పేదరికంలో ఇరుక్కుపోయి – కూరుకుపోయి ఉన్నావో మీకు సాక్ష్యాధారాలతో విన్న వించవలసిన పని లేదనుకుంటాను.

ఇదంతా మీకు తమాషాగా కనిపించవచ్చు, స్వంత పనులంటూ ఏమీ లేకుండా ఇతరులకు అడగకపోయినా సలహాలు, సంప్రదింపులు ఇస్తూ, వారి ఆంతరిక వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకుంటూ తిరుగుతూ ఉండడానికి ఒకే ఒక కారణం, అది అనేక పర్యాయాలు మీకు చెప్పాను. నాకు భగవన్నియామకమైన పని ఇది.

నాకు ఏదో 'అంతర్వాణి' వినిపిస్తుంది. నా చిన్నతనం నుంచి ఈ అనుభవం ఉంది. అందుచేతనే వేరే ఉద్యోగం, సద్యోగం చూసుకోకుండా ఈ పనికే అంకితమై పోయాను. ఒక్క విషం చెబుతాను, వినండి : మిమ్మల్నిగానీ, మీ రాజకీయ వ్యవస్థనుగానీ వ్యతిరేకించిన ఏ మనిషీ బతికి బట్టకట్టలేదు. దేశంలో జరుగుతున్న అన్యాయాలను వ్యతిరేకించిన వాడెవడూ ప్రాణాలతో నిలవలేదు. న్యాయం కోసం ఎదురొడ్డి నిలిచేవాడు కొద్దిసేపయినా బతకదలుచుకుంటే రాజకీయ జీవితం వైపు పోకుండా, తనలో తాను ముడుచుకుపోయి కూర్చోవాలి.

నేను చెబుతున్న ప్రతి మాటకూ మీకు సాక్ష్యాలు, ఆధారాలు చూపిస్తాను. యదార్థాలు మీ ముందు ఉంచుతాను. ప్రాణం కోసం భయపడి లొంగిపోవడం గానీ, చేయదలచుకున్న పని చేయకుండా ఉండడం గానీ నా వల్ల కాదు.

నేను కౌన్సిల్‌కు ఎన్నిక అయ్యాననే విషయం మీరు ఎరుగుదురు పదిమంది కమాండర్లు తప్పు చేశారనే అభియోగం ఆ కౌన్సిల్ ముందు విచారణకు వచ్చింది. అప్పుడు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహారం నడపగూడదని చెప్పి బలవంతం చేసిన వాడిని కౌన్సిల్ సభ్యులందరిలోనూ నే నొక్కడినే. అభియోగానికి వ్యతిరేకంగా ఓటు వేశాను. మీ నాయకులు నా మాట పెడచెవిని పెట్టటమే కాకుండా నన్ను 'అరెస్ట్' చేయాలని కూడా చూచారు. చావు అంటే భయం ఉన్నట్లైతే ఇట్లా చేయగలిగే వాడినా?

ఈ సంఘటన మనమంతా 'ప్రజాస్వామ్యం'లో ఉండగా జరిగింది. తరువాత రాచరికం వచ్చింది. ముప్పయి మంది కమీషనర్లు నాకు ఆజ్ఞ ఇచ్చారు. నాతోపాటు నలుగురిని గూడా పిలిపించి మిమ్మల్ని 'లియోన్'ను అతని ఇంటి నుంచి బందీగా తీసుకురమ్మని పురమాయించారు. అప్పుడు కూడా వ్యతిరేకించాను. ఇది కేవలం ఉదాహరణ కోసం చెబుతున్న సంఘటన. నేను తప్పు అనుకున్న పనిని నాచేత ఎవరూ చేయించలేరు. నాకు చావు భయం లేదు. తతిమ్మా నలుగురూ 'లియోన్'ను తీసుకురావటానికి హుటాహుటిన వెళ్ళారు. నేను మాత్రం నేరుగా నా ఇంటికి వెళ్ళిపోయాను. ఆ తరువాత – ప్రభుత్వం పడిపోయింది గనుక సరిపోయింది గాని లేకపోతే నేను మృత్యువాత పడి ఉండే వాడిని. ఈ సంగతి మీ కందరకూ తెలుసును గదా !

న్యాయం, ధర్మం – మీరిన పనిని నేను ఎప్పుడూ చేయను.

నేనెప్పుడూ ఫలానా మనిషికి 'గురువును' అనిగానీ 'బోధకుడు' అనిగానీ ప్రకటించుకోలేదు. వయోధికులు, యువకులు – నాకు శిష్యులంటూ ఎవరూ లేరు. నా పని చేసుకుంటూ పోతున్నాను. ఈ పనిని చూడడానికి 'చోద్యం'గా భావించి ఆనందించడానికి నా చుట్టూ జనం చేరితే అది నా తప్పు కాదనుకుంటాను. అది నా అపరాధం కాదనుకుంటాను. మాట్లాడినందుకు నేను 'శుల్కం' వసూలు చేయలేదు. ఎప్పుడూ, ఎవరితోనూ మాట్లాడటానికి నిరాకరించ లేదు. నా మాటలు వినడానికి, నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి ఎవరు ముందుకు వచ్చినా కాదనలేదు. వీరిలో ఎవరైనా మంచి పౌరుడు, చెడ్డ పౌరుడుగా రూపొందితే దానికి నా బాధ్యత లేదు. నలుగురిలోనూ మాట్లాడిన మాటలే తప్ప, నేను ప్రత్యేకంగా ఎవరికీ విడిగా రహస్యంగా బోధనలు చేయలేదు. అలా చేశానని ఎవరైనా అంటే ఆ మాట అబద్ధం.

నా వెంట తిరుగుతూ తన కాలమంతా హరణం చేసుకునేందుకు కొందరు ఎందుకు ఉత్సాహం చూపారు ? తెలివి కలవాళ్ళు కాకుండానే, తాము గొప్ప 'తెలివి తేటలున్న  వాళ్ళం' అని విర్రవీగే వాళ్ళను నేను ప్రశ్నలు వేసి వేధించడం, వాళ్ళ 'అసలు రంగు' బయట పడవేయడం, ఈ మనుష్యులకు ఆనందదాయకంగా, చూడ వినోదంగా పరిణమించిందని ముందే చెప్పాను గదూ. భగవన్నిర్ణయం. నాకు కలలోను, ఊహలలోను, ప్రశ్నలలోను వచ్చిన సూచనల మేరకు – నేను ప్రవర్తించాను.

నేను ఎవరికీ దుస్సలహాలు ఇవ్వలేదు. నా వల్ల చెడిపోయినామని ఎవరూ వివాదం తీసుకురాలేదు. వయోధికులు గానీ, వారి వారసులు గానీ ఇంతవరకు నా పైని ఇలాంటి అపవాదు తీసుకురాలేదు. నేను ఎవరినీ ఏ విషయంలోను బలవంతం చేసి నా అభిప్రాయం వాళ్ళపైని రుద్దాలని చూడలేదు.

కాని ఈ నాటి అభియోగం కూడా చాలా మందికి వినోదప్రాయంగా ఉండి, ఈ కోర్టు హాలు అంతా నిండిపోయింది. నాకు తెలిసిన వాళ్ళు, నన్ను ఎరిగినవాళ్ళు ఎందరో ఈ హాలులో ఇప్పుడు ఉన్నారు. వాళ్ళు ఎవరూ ఈ అభియోగం తమంత తాముగా తీసుకురాలేదు. మెలెటస్ కూడా వాళ్ళను సాక్ష్యంగా తీసుకురాలేదు. ఇప్పటికైనా మెలెటస్ అలాంటి సాక్ష్యం తీసుకువచ్చి మీ ముందు వుంచుతానంటే అందుకు నా అభ్యంతరం ఏమీ లేదు. కాని నిజం మరో రకంగా ఉంది. ఈ హాలులోని జనం చాలా మంది నాకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నా పట్ల సానుభూతిపరులు.

నా మటుకు నాకు. నన్ను సమర్థించే వాళ్ళను పోగుచేసుకు వచ్చి మీ ముందు హాజరు పరచాలనే కాంక్ష లేదు. మరణాన్ని ఎలాగైనా తప్పుకోవాలనే దుగ్ధ నాకు లేదు. నా కుటుంబాన్ని, పిల్లలను మీ ముందు ప్రదర్శించి మీ దయాదాక్షిణ్యం పొందాలనే తలంపు కూడా లేదు.

ధైర్యవంతుడిని నేను. నాకు సంభవించిన అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొంటాను.

'న్యాయం' అనే దానికి దయ, దాక్షిణ్యం అవసరం లేదు. ఆశ్రితజన పక్షపాతం అనేది లేదు.

వ్యవస్థకు అగౌరవకరము, అప్రతిష్ట కలుగచేసేది – ఎలాంటి పనీ నేను చేయను. మతం, ధర్మం – అనే వాటికి మన్నన ఉండాలి. మత విశ్వాసాలపట్ల అచంచలమైన శ్రద్ధ ఉండాలి.

నా మీద అభియోగం తెచ్చినవారికన్న, నేను ఈ విషయాలలో మిన్న.

మీరు (జ్యూరీ), భగవంతుడు – ఎలా నిర్ణయిస్తే అలాగే జరుగుతుంది. ప్రత్యేకించి నేను కోరుకునేది ఏమీ లేదు. నాకు, మీకు మంచిదనుకున్న విధంగా మీరు ఉత్తరువు ఇవ్వండి.

⁕ ⁕ ⁕ ⁕ ⁕

సోక్రటీస్ నేరం చేశాడు.

అతని మీద అభియోగం రుజువు అయింది

– అని తీర్పు ఇచ్చారు.

మెలెటస్ శిక్ష ప్రతిపాదించాడు.

'మరణ దండన' అది.

తరువాత సోక్రటీస్ ఇలా సమాధానం చెప్పుకున్నాడు.

ఈ ప్రతిపాదనకు నేనేమి కందిపోవడం లేదు.

నన్ను మీరు నిరసించారు; తొలగద్రోశారు.

మీ ప్రతిపాదన ఆశ్చర్యం కలిగించడం లేదు కూడా.

నాకూ 'విడ్డూరం అనిపిస్తున్నది ఒక విషయం ఉన్నది. అదేమిటంటే – అభియోగానికి అనుకూలంగా, ప్రతికూలంగా నమోదు అయిన ఓట్లు, వాటి సంఖ్య.

ఈ రెండు అంకెలు అంత దగ్గరగా ఉంటాయని నేను ఊహించలేకపోయినాను.

220 మంది నాకు అనుకూలంగా 'ఓటు' వేశారు.

280 మంది ప్రతికూలంగా అంటే నన్ను వదిలివేయడానికి వీలుకాదని ఓటు వేశారు.

అంటే ఓ ముప్పయి మంది ఈ గుంపులోనుంచి మొదటి గుంపులోనికి చేరినట్లయితే, నేను 'దోషి'ని అయి ఉండేవాడిని కాను; నన్ను వదలివేసేవారు.

ఫలితం ఏమైనా –

మెలెటస్ తీసుకువచ్చిన అభియోగం మేరకు నేను 'నిర్దోషి'ని అని నిరూపణ అయినట్లు.

అంతేగాదు, అనిటస్, లైకన్ అతనితో కలవక పోయినట్లయితే మెలెటస్‌కి యాభై నాణేల ప్రవేశ శుల్కం కోల్పోయే దురవస్థ కూడా పట్టేదేమో.

సరే, ఏమైనా – ఇప్పుడు అంతా స్థిరం అయిపోయింది.

'మరణదండన' ప్రతిపాదిస్తున్నాడు మెలెటస్.

దీనికి ప్రత్యామ్నాయంగా నేనూ ఒక ప్రతిపాదన చేయవచ్చును గదూ, కాని ఏం చేయను ?

ఈ శిక్ష చాలదా ?

నేను ఎప్పుడూ మామూలు మనుషుల్లా జీవించలేదు. చాలా మంది మోస్తరుగా డబ్బు, అనుకూలమైన ఇల్లు, గౌరవ పదవులు, రాజకీయ మర్యాదలు – అటువంటివి నాకు కావాలని తాపత్రయ పడలేదు.

ప్రజల దృష్టిని నైతికత, మంచితనం, ఆత్మాశ్రయమైన గుణాల వైపు మళ్ళించడానికి ప్రయత్నం చేశాను. అందరినీ ఇందుకు ప్రేరేపించటానికి పూనుకున్నాను. నిజానికి ఇటువంటి మనిషి 'రాజ అతిథి'గా సత్కారం పొందవలసిన మాట. ఆటల పందేలలో గెలుపొందిన మనిషి సైతం ఇటువంటి సత్కారాలు పొందుతున్నాడు. ఆ మనిషి 'గెలుపు' వంటిది తీసుకు వస్తున్నాడు. మీకు నేను అసలైన గెలుపునే తీసుకువస్తున్నాను. వాళ్ళకు రక్షణ అక్కర్లేదు. మీకు కావాలి. ప్రత్యామ్నాయంగా ఏదైనా నేను సూచించక తప్పదు అనేటట్లయితే, నేను ఒక్కటే చెబుతాను.

నన్ను 'రాజ అతిథి'గా ప్రకటించండి :

సత్కరించండి.

నేను మిమ్మల్ని ఏదో బతిమాలుకుంటున్నానని, భంగపడి వేడుకుంటున్నానని అనుకోకండి. అలాంటి భ్రమలు నాకేమీ లేవు.

ఒకటి మాత్రం నేను ఖచ్చితంగా చెప్పగలను.

నేను ఉద్దేశ్యపూర్వకంగా ఎలాంటి తప్పిదము చేయలేదు; ఎవరినీ తప్పు దారికి మళ్ళించ లేదు.

'యావజ్జీవ కారాగార శిక్ష' ప్రత్యామ్నాయంగా నేను కోరుకోను.

జరిమానా కోరుకోను.

ఎందుకంటే – మీకు చెల్లించటానికి నా దగ్గర ఎలాంటి పైకమూ లేదు.

దేశ బహిష్కారం కోరుకోను.

– ఇది మీలో చాలామందికి సమ్మతం అవుతుంది.

బతుకంటే మక్కువ ఉన్నవాడినైతే ఇలా 'దేశ బహిష్కరణ' కోరుకుంటాను.

నా సంభాషణలు, మాటలు, ప్రశ్నలు... ఇవన్నీ మీకు చాలా చికాకు, గందర గోళం, అస్తవ్యస్తత తీసుకు వచ్చాయి. వీటన్నింటి నుంచి దూరంగా పోవాలనుకుంటున్నారు మీరు.

నా చిన్నతనంలోనే నేను దేశదేశాలు తిరగ గలిగినట్లయితే బాగుండేది. ఏ దేశంలోనైనా, జనం నేను చెప్పిన మాటలు కుతూహలంగా, ఆసక్తిగా వింటారు, సందేహం లేదు. ఇక్కడ జరిగినట్లే ఏ దేశంలోనైనా జరుగుతుంది.

ఎక్కడికి వెళ్ళినా, ఎలా ఉన్నా 'నా పని నేను చేసుకోవటమే' భగవన్నిర్ణయం. అందుచేత ఏ దేశం వెళ్ళినా నేను చేసే పని ఇదే.

నాదంటూ అయిదు నాణేలు మాత్రమే డబ్బు ఉన్నది.

పరిహారంగా, మీకు ఈ అయిదు నాణేలు చెల్లిస్తాను. ఆగండి.... ప్లేటో, క్రిటో, క్రిటోబులస్, అపొలుడొరస్... వాళ్ళు నూటయాభై నాణేలు ఇస్తామంటున్నారు. నేనూ అంగీకరిస్తున్నాను. తరువాత మీ ఇష్టం.

❊ ❊ ❊ ❊ ❊

జ్యూరీ మరణదండనను స్థిరపరిచింది.

❊ ❊ ❊ ❊ ❊

సోక్రటీస్ కొనసాగించాడు :

అతిస్వల్ప సమయంలో మీరు ప్రపంచ ప్రఖ్యాతమైన పని చేశారు.

'జ్ఞాని' అయిన సోక్రటీస్‌ని చంపివేస్తున్నారు.

నేను జ్ఞానిని కానని నేను ఎరిగినా, నన్ను ఎరిగిన వాళ్ళందరూ నేను 'జ్ఞానినే' అంటున్నారు.

ఇప్పుడు మృత్యువుకు అతి సమీపంగా వస్తున్నాను.

వాదనలో పస లేకపోయినందువల్ల నేను వీగిపోయినా ననుకోవడం లేదు.

నేను మీకు కావలసిన పద్ధతిలో వాదనలు చెప్పలేదు. ఏడవడం, మొత్తుకోవడం, బతిమాలడం, దుర్భాషలాడడం.... ఇలాంటి పనులు చేస్తాననుకున్నారు మీరు.

యుద్ధభూమిలో మాదిరే కోర్టులో కూడా న్యాయం, ధర్మం వుండాలి. కుయుక్తులు పనికిరావు అని నమ్ముతున్నాను.

మృత్యువును తప్పించుకోవడం పెద్ద విషయం కాదు.

తప్పు చేయకుండా తప్పించుకోవడం గొప్ప విషయం.

నాకు మృత్యుదండన.

నాపై అభియోగం తెచ్చిన వారికి సత్యదండన.

నాకు వ్యతిరేకంగా ఓటు వేసిన వాళ్ళందరికీ ఒక విషయం మనవి చేస్తాను.

'నేను మరణిస్తాను, సరే. తక్షణమే, మీరు ఇంతకంటె బాధాకరం అయిన శిక్షకు గురి అవుతారు.' నా మరణంతో మీ బాధలన్నీ తొలగిపోయాయను కుంటున్నారేమో! ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటుంది. మిమ్మల్ని విమర్శించేవారు ఎక్కువ అవుతారు. ఇంతవరకూ వాళ్ళను నేను మీకు తెలియకుండా అణచి ఉంచాను. వాళ్ళు యువకులు గనుక మీ పట్ల క్రూరంగా ప్రవర్తిస్తారు. మీకు ఎంతో 'క్షోభ' కలిగిస్తారు. దాని నుంచి మీరు తప్పించుకోలేరు. ఇతరుల నోళ్ళు కట్టివేయటానికి ప్రయత్నించకండి. వీలయినంత వరకు మంచితనాన్ని పెంచటానికి ప్రయత్నించండి.

నాకు అనుకూలంగా ఓటు వేసినవాళ్ళ కోసం ప్రత్యేకంగా కొన్ని మాటలు : తుది ఫలితానికి సమాధానపడి ఊరుకోండి.

నాకు మరణం తటస్తించేవరకు మనం అప్పుడప్పుడు – చట్టరీత్యా అనుకూలం ఉన్నది గనుక – కలుసుకుంటూ ఉందాం. మీరు నా స్నేహితులు. నా పరిస్థితిని యధాతథంగా అర్థం చేసుకుని సమాధాన పడండి. అంతే.

జ్యూరీకి ఒక మాట !

నా 'అంతర్వాణి' నన్ను ప్రతిమారూ సరిచేసేది ; నాకు మాటలు గుర్తుచేసేది. కాని ఇవాళ మాత్రం ఆ అవసరం లేదు. నా ఆలోచనాధారకు ఎలాంటి అడ్డం లేకుండా గడిచిపోయింది ఇవాళ. ఇది ఓ వరప్రసాదం.

మృత్యువు భయపడవలసింది కాదు.

సునాయాసంగా మరణించడం శుభప్రదం.

మృత్యు సమయంలో స్పృహ లేకపోవడం ఒక స్థితి.

ఒక శరీరం నుంచి మరో శరీరంలోనికి పోవడం మరో స్థితి.

స్పృహ లేకుండా – స్వప్నమూ లేకుండా – ఉంటే అంతకంటే కోరుకోవలసింది మరేం లేదు.

స్వప్నం లేని రాత్రి – తెల్లవారి లేచిన తర్వాత ఎంత సుఖప్రదంగా ఉంటుందో ఊహకు అందదు.

మృత్యువు అటువంటిది అయితే – దానిని నేను తిరిగి తిరిగి ఆహ్వానిస్తాను.

జీవితకాలం అంతా ఒకే రాత్రి.

అలా కాకుండా, మృత్యువుతో పాటు మనం ఇక్కడ నుంచి మరో చోటుకు బదిలీ అయిపోతూ ఉంటే, – అప్పటి పరిస్థితి వేరు. అక్కడ – ఆ లోకంలో చనిపోయిన వాళ్ళంతా ఉంటారా, అంతకంటె కావలసింది ఏమున్నది ? మనం కలుసుకోగోరిన మహామహులు అక్కడ కనిపిస్తే అంతకన్న కోరుకోతగినది ఏముంది ? ఇదే నిజం అయితే, ఎన్ని మార్లయినా చనిపోవడానికి నేను సిద్ధమే.

వాళ్ళందరితోనూ మాట్లాడవచ్చు. ప్రశ్నించవచ్చు. అనేక సంగతులు తెలుసుకోవచ్చు. వాళ్ళ అంతరంగాలు పరిశీలించవచ్చు.

అందుచేత – ఓ జ్యూరీ సభ్యులారా ! – మీరు కూడా మృత్యువువైపు దృష్టి సారించండి.

మంచి మనిషికి – బతికి ఉన్నప్పుడుగాని, చనిపోయిన మీదటగానీ – ఏదీ చెడు చేయలేదు. అతని సౌభాగ్యాన్ని దేవతలు పరీక్షిస్తూనే ఉంటారు.

ప్రస్తుత నా అనుభవం, ఆ సమయంలోనే వచ్చిందనీ నేను అనుకోవడం లేదు. చనిపోవడానికి నాకు ఇదే అనుకూలమైన సమయం.

నాకు ఎవరిపైన ద్వేషము, కోపము లేదు.

నాపై అభియోగం తెచ్చిన వారిపైన, నన్ను శిక్షించిన వారిపైన నాకు అగౌరవం, ద్వేషం లేవు.

వాళ్ళు నాకు ఏదో 'అపకారం' చేస్తున్నామనుకుంటూ, ఈ ఉపకారం చేస్తున్నారు.

నాకో ఉపకారం మటుకు చేయండి.

రేపు నా కొడుకులు డబ్బుకే ప్రాధాన్యం ఇచ్చి, మంచితనానికి దూరంగా ప్రవర్తించినట్లయితే, మీరు వాళ్ళను, నన్ను ఇప్పుడు వేధించినట్లుగానే – శిక్షించండి. జీవితంలో ముఖ్యమైన విషయాలను అలక్ష్యం చేయవద్దని గుర్తుచేయండి. మందలించి చెప్పండి. అలా చేసినట్లయితే, మీరు నాకు, నా వాళ్ళకు కూడా ఉపకారం చేసినట్లు అవుతుంది.

ఇక మనం వెళ్ళిపోవలసిన సమయం ఆసన్నమైంది.

నేను మరణానికి అతిథిగా వెళ్ళాలి.

మీరు బతుకుకు బంధువులుగా వెళ్ళాలి.

మన ఇద్దరిలో ఎవరిది సుఖమైన ప్రసక్తో భగవంతుడికి తప్ప మరెవరికీ తెలియదు. ●

# పలాయనం తప్పు

**ఏ**థెన్స్ నగర రాజ్యాంగ పద్ధతుల ప్రకారం –'మరణ దండన' విధించబడిందీ అంటే, సాధారణంగా అది వెంటనే అమలు జరుగుతుంది.

సోక్రటీస్ విషయంలో ఈ ఏర్పాటు దాదాపు నెలరోజులపాటు ఆలస్యం అయింది. దీనికి కారణం ఏమిటంటే !

విచారణ జరగడానికి ముందు రోజే వార్షికంగా ఏథెన్స్ నుండి డెలోస్ (Delos) కు వెళ్ళే పడవను అలంకరించి సాగనంపడం జరిగింది. దీని చరిత్ర గమనించదగినది; థిసియోస్ (Theseus) ఏడుగురు యువకులు, ఏడుగురు యువతులతో క్రేట్ (Crete) కు ప్రయాణం చేసిన పడవలలో ఇది ఒకటి. ఈ యువతీ యువకుల ప్రాణాలకు భంగం కలుగకుండా రక్షణ ఏర్పడినట్లయితే, ప్రతి సంవత్సరం (Apollo) దేవతకు డెలొస్‌కు కానుకలు, కైంకర్యాలు పంపుతామని మొక్కుకున్నారట. అప్పటి నుండి ఈ దేవతకు ఈ గౌరవం, మన్నన జరుగుతూ ఉన్నాయి, ప్రతి సంవత్సరము విడవకుండా. ఇంతకూ, మన ఉపఖ్యానానికి సంబంధించిన విషయం ఏమిటంటే – పడవ అలంకారాలు తయారు చేసి పంపడం తతంగం ఆరంభమైనప్పటి నుంచి – నగరాన్ని పవిత్రంగా ఉంచే ప్రయత్నం జరుగుతుంది. ఈ పవిత్రతలో భాగంగా – నగరంలో ఎలాంటి 'మరణ దండనలు' అమలు జరగగూడదని నియమం. పడవ డెలొస్ వెళ్లి, తిరిగి వచ్చేంత వరకు పవిత్ర వాతావరణం నెలకొని ఉండాలి. ఈ ప్రయాణానికి వాతావరణం అనుకూల, ప్రతికూలాలపై ఆధారపడి ఎంతో కొంత ఆలస్యం అవక తప్పదు.

ఈ సంవత్సరం సోక్రటీస్ విచారణ జరగడానికి ముందు రోజే ఎపెలో పురోహితుడు పడవకు అలంకారం ప్రారంభం చేశాడు. ఈ పడవ తిరిగి రావడానికి ముప్పై రోజులు పట్టినది. అన్ని రోజులు సోక్రటీస్ జైల్లోనే వుండిపోవలసి వచ్చింది.

ఒక రకంగా చూచుకుంటే – కొంతమంది నగరపౌరులు, కౌన్సిలర్లు ఈ జాప్యం కావాలనే చేశారేమోనని గూడా అనుమానించే అవకాశం ఉంది. సోక్రటీస్ పారిపోవటానికి వీలుగా కొంత సమయ విరామం ఏర్పాటు అయింది. అతను పారిపోవటానికి, ఇతర దేశాలలో సురక్షితంగా ఉండటానికి కొన్ని ఏర్పాట్లు గూడా చేశారు మిత్రులు. కాని సోక్రటీస్ ఈ అసంగతమైన పనికి అంగీకరించలేదు.

సోక్రటీస్ జైలులో ఉండగా అతని స్నేహితులు తరచు అక్కడకు వస్తూ అతనితో సరస సంభాషణలు జరుపుతూ కాలక్షేపం చేస్తూ ఉండేవాళ్ళు. సోక్రటీస్‌ను తరచుగా కలుసుకుని పారిపోవడానికి ప్రోత్సాహం చేసిన మిత్రుడు క్రిటో (Crito), ఇతడు ఎంత యుక్తియుక్తంగా మాట్లాడినా అన్ని వాదనలను సోక్రటీస్ ఉపహరించగలిగాడు.

ఒకపక్క 'మరణదండన' జరుగుతుందని ఖచ్చితంగా తెలిసినా, సోక్రటీస్ హాయిగా నిరాక్షేపణగా నిద్రపోతూ ఉండేవాడు. అతని ఈ మానసిక స్థితి స్నేహితులకు – అంతకు ముందునుంచి ఎంత పరిచయం ఉన్నా, అబ్బురంగా ఉండేది. ఈ మనిషి ఇలా హాయిగా నిద్రపోగలుగుతున్నాడే! తన భవిష్యత్తును గురించి ఎలాంటి అరమరికలు లేకుండా కాలం గడిపి వేస్తున్నాడే ! వయసు మీదపడిపోతున్నప్పుడు ఉండే అవలయలు ఏ మాత్రము ఇతడిని లోగొనడం లేదే !

పడవ నేడో, రేపో తిరిగి వస్తుంది.

సోక్రటీస్ అంతిమ దినం దగ్గర పడుతోంది.

'భగవన్నిర్ణయం ఎలా ఉంటే అలా జరుగుతుంది' అని నిబ్బరంగా ఉన్నాడు సోక్రటీస్.

ఆయనకు ఒక కల వచ్చింది. ఆ కలలో తెల్లని దుస్తులు ధరించిన ఓ సుందరాంగి అగుపించింది. ఇలా చెప్పింది! సోక్రటీస్ ! ఈ రోజుకు మూడోనాడు నీవు స్వర్గధామంలో ప్రవేశించనున్నావు ?

సోక్రటీస్‌కు ఈ స్వప్నం చాలా స్పష్టంగా, సూటిగా గుర్తు ఉండిపోయింది. కాని ఆయన మిత్రులు మాత్రం ఈ కలకు అర్థం పర్థం లేవు అని వాదించారు. ఎందుచేతనంటే, ఇంకా సోక్రటీస్ తమ మాట వింటాడనీ, పారిపోవటానికి అంగీకరిస్తాడనీ, మరణ దండన అమలు జరగదనీ వారు ఆకాంక్షిస్తున్నారు.

సోక్రటీస్ మరణం అంటే వారికి రెండు రకాల ఇబ్బంది. మంచి స్నేహితుడు దొరకడు. తప్పించటానికి వీలు ఉన్నప్పటికీ ఆ పనిలో కృతకృత్యులం కాలేకపోయినా మనే చింతతో జీవిత శేషం అంతా కుంగిపోతూ గడిపారు వారు. అతనికి కావలసిన డబ్బు, దస్కం పోగుచేశారు. క్షణక్షణమూ ఇందుకు అవసరమైన ప్రోత్సాహం సోక్రటీస్‌కు ఇస్తున్నారు. కాని ఆయన 'ఊ' అనడు, 'ఆ' అనడు. నిమ్మకు నీరెత్తినట్లుగా కూర్చుండిపోతాడు.

'అందరూ ఏదో అనుకుంటారని మనం కుంగిపోవడం ఎందుకు ? ఎలా జరిగిందో అలాగే చెప్పుకుంటారు జనం... ఒక మనిషిని జ్ఞానిని చేయటానికి గాని, అవివేకిగా తయారు చేయడానికి గానీ సామాన్యజనానికి సామర్థ్యం లేదు –' అంటాడు సోక్రటీస్.

'నీవు పారిపోవటానికి దోహదం చేశామనే నేరం మీద మమ్మల్ని శిక్షించవచ్చును రాజ్యాంగం. మేం కూడా దేశాలు వదలిపోవటానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకున్నాం. ఇందులో పిరికితనం ఏమీ లేదు. ఒక రకంగా "ధీరత్వం" కూడా ఇది. నీ పిల్లల విషయం కూడా కాస్త ఆలోచించు; వాళ్ళను పెంచి పెద్దవాళ్ళు అయ్యేట్లు చూడవలసిన బాధ్యత కూడా నీకు ఉన్నది గదా' – 'ఇలా రకరకాలుగా' సోక్రటీస్‌ను ప్రలోభపెట్టటానికి ప్రయత్నం జరిగింది.

స్నేహితులు చెప్పారు గదా అని ఏ సలహా అయినా పాటించడం సోక్రటీస్‌కు మొదటినుంచీ అభ్యాసం లేదు. ఏ పని చేయవలసినా ముందుగా ఆ పని తనకు యోగ్యమైనదని తార్కికంగా నిర్ధారణ కావాలి. తన కంటె విజ్ఞులు చెప్పిన విషయాలనే పరిశీలించాలి అని ఆయన అభిప్రాయం.

మరింత ఉదాత్తమైన ఉదాహరణలు కూడా చెప్పాడు సోక్రటీస్.

'మనలో ఒక భాగం ఉంది. ఆరోగ్యవంతమైన పరిశ్రమ వల్ల అది పెరిగింది. అనారోగ్య కారణాల వల్ల కృంగిపోయింది. అలా పాడయిపోయిన భాగాన్ని ఇంకా వేసుకు తిరుగుతామా ? వయసుతో ఉడిగిపోయి, అనారోగ్యానికి ఆలవాలం అయిన శరీరాన్ని ఇంకా ధరిస్తూనే ఉండాలనే ఆలోచన ఎందుకు ? మంచి, చెడుల వివేకాంతాలు బుద్ధిని సానపట్టుకుంటున్నాం, ప్రతిదీ మనంత మనమే విమర్శ, వివేచన చేసుకుని నిర్ధారించుకుంటున్నాం. అటువంటప్పుడు ఇతరుల చేత అభిప్రాయాలకు తావు ఇవ్వవలసిన అవసరం ఏమిటి ? ఎలాగో ఒకలా బతకడం కాదు కావలసింది. ఎలా బతుకుతున్నాం అన్నది కూడా ముఖ్యం! గౌరవప్రదంగా అప్రతిష్టకు తావు లేకుండా బతకాలి. మనసుకు పొరపొచ్చాలు లేకుండా బతకాలి.

"అధికారులు శిక్ష విధించారు. ఈ శిక్ష నుండి వారి అనుమతి లేకుండా తప్పించుకు పారిపోవడం వివేకమైన పని కాదు. తప్పు పని కూడా అవుతుంది."

"మనను రక్షించేవాళ్ళకు ఏదో డబ్బు ఎర చూపి వాళ్ళకు కృతజ్ఞులై ఉండి తప్పించుకుపోవడం అంత తెలివైన పనా ? అటువంటి ప్రవర్తన సక్రమమైనదేనా?"

"తార్కికంగా యోచించి నిర్ణయం తీసుకోవాలి, అంతేగాని, నిర్ణయాన్ని ముందుగానే తీసుకుని దానికి అనుగుణంగా మన యోచన నిర్ణయించుకుంటూ పోగూడదు" అంటాడు సోక్రటీస్.

"ఏ పరిస్థితిలోనైనా తప్పు పని చేయగూడదు. పరిస్థితుల ప్రభావానికి లోనై మన నిర్ణయాలను మార్చుకోగూడదు."

"ఇతరులు మనపట్ల తప్పుగా ప్రవర్తించి ఉండవచ్చును. అంత మాత్రంచేత మనం కూడా వారిపట్ల అలాగే తప్పుగా, అక్రమంగా ప్రవర్తించవచ్చునను కోవడం తప్పు."

"మనుషులను గాయపరచడం, మనసులను గాయపరచడం – రెండూ తప్పే."

"ఒక తప్పు మరొక తప్పువల్ల పరిహారం కాదు."

"అధికారులకు తెలియకుండా మనం ఇక్కడ నుంచి పారిపోవడం, అక్రమ మైన పని; తప్పు పని. మార్గ మధ్యంలో మనం దొరికితే ఏం సమాధానం చెప్పుకో గలం ? అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు అమలు జరగకుండా మనమే అడ్డుపుల్లలు వేయడం యోగ్యమైన పని అవుతుందా ? రాజ్యాంగం, అధికారం అంటే గౌరవం ఉన్న వాళ్ళు చేయవలసిన పనేనా ఇది ? దేశ గౌరవాన్ని, రాజరిక మర్యాదలను కాదనడానికి మనకు కారణాలు ఏమున్నాయి ?

"మన దేశ ఆస్తిపాస్తులలో భాగం, దొంగదారిలో మనం దేశాన్నీ, దేశ నాయకులను తప్పించుకుపోగలమా ? ఇలా చేయడానికి మనస్సు అంగీకరించ తగునా ? ఈ దేశాన్ని పట్టుకునే, ఆశ్రయించుకునే ఉన్నాం. దానిమీద మనకు ఎలాంటి ఫిర్యాదులు లేవు. అటువంటప్పుడు పారిపోవలసిన అవసరం ఏమిటి ?"

"అభియోగానికి సమాధానం చెబుతున్నప్పుడు దేశ బహిష్కారం కోరుకోలేదు నేను. అటువంటప్పుడు ఇలా పారిపోవడం తప్పు కాదూ ?"

రాజ్యాంగంలో మనం చేసుకున్న ఏర్పాటు, నియమ నిబంధనలు... వీటిని ఉల్లంఘించడం మంచి పని కాదు. డెబ్భైయేళ్ళపాటు ఇక్కడ ఉన్నాను. అప్పుడు పారిపోవటానికి, దేశాన్ని వదిలిపోవటానికి నాకు అవకాశం ఉంది. అన్నాళ్ళూ ఆ పని చేయకుండా, ఇప్పుడు మరణదండన తప్పించుకోవడం కోసం అలా చేయనా ?

"పారిపోవడం అనేది ఏ రకంగా చూచినా యోగ్యమైన పనిగా కనిపించడం లేదు" అంటాడు సోక్రటీస్.

"మన విశ్వాసాలను మనమే వమ్ము చేసుకోవడం, అంతరంగాన్ని అశుద్ధ పరచుకోవడం అవుతుంది, ఈ పని ."

"ఇన్నాళ్ళూ మనం చేసిన బోధనలకు వ్యతిరేకంగా నడుచుకోవలసిన అవసరం ఆసన్నమవలేదు" అంటాడు.

జీవితం పట్ల – బతుకుపట్ల – దురాశతో, మక్కువతో ఈ పని చేయడం అగౌరవ ప్రదమేననే తీర్మానానికి వచ్చాడు సోక్రటీస్.

జీవితం చరమాధ్యాయంలో తప్పుడు పని చేశాడనే అప్రతిష్ట ఎందుకు పొందాలి ?

ఉత్తర లోకంలో అధికారులు ముందు ప్రవర్తన గురించి సమర్థించుకోవటానికి అవకాశం ఉంటుందా ?

సోక్రటీస్‌కు స్పష్టంగా, స్ఫుటంగా అనిపించినదేమంటే – భగవంతుడు చూపిన దారిలోనే ప్రయాణం చేయాలి గాని, మేము ఈ మార్గాలు – తాత్కాలిక ప్రయోజనాలకు దారితీసేవి – అవలంభించడం మంచిపని కాదు.

అందుచేతనే అతను, ఎందరు మిత్రులు ఎన్ని రకాలుగా చెప్పినా, బతిమాలినా జెయిలులోనుంచి పారిపోవటానికి సుతరామూ అంగీకరించలేదు.

# తత్త్వ దర్శనం

**సో**క్రటీస్ తన చివరిరోజు జైలులో ఎలా గడిపాడో తెలుసుకోవడం అభిరుచిదాయకంగా ఉంటుంది. యుగయుగాల విజ్ఞానాన్ని రంగరించుకుని, తన స్వప్రజ్ఞతో మిళితం చేసుకున్న తత్త్వసంపన్నుడు ఎలా ఉన్నాడు ? ఏం చేశాడు ? అంతవరకూ జరిగిన దానికి చింతించాడా ? జరగనున్న దానికోసం కళవెళ పడ్డాడా ? కల్లోల మనస్కుడు అయినాడా ఆఖరు క్షణంలో.

ఏథెన్స్ నగరంలో మరణశిక్ష అమలు జరపడంలో సాధారణంగా అమలు జరిపే ప్రక్రియ హెమ్‌లాక్ రసాయనము (Hemlock Juice) తాగడానికి ఇవ్వడం, ఈ సేవనం వల్ల మరణం ఏ మాత్రం బాధాకరం కాకుండా జరిగిపోతుంది ? అయితే ఇది నెమ్మదిగా మందకొడిగా మటుకే పనిచేస్తుంది.

* * * * *

ఆ రోజూ అన్ని రోజులమాదిరే తెల్లవారింది.

సోక్రటీస్‌ను కలుసుకోవటానికి రోజూ మిత్రులు, హితులు వస్తూ ఉండే వాళ్ళు. కొందరు అంతేవాసులు తెల్లవారుజామున వచ్చి, చీకటి పడేంత వరకు ఆయనతో సంభాషిస్తూ చివరకు విడవలేక, విడవలేక వెళ్ళిపోతూ ఉండేవాళ్ళు. సోక్రటీస్ సరసోక్తులు వినడం 'జ్ఞానామృతాన్ని జుర్రుకోవడం' అని వాళ్ళ ధృఢ విశ్వాసం. ఆయన మరణానికి ఆసన్న మవుతున్నాడని ఎవరికీ బెంగ, దిగులు లేవు. వీరోచిత కార్యం చేస్తున్న తమ నెచ్చెలి, సచివుడు – ఆయన సరసన ఉండడమే, ఉండగలగడమే గొప్ప కార్యం.

సోక్రటీస్ మామూలుగానే ఉన్నాడు. చిదానందంగా నవ్వుతూ – స్నేహితులను సాదరంగా ఆహ్వానిస్తూ ఉన్నాడు.

ఆయన ప్రయాణ సంరంభం చాలా హుందాగా, సమున్నతంగా జరిగిందని స్నేహితులందరూ భావించారు. మరణానంతరం లోకంలో సోక్రటీస్‌కు ఘనమైన స్వాగతం లభించబోతోంది. దీన్ని చూడటానికి మనకు యోగ్యత లేకపోయిందే అని చాలామంది విచారించారు.

* * * * *

చివరి రోజున జరిగిన సంభాషణలో సుఖము, దుఃఖము – వీటి అవినాభావ సంబంధాన్ని గురించి సోక్రటీస్ చక్కగా ముచ్చటించాడు. ఈ మనిషి ఇంకా కొన్ని క్షణాలలో విగతజీవుడు అవుతాడన్న ధ్యాసే లేదు ఎవరికీని, హాయిగా వింటూ గమనిస్తూ కూర్చున్నారు.

ఏథెన్స్ నగరంలోని అతని మిత్రులు మాత్రమే కాక, పొరుగు రాజ్యాలనుంచి, నగరాల నుంచి ఈ సంగతి, సందర్భము తెలుసుకున్న వాళ్ళు కూడా కొందరు వచ్చి చేరారు.

అందరూ సోక్రటీస్ ఉన్న జైలు ఆవరణలోనికి చేరుకున్నారు తెల్లవారు జామునే. జైలు తలుపులు ఇంకా తీయలేదు. ప్రతిరోజూ ఇంతే. చాలా ఆలస్యంగా గాని తలుపులు తెరుచుకునేవి కాదు.

ఈ రోజు, రోజుకంటె పెందలకడనే చేరుకున్నారు అనుయాయులు. ఎందుకంటే క్రితం రోజు సాయంకాలం తెలిసివచ్చింది కదా! పడవ తిరిగి ఏథెన్స్ చేరుకుందని, ఉత్సవ సమయం, పవిత్రత కాపాడవలసిన సమయం ముగిసిపోయింది. రేపు ఉదయమే 'మరణశిక్ష' అమలు జరుగుతుందని దాదాపు అందరికీ నమ్మకంగా తెలుసును.

గుమ్మం దగ్గర భటుడు, సోక్రటీస్ స్నేహితులను ఈ రోజు త్వరగా లోనికి వదలలేదు. 'ఇక్కడే కొద్దిసేపు వేచి ఉండండి. నేను కబురు పెట్టేంత వరకు లోపలకు వచ్చే ప్రయత్నం చేయవద్దు' అన్నాడు.

సోక్రటీస్ చేతులకు వేసిన శృంఖలాలు తొలగిస్తున్నారు. లోపల అధికారులు ఆయనకు చెప్పారు 'ఇదే చివరి రోజు' అని.

భటుడు ఈ తతంగమంతా లోపల గడిచిన తర్వాత, తాను బయటకు వచ్చి మమ్మల్ని సాదరంగా లోపలకు ఆహ్వానించాడు.

సోక్రటీస్ విరామంగా కూర్చుని ఉన్నాడు.

ఆయన దగ్గర 'క్సాంతిపె' ఉన్నది. ఆమె చేతుల్లో బిడ్డడు ఉన్నాడు.

అందరూ లోపలకు రావడంతోటే ఆమె భర్తతో అన్నది "ఇదే చివరి రోజు, నీవు నీ స్నేహితులతో ఇష్టాగోష్ఠి జరపటానికి". ఆమె దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడవసాగింది. సోక్రటీస్ నిదానంగా "క్రిటో! ఈమెను ఇంటికి తీసుకువెళ్ళి జాగ్రత్తగా దిగవిడిచిరా" అన్నాడు.

సోక్రటీస్ పక్క మీదనే లేచి కూర్చున్నాడు. కాలు పైకి జాపుకుని కాస్సేపు రుద్దుకున్నాడు.

"ఈ సర్వ సుఖం ఎంత మజా అయినది. అదే సుఖం అనుకుంటాం గదా."

సుఖం అనేది దానికి వ్యతిరేక భావం, దుఃఖం–బాధ–అనుకుంటాము.

సుఖము, దుఃఖము... ఎప్పుడూ ఈ రెండూ ఒకేమారు సంప్రాప్తం కావు మనిషికి. అయితే విచిత్రం ఏమిటో తెలుసునా... మీరు ఒకదాని వెనుక పరుగెత్తి దానిని సాధించడంలో కృతకృత్యులు అయినారంటే, రెండవదానికి కూడా చాలా చేరువగా ఉన్నట్లే లెక్క. సుఖము, దుఃఖము ఈ రెండూ ఒకే తలకు అంటించిన రెండు శరీరాలు అయి ఉండాలి. ఈసప్‌కు ఈ ఆలోచన వచ్చినట్లైతే అతను దీనిని ఒక గాథగా మలచి ఉండేవాడు. ఈ గాథ బహుశా ఇలా ఉండి ఉంటుంది.

"భగవంతుడు పరస్పర విరుద్ధమైన సుఖ దుఃఖాలను కలిసికట్టుగా ఉంచాలనుకున్నాడు. కాని సుఖ దుఃఖాలు ఎప్పుడూ ఒకదానితో మరొకటి పోటీ పడుతూ ఉంటాయి. అందుచేత వాటిని కలిపి ఒకచోట ఉంచగలగడం అసాధ్యం. అప్పుడు ఆ రెండింటి తలలు కలపి కట్టేశాడు. అందుచేత ఎప్పుడూ అని జమిలిగానే వస్తాయి. ఒకదాని వెనుక, మరొకటి తప్పనిసరిగా సాక్షాత్కరిస్తాయి."

సోక్రటీస్‌కు సంకెళ్ళ వల్ల కాళ్ళకు గాయాలవంటి మచ్చలు, గీతలు ఏర్పడ్డాయి. వాటివల్ల అతనికి ఇప్పుడు నొప్పి ప్రారంభమైంది కూడా. కాని – ఈ నొప్పితోపాటు, దానితో తప్పనిసరిగా వచ్చే 'సుఖం' కూడా ఇపుడు తన దగ్గరకు వస్తుంది, అనుకున్నాడు.

సోక్రటీస్ ఈ సంఘటన వర్ణించడంతోటే, అతని అనుయాయులలో ఒకడైన సెబెస్ (Cebes) ఇలా అన్నాడు. "ఇవెనస్ (Evenus) నన్ను రోజూ అడుగుతున్నాడు, మీరు ఈసఫ్ కథలను గేయాలుగా వ్రాస్తున్నారట గదా, ఈ చరమదశలో మీకు గేయరచన మీద ఎందుకు, దృష్టి మళ్ళిందో తెలుసుకోవాలని ఎంతో ఆసక్తిగా ఉంది అతనికి. అసలు ఈ దృష్టి ఎందుకు ఎలా ఏర్పడిందో చెప్పండి, రేపు అతను అడిగితే చెప్పటానికి నా దగ్గర సమాధానం ఉంటుంది."

"ఇవెనస్‌కు చెప్పు, గేయరచనలో అతను సిద్ధహస్తుడు. అతనితో పోటీపడడం కోసం నేను గేయరచన ప్రారంభించ లేదు అని చెప్పు. నాకు కొన్ని కలలు వస్తున్నాయి. ఈ కలల అంతరార్థం తెలుసుకోవడం కోసం – గేయరచన ప్రారంభం చేశాను. నేను అభ్యాసం చేయువలసిన 'కళా, నైపుణ్యం' ఇదేనేమోనని పరీక్షించి

చూచుకుంటున్నాను. నాకు ఒకే ఒక కల అతి తరచుగా వస్తూ ఉండేది” అంటూ సోక్రటీస్ దాని వివరాలు చెప్పసాగాడు.

‘సోక్రటీస్! కళలు నేర్చుకో, అభ్యాసం చేయి’ అని ఆ కల. చాలా మార్లు అతని మనఃఫలకంలో అవతరిస్తూ ఉండేదట, గుర్తు చేస్తున్నట్లుగా.

బహుశ తాను చేస్తున్న పనులనే కొనసాగించమన్న ఆదేశంగా తీసుకున్నాడు దీనిని చాలా కాలం సోక్రటీస్. ఎందుకంటే తత్త్వదర్శనం కళలలో ప్రధానమైనది. దానిని ఆయన అభ్యసిస్తూనే ఉన్నాడు అనుక్షణం.

“కాని ఈ నెల రోజులు జైలులో ఉన్న సమయంలో అంతర్మథనం చేసుకుంటున్నపుడు బహుశ నేను అభ్యాసం చేయాలని ఆదేశించిన కళ, కవిత్వ రచన ఏమోనన్న భావం కలిగింది. అందుచేత ఆ దైవ ఆదేశాన్ని మన్నించాలని, అవిధేయంగా ఉండగూడదని తీర్మానించుకున్నాను. చనిపోయే లోపుగా కవిత్వ రచన గూడ చేసి, ఈ ఆదేశం అమలు జరిపాను. భగవంతుని కీర్తిస్తూ, ఉత్సవ సంప్రదాయాలను వర్ణిస్తూ కొన్ని కీర్తనలు, గేయాలు వ్రాశాను. ఇవి వ్రాసిన తరువాత అనిపించింది. ఇలా కీర్తనలు వ్రాయడం కాదు; ఏదైనా కాల్పనిక సాహిత్యం పట్ల, ఊహారచనల పట్ల దృష్టి సారించాలనుకున్నాను. అప్పుడే కవిగా నాకు తగిన గౌరవం లభ్యమవుతుంది. ఈసఫ్ కథలు మనకందరికీ పరిచయమైనవి కదూ, ఆ కథావస్తువు తీసుకున్నాను సౌలభ్యం కోసం. కొత్త కథలు సృష్టించటానికి తగిన సామర్థ్యం నాకు లేదు... ఈ సంగతి కూడా నీవు ఇవెనస్‌కు చెప్పు. అతనికి శుభాకాంక్షలు చెప్పు. నేను ఈ రోజు వెళ్ళిపోతున్నాను. – అతను గూడా జ్ఞాని అయినట్లయితే, నన్ను వెంబడించమని చెప్పు. నా దేశ ఆదేశం ప్రకారం నేను ఈ రోజు దేహత్యాగం చేయవలసి ఉంది గదా!’

తత్త్వవేత్త అయినవాడు దౌర్జన్యం చేయడు; అందులో ఆత్మత్యాగం వంటి పనులు అసలే చేయడు; అయినా తత్త్వవేత్త అయినవాడు తన స్నేహితుడిని చావులో కూడా అనుసరించే ఉంటాడు. ఈ విషయాలను వివరిస్తూ సోక్రటీస్ ఇలా చెప్పాడు.

ఈ ప్రపంచాన్ని వదలి పోవటానికి నిశ్చయమైన తర్వాత : ప్రతి మనిషీ పరలోకాన్ని గురించి ఆలోచన చేయడమే యోగ్యమైన పని.

కొందరికి బతికి ఉండడం కంటే మరణమే మేలు. మరణం శ్రేయోదాయకం కావచ్చును. ఇది మనకు అర్థం కాదు. నమ్మబుద్ధి కాదు. అయినా వాళ్ళు ఆఖరు క్షణం వరకు వేచి ఉండవలసిందే తప్ప, తమంత తాముగా తొందరపడి ఆత్మహత్య చేసుకోగూడదు.

మనుషులందరమూ – ఏదో పని కోసం ఇక్కడకు వచ్చాం. కాపలా మనుషులలా ఉన్నాం అనుకుందాం! ఉదాహరణ కోసం. ఈ కాపలా పని నుంచి మనంతట మనం పరుగెత్తుకుపోగూడదు. పారిపోగూడదు... అదీ విషయం. ఇది మనకు తేలికగా అర్థం కాకపోవచ్చును. మరోరకంగా అనుకుందాం. దేవతలు మనకు రక్షకులు : మనం కేవలం వాళ్ళ సొత్తు. మన ఆధీనంలో ఉన్న వస్తువు మనకు తెలియకుండా తనను తాను తుదముట్టించుకుంటే ఎలా ఉంటుంది మనకు ? కోపం రాదూ వాటి మీద. అలాగే మనమేదైనా అకార్యం చేస్తే, దేవతలకు మటుకు మనపైన కోపం రాదూ ? అందుచేత – దేవుని దగ్గర నుంచి ఆదేశం వచ్చేంత వరకు మనం ఇలా కాలక్షేపం చేయవలసిందే !

సెబెస్ సందేహం వెలిబుచ్చాడు. తత్త్వవేత్తలు ఎప్పుడైనా చనిపోయేందుకు సిద్ధంగా ఉండాలని అనడం అంత హేతుబద్ధంగా లేదు. మనం భగవంతుని ఆస్తి కావచ్చును. ఆయన ఆదేశానుసారమే పనిచేయవలసి ఉన్నదన్న సంగతి కూడా యదార్థమే. మన సేవా కైంకర్యం అంతా భగవదాదేశానుసారమే అనుకుంటే, మనుషుల్లో అత్యంత జ్ఞాని నిష్క్రమణకు సర్వసన్నద్ధం ఉండాలనడం అర్థం కావడం లేదు. అతను స్వేచ్ఛాయుతుడు అయినప్పుడు ఇక చేయవలసిన పని అంటూ ఏమీ ఉండదు. అలాగే – ఒక అవివేకి ఉన్నాడనుకుందాం. యజమాని పెట్టే బాధలు పడలేక శరీరత్యాగానికి సిద్ధం అవుతాడు. అదే లాభదాయకం అనిపిస్తుంది. అతనికి యజమాని నుంచి తప్పించుకుందుకు, మంచి యజమాని నుంచి తప్పించుకోవాలనుకోవడం తప్పు అని అతనికి స్ఫురించదు. నిజానికి అవివేకి అయినవాడు ఎప్పుడూ యజమానిని అంటిపెట్టుకుందామనే ప్రయత్నిస్తాడు. ఈ రకంగా ఆలోచించినప్పుడు జ్ఞాని మరణ సమయంలో చింతించడం, అవివేకి ఆనందించడం సహజ సిద్ధం అని అనిపిస్తోంది.

సెబెస్ చెప్పిన వాదన కొందరు అనుయాయులకు సమంజసంగా కనిపించింది. వారు కూడా సోక్రటీస్‌ను మరింత వివరణ ఇవ్వమని కోరారు.

“మరణం వలన నాకు రెండు అవకాశాలు వస్తున్నాయి.

ఒకటి : నాకంటె జ్ఞానులైన పెద్దల దగ్గరకు, దేవతల దగ్గరకు చేరుకుంటాను.

రెండు : ఇప్పుడు ప్రపంచంలో ఉన్న వాళ్ళకంటె ఎంతో జ్ఞానులైనవాళ్ళు, ఇదివరకు ఈ ప్రపంచంలో ఉండి ఇప్పుడు చనిపోయిన వాళ్ళ సమక్షంలోనికి వెడతాను.

ఈ రెండూ నిజం కాకపోయినట్లయితే నేను చనిపోవటానికి చింతించవలసిన మాట నిజమే. నాకంటె తెలివిగలవాళ్ళు, దేవతలు అక్కడ నాకు కలుస్తారు. అందుకనే నేను మరింత ఉత్సాహంతో చావటానికి ఆసక్తి చూపాలి. చనిపోయిన వాళ్ళకు, ఇంతకంటె – ఇక్కడికంటె – మంచి అవకాశాలు అనేకం ఏర్పడతాయి.

మరో మిత్రుడు 'నీవు ఇప్పుడు వెళ్ళిపోతున్నావు : సరే, నీ జ్ఞాన భండారం అంతా నీతోనే పట్టుకుపోతావా ? లేక మాకేమైనా కొద్దిగా రుచి చూపిస్తావా ? మాతో ఈ తాత్త్విక చర్చ జరపడం నీకూ ఆనందదాయకమే గదూ ?" అన్నాడు.

సోక్రటీస్ తన ప్రక్కనున్న క్రిటోను తట్టి, "నీవు చాలా సేపటినుంచి ఏదో చెప్పాలనుకుంటున్నావు ఏమిటది ?" అనడిగాడు.

"నీకు విషం ఇవ్వవలసి ఉన్న మనిషి నాకు ఓ సంగతి చెప్పాడు. నీకు చెప్పమన్నాడు. ఏమిటంటే, నీవు ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదట. మాట్లాడిన కొద్దీ వొళ్ళు వేడి ఎక్కుతుంది. విషం పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. ఒక్కోమారు రెండో డోసు కూడా ఇవ్వవలసి వస్తుందట! మూడో గ్లాసు తాగవలసి వచ్చినా ఆశ్చర్యం ఉండదన్నాడు అతను" అని చెప్పాడు నిదానంగా క్రిటో.

"అది అతని సమస్య! రెండు మార్లు కాకపోతే మూడు మార్లు ఇవ్వటానికి సన్నాహాలు చేసుకోనీ"

"నీవు అలాగే అంటావని నాకు తెలుసు. కానీ నీకు విషయం చెప్పి ఉండడం మంచిదనుకున్నాను."

"అదలా ఉంచు....." అని సోక్రటీస్ జ్యూరీ సభ్యులను గుర్తుకు తెచ్చుకుంటూ మాట్లాడసాగాడు !

"జీవితమంతా తత్వదర్శనంలోను, తత్త్వవిచారంలోను గడిపిన మనిషి, మృత్యు ముఖంలో చాలా ఆనందంగా ఉండడం సహజమైన పరిణామం అని అనిపిస్తోంది నాకు. అలా కాకుండా, మృత్యువంటే భీతితో ఉన్నా, వెనకడుగు వేయచూచినా ఇన్నాళ్ళు తాము చెబుతూ ఉన్నదీ, నమ్ముతూ ఉన్నదీ అంతా అబద్ధం అన్నమాట !"

ఒక మిత్రుడు "తత్త్వవేత్తలు సగం చచ్చినవాళ్ళు, అందుచేత చావే వాళ్ళకు తగినది... అంటారు అందుకనే!" అన్నాడు.

మాట మాత్రంగా చెప్పడమే తప్ప, తత్త్వవేత్తలు అంటే "సగం చచ్చిన వాళ్ళు" అన్న ప్రయోగానికి అర్థం ఏమిటో ఎవరికీ తెలియదు. వాళ్ళకు చావు ఎందుకు

తగినదో, ఎలాంటి చావు యోగ్యమైనదో అసలే తెలియదు. అసలు 'మృత్యువు' అనేది ఒకటి ఉన్నదా ?

మృత్యువు అంటే శరీరము. శరీరం, ఆత్మ వేరు, వేరు అయిపోవటమేనా ? మృత్యువుకు ఇంతకంటే భిన్నమైన అర్థం, ప్రయోజనం లేవా ?

'తత్త్వవేత్తకు తన ఆహార పానీయాల విషయంలో మక్కువ ఉండడం మంచిదేనా ?'

'కాదు.'

'లైంగిక వ్యవహారాలలో ఆసక్తి ఉండవచ్చునా ?"

'ఉహుఁ'

'ఇంకా మన శరీరం కోరుకునే భోగభాగ్యాలు ఏమిటి ? తత్త్వవేత్త వాటికి అంత ప్రాముఖ్యత ఇస్తాడా ? ఇవ్వగలడా ? మంచి, మంచి దుస్తులు వేసుకోవాలని గొప్పగా కనిపించే పాదరక్షలు ధరించాలని, నగలు – ఆభరణాలతో అలంకరించుకోవాలనే అనిపిస్తుందా అతనికి ? వాటివల్ల అతని వైఖరి ఏమిటి ? అసహ్యించుకుంటాడా, ఉదాసీనంగా ఉంటాడా ?'

'అసహ్యించుకుంటాడను కుంటాను.'

'అయితే – తత్త్వవేత్త శరీరానికి ఎక్కువ గమనం ఇవ్వకుండా సాధ్యమైనంత వరకు దానికి దూరంగా వెళ్ళిపోయి ! ఆత్మగతమైన విషయాలపట్ల ఆసక్తుడై ఉంటాడన్న మాట'

'అవును.'

'దైహిక సుఖాలపట్ల విముఖత అలవరచుకుంటాడు.'

'అలాగే అనిపిస్తుంది.'

'ఇలాంటి సుఖాలవల్ల ఆసక్తిలేని మనిషి జీవించి ఉండడం అవసరం అని చాలా మంది అనుకుంటారు. దైహిక, లౌకిక సుఖాలపట్ల మక్కువలేని మనిషి అప్పుడే తన సమాధిలో ఒక కాలు ఉంచాడన్నమాట'

'అవును, నిజం'

'అలాగే – జ్ఞానం విషయం తీసుకుందాం, శరీరం బంధనం అవునా కాదా.... దానితోపాటు సమరసంగా వర్తించాలనుకుంటే : అంటే మన దృష్టికిగానీ, శ్రవణానికి గాని ఏదైనా నిశ్చిత జ్ఞానం ఉన్నదా ? మనం అసలు చూడడం గానీ, వినడం గానీ

చేస్తూ ఉన్నామా ? స్పష్టంగా చేస్తున్నామా ఈ పనులు ? వీటిలో స్పష్టత లేకపోయిన తర్వాత మనం సజావుగా వ్యవహరిస్తున్నట్లు కానేకాదు గదా !"

'అవును'

'అయితే ఆత్మజ్ఞానం పొందేది ఎప్పుడు ? అది శరీరంతో సమానంగా జ్ఞాన సముపార్జన చేయవలెనని అనుకుంటె తప్పుదారిని పోతుందిగాని సజావుగా వ్యవహరిస్తుందని అనుకోగలమా ?'

'నిజం.'

'ఆలోచన అంతర్మథనల సమయంలోనే గదూ, ఆత్మకు విషయాలు స్పష్టంగా అవగతం అయ్యేది ?"

'అవును'

'మరేమీ ఆటంకం, బంధనం లేనప్పుడు ఆత్మ అన్ని విషయాలను యధాతథంగా తెలుసుకోగలుగుతుంది: సుఖలాలస, దేహ వ్యామోహము వదులుకున్నప్పుడే తనకై తాను స్వతంత్రంగా వ్యవహరించినప్పుడే సత్యాన్ని కలుసుకోగలుగుతుంది, తెలుసుకోగలుగుతుంది కదూ?'

'అవును.'

'అంటే – ఇక్కడగూడా దేహాన్ని పరిత్యజించడం వల్ల, తత్త్వవేత్త ఇతరుల కంటె త్వరగా జ్ఞానార్జన చేయగలుగుతున్నాడు, అనుకోవచ్చును గదా !'

'కావచ్చును'

'మరి కొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. నికార్సయిన – కల్తీలేని నిజాయితీ అనేది ఉందా ? ఉన్నదని మనం గుర్తిస్తున్నామా ?'

'గుర్తిస్తున్నాం'

'అలాగే నికార్సయిన సౌందర్యం, మంచితనం కూడా ఉన్నాయని గుర్తిస్తున్నామా ?'

'ఆహా!'

'వీటిని ఎన్నడైనా నీ కన్నులతో చూచావా ? చూడగలిగావా ?'

'ఊహు, చూడలేదు'

'పోనీ, ఏ ఇతర శారీరక ప్రజ్ఞతోనైనా, వాటిని చూడగలిగావా ? కేవలం నేను చెప్పిన మూడు లక్షణాలే కాదు, ఇలాంటివి ఏవైనా సరే, వాటి నిజ స్వరూపాన్ని ఎఱుకకు తీసుకు రాగలిగావా ? ఈ ఎఱుక శరీరం ద్వారా – అంటే ఇంద్రియాల ద్వారా – సమకూరుతుందా ? ఏ వస్తువునైనా నీవు తెలుసుకునేందుకు తీసుకున్న శ్రద్ధ, ఆసక్తి నిదానము మీద ఆధారపడే వాటి ఎఱుక నీకు కలుగుతుంది గదా! వివేకాన్ని (మనస్సును) జోడించకుండా విషయ పరిగ్రహణ చేయవలెననే ప్రయత్నం చేసిన మనిషి ఇతరులకన్నా ఎక్కువ తొందరగా, చురుకుగా ఇలాంటి విషయాలు తెలుసుకోగలుగుతాడు కదూ, విషయం తాలూకు యధార్థతకు తన పరిజ్ఞానం తాలూకు యదార్థతను జోడించి చూస్తాడు. అప్పుడు శరీరం – కళ్ళు, చెవులు, ప్రతిబంధకాలు కావు. సత్య సందర్శనానికి, స్పష్టతకు అడ్డుపొరలు ఉండవు. అటువంటి మనిషే తన గమ్యాన్ని త్వరగా చేరుకోగలుగుతాడు.

'ఈ రకమైన ఆలోచనలన్నీ మనను ఒక దారికి తీసుకువస్తాయి. సరైన మార్గానికి తీసుకువెళ్ళే రహదారిలా కనిపిస్తుంది ఇదంతా. ఎంతసేపూ శరీరానికి, దాని తాలూకు లాలనకు ఆలవాలమైపోతే మనకు సత్యసందర్శనం అసాధ్యం అయిపోతుంది. ఆత్మను కలుషితం చేస్తున్నప్పుడు వస్తువులు ఉన్నవి ఉన్నట్లుగా అగుపించవు.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ శరీరం మనకు కావలసినన్ని అడ్డుదారులు ఏర్పరుస్తుంది. ఎన్నో వికర్షణలు – ఆకర్షణలు చేకూరుస్తుంది. దీనికి రోగం వంటి అవలక్షణాలు తటస్థిస్తే ఇంక చెప్పనే అవసరం లేదు. సత్యపథం మరింత దూరమైపోతుంది. అంతేకాదు. శరీరం మనలను కామనలు, ఆప్యాయతలు, మమకారాలతో నింపుతుంది. ఊహాపోకలతో ముంచెత్తుతుంది. అసలు విషయాన్ని గురించి ఆలోచించనివ్వకుండా చేస్తుంది. యుద్ధాలు, విప్లవాలు, గందరగోళాలు… ఇవన్నీ శరీరానికి, కోరికలకే. యుద్ధాలన్నీ మరింత సంపద పోగుచేసుకోవడం కోసమే గదా జరిగేది. శరీరం కోసమేగా ఈ సంపదలన్నీ పోగుచేసుకోవాలనే కాంక్ష కలిగేది. ఈ శరీరానికే గదా మనం బానిసలుగా తయారయేది… వీటన్నింటిలోనూ మునిగిపోయిన నిజమైన తత్త్వచింతన చేయటానికి సమయం లేదని వగుస్తూ ఉంటాము. ఎప్పుడైనా, శరీర శ్రమ నుంచి తప్పించుకొని కాస్త విచారం, పరిశీలన మొదలు పెడితే – శరీరం మళ్ళీ ముందుకు వచ్చి ఇందులో జొరపడటానికి ప్రయత్నం చేస్తుంది. మన పరిశోధనకు అంతరాయం కలిగిస్తుంది. ఆటంకం తీసుకు వస్తుంది. సత్య సందర్శనానికి మారుగా 'నకిలీ' సత్యాన్ని మన ముందుకు సాక్షాత్కరింప చేస్తుంది.

'ఒక్క విషయం స్పష్టం. ఏదైనా అసలు విషయం తెలుసుకోవలెనంటే, శరీర ప్రసక్తి లేకుండా, ఆత్మ తనంత తాను పరిశోధన చేసుకుని ముందుకు అడుగు వేయవలసి ఉంటుంది. మనం నిజంగా పొందగల జ్ఞానం మరణానంతరమే లభిస్తుంది తప్ప, జీవితకాలంలో కుదరదు. శరీరాశ్రయంలోనే జ్ఞానం లభ్యం కాదు. అది అసాధ్యం అయిపోతుంది. మరణానంతరం శరీరం ఉండదు గనుక, జ్ఞానం సాక్షాత్కరించటానికి వీలవుతుంది. జీవించి ఉన్న కాలంలో, శరీరాన్ని పక్కకు పెట్టగలంతవరకూ జ్ఞానం లభిస్తుంది. అంతే, శరీర గతుల కాకుండా వీలయినంత వరకు పరిశుద్ధపరుచుకుంటూ, భగవదేచ్ఛ కోసం ఎదురు చూస్తూ ఉంటాము. ఈ రకంగా శరీరం మనను కలుషితం చేయకుండా కాపాడుకుంటూ ఉంటాం. అప్పుడే మనం మనవంటి సత్పురుషులను కలుసుకోగలుగుతాం.

'ఆత్మను జ్ఞానమయం చేసుకోవాలనే అభిలాష కేవలం తత్త్వవేత్తకు మటుకే ఉంటుంది. మరణానికి దరిదాపులలోనే జీవితగమనం సాగించినట్లయితే – మృత్యువు దగ్గరకు వచ్చినప్పుడు దానిని చూచి దిగ్భ్రమ చెందనవసరం లేదు, భయభ్రాంతులం కానక్కరలేదు.

'అందుకనే తత్త్వవేత్తలకు మరణభయం లేదు. జ్ఞాన సముపార్జనమే వారి ప్రధాన వృత్తి, అందుచేతనే పరలోకయాత్ర వారికి భయావహం కాదు. పరమ సంతోషంగా, ఆనందంగా ఈ యాత్ర సాగిస్తారు.

"మరో విషయం, మరణాన్ని గురించి భయవిహ్వలుడైన మనిషి నిజ స్వరూపం ఏమిటో తెలిసిందా ? అతను జ్ఞానం కోసం కాదు, శరీర సుఖాల కోసం తాపత్రయ పడుతున్నాడు. ధనకాంక్ష, కీర్తికాంక్ష అతని గమ్యాలు."

'అవును, నిజం, నిజం' అన్నారు మిత్రులు.

'మనం ధైర్యం, సాహసం అని చెప్పుకునే లక్షణం నిజంగా తత్త్వవేత్త యొక్క సహజ స్థితి గదూ!'

'నిస్సందేహంగా.'

'ఆత్మ నిగ్రహం – ఎంత తక్కువ స్థాయిలో అయినాగానీ ! కోరికల వెనకాల పరుగులు తీయకుండా ఉండడం, వాటిపట్ల మరో రకమైన ఉపేక్ష భావం ఉండడం – ఈ లక్షణం ధైర్యంతోపాటుగా తత్త్వవేత్తను అనవరతం కాపాడుతూ ఉంటుంది.

'కేవలం ధైర్యం మటుకే ఉన్న మనిషి, మృత్యువును ఎదుర్కొనేటప్పుడు. అంతకంటే ఇంకేదో ఉపద్రవం తలయెత్తుతుందనే భయంతో ఉంటాడు. అంటే

తత్త్వవేత్తలో తప్ప తతిమ్మావాళ్ళలో ధైర్యం అన్నది భయం ; భీభత్సం వల్ల కలుగుతుంది, ఇది అతార్కికంగా కనిపించినా, యదార్థమే !'

సిమ్మియస్ (Simmias) కలుగజేసుకుని మామూలు మనుషులు ప్రదర్శించే ఆత్మనిగ్రహం ఎంత కుతకమైనదో వివరించాడు. 'కొన్ని కొన్ని సుఖాలను దూరం చేసుకోలేరు గనుక, వాటికంటే భిన్నమైన చిన్న చిన్న సుఖాల నుండి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తారు. లొంగిపోయే, ఆత్మనిగ్రహం ఉన్నట్లుగా నటిస్తూ ఉంటారు' అన్నాడు.

సోక్రటీస్ అతని వివరణను మెచ్చుకొన్నాడు.

'నైతికంగా ఆలోచించినట్లయితే, ఒక సుఖం కోసం మరికొన్ని సుఖాలను పణంగా పెట్టడం తప్ప, సుఖమైనా, దుఃఖమైనా వేరు వేరు విలువల నాణెం అన్నమాట. అన్ని నాణేలు ఒకే ఒక్క గీటురాయికి రావాలి. ఆ గీటురాయి ! 'జ్ఞానం'. జ్ఞానం వల్లనే ధైర్యం, ఆత్మనిగ్రహం, సమగ్రత, నిజమైన మంచితనం ప్రభవిస్తుంది. నిజమైన నైతిక ఆదర్శం ఏమిటంటే, అన్ని రకాల వికారాల నుంచి దూరంగా ఉండడం. జ్ఞానమే ఒక రకమైన పరిశుద్ధత. మతపరమైన దీక్షలు ఇచ్చే వాళ్ళు ఈ ప్రమాణాలకు బహుదూరంలో ఉంటారనుకుంటాను. మత బోధనలు మార్మికంగా ఉంటాయి కూడా. 'సరైన వివేకం లేకుండా పరలోకంలో ప్రవేశించిన వాడు బూడిదలో పడి పొర్లాడే వానితో సమానం. అలా కాకుండా సరైన విజ్ఞానఖని, దేవతల సమక్షానికి చేరుకుంటాడు... ఎందరో ప్రవేశిస్తారు, కాని నిజంగా వచ్చే వాళ్ళు బహు కొద్దిమంది' ఇటువంటి వాక్యాలన్నీ ఈ భావాన్నే తెలుపుతున్నాయి. జీవితం పొడుగునా తత్త్వచింతనతో, తత్త్వదర్శన కాంక్షతో గడపడం తప్ప ఇంకో మార్గం లేదు. మన జీవిత గమనంలో సాధించినదేమైనా వుంటే, అది పరలోకానికి వెళ్ళినప్పుడే మనకు తెలిసివస్తుంది.

ఈ మనఃస్థితిలో నేను అవతలి గట్టుకు వెళుతున్నాను. నా మనసులో యే విచారము, సందిగ్ధము, పెళుసుతనము లేవు. అక్కడ నాకు ఇక్కడికంటే ఏమీ తక్కువ కాకుండా, మంచి స్నేహితులు, మిత్రులు, పాలకులు దొరుకుతారు.'

తరువాత, సంభాషణ మరణానంతరం ఆత్మలు మరో ప్రపంచంలో ప్రవేశిస్తాయి అన్న విషయం మీదకు మళ్ళింది.

సోక్రటీస్, ఆర్ఫిక్ సిద్ధాంతం ప్రకారం – చనిపోయిన వారి ఆత్మలు కొన్నాళ్ళు పరలోకంలో ఉంటాయనీ, తిరిగి కొన్నాళ్ళకు భూమి మీదకు అవతరిస్తాయనీ

అనుమానంగా ఒక అభిప్రాయం ఉన్నదని చెప్పాడు. పునరుజ్జీవనం ఉన్నది. అంటే అవి ఎక్కడో ఒకచోట విశ్రమిస్తూ ఉండాలి.

'మనుషుల విషయం మాత్రమే కాకుండా – జంతువులు, మొక్కలు విషయం కూడా గమనిద్దాం. పరస్పర విరుద్ధమైన విషయాలు ఉన్నాయి. ఒక విరుద్ధం లోంచి దానికి విరుద్ధమైనది జన్మిస్తోంది. సౌందర్యం – అసౌందర్యం: మంచి – చెడ్డ... ఇలా అనేక ఉదాహరణలు ఇవ్వవచ్చు. సృష్టిలో ఈ ద్వంద్వాలు ఉన్నాయి. అందుచేత ప్రతీదీ తనకు వ్యతిరేకమైన తత్త్వం నుండి నిర్మాణం అవుతోందా అనే విషయం గూడా మనం పరిశీలన చేయవచ్చును. ఒక పెద్ద వస్తువు ఉన్నదనుకోండి, పూర్వం అది చిన్నదిగా ఉండేదా! ఆ చిన్న వస్తువే పెద్దదిగా రూపాంతరం, పరిణామం చెందుతుందా – అని గూడా పరీక్షింపవచ్చు. అలాగే ఒక చిన్న వస్తువు – ముందులో పెద్దదిగా ఉండి దరిమిలా ఇలా చిన్న రూపు కట్టుకొన్నదా ? బలహీనమైనది బలవంతమైన దానినుంచే వచ్చిందా, వేగవంతమైనది నిర్వేగంలోంచి వచ్చిందా ? చెడ్డ వస్తువు, మంచిదాని నుండి బయలు వెడలుతోందా – న్యాయవంతమైనది అన్యాయం నుంచి వస్తోందా ?... ఇలా అన్నీ విరుద్ధాల నుంచే ఉద్భవిస్తున్నట్లు అగుపిస్తుంది. ఉత్పత్తిలో ఈ మూలసూత్రం ఉన్నట్లు స్పష్టమవుతోంది ఒక ప్రక్రియ.... సంవిధానం ఉన్నాయి. ఒకటి నుంచి రెండోది, మళ్ళీ రెండో దానినుంచి మొదటిది.... ఇలా పరావర్తనం, అనువర్తనం జరుగుతున్నాయి. అలాగే అభివృద్ధి, వినాశనం కూడా. కలయిక, వేర్పాటు; ఉష్ణం, శీతము...; ఇలా విశ్వవ్యాప్తంగా ఎన్ని విషయాలకైనా అన్వయం చెప్పవచ్చును. అలాగే జీవించడం... దానికి వ్యతిరేకం ఏమిటి ? మెలకువ, నిద్ర లాగ – జీవనం, మృత్యువుల మధ్య గూడా రెండు రకాల ఉత్పత్తి జరుగుతోంది.

'పరస్పర విరుద్ధమైనవి రెండు – వాటి మధ్య అన్వయం. నిద్ర నుంచి మెలకువ, మెలకువ నుండి నిద్ర; బ్రతికున్న దాని నుండి చనిపోయినది, చనిపోయిన దాని నుండి బతికి ఉన్నదీని!.... అంటే మృత వస్తువు నుండి మళ్ళీ రూపాలు, యావత్తు ప్రపంచము ఏర్పాటు అవుతున్నాయన్నమాట. అంటే.... మన ఆత్మలు పరలోకంలో ఉంటాయి. అలా కాదనుకుంటే, ప్రకృతికే ఒక మచ్చ – ఒక లోపం ఆపాదించిన వాళ్ళం అవుతాము.

'మరో మార్గం కూడా ఉంది. రెండు విరుద్ధమైన వస్తువుల మధ్య ఈ సమన్వయం, సంవిధానం లేకపోయినట్లయితే ఒకదానిలో మరొకటి లీనం కాకపోయినట్లయితే – సృష్టి అంతా నిలుపుదలకు వచ్చేస్తుంది. 'నిద్రపోతున్నాం, మళ్ళీ మేలుకొంటున్నాము. ఎండిమాయిన్ (Endimyon) చెప్పిన సూత్రాలు,

ఎనాక్సగొరస్ (Anaxagorus) సూక్తులు – నిజమని ఇప్పుడు అంగీకరించక తప్పదు గదా, బతికివున్న వస్తువులన్నీ చనిపోయి – తిరిగి ఆ చనిపోయినవన్నీ కొత్తరూపు కట్టుకోకపోతే, సృష్టి అంతా 'కట్టకడపటి'కు వచ్చేస్తుంది. సజీవ పదార్థమే మిగలకుండా పోతుంది.'

సెబెస్ ఆపుకోలేకపోయాడు తన ఆలోచనను. సోక్రటీస్ వంక ఆత్మీయముగా చూస్తూ, 'మన జ్ఞానం అని పిలుస్తున్నదంతా వెనుకటి విషయాలను నెమరుకు తెచ్చుకోవడమే – స్మృతి – అన్న సంగతి ఇప్పుడు నాకు బాగా అర్థం అవుతోంది. దీని విషయం మీరు మాకు అనేకమార్లు చెప్పారు. మనం ఇప్పుడు గుర్తు తెచ్చుకుంటున్న దంతా లోగడ ఎప్పుడో కష్టపడి నేర్చుకున్నదే. ఈ మానవ ఆకారం ఏర్పడటానికి ముందు మన ఆత్మలు నేర్చుకున్న అనేక పాఠాలు, ఆ పద్ధతిగా చూచుకున్నా... ఆత్మలకు అమృతత్వం ఉన్నది –

'ఎవరినైనా ఒక ప్రశ్న వేశామంటే, వాళ్ళు యదార్థమైన సమాధానం ఇస్తారు. ప్రశ్న వేయడం సరళమైన, సజావైన పద్ధతిలో జరిగితే సమాధానం గూడా సరిగానే వస్తుంది. ఆ విషయాన్ని గురించి వాళ్ళకు ఇదివరకే అవగాహన లేకపోతే ఇది జరిగేపని కాదు' అన్నారు.

సోక్రటీస్ అందుకుని, 'ఎవరికైనా ఒక విషయం గుర్తు చేస్తున్నాము – అంటే, అది వాళ్ళకు ఇదివరకే బాగా తెలుసును అని గదా అర్థం!'

'ఒక వస్తువును చూచినప్పుడు, కేవలం ఆ వస్తువుకు చెందినదేకాక అందుకు సంబంధించిన అనేక విషయాలు మనసుకు వస్తాయి. ఉదాహరణ ఇస్తాను, ఒక మనిషి : ఒక సంగీత వాద్యం ఉన్నాయనుకోండి. అది రెండు వేరు వేరు వస్తువులు కదా. ఒక వస్తువును చూచినప్పుడు మనసు వెంటనే ఆ వస్తువు తాలూకు యజమానిని గూడా స్ఫురణకు తెస్తుంది. అదే స్మృతి. ఇలా అనేక ఉదాహరణలు ఇవ్వవచ్చును. ఒక వస్తువును గురించిన జ్ఞాపకాలు – చాలా కాలంగా మరుగున పడిపోయి, తిరిగి ఇప్పుడు స్ఫురణకు రావడం. సంగీత పరికరాన్ని చూచినప్పుడు దాని యజమాని గుర్తుకు వస్తాడు. ఒక మనిషి బొమ్మను చూచినప్పుడు ఆ మనిషి గుర్తుకు వస్తాడు. అంటే రెండు వస్తువుల వల్ల – సామ్యత, అసామ్యత కూడా తెలిసి వస్తున్నాయి. సామ్యత పరిపూర్ణంగా ఉందా, అసంపూర్ణంగా ఉందా అన్న సంగతి కూడా తెలుస్తుంది. అలాగే 'సమానత' విషయం గూడా.

'మన జ్ఞానం అంతా ఎక్కడ నుంచి వచ్చింది ? ఈ వివరాలలోనుంచి ఉద్భవించినదే గదూ, సమానమైన రాళ్ళు, కర్రలు, వస్తువులు చూచినందువల్ల మనకు

సమానత కళ్ళకు కడుతోంది. ఇందాకటి సూత్రాన్ని బట్టి, సమానంగా కనిపిస్తున్న వస్తువులన్నీ అసమానతల నుంచి వచ్చాయి. సమానత అంటేనే అసమానత!'

'ఉహు, కాదు,'

'అలా అయితే, ఈ సమాన వస్తువులు నికార్సు ఐన సమానత నుంచి వచ్చినవి కాదు.'

'అవును.'

'ఐన ఈ సమాన వస్తువులు సమానత అనే లక్షణాన్ని మనకు ముందుకు తీసుకు వస్తున్నాయి. ఈ రెండు వస్తువులు సమానం కావచ్చు, కాకపోవచ్చు.'

'అవును.'

'రెండు సమానమైన పుల్లలున్నాయి. ఇవి సమగ్రమైన సమానతను స్ఫురింపచేస్తున్నాయా ?'

'చాలా వరకు.'

'మనం చూస్తున్న వస్తువు – చాల మటుకు చూడని వస్తువుతో సామ్యం కలిగి ఉంది. దానికి ప్రతిగా ఉంది – అనుకుంటాం, మొదటి వస్తువును గూడా ఎప్పుడో చూచి ఉండాలిగదూ, సరిపోల్చుకోవాలంటే ?'

'అవును'

'మన ఇంద్రియాలన్నిటినీ కలిపికట్టుగా చేసి – సమగ్రమైన వస్తువును ఎప్పుడో మనం చూచి ఉండాలి. లేకపోతే ఈ సామ్యత గుర్తించలేం.'

'తార్కికంగా అంతే !'

'మనం పుట్టకముందు నుంచి కూడా ఈ ఇంద్రియాలతో పనిచేస్తున్నాం. నికార్సయిన సౌందర్యం, మంచితనం, నిజాయితీ, పవిత్రత..... ఇటువంటి లక్షణాలన్నీ మనకు ఇదివరకే తెలుసును.

వాటిని ఈ జన్మలో కూడా ఇంకా తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. కనుక తేలేది ఏమిటంటే : మనమంతా ఈ జ్ఞానం పుణికి పుచ్చుకునే జన్మించాం. జన్మించగానే మరచిపోతున్నాం. కాని ఇంద్రియాల వ్యాపారం వల్ల మళ్ళీ తెలుసుకోగలుగుతున్నాం. మన జ్ఞానాన్ని మళ్ళీ పొందుతున్నామన్న మాట. గుర్తు తెచ్చుకుంటున్నాం,' అన్నాడు సోక్రటీస్.

ఒకసారి తెలుసుకున్న విషయాలనే మళ్ళీ గుర్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ తెలుసుకోవడం అన్నది ఈ జన్మకి ప్రారంభం తరువాతనే జరిగిందని చెప్పుకోవటానికి వీల్లేదు. శరీరధారులు కాకముందే ఆత్మలు అనేక విషయాలు తెలుసుకున్నాయి. నికార్సయిన సౌందర్యం, మంచితనం – ఇవన్నీ గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాం మనం.

జన్మించటానికి ముందే ఆత్మ ఉన్నది.

మరణించిన తరువాత కూడా అది తన వ్యవహారం కొనసాగిస్తూ ఉన్నది– అన్న విషయం మరింత వివరంగా సోక్రటీస్ తన అనుయాయులకు విశదీకరించాడు.

కొంతసేపైన తర్వాత మళ్ళీ విషయం ఆత్మవైపు మొగ్గింది.

'సృష్టిలో నికార్సయిన విషయాలు, రూపాశ్రయమైన విషయాలు అని రెండు రకాలు ఉన్నాయి. నికార్సయిన విషయం రూపానికి అందదు. రూపాశ్రయమైనవి మటుకే మనకు కనిపిస్తాయి. కనిపించని (నికార్సయిన) విషయాలు – గుణాలు, ఎలాంటి మార్పుకు, పరిణామానికి లోనుకావు. కనిపిస్తున్నవన్నీ ఎప్పటికీ ఒక్క మాదిరిలా ఉండవు. ఇదే విమర్శన మనిషి దగ్గరకు వచ్చినప్పుడు మనిషిలో కనిపించే భాగం ఒకటి, కనిపించని భాగం మరొకటి విధాయకంగా ఉండనే ఉన్నాయి. అవునా, కాదా ?'

'అందుకు సందేహం ఏముంది ? కనిపించేవి, కనిపించనివి అన్న విభాగం ప్రతిచోటా ఉన్నదే.'

'సరే, ఈ విభాగాలలో శరీరం దేనికి చెందుతుంది?'

'కనిపించే విభాగానికే గదా !'

'మరి ఆత్మ ? కనిపించేదా ? కనిపించనిదా ?'

'మనుషులకు సంబంధించనంతవరకు అది కనిపించని విభాగానికి చెందినదే'

'మన ఆలోచన అంతా మనషిని గురించే. మరోది ఏదైనా ఉందా కనిపించనిది ?'

'మానవ ప్రకృతి, స్వభావము – గోచరము అయ్యేది కాదు'

'సరే, ఆత్మ కనిపించేదా – కనిపించనిదా ?'

'కనిపించనిదే'

‘అంటే – ఆత్మ కనిపించని విభాగానికి చెందినదీ, శరీరం కనిపించే విభాగానికి వచ్చేది అన్నమాట !’

‘అంతే.’

‘ఇంతకు ముందు అనుకున్నాం – ఆత్మ తన పరిశీలనకు, పరావిమర్శకు శరీరాన్ని ఉపయోగించుకుంటుంది. అంటే ఇంద్రియాల ద్వారా విషయ పరిజ్ఞానాన్ని సేకరించుకుంటుంది. అంటే – ఆ సమయంలో ఆత్మ శరీరానికి దగ్గరగా వచ్చేస్తున్నదన్న మాట. మార్పులకు లోనవుతోంది. తద్వారా పరిణామానికి లోనైపోతోంది. గందరగోళాన్ని సంతరించుకుంటూంది, అవునా ?’

‘అవును.’

‘ఆత్మ తనంతట తాను పరిశీలన, పరామర్శ చేస్తూ ఉన్నప్పుడు పరిశుద్ధమైన వాతావరణంలోనే ఉండిపోతుంది. శరీరంతో మిళితమైనప్పుడు వచ్చే గందరగోళానికి ఇక్కడ తావులేదు. మరేమీ కల్తీలేక, స్వతంత్ర ప్రతిపత్తితోనే ఉన్నప్పుడు దానికి స్థాయీభేదం లేదు. అప్పుడు స్ఫురించే విషయాలకు జ్ఞానం అని పేరు పెట్టుకుంటాము మనం.’

‘వివరణ బాగుంది. మాకు బాగా అర్థం అవుతోంది.’

‘సరే, ఈ చర్చవల్ల మనకు ఏం తెలుతోంది ? ఆత్మ అనేది ఏ విభాగానికి దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తోంది.’

‘ఇంత విన్న తర్వాత ఇంక ఎంత మొద్దు మనిషి అయినా అంగీకరించి తీరవలసిందే – ఆత్మ ఏ మాత్రమూ మార్పులు చెందని విభాగానికే వస్తుందని’

‘మరి శరీరము ?’

‘మార్పు చెందే విభాగం’

‘సరే, ఇప్పుడు సమీకరణ వినండి. ఆత్మ, శరీరము ఒకే జాగాలో ఉన్నప్పుడు – ప్రకృతి స్వభావము ఏం చెబుతాయో గమనించండి. ఒక దానికి నీవు లొంగి ఉండు అని చెబుతాయి. రెండో దానికి నీవు పరిపాలించు – మిన్నగా ఉండు అని చెబుతాయి. ఈ రెండు లక్షణాలలో దైవ సంబంధమైనది ఏది ? ప్రకృతి సంబంధమైనది ఏది ? – పరిపాలించడము మిన్నగా ఉండడము దైవ సంబంధమైన చర్య. లొంగి ఉండేది ప్రకృతి సంబంధితము కదూ.’

‘అవును.’

'సరే, ఆత్మ ఏ తెగకు చెందినది అంటారు ఇప్పుడు ?'

'నిస్సందేహంగా ఆత్మ దైవసంబంధమైనదే. శరీరం ప్రకృతి సిద్ధమైనదీని'.

'సరే, మళ్ళీ పునరావృతం చేసి చెబుతున్నాను వినండి ; ఆత్మ – దైవ సంబంధం, అమృతమయం, వివేకయుతం, సర్వసామ్యం, అవినాశి, స్వయంభువు, ఎలాంటి మార్పులకు ఆలవాలం కానిది. శరీరమో, ప్రకృతి జనితము, మృతలక్షణం ఉన్నది, అనేక రూపాలు కలది : అవివేకమైనది, నశించేది, పరాశ్రయమైనదీని. ఈ నిర్ణయాన్ని కాదనటానికి మనకేమైనా వాదన మిగిలిందా ?'

'లేదు.'

'సరే, మంచిది. అయితే – శరీరానికి నాశనం ఉన్నది. ఈ 'నాశనం' క్రమానుగతంగా జరుగుతుంది. ఆత్మ మాత్రము అవినాశి,

'అవును.'

'ఓ మనిషి చనిపోయినప్పుడు ఏం జరుగుతుందో ! ప్రాణం లేని శరీరం కట్టెలాగ పడిపోతుంది. కనిపించే విభాగం కనుమరుగు అయిపోతుంది. ఈ పని తక్షణమే జరగదు. కొంత సమయ విరామంలో జరుగుతోంది. శరీరానికి ఎంత పోషణ, మన్నన జరిగినా – ఆరోగ్యంతో మిసమిసలాడుతూ ఉన్నా చావు వచ్చినప్పుడు ఆ శరీరం కృశించి విరూపం చెందవలసిందే గదా. శరీరాన్ని ఎండగట్టి కొన్ని రసాయనాలు పులమడం వల్ల – ఈజిప్టులో చేస్తున్నట్లుగా – అది ఎన్నాళ్ళయినా విరూపం చెందకుండా ఉండగలుగుతోంది. కొన్ని భాగాలు చిదికిపోయినా, ఎముకలు అలాంటి భాగాలు కొన్ని స్థిరంగా ఉంటున్నాయి. మరి, ఆత్మ ఏమవుతోంది ? పవిత్రమైన స్థలానికి ఎగిరిపోతుంది. అక్కడ దానిని పాడుచేయగల కల్మషము, కశ్మలము ఏమీ లేదు. ఆ ప్రదేశం ఆత్మ మాదిరే అవినాశమైనది. మార్పులు లేనిది, కనిపించనిదీని. అక్కడ భగవంతుని సమక్షంలో చేరుకుంటుంది ఆత్మ. దేవుని దయవల్ల నాకు ఈ సంగతి త్వరలోనే సంప్రాప్తం కానున్నది గదా. అయితే ఇక్కడ చర్చనీయాంశము ఒకటి ఉంది. మనిషి చనిపోవడంతోటే ఆత్మ అలా భగవత్ సమక్షం లోనికి ఎగిరిపోతుందా ? లేక దీనికి ఏమైనా మినహాయింపులు ఉన్నాయా ? శరీరం నుండి విముక్తం అయినప్పుడు, దానికి శరీరం తాలూకు వాసనలు ఏవీ అతుక్కోకుండా ఉంటే, శరీరానికి దూరంగా అది వ్యవహరించి ఉన్నట్లయితే అలాగే జరుగుతుంది. అంటే, విషయలంపటంలో ఇరుక్కోకుండా తత్త్వదర్శనం పట్లనే ఆసక్తితో జీవితం గడిపినట్లైతే, ఆత్మ వెనువెంటనే భగవంతుని సన్నిధికి వెళ్ళిపోతుంది. మృత్యువును సదా ధ్యానించడం, ఎలా కలుసుకోవాలో తెలుసుకుని ప్రవర్తించడం అంటే ఇదే.

'అలా కాకుండా శరీర గతుడైనప్పుడు ఆత్మ ఇంద్రియచాపల్యం వైపే ఎక్కువగా మొగ్గి కాలక్షేపం చేసినట్లైతే ఇటువంటి భగవత్ సన్నిధి లభిస్తుందా ?

'అసాధ్యం.'

'భగవత్ సన్నిధి లభించకపోగా, – కొంత యాతనకు కూడా ఆలవాలమవుతుం దనుకుంటాను. శరీరం – ప్రకృతి – బరువైనది, కృంగదీసేదీని. ఆత్మ దీనికి అతుక్కుపోయి ఉన్నట్లైతే ఇంకా కింది లోకాలలోనే తారట్లాడుతూ ఉంటుంది. హేడ్స్ (Hades) వంటి వాళ్ళు పై స్థితికీ, ఈ స్థితికీ రూపకల్పన చేసి పేర్లు కూడా తగిలించారు. స్వర్గము, నరకము అని స్మశానవాటికలలో నీడలుగా, జాడలుగా తిరుగుతూ ఉండే రూపాలు ఇలా శరీర సంబంధం పెంచుతున్న ఆత్మలు, వాటి చర్యల, కామనలకు ప్రతిగా ఇక్కడ అవస్థలు పడతాయి. శరీరం కోసం తపనపడి తిరిగి దానిని సంపాదిస్తాయి. అంటే జీవిత కాలంలో దేనిని ఆశ్రయించుకు ఉండి, దేనికోసం తపన పడతామో అదే మరణానంతరం మనకు సంప్రాప్తం అవుతుందన్నమాట. జీవితకాలంలో తత్త్వచింతన చేయని ఆత్మ, శరీర త్యాగం చేసిన మీదట దైవ సంపదను చేరుకుంటుందనుకోవడం అసంబద్ధమైన విషయం. అందుకనే తత్త్వదర్శనులు, తత్త్వవేత్తలు శరీర సంబంధమైన సంపర్కాలు పెట్టుకోకుండా తగు జాగ్రత్తగా జీవితం గడపాలని అభిలషిస్తారు.

మరింత వివరిస్తాను, వినండి. జీవితాన్ని, తత్త్వచింతన ఆకట్టుకునేంత వరకూ – శరీరానికి దాసానుదాస స్థితిలోనే ఉంటుంది ఆత్మ. దాని చేతులు, కాళ్ళు శరీరంతో సంకెళ్ళు వేసుకుపోయి ఉంటాయి. అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతూ ఉంటుంది. తత్త్వచింతన ప్రవేశించిన తర్వాత, ఈ స్థితి మారిపోతుంది. క్రమంగా ఆత్మకు వివేకం సంప్రాప్తమవుతూ ఉంటుంది. ఇంద్రియాలు సేకరించి తీసుకువచ్చే పరిజ్ఞానం సంపూర్ణమైనది కాదు – అని తెలిసివస్తుంది. ఎప్పటికప్పుడు ఆత్మగతంగా ఆలోచించుకోవడం, ప్రవర్తించడం శ్రేయస్కరం అని స్ఫురిస్తుంది. తత్త్వవేత్త అందుచేతనే శరీరం త్యాగం చేయగల సదవకాశం వచ్చినప్పుడు వెనుకంజ వేయడు.

తత్త్వదర్శనం జీవితంలో ప్రధాన పాత్ర వహించినప్పుడు ఎన్ని గొప్ప మార్పులు జరుగుతాయో ఊహించలేము. ఇంద్రి జనితమైన జ్ఞానం చాలా లోప భూయిష్టమైనది అనేది మొదటి విషయం. ఇంద్రియాల ద్వారా విషయసేకరణ చేయడం – అందుకు అది తప్ప ఇంకో మార్గం లేనప్పుడు మాత్రమే చేయనగును అనేది రెండవ విషయం. ప్రత్యక్షంగా ఆత్మగతమైన విషయాలను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయవచ్చును అనేది మూడవ విషయం. ఆత్మగతంగా తెలుసుకున్న విషయం ఒక్కటే సరళమైనది,

స్పష్టమైనది, ఎలాంటి మార్పులకు లోనుకానిది. తత్త్వవేత్త ఈ రకమైన పరిశ్రమ చేసి, విముక్తుడు కావటానికి ప్రయత్నిస్తాడు. సుఖాలు, దుఃఖాలు, విచారాలు అతన్ని కలత పెట్టడం మానివేస్తాయి. వాటికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం మానివేస్తాడు. అతను విషయలోలత్వం ద్వారా సుఖ దుఃఖాల వెనుక పరుగులు తీయడం, ధన కనక వస్తు వాహనాల కోసం తాపత్రయ పడడం ఇవన్నీ వినాశనానికి దారితీస్తాయని అతనికి క్షుణ్ణంగా తెలుస్తుంది.

ఆత్మ ఎలా ప్రలోభంలో పడిపోతుందో – శరీరంలో తనకు తెలియకుండానే కూరుకుపోతుందో – గ్రహించగలగాలి మనం. శరీరం చెప్పే ప్రతి విషయము నిజమే ననుకొని దాని కోసమే పనిచేయడం మొదలు పెడుతుంది. ఈ పరిణామం వల్ల ఆత్మ తన పవిత్రతను, పరిశుద్ధతను కోలుపోయి ఎప్పటికీ దైవసంపదకు నిలయమైన ప్రాంతానికి చేరుకోలేకపోతుంది. ఒక శరీరం అయిన తర్వాత, మరో శరీరంలోకి దిగజారుతూ – ఎప్పటికీ ఆ విషవలయం నుంచి తప్పించుకోలేకపోతుంది. విషయ సాంగత్యంతో అల్లుకుపోయి గజిబిజిగా తయారై పోతుంది. తర్వాత జరిగేదేమంటే – పవిత్రము, దైవికము, సర్వస్వామ్యం అయిన వాతావరణం నుండి దూరంగా వైదొలగిపోతుంది.

ఈ విషయాలు స్పష్టంగా తెలుసును గనుకనే, తత్త్వవేత్త ఆత్మనిగ్రహం, సంయమనం, ధైర్యం వహిస్తాడు.

అంతే తప్ప పైపూమెరుగులు కోసం – దీనికి చెప్పే కారణాలే సర్వమూ అనుకోకండి.

తత్త్వవేత్త తాలూకు ఆత్మ ఉన్న స్థితి ఇది.

తత్త్వదర్శనం ఆత్మకు బంధనాలు లేకుండా చేస్తుంది. సుఖము, దుఃఖము, బంధనాలు కాకుండా పోతాయి. తార్కికము, హేతుబద్ధత అనుసరించినందువల్ల తత్త్వవేత్త నిజమైన మార్గంలో ప్రయాణం చేస్తాడు. సత్యము – దైవ సంబంధం అయిన వస్తువు పైననే ధ్యానం నిలిపి ఉంచుతాడు. దాని నుండే స్ఫూర్తి, ప్రోద్బలము సంపాదిస్తాడు. కొంత సానబట్టడం జరగింది గనుక, అతని ఆత్మ ఏది నిజమైన జీవిత గమనం, జీవిత గమ్యం – అనే సంగతులు గ్రహించగలుగుతాడు. ప్రాణగతుడై ఉండగానే ఇటువంటి జీవితం గడపటం అవసరం అని గుర్తిస్తాడు. మరణానంతరం– ఇన్ని నాళ్ళ పరిశ్రమకు తగినట్లుగ – దైవ సంపద దగ్గరకు సహజంగా చేరుకుంటాడు; అప్పుడు ఇక మానవులు మామూలుగా భయపడే 'సంసారం', 'విషవలయం' అనే

ప్రసక్తులు ఉండవు. తిరిగి దిగజారి పోతానేమోననే భయం ఉండదు. శరీరం నుంచి విడివడగానే, గాలివాలుకు పడి కొట్టుకుపోకుండా అరూపం చెంత అన్యవస్థితం కాకుండా ఉంటుంది.'

సోక్రటీస్ ఇంత సుదీర్ఘంగా చెప్పిన తర్వాత అనుయాయులందరూ కొంతసేపు మౌనంగా కూర్చున్నారు, గంభీరమైన వాతావరణం అంతటా అలుముకుంది.

సోక్రటీస్ ఇంకా తాను చెప్పిన తార్కికతలోనే నిమగ్నమై ఉన్నట్లు కనిపిస్తున్నాడు.

కొందరు మిత్రులు లోగొంతులో తమలో తాము వివరించుకుంటున్నారు. విన్న విషయాలను నెమరు వేసుకుందుకు ప్రయత్నిస్తున్నారు.

సోక్రటీస్ ఆ విషయం గమనించి, ఇలా అన్నాడు.

'ఇంత వివరంగా చెప్పినా ఇంకా అసమగ్రంగానే అనిపిస్తున్నట్లుంది. ఇంకా అనేక సందేహాలు, అభ్యంతరాలు పుట్టటానికి అవకాశం ఉన్నదనుకోండి. మరింత లోతుగా, వివరంగా చూసుకోవచ్చును దీన్ని. ఇంత వరకు మీరు విన్న దాంట్లో ఏమైనా అనుమానాలు ఉంటే ఇప్పుడే ప్రశ్నలు వేయండి. నేను చెప్పిన దాన్ని ఇంకా స్పష్టపరచటానికి ఏదేనా మార్గం ఉంటే సూచించండి.

సిమ్మియస్ (Simmias) నిదానంగా బదులు చెప్పాడు. 'సోక్రటీస్ అబద్ధం ఎందుకు ? మేం అనేక అనుమానాలతో, సందేహాలతో వేగిపోతున్నాం. నీవు అంటే నీవు ప్రశ్నలు అడగమని వంతులు వేసుకుంటున్నాం. అయినా, నీవు ఇప్పుడు ఇరుక్కుపోయిన విపత్కర పరిస్థితిలో నిన్ను ఇంకా ఇబ్బంది పెట్టటం, నీ చేత ఇంకా మాట్లాడించడం అనుచితంగా ఉంటుందేమోనని భయపడుతున్నాం. అంతకంటె ఇంకేం లేదు.'

సోక్రటీస్ ఈ మాటలు విని నవ్వాడు.

'మీ మాటలు చోద్యంగా ఉన్నాయి. నేనేమీ విపత్కరమైన స్థితిలో ఇరుక్కుపోలేదు. కనీసం అలా అనుకోవడం లేదు. ఈ విషయం ఇతరులను నమ్మించడం చాల కష్టమైన మాట నిజమే. అయినా నన్ను గురించి మీరు అలా అనుకోవడం చాల కష్టంగా, చిరాకుగా ఉంది. నాకు హంసల కంటే తక్కువ అంతఃస్ఫూర్తి ఉందని మీరు అనుకున్నట్లు ఉంది. మీకు తెలుసునో లేదో హంసలు మొదలైన పక్షులు తమ అంత్యకాలం సమీపించిందని తెలుసుకోవటంతోనే ఎక్కువగా పాడడం, ఆడడం చేస్తాయి. జీవితకాలంలో గడిపిన ఆట పాటల కంటె, ఈ చివరి సమయంలో ఎక్కువ చలాకితనం చూపుతాయి. భగవంతుని ముందుకు చేరుకుంటున్నామనే స్పృహ వాటిచేత

అలా నర్తింపచేస్తుంది. ఆ ఆనందము మనసంతా నిండిపోతుంది. మనుషులు – తమ అజ్ఞానం వల్ల – పక్షులు మరణ భయములో ఈ ఆక్రందనలన్నీ చేస్తున్నాయేమో ననుకుంటారు. తమ భయాలను ఆ పక్షులకు ఆపాదనం చేసినందువల్ల కలిగే భావన ఇది. విచారంతో ఉన్నప్పుడు పాటలు పాడవు పక్షులు, హంసలు. అరూప ప్రపంచంలో తమకు సంప్రాప్తం కాబోతున్న మంగళకర విషయాలను తలపుకు తెచ్చుకుంటూ హంసలు కేరింతలు కొడుతూ పాటలు పాడతాయి. అవి అపోలో దేవతకు దగ్గరైన ప్రాణులు. ఆ దేవత దగ్గరకు తిరిగి వెళ్ళిపోతున్నాం అనేది అమందానందకరమైన ప్రసక్తి వాటికి. సరీగా నేనూ ఇప్పుడు అదే స్థితిలో ఉన్నాను; నాకూ అదే దేవత. అదే భవితవ్యం. మరణభయం నన్ను విచలితుడిని చేయడం లేదని పదేపదే చెప్పనవసరం లేదనుకుంటాను. అందుచేత, మీరు ఎలాంటి సంకోచము లేకుండా మీ అనుమానాలన్నీ అడిగి వేయండి. ఏథెన్స్ అధికారులు సమయం ఇచ్చినంత వరకు నాకు చేతనైనంత వరకు సమాధానాలు చెబుతాను.'

ముందుగా సిమ్మియస్ తన సందేహాలు, అభిప్రాయాలు ప్రకటించాడు.

'ఈ జీవిత కాలంలో అన్ని ప్రశ్నలకూ సజావు అయిన సమాధానాలు చెప్పగలగడం, పొందగలగడం సాధ్యం కాకపోవచ్చును. అయితే అందుబాటులో ఉన్న సిద్ధాంతాలను ఉపయోగించుకోవచ్చును. లేదా మన స్వప్రజ్ఞనే చక్కగా విస్తరింపచేసుకో వచ్చును. ఈ రెండింటిలో ఏదో ఒక మార్గం అవలంభించ వచ్చును. ఇతరుల నుంచి ఆదేశాలు అందుకోవడం, లేదా స్వప్రజ్ఞ మూలంగానే పరిశోధన చేయడం – ఇవీ ఈ రెండు పద్ధతులు. జీవనగమనాన్ని గడిచి గట్టు ఎక్కడానికి వీలైన సరంజామా పోగుచేసుకోవాలి. అంటే – దైవవికాసం ద్వారా మనకు అనుకూలమైన పద్ధతిలో ప్రయాణం సాగించలేమని అధైర్యం కలుగుతోందన్న మాట... నాకు నీ వివరణలలో ఎన్నో లోపాలు ఉన్నట్లుగా అగుపిస్తోంది. అదే ఆలోచిస్తున్నాను ఇంతసేపూ.',

'సరే ఆ లోపాలు ఏమిటో చెప్పు' అన్నాడు సోక్రటీస్.

'సంగీత వాద్యం ఉంది. దానికి తంత్రులు ఉన్నాయి. వాటిని సమరసంగా జోడించడం జరగాలి ముందు, ఇదంతా నీవు పదేపదే చెప్పవచ్చును. సమరసరంగా జోడించడం అనేది కనిపించని విద్య, దైవికం, మహాద్భుతమైన చర్య. ఇది సంగీత పరికరంలోనే 'నిగూఢంగా', 'ప్రక్షిప్తంగా' ఉంది. అయితే పరికరం మటుకు పైకి కనిపించే వస్తువు. ప్రకృత సంబంధమైనది. కాలానుగుణంగా శిథిలమైపోయేది. ఒక సందర్భం తీసుకుందాం. ఆ సంగీత పరికరం విరిగిపోయింది. దాని తీగలు

తెగిపోయినాయి. నీవు చెబుతున్న సిద్ధాంతం ప్రకారం సంగీత పరికరానికి సంబంధించిన 'సామరస్యం' ఇంకా ఆ పరికరాన్ని ఆశ్రయించుకునే ఉండాలి. ఎందుకంటే దాన్ని ఎవరూ పాడుచేయలేరు. అది నాశన రహితమైనది. తీగలు తెగినా, వస్తువు విరిగిపోయినా – ఇంకా 'పరికరం' అంటూ గుర్తించటానికి వీలైనవి మిగిలే ఉన్నాయి కదా! వాటితో సామరస్యం ఇంకా సమజీవనం చేస్తోందా ? దైవికము, అమృతమయము అయిన సామరస్యం – పరికరంతోపాటే మృగ్యం అయిపోయింది గదా ! నీవేమో – ఈ సామరస్యం ఇంకా ఎక్కడో దాక్కుని ఉంటుందన్నావు. పరికరం ముక్కలు, ముక్కలు అయిపోయేంత వరకూ అది ఉంటుందంటున్నావు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే పైతోగొరియన్‌లమైన మేమందరం మామూలుగా ఒక సిద్ధాంతాన్ని నమ్ముతాం !

శరీరం – శీతోష్ణల నడుమ, తడి–పొడిల మధ్య ఇలా అనేక వైరుధ్యాలలో ఒక బిగింపులో ఉంటుంది.

ఆత్మ కూడా ఇటువంటి వైరుధ్యాల నడుమనే సరిపుచ్చుకుని ఉండిపోతుంది.

ఆత్మ అనేది – ఇలా చేసుకున్న సర్దుబాటు అయినట్లైతే, శరీరములో వచ్చే మార్పులకు అది ఎప్పుడో ఒకప్పుడు తప్పించుకు పారిపోవలసి ఉంటుంది. దైవ సంబంధమైనదైనా అదీ నాశనానికి లోనవుతుంది. సర్దుబాటు అంటే అంతేమరి. శరీరం పూర్తిగా దహనం అయిపోతుంది, కొంతకాలానికి. లేకపోతే పూర్తిగా కుళ్ళిపోతుంది. ఆత్మ సంగతి ఏమిటి ? దీనికి తగిన సంజాయిషీ కనిపెట్టగలగాలి నీవు, సోక్రటీస్.'

సోక్రటీస్ కళ్ళు విశాలంగా తెరిచాడు. అతడు అప్పుడప్పుడు చేసే తమాషా ప్రక్రియ ఇది.

నవ్వాడు.

'సిమ్మియస్ చేసిన విమర్శ సజావు అయినదే. మీలో ఎవరైనా వెంటనే దానికి సమాధానం చెప్పగలిగితే, నాకంటె చురుకుగా ఆలోచించగలిగితే.... ఊ, చెప్పండి, సిమ్మియస్ వాదన కోసం వాదన చేస్తున్నాడనుకోలేము. అతనికి సమాధానం చెప్పుకునే ముందు, సెబెస్ ఏమి ఆలోచిస్తున్నాడో కూడా తెలుసుకోవడం మంచిదనుకుంటాను. ఈ లోపుగా జవాబు ఏం చెప్పాలి అన్నది ఆలోచించుకునేందుకు సమయ విరామం దొరుకుతుంది. అతను చెప్పేది సబబుగా కనిపిస్తే దానినే మనం అంగీకరించవచ్చును. లేదా మన సిద్ధాంతాన్ని కొనసాగించవచ్చును. కనుక, సెబెస్ ! నీ అనుమానాలు కూడా బయటపెట్టు' అన్నాడు.

'నా అనుమానాలు కూడా సరిగా అటువంటివే.'

'ఆత్మ అనేది మనం ఈ రూపు కట్టుకోక ముందే – ఉన్నది అనే విషయంలో మనకందరికీ ఏకాభిప్రాయం ఉంది. దాన్ని గురించి ఆలోచించే పనిలేదు. అయితే, మనం చనిపోయిన తరువాత కూడా అది ఎక్కడో ఒకచోట ఉంటుందనీ – ఏదో చేస్తూ ఉంటుందనీ అనడంలోనే నాకు అనుమానాలు కలుగుతున్నాయి. దీనికి తగిన ఉదాహరణలు లేవు. ఆత్మ శరీరం కంటే బలమైనది కాదనీ, శరీరాన్ని విడిచి ఎక్కువ కాలం మనలేదనీ సిమ్మియస్ అంటే – ఆ అభిప్రాయంతో నేను ఏకీభవించను. ఆత్మ శరీరం కంటె ఉన్నతమైనది, ఉదాత్తమైనది – అని నేను నమ్ముతున్నాను. అయితే ఇంకా నీకు అనుమానాలు ఎందుకు అని మీరు ప్రశ్నించవచ్చును. మనిషి చనిపోయిన తర్వాత – బలహీనమైన భాగం కూడా కొంతకాలం మన్నుతుంది గదా! బలవంతమైనది ఎక్కువ కాలం ఉండి తీరుతుంది అనుకోవడానికి నీవు ఎందుకు అభ్యంతరం చెబుతున్నావు – అని మీరు అడగవచ్చును. నా అనుమానాన్ని ఇంకా వివరంగా చెప్పటానికి ఒక ఉదాహరణాత్మకమైన ఉదంతం చెబుతాను !

'వయోధికుడైన దర్జీ మనిషి ఉన్నాడు. ఆయన చనిపోయాడు. మీ సిద్ధాంతం ఎలా ఉందంటే – దర్జీ చనిపోలేదు. ఇంకా ఎక్కడో మిగిలి ఉన్నాడు దాగొని ఉన్నాడు – అని సురక్షితంగా, భద్రంగా ఉన్నాడు అని మీరు చెబుతున్నారు. అందుకు సాక్ష్యం ఏం చెబుతున్నారంటే – అతను తయారుచేసిన కోటు ఇంకా భద్రంగా ఉంది గదా, అంటున్నారు. మనిషా, అతని కోటా – ఏది ఎక్కువ కాలం ఉంటుంది అని ప్రశ్న వేసుకుంటే, మనిషేనని సమాధానం వస్తుంది. అందుకని, మనిషి క్షేమంగా, భద్రంగా ఉన్నాడని మీరు నిర్ధారణ చేస్తున్నారు. తక్కువ కాలపరిమితి ఉన్న వస్తువు ఇంకా సురక్షితంగా ఉన్నది గనుక ఈ నిర్ధారణకు విలువ ఏర్పడుతోంది.

'అయితే ఈ ఉదాహరణలో అన్నీ లోపాలే. ఒక దర్జీ ఉన్నాడంటే – అతను ఎన్నో కోట్లు, అంగారఖాలు తయారుచేస్తాడు. వాటన్నిటికంటే ఎక్కువ కాలం జీవిస్తాడు. అయితే అతడు తయారుచేసిన చివరి కోటుకంటే ముందుగానే చనిపోతాడు. అంతమాత్రం చేత మనిషి కంటే కోటు మిన్న అని అనలేము గదా. మనిషికి ప్రాణం మీద బిగువు లేదు అని నిర్ధారించలేము. ఆత్మకు, శరీరానికి ఉన్న అవినాభావ సంబంధం ఇలాంటిదే ననుకుంటాను. ఆత్మకు వయోపరిమితి ఎక్కువ. దానితో పోల్చి చూచినప్పుడు శరీరానికి ఉన్న వయోపరిమితి బహు తక్కువ – కావచ్చును. ప్రతి ఆత్మ అనేక శరీరాలను ధరిస్తుంది. మోసుకు తిరుగుతుంది. జీవితకాలమంతా శరీరం పరిణామం చెందుతూ, మార్పులు పొందుతూ ఉన్నప్పటికీ ఆత్మ మటుకు తనకు

పనికిరాని పాత వస్తువును నిర్దాక్షిణ్యంగా వదిలివేస్తుంది. ఆత్మ కూడా 'వినాశనం' అయినప్పుడు, దాని ఇటీవలి తొడుగు ఇంకా అమలులోనే ఉన్నదనుకోవాలి. ఈ తొడుగు కంటె ఈ ఒక్క తొడుగే సుమా – ముందుగానే ఆత్మ అంతర్ధానం అయిపోతుంది. ఆత్మ అంతర్ధానం అవగానే శరీరం తన అసహాయత ప్రదర్శిస్తుంది. త్వరలోనే విరూపం చెందుతుంది. ఈ వాదనను బాగా పరిశీలించి అంగీకరించి నట్లయితే, ఇక మనిషి చనిపోయిన తర్వాత ఆత్మ ఎక్కడో ఒకచోట భద్రముగా ఉండి ఉంటుంది – అనుకోవటానికి వీలులేదు. అవసరం అంతకన్నా లేదు.

"అలాగే అమృతత్త్వం గురించి చెప్పేవాళ్ళ మాటలు పరిశీలిద్దాం."

'ఆత్మ మనిషి పుట్టడానికి ముందూ ఉంది, మరణించిన తరువాతనూ ఉంది. అనేక జన్మలలో అనేక శరీరాలను ధరిస్తుంది. అనేక మార్లు చనిపోతుంది. ఈ జన్మ, పునర్జన్మల ప్రక్రియలో ఆత్మకు ఎలాంటి పరిణామము రావడం లేదు. అయితే అది ఎప్పుడు అంతరించిపోతుందో ఎవరికీ తెలియదు. ఎప్పుడో ఒకప్పుడు దానికీ అవకాశం తప్పదు. శరీరం నుండి విడిపోవడం, ఎప్పుడో ఒకప్పుడు ఆత్మకూ మరణ హేతువు అవుతుంది. ఇలా ఆలోచించుకుంటూపోతే, సోక్రటీస్, ఎవరూ మరణాన్ని ఉదాసీనంగా చూడడంగాని – భక్తిగా కలుసుకునేందుకు ప్రయత్నించడం గాని జరగదు. అంటే, ఆత్మ అవినాశి అనీ, అమృతమయమనీ నిర్ధారణ అయి తీరాలి ఆ మనిషికి. ఎందుకంటే, ప్రతి చావుకు ముందూ – ఇంతటితో నా శరీరం, నా ఆత్మ విడివడి పోతున్నాయి. ఇంతటితో నా ఆత్మ దగ్ధమై పోతోంది అని భయం వెంటాడుతూనే ఉంటుంది.

సోక్రటీస్ వాదనలు అంగీకారయోగ్యంగా ఉన్నట్లే కనిపించాయి ముందు.

ఇప్పుడు వ్యతిరేక అభిప్రాయాలు విన్న తర్వాత ఇవీ సబబుగానే కనిపిస్తున్నాయి.

నమ్మకాలు అపనమ్మకాలుగా మారుతున్నాయి.

సోక్రటీస్ ఈ కుర్రవాళ్ళ వాదనలను సానుభూతితో విన్నాడు. అందరినీ ఆలోచించమన్నాడు. చివరకు తన నైపుణితో గాయాలను కడిగి వేశాడు. చిన్నా భిన్నం అవుతున్న వివేకాన్ని బుజ్జగించి తిరిగి తన దారిలో పెట్టాడు. ఆత్మ – శరీరాల సంబంధాన్ని గురించి పరిశోధనలు కొనసాగవలసిందే... ఇక ముందు తరాలు దీన్ని గురించి తర్జన భర్జనలు చేయవలసిందే అని సూచించాడు.

సోక్రటీస్ మంచం మీద పడుకుని ఉన్నాడు.

పక్కనో బల్ల ఉంది.

దానిమీద ఫెడో (Phaedo) కూర్చుని ఉన్నాడు. సోక్రటీస్ మంచి పొడగిరి. అతని చేయి ఫెడో తలపైకి పాకి, అతని గిరజాల జుట్టును నిమురుతోంది.

ఫెడో గిరజాల జుట్టును గురించి వేళాకోళంగా మాట్లాడడం సోక్రటీస్‌కు అలవాటు.

'అయితే రేపు – ఈ పొడుగాటి వెంట్రుకలన్నీ కత్తిరించి వేస్తావా, ఫెడో' అని అడిగాడు సోక్రటీస్.

'అంతే చేయవలసి వస్తోంది సోక్రటీస్'

'నా సలహా పాటిస్తే, ఆ అవసరం లేదు'

'ఎలా ?'

'నేను నా జుట్టు ఇవాళే కత్తిరించేస్తున్నాను గదా, నీవూ ఈరోజే చెయ్యి, మన వాదన అంతరించిపోయి, మళ్ళీ పునరుజ్జీవింప చేయి. నీ స్థానంలో నేనుంటే సత్యం చేజారిపోయినప్పుడు – తిరిగి గెలుపు పొందేంతవరకు జుట్టు పెంచను అని ప్రతిజ్ఞ చేస్తాను'. అన్నాడు సోక్రటీస్.

కొంతసేపు అయినాక, 'సరే, అది అలా ఉంచు. నీవో విషయం గమనించి నావా ? మానవ మనస్తత్వాన్ని గురించి క్షుణ్ణంగా తెలియకుండానే చాలా మంది, మానవ సంబంధాలను గురించి వ్యాఖ్యానాలు చేయడానికి పూనుకుంటారు. సత్యం ఏమిటో నీకు తెలుసా ? మనుషుల్లో మంచివాళ్ళు – చెడ్డవాళ్ళు అనే విభాగం లేదు. మనుషులను గురించి ఆలోచించేటప్పుడు మనం చేసే మొదటి పని ఇదే, పొరపాటూ ఇదే, ప్రతివాడిని ఏదో ఒక తరగతికి కేటాయించటానికి చూస్తాం. నిజం ఏమిటంటే – ప్రతివాడిలోనూ కొంత మంచితనం ఉంటుంది. కొత్త చెడ్డతనం ఉంటుంది. మంచి – చెడ్డ కలగా పులగం అయి ప్రతి మనిషిలోనూ కొద్దో, గొప్పో ఉంటాయి. అతి మంచివాడు, అతి చెడ్డవాడు చాలా అరుదుగా కనిపిస్తారు. కలగా పులగం అయిన మంచి–చెడ్డవాళ్ళు అనేకమంది కనిపిస్తారు. ఏ తరగతిలో అయినా సరే, ఇదే రకమైన సమాలోచన చేయగలగాలి మనం' అని, ఇంకా ఇలా కొనసాగించాడు.

'కాస్సేపు వేరు విషయాలు ప్రస్తావించుకున్నాం గదా, వానదలు, మానవ ప్రకృతిని గురించి ఇప్పుడు చెప్పింది ఒక పద్ధతి. ఇదివరలో చెప్పిన తీరు వేరు. వాదన ఒకప్పుడు నిజం అనిపించవచ్చు, మరుక్షణంలో అబద్ధం అనిపించవచ్చు. ఇదే అనేకమార్లు పునరావృతం కావచ్చును. పనివేళ వాదనలు చేస్తూ కూర్చునే వాళ్ళ

విషయంలో ఇది తేలికగా కనిపిస్తుంది. ఇరుపక్షాలు వాదించి, తాము చాలా తెలివిగల వాళ్ళం అనుకుంటారు. వాదన క్రమంలో నిజం – అబద్ధం అనేవి నీళ్ళ మాదిరి అటు ఇటు ఒరుగుతూ పరుగులు తీస్తూ ఉంటాయి. ఎప్పుడూ ఒకచోట నిలకడగా ఉండవు.

.....ఇలా వాదనలలో చిక్కుకుపోయిన మనిషి, సత్యపరిశోధన అనే పనిని గుంటపెట్టి గంట వాయించేసినట్లు అవుతుంది. అంతకంటె దారుణమైన వ్యవహారం ఇంకొకటి ఉంటుందా ?

'అందుచేత మనం చేయవలసిన మొదటి పని ఏమిటంటే – వాదనలో బలం లేదేమో, నిజం లేదేమో అనే అనుమానం మనకు రాకుండా చూచుకోవాలి.

'అంతేకాదు, మనంత మనం, మనమటుకు మనం – ఇంకా బుద్ధిజీవులుగా బాల్యావస్థలోనే ఉన్నాం. ఇంకా ఎదగవలసిన అవసరం ఉంది. నీకైతే – జీవితం అంతా ఇక ముందే ఉంది. నాకు మృత్యుద్వారం అగుపిస్తూ ఉంది. ఇప్పుడు నేను తాత్త్విక చర్చ చేయడం లేదు. స్వానుభవ ప్రకటన చేస్తున్నాను. వాదన జరుగు తున్నప్పుడు, అంతగా చదువు – వివేకము లేనివాళ్ళు తమ పక్షం గెలుపొందాలనే తపనతోనే ఉంటారు తప్ప తాము మాట్లాడుతున్న దాంట్లో ఎంత సంబద్ధత ఉన్నదీ చూచుకోరు. ఇప్పుడు నేను అటువంటి స్థాయిలోనే ఉన్నానేమో అనిపిస్తోంది. కాకపోతే ఒకటే తేడా ఉంది. నా శ్రోతలను ఎలాగైనా నమ్మించాలని నేను తపన పడడం లేదు. నా మటుకు నాకు నమ్మకం కలగడం కోసం ప్రయత్నం చేస్తున్నాను. చూచావా నేను ఎంత స్వార్థపరుడినో! నా సిద్ధాంతాలు నిజం అయినట్లయితే – వాటిని నమ్మడం బాగానే ఉంటుంది. మృత్యువుతో నేను మాయమైపోతానని తెలిసినా, అంతకు ముందుగా నా సహచరులందరినీ ఒప్పించాలని కాక వారికి నాపై అనుకంప కలగాలని చూస్తున్నాను. ఈ లక్షణం త్వరలోనే మాయమైపోతుంది గదా !

'ఈ సరళిలోనే సిమ్మియస్, సెబెస్‌ల వాదనలను అర్థం చేసుకు ప్రయత్నిస్తు న్నాను. నీ మటుకు నీవు – సోక్రటీస్‌ను గురించి ఎక్కువగా ఆలోచించకుండా, సత్యశోధన గురించి కాలం గడపటానికి ప్రయత్నించు. నేను చెబుతున్న దాన్లో ఏమైనా సత్యాంశ ఉన్నట్లయితే దానిని మటుకు స్వీకరించండి లేకపోతే ప్రతివాదన చేయండి. అలాకాక, నేను చెప్పిన దానికి ఊ కొడుతూ మర్యాదగా ఊరుకుంటే, మీకూ, నాకూ అన్యాయం చేసినట్లు అవుతుంది.

'ఇప్పుడు విషయానికి వస్తాను ?'

సిమ్మియస్ వాదన ఏమిటంటే,

ఆత్మ శరీరం కంటె బలమైనదైనా, దైవ సంబంధమైనదైనా – అది కూడా సామరస్యం వల్ల వినాశనం కాక తప్పదు అని.

సెబెస్ ఏమంటాడంటే :

సోక్రటీస్ వాదన చాలవరకు సరైనదే అయినా, ఆత్మ చివరి శరీరాన్ని పొందిన కొద్దికాలం తరువాత తాను కూడా నాశనం అయిపోవలసిందేనని.

'అంతకు ముందు మనం స్మృతిని గురించి ముచ్చటించుకున్నాం. ఆత్మలు మన పుట్టుక కంటె చాల ముందే ఉండి ఉండాలని అనుకున్నాం. మన శరీరాలలో ఇరుక్కుపోవటానికి ముందు అవి ఎక్కడో ఉండే ఉండాలి గదా?

ముందు వాదనలు విన్నప్పుడు తాము ఆ అభిప్రాయంతోనే నిలకడగా ఉండి పోయామని వాళ్ళు ఇద్దరూ చెప్పారు.

'అయితే మీరు మీ అభిప్రాయాలను మార్చుకోవలసిన తరుణం ఆసన్నమవుతోంది, స్నేహితులారా!' అన్నాడు సోక్రటీస్. 'సామరస్యం అనేది రెండు వస్తువుల మధ్య జరిగేది. ప్రకృతి సముదాయం ఒక బిగింపులో ఇమిడి ఉండడం సమరసత. ప్రకృతిలోనే – ముందుగా ఈ సమరసత ఉండినదని మీరు అనుకోరనుకుంటాను.

ఇప్పుడు – విషయం ఎలా రూపొందిందో చూడండి.

మానవ ఆకారం, రూపు ధరించటానికి ముందే ఆత్మ అనేది ఉన్నది.

దానిలో అంతకు ముందు ఎరుగని కణాలు (Elements) ఉన్నాయి.

సామరస్యం అనేది పోల్చి చూచుకోవడం కాదు.

సంగీత పరికరం, తంత్రులు : వాటి సమరసత ఏర్పడని సంగతులు – ముందే ఉన్నాయి.

సమరసత ఒక్కటే చివరకు ఏర్పడవలసి ఉన్నది.

అదే మొదటిగా వినాశం అయ్యేది కూడాను. ఈ వివరణం ఇదివరకటి దానితో ఎంత వరకు నప్పుతోంది ?

'ఏమీ నప్పటం లేదు' అన్నాడు సిమ్మియస్.

'అవునా ? ఏదైనా అతికినట్లు నప్పవలెనంటే, సహజమైన సామరస్యం ఉండాలి.'

'అవును.'

'సరే, ఇది మీ అభిప్రాయంతో సరితూగడం లేదు. నీకు ఏ అభిప్రాయం ఆమోదయోగ్యం అవుతుందో ముందు ఎంచుకో.

జ్ఞానం అంతా స్మృతే నన్నదా

లేక

'ఆత్మ సామరస్యం తీసుకు వస్తుందనేదా ?'

'మొదటిదే అంగీకారం, రెండో దానికి ఎలాంటి సాక్ష్యం దొరకడం లేదు.'

'సరే, ఈ సమరసత అనేది ఆ వస్తువును మార్చిన కణముల సముదాయం కంటె భిన్నంగా ఉంటుందా ?' అనడిగాడు సోక్రటీస్.

'ఊహు. ఉండదు.'

'అది పని చేయదు. కేవలం క్షేత్రంగా ఉపయోగపడుతుంది. వాటికన్నా భిన్నముగా పనిచేస్తుంది.'

'అవును.'

'అంటే సమరసత ఆ సముదాయాన్ని నియమించిందన్నమాట. వాటిని అనుసరించి మటుకే ఉంటుంది.'

అవునన్నాడు అతడు.

'వాటితో విరుద్ధత లేదు దానికి, కదలికతోగాని, సవ్వడిలోగాని ఇంకే రకంగానూ.'

'లేదు.'

'మంచిది. ప్రతి సామరస్యము, తెచ్చి పెట్టుకున్న బిగింపు కాదు.'

'నాకు అర్థం కాలేదు.'

'బిగింపు ఎక్కువ అయినట్లయితే – ఎక్కువ పటుత్వం, తక్కువ బిగింపుతో తక్కువ సమరసత ఏర్పడుతోందా ?'

'అవును.'

'ఆత్మ విషయంలోనూ ఇదే నిజమా ? ప్రతి ఆత్మ-ప్రతి వివరంలోనూ ఆత్మ తప్ప ఇంకేమీ కాదా ?'

'కాదు.'

'సరే. ఇప్పుడు శ్రద్ధగా వినండి.'

'ఒక రకమైన ఆత్మకు మంచితనం, వివేకం ఉంటాయని : మరో ఆత్మకు దుర్మార్గము, అవివేకము ఉంటాయని చెప్పగలమా ? ఒకటి మంచిదని, మరొకటి చెడ్డదని వింగడించగలమా ?'

'అవును.'

'అలా అయినప్పుడు : ఆత్మ కేవలం సమరసత వల్ల ఏర్పడేదే అనే మనిషి దానిలో మంచితనం, చెడ్డతనం ఉన్నాయని ఎలా అనగలడు ? దానికి మరో సామరస్యం – లేకపోవడం వంటివి ఆపాదిస్తాడా ? మంచి ఆత్మ మంచి సమరసతము ఉన్నదని, చెడ్డ ఆత్మ ఏమాత్రము సమరసత లేకుండా ఉంటుందని అంటాడా ?'

'నాకు సమాధానం స్ఫురించడం లేదు. అయితే ఆ అభిప్రాయానికి అతుక్కున్న మనిషి అలాంటి మాటే అనాలి.'

'కానీ ఆత్మలు అన్నీ ఒకే పద్ధతినీ, వాటి సామరస్యంలో ఎక్కువ – తక్కువలు ఉండడానికి వీలులేదని ముందు అనుకున్నాం గదా.'

'అవును.'

'ఆత్మ అన్న తరువాత ఎక్కువ తక్కువలు ఉండవు. అన్నీ ఒకటే, అందుచేత దానిలో ఎక్కువ వైమనస్యంగాని, ఎక్కువ సామరస్యంగానీ ఉండటానికి వీల్లేదు.'

'అవును.'

'అలాగే – ఒక ఆత్మలో ఎక్కువ మంచితనం, మరో దానిలో ఎక్కువ చెడ్డతనం ఉండటానికి వీల్లేదు.'

'ఇంకో మెట్టు పైకి ఆలోచించి చూస్తే – ఆత్మలో యే మాత్రం చెడ్డతనం ఉండటానికి వీల్లేదు. సమరసత అన్న తరువాత అంతా సమరసతే.'

'అవును.'

'ఆత్మలో చెడ్డతనం అనేదానికి ఆస్కారం లేదు.'

'అవును, మనం తీరుగా ఆలోచించిన దాన్నిబట్టి అలాగే వీలవుతుంది.'

'అందుచేత – ప్రతి మనిషి యొక్క ఆత్మ కూడా మంచిదే, శుభప్రదమైనదే, మంగళకరమైనదే. దీనిలో ఎక్కువ తక్కువలకు అవకాశం లేదు. అన్ని ఆత్మల లక్షణాలు ఒక్కటే.'

'అవును.'

'ఈ ఆలోచన తీరు సవ్యంగానే అనిపిస్తోంది గదా. నీకు ఆత్మ కేవలం ప్రకృతి సముదాయం – కలిపి కట్టుతనం అనుకునేట్టయితే ఇటువంటి నిశ్చయానికి రాగలుగుతామా ?'

'రాలేము. అప్పుడా అవకాశం లేదు.'

'సరే, మళ్ళీ మనిషి దగ్గరకు వెడదాం – మనిషిలో ఆత్మగాక ఇంకేదైనా భాగం ఉన్నదా, అతన్ని పరిపాలించేది, నియంత్రించేదీని.'

'లేదు.'

'ఆత్మ శరీరం తాలూకు వాంఛలకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. వాటిని ప్రతిఘటిస్తోంది. ఉదాహరణ కోసం చెబుతాను, మనిషికి జ్వరం వచ్చి – దప్పికైనప్పుడు 'మంచినీళ్ళు తాగవద్దు' అని చెబుతుంది. ఆకలి కానప్పుడు తినవద్దు అని చెబుతుంది. అలా అనేక రకాలుగా శరీర లోలత్వం నుంచి మనిషిని కాపాడుతూ ఉంటుంది ఆత్మ. అవునా, కాదా ?'

'నిశ్చయంగా అవును.'

'కేవలం కొన్ని వస్తువుల సముదాయము, సంపర్కము, బిగింపు మాత్రమే అయినట్లయితే అది శరీరానికి వ్యతిరేకంగా మాట్లాడగలదా ? ఈ విషయం ముందే అంగీకరించాం కదా !'

'అవును, అంగీకరించాం.'

'కనుక – సారాంశంగా తేలిన విషయం ఏమిటంటే – ఆత్మ శరీరానికి వ్యతిరేక స్థాయిలో పని చేస్తుంది. తనలో అన్ని భాగాలను నియమించి పాలిస్తుంది. ఒక్కొక్కమారు శరీరానికి ఆయాసం. ప్రయాస కలిగే పనులు కూడా చేయమని నియమిస్తుంది. ఒక్కొక్కమారు జీవితమంతా ఇలాంటి శిక్షణలోనే గడిపివేయ వలసి వస్తుంది. అందుచేత ఆత్మను గురించి మనకున్న అభిప్రాయాలన్నీ పునరాలోచన చేసుకోవాలి. గుడ్డిగా ఇదివరకు చదువుకున్న, విన్న సమాచారంతోనే ముడిబెట్టుకు కూర్చునేందుకు కుదరదు.'

'ఇక రెండో వాదన దగ్గరకు వద్దాం.'

‘ఆత్మ అమృతమయమైనదే, మనకంటే ముందు నుంచి ఉన్నదే. అయితే మన తర్వాత కూడా ఉంటుందంటే నమ్మనంటాడు సెబెస్.’

‘అసలు ఆత్మ మానవ శరీరం లోనికి ప్రవేశించడమే ఒక రకమైన జబ్బు వంటిది. అక్కడే దాని నాశనం ఆరంభమైంది. జీవితమంతా అనేక అవస్థలు పడి, యాతనలు అనుభవించి – చివరకు మరణంతో ఏమీలేకుండా అయిపోతుంది. శరీరం లోనికి ఒకమారు ప్రవేశిస్తోందా చాలాసార్లు ప్రవేశిస్తోందా అనేది అప్రస్తుతం. మన ఆలోచనకు – ఇదీ సెబెస్ వాదన సారాంశం కదూ ?’

సోక్రటీస్ కాస్సేపు నిదానించాడు.

ఆలోచిస్తున్నట్లుగా ఉండిపోయాడు.

‘సెబెస్ వాదనను అర్థం చేసుకోవడం అంత తేలికైన పని కాదు. అసలు సృష్టిలయముల విషయం కూలంకషంగా చర్చించుకుంటే గాని మనకు ఈ సంగతి అవగతం కాదు.’

‘నాకు చిన్నతనంలో Natural Science పట్ల మక్కువ, ఆసక్తి ఉండేది. ప్రతి వస్తువు ఎలా ఉద్భవం అవుతుందో, ఎలా స్థితిలో ఉంటుందో, ఏ రకంగా లయమైపోతుందో తెలుసుకోవడం చాలా ఆనందదాయకంగా ఉంటుంది. మనం ఆలోచించ గలుగుతున్నామంటే – మెదడుకు నెత్తురు సరఫరా అవడం వల్ల, ఇంద్రియ పరిజ్ఞానం వల్ల, లేక ఇంకేదైనా కారణం ఉందా ? స్మృతి, ఆలోచన – అభిప్రాయము ఎక్కడ నుండి వస్తున్నాయి ? ఇవన్నీ స్థిరీకరణ పొంది పాండిత్యము, జ్ఞానము ఏర్పాటు అవుతున్నాయి... తరువాత ఈ గురుతర విషయాలన్నీ మనసుకు మరుగు అయిపోతున్నాయి. ఆకాశము, నక్షత్రమండలము.... వీటన్నింటి గురించి తెలుసుకుంటే ఇంకా బాగుంటుంది.... కాని నాకు ఇందుకు తగినంత ‘మేధ’ లేదని త్వరలోనే తేలిపోయి నేను ఆ రకమైన విద్యల వెనుక పరుగులు తియ్యడం మానివేశాను.

‘కొన్ని విషయాలు నా అంతట నేను స్థిరంగా తెలుసుకున్నాను. తరువాత రకరకాల ఊహాలోకాలలో అతలాకుతలం అయిపోయి, తెలుసుకున్నదంతా మరచి పోవాలనుకున్నాను. ముఖ్యంగా మానవాభివృద్ధికి సంబంధించిన విషయాలు మరచి పోవడం అవసరం అయింది. ఆహార పానీయాల వల్లనే మనిషి ఎదుగుతున్నాడు. పెరిగి పెద్దవాడు అవుతున్నాడు అనుకొనేవాడిని ముందు ముందు. ‘అనాక్సగొరస్’ పుస్తకంలో ఒక విషయం ఎవరో చదువుతూ ఉండగా విన్నాను. మనస్సు అనేది ఒకటి ఉంది. మానవ జీవితంలో ఇదే క్రమతను, కారణాన్ని తీసుకు వస్తోంది అని. ఈ వివరణ నా మనసుకు ఆమోదయోగ్యంగా కనిపించింది.

'మనస్సే అన్నింటికి కారణం. మనస్సు క్రమతను ఏర్పాటు చేస్తూనే అన్నిటికీ ఒక క్రమాన్ని తీసుకువస్తుంది. ఆ వస్తువుల పరిణామానికి అవసరమైన స్థానంలో వాటిని చేరుస్తుంది. అందుచేత – ఏ వస్తువు అయినా ఎందుకు వచ్చింది, ఎందుకు పోయింది, లేక ఎందుకు ఇంకా ఉంది అని తెలుసుకోవాలంటే, ఆ వస్తువుకు శ్రేయోదాయకమైన పరిణామం ఏమిటి – అనేది కూడా ముందుగా తెలుసుకోవలసి ఉంటుంది. మనిషికి సంబంధించినంత వరకూ ఒకటే విషయం : అతనికి అత్యంత శ్రేయోదాయకమైనదేమిటి ? ఎక్కువ శుభప్రదమైన దేమిటి ? – తక్కువ అయినదేమిటి అనేది కూడా తెలిసివస్తుంది.

'ఏమైనా అనాక్సగొరస్ చెప్పింది చాలా యుక్తాయుక్తంగా ఉంది. సృష్టిని గురించి ఆయన చెప్పిన విషయాలు బాగున్నాయి. భూమి గుండ్రంగా ఉందా ? చదునుగా ఉందా ? అనే విషయం చెప్పడంతో ప్రారంభం చేస్తాడనుకున్నాను. దీనికి కారణం తార్కికమైన అవసరం వివరిస్తాడనుకున్నాను. భూమి అలా ఉండడమే ఎందుకు శ్రేయోదాయకమో చెబుతాడనుకున్నాను.... అలాగే సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాలు వాటి గతులు, వర్తన మండలాలు విశదపరుస్తాడనుకున్నాను. ఒకదానిపై మరొకటి ప్రభావం చూపిస్తూ తిరుగాడడం ఎంత అవసరమో చూపిస్తాడనుకొన్నాను. మనస్సు పైన ఇంతగా కేంద్రీకరించిన మనిషి, అదే క్రమత తీసుకువస్తున్నదన్న వ్యక్తి – ఈ గ్రహాలన్నీ తమ తమ స్థానాలలో ఉన్నాయని చెప్పడం తప్ప ఇంకేమీ చేయడనుకున్నాను. ఒక్కొక్కదానికి ఒక్కో శ్రేయస్కరమైన కారణం చూపి –విశ్వమంతా అలా ఉండడానికి తగిన మంచి కారణం చూపడం విదాయకం. అందుకని ఆ పుస్తకాలన్నీ బెలెడు డబ్బు వెచ్చించి సేకరించాను, వెనువెంటనే చదవటం మొదలు పెట్టాను. "మంచి"ని గురించి గబగబ అంతా తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాను.

"అయితే ఈ ఆశ త్వరలోనే అడియాస అయిపోయింది. పుస్తకాలు చదివిన కొద్దీ నాకు స్పష్టం అయింది; మనసుకు, విశ్వగతులకు ఆయన ఎలాంటి సమన్వయ సూత్రము తీసుకురాలేదు. పంచభూతాలు అయిన గాలి, వెలుతురు, ఆకాశము, నీరు, భూమి, వీటికి కారణం " అపాదించడం జరిగింది. ఇంకా ఇంకేవో అభూత విషయాలను గురించి చెప్పాడు.

"సోక్రటీస్ చేసే అన్ని పనులకు అతని మనసు కారణం." అని చెప్పినట్లు ఉంటుంది.

"సోక్రటీస్ ఇక్కడ ఇలా ఎందుకు పడుకుని ఉన్నాడు ?"

"అతని శరీరంలో ఎముకలు – నరాలు ఉన్నాయి.

ఎముకలు నిటారుగా ఉంటాయి, ముడుచుకుంటాయి.

కీళ్ళు అవసరాన్ని బట్టి అటు ఇటు తిరుగుతాయి.

అందుకని అలా – ముడుచుకుని కూర్చున్నాడు.

అలాగే – సోక్రటీస్ ఇతరులతో ఎందుకు మాట్లాడుతున్నాడంటే –

దానికి ధ్వనితరంగాలు, స్వరపేటికలు కారణం – అంటాడు.

– ఇలా చుట్టు తిరిగి ఏదో చెప్పినట్లు కనిపించడమే తప్ప, అసలైన కారణం ఏమిటో స్పష్టంగా చెప్పడు.

ఏథెన్స్  నగరం నన్ను శిక్షించాలనుకున్నది.

నేను ఇక్కడ ఇలా వేచి ఉండడమే నయమనుకున్నాను.

శిక్షకు, ఆజ్ఞలకు లొంగిపోవడమే మంచిదనుకున్నాను – అనే మాటలు ఆయన చెప్పడు.

శిక్ష అనుభవించడం – లేకపోతే ఎముకలు, నరాలు, కీళ్ళు ప్రయోగించి పరుగు తీయడం – ఈ రెంటిలో మొదటిది శ్రేయస్కరం అని నేను ఎందుకు తీర్మానం చేసుకున్నానో ఆయన వివరించాడు.

అయితే ఒక విషయం – ఎముకలు, కీళ్ళు లేకపోతే నేను పారిపోలేను అన్న సంగతి నిజం. అంత మాత్రాన వాటి వల్లనే నేను చేస్తున్న పనులన్నీ జరుగుతున్నాయనుకోవడం అసంబద్ధం "మనసు"కు స్థానం ఏమిటో తెలుసుకోవాలి.

ఒక పనికి కారణం –

అది కారణం కాకుండా ఉండలేని పరిస్థితి.

ఈ రెంటిని వేరు వేరుగా చూడలేకపోవడం దురదృష్టం.

ఆ "పరిస్థితి"నే చాలా మంది కారణం అని భ్రమపడుతూ ఉంటారు.

దానికే ఒక పేరు తగిలించి, దాని వెనుక పరిశోధనలు చేస్తారు.

ప్రకృతికి అతీతమైన శక్తి ఒకటి ఉన్నదన్న విషయాన్ని మరచిపోతారు. తెలుసుకోలేక పోతారు. దానివల్లనే అన్ని వస్తువులు వాటి వాటి స్థానాలలో ఉన్నాయి.

ఎప్పటికో ఒకనాటికి – అన్నిటినీ తనలో ఇమడ్చుకునే గొప్ప అతీతశక్తి "అట్లాస్" వంటిది తయారవుతుందని భ్రమలు పోతారు–

ఈ రకంగా నేను పుస్తకాల నుంచి, ఇతర పండితుల నుంచి విషయాలన్నీ సమగ్రంగా తెలుసుకోలేక, నా అంతట నేను ప్రతిదీ ఆలోచించుకుని, కొన్ని నిర్ధారణలకు వచ్చాను. దీనిని మరింత వివరించి చెప్పమంటావా, సెబెస్ ?"

"తప్పకుండా చెప్పండి."

"ఇలా భౌగోళికమైన విషయాల పరిశీలన తర్వాత, గ్రహణ సమయంలో సూర్యుడిని చూచి కళ్ళు చెడగొట్టుకునే తరహా తప్పిదం చేయగూడదని నిర్ధారించుకున్నాను. ప్రతిబింబాన్ని నీళ్ళలోనో, గాజులోనో చూడాలి. లేకపోతే ప్రమాదం. ప్రతి వస్తువును ఇలా కళ్ళతో చూచి ఇతర ఇంద్రియాలతో సమన్వయం చేసుకున్నందు వల్ల క్రమంగా ఆత్మ గుడ్డిదైపోతుందనిపించింది. అందుచేత ముందుగా సిద్ధాంతాలు పరిశీలించాలనుకున్నాను. సిద్ధాంతాల ద్వారా నిజం తెలుసుకోవడం మంచిది. బహుశా – నేను చెబుతున్న ఉదాహరణలు నా ఉద్దేశాన్ని పూర్తిగా అవగతం చేయడం లేదేమో, సిద్ధాంతాలంటే కేవలం "ప్రతీక"లు కావు. అసలు వస్తువుకు అనుబంధమైనవే, అందుచేత ఇలా ప్రారంభం చేశాను.

'ముందుగా ఒక విషయం నా మనసుకు సజావుగా కనిపించిన దాన్ని – తీసుకున్నాను. ఆ సిద్ధాంత విషయంలో నప్పే విషయాలన్నీ పోగుచేసుకున్నాను. కారణరీత్యా కావచ్చును, ఇతరం కావచ్చును. అలా నప్పే విషయాలు నిజమైనవి, నప్పనివి నిజం కానివి. మరింత వివరంగా చెబుతాను... ఈ మాటలు మీకు అవగాహన కాలేదని స్పష్టంగా తెలుస్తూ ఉంది నాకు.

'మరేం కొత్త విషయం కాదు. లోగడ అనేకమార్లు చెప్పాను. ఇది చెప్పకుండా ఉన్న రోజు లేదనుకుంటాను, సందర్భం లేదు.

'నికార్సయిన (Absolute) సౌందర్యము, మంచితనము, ఉదారత ఉన్నాయి. వీటి అస్తిత్వంతో మీకు ఏమీ పేచీ లేకపోయినట్లయితే – వాటి ద్వారా సృష్టి, కారణం, ఆత్మ, అమృతత్వము – ఇవన్నీ మీకు తెలియచెప్తాను.

నికార్సయిన సౌందర్యం ఉంది. మరే వస్తువైనా సుందరంగా అగుపిస్తోంది. అంటే అందుకు కారణం, ఆ వస్తువు నికార్సయిన సౌందర్యంలో భాగం, సకలం. అంతకంటే మరేం ఇతర కారణం లేదు.

'ఏదో రంగు వల్ల, ఆకారం వల్ల సౌందర్యం వచ్చిందంటే నేను అంగీకరించను. ఇతర కారణాలు, విశదీకరణలు నాకు చాల గందరగోళంగా ఉంటాయి. నికార్సయిన సౌందర్యంతో సంబంధం ఉన్నది గనుకనే – దానిలో ఒక భాగం గనుకనే ఏ వస్తువైనా అందంగా ఉంటుంది.

‘అందం వల్లనే అందమైన వస్తువులు అందంగా కనిపిస్తున్నాయి. ఇదే ఉత్తమమైన సమాధానం అని నాకు తోస్తోంది. ఈ అభిప్రాయానికి అంటిపెట్టుకు ఉన్నంత వరకు నేను ఎక్కడా తప్పటడుగు వేయను.’

‘అలాగే – విశాలత వల్లనే విశాలమైన వస్తువులు విశాలంగా కనిపిస్తున్నాయి’ అలాగే ఏ లక్షణమైనా గానీ’.

‘ఎనిమిది కంటె పది అనే అంకె రెండు అంకెలవల్ల పెద్దది’. ‘రెండు’ కారణంగా పది, ఎనిమిది కంటె పెద్దది.

‘ఒకటికి ఒకటి కలిపాం. రెండు వచ్చింది. అలా కలపడం వల్ల రెండు వచ్చింది. అదే కారణం అనుకుంటాం. అలాగే భాగహారం కూడా.

‘ఏ వస్తువైనా దాని తాలూకు విశ్వవ్యాప్త స్థితితో సంబంధం వల్లనే వెలికి వస్తోందని మీకు త్వరగా తెలిసిపోతుంది. రెండు అంటే – భాగస్వామ్యం; ఒకటి అంటే ఏకత. ఈ మూల సూత్రాల నుంచే వస్తువులు బయలు వెడలుతున్నాయి. ఈ సంగతి అర్థం అయినాక కూడికలు, హెచ్చవేతలు, భాగహారాలు ఇవన్నీ పక్కన పెట్టేస్తారు. మీ దత్తాంశానికి మీరు అంటిపెట్టుకు ఉండి – నీడకు జారగిలబడినట్లుగా, దాని ముఖాంతరంగానే సమాధానాలు ఇస్తూ వెడతారు. దత్తాంశాన్ని అంటిపెట్టుకున్నప్పుడు కూడ, దాని ఫలితాలు అసంబద్ధంగా ఉన్నాయా లేదా అని సమీకరించుకుంటారు.

‘సిద్ధాంతము – దాని ఫలితము, ఈ రెండూ వేరు వేరు. ఎప్పుడూ కలిపి చదువుకోవాలి. ఎప్పుడూ విడివిడిగా చూచుకోవాలి అనేది తత్త్వవేత్తలైన మీకు ప్రయోగాలు చేసిన మీదట తెలిసి వస్తుంది.’ అన్నాడు సోక్రటీస్.

ఈ విషయం ఆమోదం పొందింది.

అనేక రూపాలు ఉన్నాయి.

ఈ రూపాలను అనుసరించి అనేక వస్తువులు ఉద్భవిస్తున్నాయి.

ఆ వస్తువులు రూపాలతో సమన్వయం పొందుతున్నాయి.

ఫలానా మనిషి, అతని తండ్రి కంటె పొడుగైనవాడు, బావమరిది కంటె పొట్టివాడు.... అని సిద్ధాంతీకరించమంటే ఆ మనిషిలో పొడుగరితనము, పొట్టితనము కూడా ఉన్నట్లే గదా! మనుషులలో ఉన్న లక్షణాల వల్లనే ఈ సామ్యం కుదురుతోంది గాని, మనుషులవల్ల కాదు గదా !

ఇదేదో కృతకమైన వాదనలాగా అగుపిస్తుంది. కాని లోతుగా ఆలోచిస్తే యదార్థం ఇదే.

'పొడుగైన రూపం కురచతనాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. పొడుగరి తనం పొట్టితనాన్ని అంగీకరించదు. ఒకటి ఉన్నచోట రెండోది ఉండదు. దానికి దారి ఇస్తుంది, లుప్తమై పోతుంది.

వస్తువు ఉన్నది ఉన్నట్లుగానే ఉండి పొడుగు, కురచ అయిపోతూ ఉండడం మనకు తెలుసు. దానిలో మార్పు లేకపోయినా ఇతర వస్తువులతో సామ్యం తెచ్చినప్పుడు, ఈ మార్పు వస్తువులలోనే ఉన్నట్లు భ్రమ కలిగిస్తుంది.'

–ఈ వాదం ఇలా సాగుతూ ఉండగా అనుయాయులలో ఒకతను గుర్తు చేశాడు.

'లోగడ మనం ఒక వింత సిద్ధాంతం అంగీకరించాం. మీకందరకూ గుర్తు ఉండే ఉంటుంది. అదేమిటంటే – పెద్ద వస్తువు చిన్న వస్తువు నుండి వస్తుంది. చిన్న వస్తువు పెద్ద వస్తువు నుండి వస్తుంది. అంటే పరస్పర విరుద్ధమైన రూపాల నుండి వస్తువులు ఉత్పన్నం అవుతున్నాయని. ఆ సంగతి గుర్తుకు తెచ్చుకుంటే ఇప్పుడు చెబుతున్న వాదన అంతా అర్థం లేనిదిగా తయారైపోతుంది.'

'నీవు ఈ సంగతి గుర్తు చేయడం చాలా మంచిదే అయింది. అయితే నీవు ఇందాకటి వాదనలోని తత్త్వాన్ని, ఇప్పటి వాదనలోని సారాంశాన్ని – వాటిలో వ్యత్యాసాలను గమనించలేదన్న మాట.'

అప్పుడు మనం విరుద్ధమైన 'వస్తువులు', విరుద్ధమైన 'వస్తువుల' నుండి వస్తున్నాయి అనుకున్నాం.

ఇప్పుడు ఏమంటున్నామంటే 'విరుద్ధమైన లక్షణం – విరుద్ధమైన లక్షణం నుంచి రాలేదు' అంటున్నాము.

అప్పుడు మనం వస్తువులను గురించి మాట్లాడుకుంటున్నాము. వాటికి ఉన్న వ్యతిరేక లక్షణాలను గురించి ముచ్చటించు కుంటున్నాము. లక్షణాలను బట్టి వచ్చిన పేరు ప్రస్తావించుకున్నాం.

ఇప్పుడు లక్షణాలను గురించే యధాతథంగా పరిశీలిస్తున్నాం. ఆ లక్షణం ఉన్నందువల్ల ఆ వస్తువుకు పేరు వచ్చింది అనే విషయం నిర్ధారించుకుంటున్నాము.

– ఇంతకూ ఒక విషయం మనం సిద్ధాంతీకరించ వచ్చుననుకుంటాను. అదేమిటంటే :

'ఏ వ్యతిరేక వస్తువు లేక లక్షణం అయినా – తనకు తానే వ్యతిరేకం కాలేదు' అనేది.

'అవును, నిజం' అని అందరూ ఆమోదం తెలిపారు.

'మరో విషయం గమనించండి ఇప్పుడు. అది గూడా మీకు ఆమోద యోగ్యముగా ఉందేమో చూడండి.'

'ఉష్ణము – శీతలము అనే రెండు వస్తువులు ఉన్నాయా ?'

'ఉన్నాయి.'

'మంచుగడ్డ – నిప్పురవ్వ వంటివేనా అవి ?'

'కాదు'

'ఉష్ణం అనేది నిప్పురవ్వ కంటే వ్యతిరేకమైనది. అలాగే శీతలం మంచుగడ్డ కంటే విరుద్ధమైనది.'

'అవును.'

'ఇందాక మనం పరిశీలించిన దానిని బట్టి – మంచుగడ్డ, దాని తత్త్వం అలాంటిది గనుక, ఉష్ణాన్ని తనలోనికి అవగాహన చేసుకోలేదు. చేసుకున్నాక కూడా మంచుగడ్డగానే ఉండిపోలేదు. అంటే – అది ఉష్ణం నుంచి దూరంగా పారిపోవాలి, లేదా తన అస్థిత్వాన్ని పోగొట్టుకోవాలి.'

'అవును, అంతే.'

'అలాగే ఉష్ణం కూడా. ఇంతకూ తేలుతున్న విషయం ఏమిటంటే – వస్తువులకు మనం ఇస్తున్న పేర్లు ఆ వస్తువుల బాహ్యరూపానికి గాకుండా అంతర్గత లక్షణానికి కూడా సమన్వయం అవుతున్నాయి.'

'బేసి అంకెలు ఉన్నాయి.'

బేసి అంకె మూడు.

మూడు ఒక్కటే బేసి అంకె కాదు.

అయిదు కూడా ఇలాంటిదే.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా ఉన్నాయి.

మూడు, అయిదులలో – ఇంకా ఇలాంటి అంకెలలో ప్రక్షిప్తంగా ఉన్న లక్షణం 'బేసితనం' అలాగే పది అంకెల విషయం గూడా.

'ముఖ్యంగా ఇందులో మనం గమనించవలసిన సారాంశం ఏమిటంటే.

పరస్పర వ్యతిరేకతలు మటుకే రెండు విషయాలను అవగాహనకు తీసుకురావు.

వ్యతిరేకం కాని రెండు వస్తువులు కూడా తమలో తాము వ్యతిరేకత లక్షణం పుణికి పుచ్చుకుంటాయి.

వాటిలో ఆ వ్యతిరేక రూపం ఉన్నది. కాని అది బయటకు రాలేదు. బయటకు వస్తే వస్తువు రూపం చెదిరిపోతుంది.

'మూడు అంకె ఎప్పటికీ బేసి అంకెగానే ఉంటుంది. దానిలో సరి అంకె ఇమిడి ఉన్నా మూడు ఎప్పటికీ సరి అంకె కాలేదు.

'అవును' అన్నాడు సెబెస్.

'అయినా రెండు, మూడు అంకెలు వ్యతిరేకమైనవి కాదు'

'కాదు'

'అందుచేత పరస్పర వ్యతిరేకమైన అంశాలే కాకుండా, ఇతరమైనవి కూడా ఒకదానిలో ఒకటి ఇమిడి ఉండలేవు. ఇమడకుండా ఉండలేవు.'

'నిజం'

'మరి ఇలాంటి వస్తువులు ఏమిటో పరిశీలించటానికి ప్రయత్నం చేద్దామా ?'

'తప్పకుండా'

'ఇలా చెబుతాను ముందు :'

కొన్ని వస్తువులు ఉన్నాయి. అవి రూపాలను తీసుకుంటాయి.

ఈ రూపం వల్లనే వస్తువుగా తయారవుతున్నాయి.

'అయినా ఇతర రూపాల – వ్యతిరేక రూపాల ఛాయలు, ప్రతీకలు కూడా ఈ రూపాలలో ఉంటున్నాయి.'

'వివరంగా చెప్పండి అర్థం కాలేదు.'

'మూడు అనే రూపం ఎప్పటికీ – ఏ వస్తువును ఆశ్రయించినా బేసిగానే ఉండి పోతుంది.'

'నిజం.'

'ఈ రూపంలోనికి ఇందుకు వ్యతిరిక్తమైన రూపం ఉన్న వస్తువు చేరలేదు.'

'అవును'

'బేసి రూపం వల్లనే ఇలా జరుగుతోంది.'

'అవును'

'దీనికి వ్యతిరేకమైనది ; సరి అయిన రూపం'

'అవును'

'సరి అయిన రూపం – మూడు లోనికి ఎప్పటికీ ప్రవేశించలేదు'

'అవును'

'అంటే, మూడు అనేది 'సరి' అయిన రూపానికి ఎప్పటికీ అనానుకూలమైనదే'

'అవును'

'కనుక మూడనే అంకె సరి అయినది కాదు'

'అవును'

'వాటంతట అవి వ్యతిరేకమైనవి కాకపోయినా, ఆ వ్యతిరేకతలో ఇమిడిపోలేని ఉదాహరణ ఇచ్చాను గదా ! మూడు సరి అంకెకు వ్యతిరేకం కాదు. అయినా సరి అంకెగా తయారు కాలేదు. సరి అయిన దానికి వ్యతిరేకత ఎప్పటికీ మూడులో ఉంటుంది. రెండు – బేసి, నిప్పు – శీతలం ఇలా ఎన్నైనా ఉదాహరణలు ఇచ్చి చెప్పవచ్చును. ఈ సంగతులు ఇప్పుడు నిర్వచనం వినండి'

'వ్యతిరేకమైనది, తనకు వ్యతిరేకమైన దానిని అంగీకరించకపోగా – అలాంటి వ్యతిరేకతతో ఇమిడిన ఏ రూపం దాని దగ్గరకు వచ్చినా, ఆ వ్యతిరేక రూపాన్ని గూడా వ్యతిరేకిస్తుంది.'

'అయిదు అనే అంకె 'సరి' అయిన రూపాన్ని అంగీకరించదు. పది అయిదుకు రెట్టింపు. అయినా పది, అయిదు అనే బేసి రూపాన్ని అంగీకరించదు. రెట్టింపులో తనదే అయిన ఓ వ్యతిరేకత ఉంది. అలాగే ఒకటిన్నర, ఒకటి ముప్పావు – ఇలాంటివి సమగ్రమైన ఏక రూపాన్ని అంగీకరించవు.'

'ఈ వాదం మీకు అర్థం అయిందా ? అంగీకారంగా ఉందా ?' అని అడిగాడు సోక్రటీస్.

'ఆఁ అర్థం అయింది, అంగీకారం కూడా' అన్నాడు సెబెస్.

'సరే మరో వివరణ వినండి.'

శరీరాన్ని వెచ్చగా ఉంచటానికి దానిలో ఏమి  ఉండాలి ? ఉష్ణం అని చెప్పను జవాబు. ఇందాక జరిపిన సంభాషణల సిద్ధాంతరూపంగా 'నిప్పు' ఉండాలి అని చెబుతాను. అలాగే శరీరాన్ని అనారోగ్యవంతం చేయటానికి దానిలో ఏమి ఉండాలి అంటే  – వ్యాధి అనను, 'జ్వరం' అంటాను.

'ఏదైనా అంకెను 'బేసి' సంఖ్య చేయాలంటే అందులో ఏమి ఉండాలి – అంటే 'బేసితనం' అని చెప్పను. 'ఏకత' ఉండాలి అంటాను... సరే ఇప్పుడు మరో అడుగు ముందుకు వేద్దాం. శరీరం సజీవంగా ఉండాలంటే ఏమి ఉండాలి ?'

'ఆత్మ'

'అంటే ఆత్మ శరీరాన్ని కైవశం చేసుకున్నప్పుడు – తనతో పాటు సజీవ లక్షణాన్ని కూడా తీసుకువస్తుంది.'

'అవును'

'సజీవ లక్షణానికి వ్యతిరేకమేదైనా ఉన్నదా ?'

'ఉన్నది'

'ఏమిటది?'

'మృత్యువు'

'ఇందాక మనం చేసిన ఆలోచన, సిద్ధాంతాన్ని అనుసరించి – ఆత్మ తనకు వ్యతిరిక్తమైన లక్షణాన్ని తీసుకువచ్చే వస్తువును తమలో ఇముడ్చుకోదు. అంగీకరించదు కదూ ?'

'అవును' అన్నాడ సెబెస్.

'సరి అయిన రూపాన్ని ఇముడ్చుకోని దానికి ఏమని పేరు పెట్టుకున్నాం?"

'సరి కానిది – అనుకున్నాం.'

'ధర్మం, సంస్కృతి వంటి వాటిని అంగీకరించని వాటికి ఏమని పేరు పెట్టుకున్నాం ?'

'అధర్మం, అసంస్కృతి.'

'మృత్యువును అంగీకరించడానికి ఏమని పేరు పెట్టుకోవచ్చును ?"

'అమృతత్త్వం'

'ఆత్మ మృత్యువును ఇముడ్చుకోదు. అంగీకరిచదు గదూ ?'

'అవును'

'కనుక ఆత్మ అమృతత్త్వమైనది !'

'సరే, ఆ విషయం నిరూపణ అయిపోయిందని అనుకోవచ్చునా ? మీరు ఏమంటారు ?' అని సోక్రటీస్ అందరివంక చూచాడు.

'క్షుణ్ణంగా, నిర్ద్వంద్వంగా నిరూపణ అయింది.'

'మరో అంశం. సరికానివి అవినాశి అయినట్లయితే, మూడు అంకె కూడా అవినాశే గదూ?'

'అవును, అవినాశే.'

'వేడి కానిది అవినాశి అయితే – మంచుగడ్డకు నిప్పు జోడించినప్పుడు, మంచు గడ్డ దూరంగా తొలగిపోతుందా – కరగకుండా ఉండిపోతుందా ? లేకుండా పోతుందా ? లేక తనలో నిప్పు జోడించమంటుందా ? అలాగే శీతల విషయం కూడా.

"దీనిని అమృతత్త్వంతో పోల్చి చూద్దాం."

అమృతత్త్వమైనది అవినాశి కూడా అయితే, మృత్యుముఖంలో ఆత్మ ఉండకుండా పోవడం అసాధ్యం. అది మృత్యువును ఇముడ్చుకోలేదు. తనకై తాను మరణించ లేదు. మూడు సరి కాదు ! బేసి కాదు అన్నట్లుగా. శీతలం ఉష్ణం కాదు, శీతలం కాదు అన్నట్లుగా... అది మాయమైపోయి, దాని స్థానంలో మరేదైనా రావచ్చును గదా! "అందుచేత... అమృతత్త్వం అనేది అవినాశి అని గూడా ఋజువు అయిపోయింది" అన్నాడు సోక్రటీస్.

సెబెస్ "అమృతత్త్వము, శాశ్వతము అయినది అవినాశి కాకపోతే ఇంకేది మిగులుతుంది గనుక!" అన్నాడు.

"అందుచేత అందరూ అంగీకరించవలసిన విషయం ఏమిటంటే – భగవంతుడు, జీవస్వరూపము, ఇంకా అమృతత్త్వమైన ఏ వస్తువైనా ఎప్పటికీ ఉండకుండా పోదు ! దాని అస్తిత్వానికి ఢోకా లేదు : అన్నాడు సోక్రటీస్. 'ఆత్మ అమృతమయము అయితే అవినాశి కూడా అవుతుంది."

'తప్పదు.'

‘కనుక – మనిషిని మృత్యువు ఆవహించినపుడు అతనిలోని మృతప్రాయమైనది మరణిస్తుంది. అమృతమయమైనది మరో చోటుకు, మృత్యువుకు అందని తీరానికి పోయి ప్రమాదం నుంచి తప్పించుకుంటుంది. వినాశం నుండి బయట పడుతుంది.”

“అవును.”

“అందుచేత, సెబెస్, మన ఆత్మలు అమృతమయం : అవినాశి మరణానంతరం మరో లోకానికి పోతాయి.”

సెబెస్ వినయంగా “సోక్రటీస్, నాకు నీ వాదనను గురించి, సిద్ధాంతాన్నీ గురించి ఇప్పుడు ఏ మాత్రం అనంగీకారం లేదు. సిమ్మియస్‌గాని, ఇతరులు ఎవరైనా దీనిలో ఏ భాగాన్ని అంగీకరించకపోయినా, వాళ్ళు ఆ విషయంపైకి చెప్పి చర్చకు తావు ఇవ్వడం మంచిదనుకుంటాను. ఇంతకంటె మరో చక్కని అవకాశం రాదు.” అన్నాడు.

సిమ్మియస్ “నా మటుకు నాకు అనుమానాలు, వ్యతిరేకతలు లేవు. అయినా మానవ స్వభావం అతి బలహీనమైనది. అందుచేత ఏవో చిన్న విషయాలు ఉండనే ఉంటాయి.” అన్నాడు.

“మనం సిద్ధాంతాలను ఎంత క్షుణ్ణంగా పరిశీలించి అంగీకరించినా, వాటి పరిశీలనలో ఏదో చిన్న అవ్యవస్థలు వస్తాయి. తప్పదు. మీరు క్షుణ్ణంగా పరిశీలించినట్లైతే ఈ అనుమానాలు వైదొలగిపోతాయి. సత్యదర్శనం అవుతుంది. మానవ మేధ ఎంత వరకు అవగాహన చేసుకోగలదో అంత వరకు దొరుకుతుంది సమాధానం. ఆ స్థాయి చేరుకున్న తర్వాత పరిశోధించ వలసింది ఏమీ ఉండదు.” అన్నాడు సోక్రటీస్.

సిమ్మియస్ అంగీకారం తెలిపాడు.

“మరో విషయం” అంటూ సోక్రటీస్ కొనసాగించాడు. “ఆత్మ అమృతమయము అయితే, అది మన సమయాన్ని జీవిత కాలంలోనే కాక ఎప్పటికీ కోరుకుంటుంది. దానిని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం కూడాను. మృత్యువు అన్నిటి నుంచీ విముక్తమైన స్థితి అయితే – దుర్మార్గులకు, నేరస్తులకు, ఇది తరుణోపాయం అవుతుంది. చనిపోవడం వల్ల శరీర త్యాగమే కాకుండా శరీరం చేసిన పాపాలన్నిటి నుంచీ “విడుదల” చేస్తుంది. అయితే ఆత్మ అమృతమయం అవడం వలన ఇలాంటి విపత్కర పరిస్థితి లేదు. పాపాల నుంచి పరుగులు తీయడానికి దారి కనిపించదు. ఎందుచేతనంటే అది తనతోపాటు

దేనినీ ఇతర లోకాలకు తీసుకువెళ్ళదు. తన శిక్షణ, వివేకము తప్ప ఇంకేమీ దానితో రాదు. క్రొత్తగా చనిపోయిన వాళ్ళకు సహాయకారి అనేవి ఇవే.

'జరిగే కథ ఇలా ఉంటుంది.'

మనిషి చనిపోతాడు.

అతని రక్షణ తీసుకున్న ఓ దేవతామూర్తి మనిషిని ఒక చోటుకు తీసుకుపోయి అందరి ముందు నిలబెడతాడు. అతని చర్యలు తీర్పుకు సమర్పితం అయిన తర్వాత, ఇద్దరూ మరో లోకానికి పోతారు. ఈ లోకం నుంచి మరో లోకానికి మనుషులను తీసుకుపోవటానికి – అదే తమ విద్యుక్త ధర్మంగా కొందరు జీవులు ఉంటారు. అక్కడ ఆ లోకంలో అవసరమైన శిక్షణ పొందిన తర్వాత, అనుభవాలు గడించిన తర్వాత, మరో దేవతామూర్తి అతన్ని తిరిగి ఈ లోకానికి తీసుకు వస్తాడు.

"తెలివైన ఆత్మ – అన్నిటినీ పరిశీలిస్తూ తిరుగుతుంది. శరీరానికి అనుబంధం అయిన ఆత్మ ఎప్పుడూ దానిమీదుగానే తిరుగాడుతూ ఉంటుంది. ఎంతో బలవంతం మీదగాని ఈ లోకాన్ని వదలి పై లోకానికి వెళ్ళటానికి అంగీకరించదు.

ఈ లోకాలలో అనేక అంతస్తులు, ఉపలోకాలు ఉన్నాయి. భూమి విషయమే పరిశీలిస్తే, స్వరూప స్వభావాలలో దీనికి మనం అనుకునే లక్షణాల కంటే విభిన్నమైనవి చాలా ఉన్నవని విన్నాను."

"అవేమిటో చెప్పండి."

"ఒకటి : భూమి గుండ్రంగా ఉంది."

"స్వర్గాల నడుమ ఉంది."

అది పడిపోకుండా ఉండటానికి గాని, లేక ఇతర ఒత్తిడులు ఏమీ అవసరం లేదు.

స్వర్గాల సారూప్యం. భూమి పరిస్థితి చాలు అది దాని స్థానంలో స్థాయిగా ఉండటానికి.

సమస్థితిలో ఉన్న ఏ వస్తువైనా, కింద పడదు, పైకి ఎగరదు. ఏ ఆధారము లేనట్లు కనిపిస్తున్నా, అది ఉన్నచోటనే ఉంటుంది.

"ఇదీ నా మొదటి నమ్మకం."

సిమ్మియస్ "చాలా సమంజసంగా ఉంది" అన్నాడు.

"తరువాత, భూమి చాల విస్తారమైంది. మనం ఎక్కడో, ఏ మూలో ఉంటున్నాం, తటాకం ఒడ్డున కప్పలలాగా. భూమి మీద ఎన్నో రకాల ఆకారాలు, ప్రమాణాలు, నీరు, గాలి నిండిపోయి ఉన్నాయి. ఈథర్ అని ఒక వస్తువు ఉంది. మనం భూమి ఉపరితలం మీద ఉన్నామనుకుంటున్నాం గాని, దాని లోయలలోనే ఉంటున్నాం. సముద్ర గర్భంలో ఉన్న జంతువులు తాము సముద్ర ఉపరితలం మీదనే ఉన్నామని అనుకుంటాయి. అలాగే మనమూ. వాటిని సముద్రం ద్వారా కనిపించే సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాలు.... సముద్రమే ఆకాశం భ్రమ కలిగించవచ్చును. సముద్ర ఉపరితలం మీదకు ఆ జీవులు ఎన్నడూ రాకపోవచ్చును. అయితే ఏం, దాని అస్తిత్వానికి ఏమీ లోపం లేదు.

"పన్నెండు పొరలతో పేనిన గోళం ఈ భూమి.

పై నుంచి చూచినప్పుడు కనిపించే దృశ్యం ఇది.

వేరు వేరు రంగులు, సాంద్రతలు, కళాకారులు ఉపయోగించే రంగుల వంటివి.

మనోహరమైన ఊదా రంగు.

బంగారు రంగు.

తెలుపు, సున్నం కంటె, పాల కంటె వేరైన తెలుపు... అంతా మనోహరమైన దృశ్యం.

భూమిలోని లోయలు, నీరు, గాలి మిశ్రితమై ఉంటాయి.

రకరకాల రంగులలో సుందరంగా ఉంటాయి.

అనేక రంగులు పరచినట్లుగా ఒకే తలంగా అగుపిస్తాయి చెట్లు, పూలు, ఫలాలు... ఈ భూమి మీద పెరుగుతాయి. అవి అందాన్ని పుణికి పుచ్చుకుంటాయి.

పర్వతాలు – వాటి మీద రాళ్ళు... ఎంతో సున్నితంగా రకరకాల రంగులలో, స్ఫటికాల్లా మెరుస్తూ సుందరంగా ఉంటాయి.

నవరత్నాలు ఈ రాళ్ళలోనివే.

సమాజస్థితిలో ఉన్న రాళ్ళు, అవి ఇతర ముద్రలకు, తాకిళ్ళకు లోనుకాలేదు. సముద్ర కెరటాలు వాటిని తాకలేదు.

ఈ రాళ్ళు, రత్నాలు కాక... బంగారము, వెండి ఇతర లోహాలు, ఇవన్నీ భూమిలో భాగమే.

వాటినన్నిటినీ చూడడం కన్నులకు పండుగ !

ఎన్నో జంతువులు ఉన్నాయి, మనుషులు.

కొన్ని భూమి మీద, కొన్ని ఆకాశంలో,

కొన్ని సముద్రతీరంలో, గాలిలో, ద్వీపాలలో.

పక్షులకు, జంతువులకు వ్యాధులు లేవు.

మనుషుల కంటె ఎక్కువ కాలం బ్రతుకుతాయి.

ఎన్నో పవిత్ర గుహలు, దేవాలయాలు ఉన్నాయి. దేవతలు, దేవుళ్ళు నివసిస్తారు అక్కడ. భవిష్యత్తులో ప్రశ్నలు, ఆదేశాలు, ఉత్తర్వులు అక్కడ నుంచి వస్తాయి.

"భూమి తత్వం ఇలాంటిది."

రకరకాల లోయలు, ఎత్తు పల్లాలు అన్నిటినీ కలుపుతూ ఒక తలం.

నదులు, నదాలు.

చల్లని, వెచ్చని నీటి కాలువలు.

అగ్ని వర్షిస్తున్నట్లు కొన్ని నదులు.

వరదలు, వెల్లువలు.

భూమిలో అంతర్గతంగా జరిగే కదలికల వల్ల, స్పందనాల వల్ల ఈ ఆటుపోటులు.

భూమిలో ఉన్న ఒక గుహ చాలా పెద్దది. హోమర్ (Homer) చెప్పినట్లుగా ఒక చివర నుంచి మరో చివర వరకు అవిరళంగా దూసుకుపోతుంది.

అన్ని నదులు ఈ గుహలోనికి చేరుకుంటాయి, చివరకు.

మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలలాగ ఇవీ వరుసక్రమంలో తప్పనిసరిగా స్రవిస్తాయి.

కొన్ని వాగులు ఉపరితలంలోనికి వచ్చి మనకు పంటలు పండటానికి దోహదం చేస్తున్నాయి.

భూమి అంతర్గతంగా ఎన్నో చర్యలు, మథనాలు జరుపుతున్నాయి.

పైకి అంతా క్రమం ప్రకారం వస్తాయి.

సముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు, ఊటలు...

"మనిషి చనిపోయిన తర్వాత ఒక దూత ఆశ్రయంలో ఈ నదులన్నీ చూస్తూ వివిధ ప్రాంతాలు సందర్శిస్తూ తిరుగుతాడు. అతని చర్యనుబట్టి అతనికి శిక్షలు, పరిహారాలు జరుగుతాయి – ఎంత వర్ణించి చెప్పినా ఈ వర్ణనే సర్వమూ అనుకోగూడదు. ఈ వర్ణనలన్నీ మనలో స్ఫూర్తి, విశ్వాసము కలిగించటానికే.

ఆత్మ ఈ క్షోభలన్నీ పడకుండా వీటన్నిటికి అతీతంగా ఉండటానికి ఒక మార్గం ఉంది. జీవితకాలంలో శరీర సుఖలాలసల కోసం తాపత్రయపడకుండా ఉంటే, జ్ఞాన సముపార్జన కోసం ఎక్కువ సమయాన్ని వినియోగించినట్లయితే, పెట్టుడు సౌందర్యం కాకుండా సహజమైన సౌందర్యంలోనే ఆత్మ ధగద్ధగాయమానంగా వెలిగిపోతుంది, మెరిసిపోతుంది.

"ఆత్మ నిగ్రహం, మంచితనం, సాహసం, వితరణ, సత్యము – ఈ లక్షణాలు ఉపాసించినప్పుడు పరలోక ప్రయాణానికి సజావైన, సక్రమమైన ఏర్పాట్లు చేసుకున్నట్లు అవుతుంది."

"నా మటుకు నాకు ఆ సమయం ఇప్పుడే ఆసన్నమైంది. నేను ఇప్పుడు స్నానం చేయవలసిన సమయం. విషం పుచ్చుకోవటానికి ముందు స్నానం చేయడం మంచిదనుకుంటాను. అలా అయితే, నేను చనిపోయిన తర్వాత తిరిగి నా శవాన్ని స్నానం చేయించి శుభ్రపరచవలసిన పని ఉండదు." అన్నాడు సోక్రటీస్.

క్రిటో అతి నింపాదిగా "సోక్రటీస్ అంతా చెప్పావు. బాగానే ఉంది. మీ పిల్లలను గురించి, కుటుంబాన్ని గురించి నాకు గాని – ఇంకెవరికైనా గాని ఏమైనా ఆదేశాలు, ఉత్తరువులు ఇవ్వాలనుకుంటున్నావా ? మేం ఏం చేస్తే మీకు ఆనందదాయకంగా ఉంటుందో సెలవు ఇస్తావా ?" అన్నాడు.

"కొత్తగా చెప్పవలసింది ఏమీ లేదు క్రిటో. మీ మీ పనులు చేసుకుంటూ చక్కగా కాలక్షేపం చేస్తూ ఉండండి. అదే నాకు ఆనందదాయకం."

"మీ పనులు నిర్లక్ష్యం చేసినా, అజాగ్రత్తలో పడినా – నేను చెప్పిన సంవిధానంలో మీ జీవితాలను అమర్చుకోకపోయినా, ఇప్పుడు నేను చెప్పిన విషయాలు విని అంగీకరించినంత మాత్రాన మీకు ఏమీ మేలు జరగదు."

"శక్తివంచన లేకుండా మంచి జీవితం – మీరు ఆదేశించిన రకంగా గడపటానికి– ప్రయత్నిస్తాం." అన్నాడు క్రిటో. "మీ దహనక్రియలు ఎలా చేయాలని అభిలాష ?" అని అడిగాడు.

"అది మీ ఇష్టం. నా అభిప్రాయ పరంపరలను పట్టుకోగలిగితే సరేసరి. లేకపోతే నేను మీ వేళ్ళ సందుల నుంచి తప్పించుకుపోతాను" అంటూ సోక్రటీస్ సరళంగా నవ్వాడు.

మళ్ళీ అందరివైపు తిరిగి, తాపీగా చూస్తూ ఇలా అన్నాడు.

"ఇక్కడ పడుకుని ఉండి, కూర్చుని – మీతో మట్లాడుతూ, రకరకాల వాదనలు ప్రతిపాదించిన నేను సోక్రటీస్‌నేనని, మీకు – క్రిటోకు, నచ్చచెప్పలేను. నేను కొద్దిసేపట్లో మృతదేహాన్నై ఇక్కడ పడి ఉంటానని అతడు అప్పుడే అంచనా వేస్తున్నాడు. నా దహన క్రియలు ఎలా జరగాలని అడుగుతున్నాడు.

విషం తాగిన మీదట నేను మీతో ఉండను. స్వర్గ సుఖధామాల వైపు షికారు వెడతాను. ఇదంతా క్రిటో మనసుకు పట్టుకున్నట్లుగా లేదు. నా తరఫున మీరు క్రిటోకు ఈ విషయం చెబుతూ ఉండాలి. ఎందుకంటే అతను నేను చనిపోకుండా ఉండటానికి ఏమేం చేయగలడో అంతా చేశాడు. నేను చనిపోయిన తరువాత మాత్రం – ఇంకా ఇక్కడ ఉండననీ, వెళ్ళిపోతానని అతను ఊహించలేకపోతున్నాడు. శరీరాన్ని తగులపెట్టినా, సమాధి చేసినా.... ఆ దృశ్యాన్ని చూచి క్రిటో తట్టుకోలేడు. అతన్ని ఆ దుఃఖం నుండి నివారించండి. అనివార్యమైనది జరిగితే అది చూస్తూ తట్టుకోవడం అతని వల్లకాదు. సోక్రటీస్‌ను నేను మోసుకు వెడుతున్నాను. తగల పెడుతున్నాను. అంత్యక్రియలు చేస్తున్నాను. – అనే మాటలు రాగూడదు. క్రిటో – ఒక్కమాట విను, పొరపాటు మాటలు ఆత్మను క్షోభ పెడతాయి. వినడానికి కటువుగా ఉండడమే కాకుండా నీవు నిదానంగా, నిగ్రహంగా ఉండాలి. నీవు తగలవేస్తున్నది నా శరీరాన్ని మటుకే. దాన్ని నీ ఇష్టం వచ్చినట్లు చేయి, తగలవేయి, పూడ్చు అంతా నీ ఇష్టం. ఏది యోగ్యమైన పనో అదే చేయి."

ఈ మాటలు చెప్పేసి సోక్రటీస్ పక్కగదిలోనికి వెళ్ళాడు, స్నానం చేయటానికి.

క్రిటో అతన్ని అనుసరించాడు.

తతిమ్మా అందరూ అక్కడే ఉండిపోయారు.

'మరుక్షణం ఏమవుతుంది ? అందరమూ అనాథలమైపోతాము. మా తండ్రి మమ్మల్ని వదలి వెళ్ళిపోతున్నాడు' అనే భావం అందరి మనసులలోనూ గూడుకట్టుకు పోయింది.

సోక్రటీస్ స్నానం చేసి వచ్చాడు.

అతని కుమారులను తీసుకువచ్చి చివరి మారుగా చూపించారు. ఇద్దరు చిన్న పిల్లలు – ఒకడు పెద్దవాడు.

అతడి భార్య, ఇతర ఆడవాళ్లు వచ్చారు.

క్రిటో సమక్షంలోనే అందరితోనూ మాట్లాడాడు. తన ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారి కందరికీ చెప్పాడు.

ఆడవాళ్ళను, పిల్లలను పంపించేసి, తన స్నేహితులు, అనుయాయులు ఉన్న గదిలోనికి తిరిగి వచ్చాడు సోక్రటీస్.

దాదాపు సూర్యాస్తమయం అయింది.

చాలాసేపు లోపల గడిపాడు.

సోక్రటీస్ నిదానంగా వచ్చి కూర్చున్నాడు.

స్నానం చేసినందున, కడిగిన ముత్యంలా ఉన్నాడు.

కొద్ది నిముషాలు స్నేహితులతో ఈ మాటలు, ఆ మాటలు ఆడాడు.

జైలు అధికారి వచ్చాడు.

"ప్రభుత్వ ఆజ్ఞల ప్రకారం మీకు నేను విషపాత్ర అందించాలి. అప్పుడు నన్ను మీరు కోపంగా చూస్తారు, నిందిస్తారు. అందరూ అలాగే చేస్తారు. అందరిలాగా మీరు చేస్తారు. అందకు నేనేం అనుకోను. ఇక్కడున్న వాళ్ళలో మీరు చాల ఉదాత్తమైన వ్యక్తులని, మనుషులందరిలోకీ ధీరోదాత్తులనీ తెలుసుకున్నాను. నా పైన కోపం చేయరనే విషయం కూడా నాకు స్పష్టం అయిపోయింది.. ఈ శిక్షకు బాధ్యులు ఎవరో మీకు బాగా తెలుసును. కనుక – నేను చివరి మారుగా మీకు మనవి చేసేది ఏమంటే దయచేసి జరగనున్న దానితో శృతి కలపండి. ధైర్యంగా భరించండి" అన్నాడు.

జైలు అధికారి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.

గిరుక్కున తిరిగి – ఇక అక్కడ నిలవలేను అన్నట్లుగా వెనక్కు వెళ్ళాడు.

సోక్రటీస్ నింపాదిగా అతన్ని చూచి, 'సెలవు. నీవు చెప్పినట్లే చేద్దాం" అన్నాడు.

తన స్నేహితులతో ఇలా అన్నాడు.

"ఇతను ఎంతో ఉత్తముడు! నేను ఇక్కడ ఉన్నన్ని రోజులు నన్ను చూడవచ్చేవాడు. అప్పుడప్పుడు నాతో సంభాషణలు జరిపేవాడు. నా పట్ల చాలా దయగా ప్రేమగా ఉన్నాడు. ఈ వీడ్కోలు సమయంలో నా కోసం కన్నీరు కార్చడం

అతని మంచితనాన్ని తెలుపుతుంది. సరే, క్రిటో అతను చెప్పినట్లు చేద్దాం పద. ఎవరైనా విషపాత్ర తీసుకురండి, అది సిద్ధం అయి ఉంటే. ఇంకా తయారు కాకపోతే మనం వేచి ఉన్నామని చెప్పండి, సిద్ధం చేయమనండి."

క్రిటో "సూర్యుడు ఇంకా కొండల మీదే ఉన్నాడు. పూర్తిగా అస్తమయం కాలేదు. ఇతరుల విషయంలో నేను విన్నదేమంటే – శిక్షకు గురైన వారు రాత్రి భోజనం చేస్తారు. ఇష్టమైన పానీయాలు సేవిస్తారు. తమ స్నేహితులతో ఇష్టాగోష్ఠి జరుపుతారు. బాగా రాత్రి అయిన మీదట విషం తీసుకుంటారు. అందుచేత మనం తొందరపడ వలసిన అవసరం లేదు. చాలా సమయ విరామం ఉన్నది ఇంకా " అన్నాడు.

"క్రిటో! ఆ మనుషులంతా అలా ప్రవర్తించడం వారికి పూర్తిగా తగి ఉంది. భోజనం వల్ల, పానీయం వల్ల, కబుర్ల వల్ల వారికేదో ఒరుగుతుందనుకుంటారు. నేను ఆ పద్ధతిలో నడవక పోవడం నాకు సముచితమైన తీరు. విషం తాగడం ఆలస్యం చేసినందువల్ల నాకు ఉపకరించేది ఏమీ లేదు. జీవితం కొన్ని క్షణాల పాటు పొడిగించుకుందాం అనుకోవడం నా క్షుల్యకతనే తెలియపరుస్తుంది. అందుచేత తీసుకురా. మరేం ఆలస్యం చేయకు" అన్నాడు సోక్రటీస్.

క్రిటో తన అనుచరుడికి సైగ చేశాడు.

అతడు బయటకు వెళ్ళి చాలా సేపటి తర్వాత వచ్చాడు. అతడితో పాటు విషపాత్ర అందించవలసిన మనిషి కూడా వచ్చాడు. అతని చేతిలో విషపాత్ర సిద్ధమై ఉంది.

సోక్రటీస్ అతన్ని చూడగానే "బాగుంది, ఇప్పుడు నేనేం చేయాలో చెప్పు" అనడిగాడు.

"ఈ పాత్రలోని పానీయం తాగేయండి. అటు, ఇటు పచార్లు చేయండి. కాస్సేపట్లో మీ కాళ్ళు బరువు ఎక్కుతాయి. అప్పుడు పడుకోండి. అప్పుడు విషం తనంతట తనే పనిచేస్తుంది."

ఈ మాటలు చెప్పి అతను సోక్రటీస్‌కు పాత్ర అందించాడు, తన పని అయిపోయింది అన్నట్లుగా.

సోక్రటీస్ ఆనందంగా దాన్ని అందుకున్నాడు.

ఏ మాత్రం వణుకు, తడబాటు లేదు.

ముఖ కవళికలలో మార్పు లేదు.

గాంభీర్యం చెక్కు చెదరలేదు.

కనుబొమలు సారించి స్థిరంగా కిందకు చూస్తూ "ఈ పానీయంలో కొంత దేవుడికి సమర్పించవచ్చునా ?" అని అడిగాడు.

"మామూలుగా మనిషికి సరిపోయేంత ప్రమాణంలోనే తయారు చేస్తాం సోక్రటీస్" అన్నాడు అతడు.

"అలాగా ! సరే, ఈ లోకం నుండి పరలోకానికి నా ప్రయాణం వైభవంగా జరగాలని దేవుళ్ళను ప్రార్థిస్తున్నాను. ఈ ప్రార్థన వారు మన్నిస్తారని ఆశిస్తాను" అంటూ సోక్రటీస్ విషపాత్ర ఎత్తి ఏ మాత్రం అరుచి, అయిష్టం చూపకుండా – మొత్తం పాత్రలో ఉన్న పానీయాన్ని ఒక్క మోతాదులో గొంతులో పోసుకుని గుటక వేశాడు.

ఈ క్షణం వరకు అతని స్నేహితులు, అనుయాయులు ఎలాగో తమ దుఃఖాన్ని, కన్నీళ్ళను నిగ్రహించుకు ఉండగలిగారు.

అతను విషం తాగుతూ ఉన్నప్పుడు వాళ్ళంతా వివశులైపోయారు.

ముఖాలు చేతుల్లో కప్పుకుని, కడుపు చించుకుపోయేటట్లు విలపించారు.

క్రిటో అందరి కంటే ముందే దుఃఖ సముద్రంలో పడిపోయాడు. పక్క గదిలోనికి వెళ్ళిపోయాడు.

అపోలోడరస్ (Appollodurus) అందరికన్నా ఎక్కువగా విలపిస్తున్నాడు.

సోక్రటీస్ ఈ దృశ్యం చూచి ఇలా అన్నాడు.

"మిత్రులారా ! ఇదేనా ప్రవర్తించవలసిన తీరు ? అందుకనే ఆడవాళ్ళను ముందుగా బయటకు పంపివేశాను. వాళ్ళు గందరగోళం సృష్టిస్తారని భయపడ్డాను. నాకు తెల్సినంతవరకు చివరి ఘడియలు చాలా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా గడిచిపోవాలి. మనస్సులో ఎలాంటి వికారాలు ఉండకూడదు. అందరూ సమాధానచిత్తులు అవండి. ధైర్యంగా ఉండటానికి ప్రయత్నించండి."

అతని మాటలు అందరికీ సిగ్గు తెప్పించాయి.

చనిపోతున్నవాడు ఇతరులకు ధైర్యం చెబుతున్నాడు.

అందరూ చేతనైనంత వరకు నిగ్రహించుకుందుకు పూనుకున్నారు.

కాళ్ళు బరువు ఎక్కుతున్నాయి అని చెప్పి, వెల్లకిలా పడుకున్నాడు. విషపాత్ర తెచ్చి అందించిన మనిషి సోక్రటీస్ పైన చేయి వేసి పరీక్షించి చూచాడు. కొద్దిసేపు అయినాక, కాళ్ళు, చేతులు పరిశీలించాడు. కాళ్ళను గట్టిగా గిల్లి "తెలుస్తోందా ?" అని అడిగాడు. "నాకేం తెలియడం లేదు" అన్నాడు సోక్రటీస్.

క్రమంగా వళ్ళు చల్లబడుతోంది.

మొద్దు ఎక్కుతోంది.

"విష ప్రభావం గుండె ప్రాంతానికి చేరుకోగానే సోక్రటీస్ మరణిస్తాడు" అని చెప్పాడు ఆ మనిషి.

చల్లదనం పైకి ఎగబాకుతోంది.

సోక్రటీస్ ముఖం మీది ముసుగు తీశాడు.

"క్రిటో, అక్లెపియస్ (Ascleplus) కు మన మో కోడిపుంజును ఇవ్వాలి" అన్నాడు. "మరచిపోవద్దు సుమా! ఈ కానుక చెల్లించేట్లు చూడు."

"అలాగే చేస్తాను" అన్నాడు క్రిటో "ఇంకేమీ మరచిపోలేదు గదా!" అని అడిగాడు.

సోక్రటీస్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

కొంతసేపైన తర్వాత, కదలిక అగుపించింది.

జైలు మనిషి ముసుగు తొలగించి చూచాడు.

సోక్రటీస్ కళ్ళు స్థిరంగా ఉన్నాయి.

క్రిటో ఇది చూచి అతని నోరు, కళ్ళు మూసివేశాడు.

ధైర్యశీలుడు, జ్ఞాని, నిజాయితీపరుడు సోక్రటీస్ అస్తమించాడు.

**- సమాప్తం -**

# ప్లేటో

**'ప్లేటో** (Plato) క్రీ. పూ. 427లో జన్మించాడు. అప్పటికి ఆ దేశం యుద్ధ వాతావరణంలో కూరుకుపోయి మూడు సంవత్సరాలు అయింది. అంతకు ముందు సంవత్సరమే పెరిక్లిస్ (Pericles) మరణించాడు.

ప్లేటో తండ్రి అరిస్టాన్ (Ariston). ప్లేటో బాల్యంలోనే ఈయన మరణించడం జరిగింది. తల్లి పేరు పెరిక్షన్ (Periction). తల్లిదండ్రులు ఇద్దరూ ఉన్నత వంశీయులే. వీరిద్దరికీ అడెమంటస్ (Adeimanuts), గ్లాకన్ (Glaucon) అని మరి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఇద్దరూ ప్లేటో కంటే పెద్దవాళ్ళే. భర్త చనిపోయిన కొద్దికాలానికే ప్లేటో తల్లి దేశ, కుటుంబ ఆచారాలను అనుసరించి పునర్వివాహం చేసుకుంది. ఈ భర్త పేరు పిరిలాంపస్ (Pyrilampes).ఈయన పెరిక్లిస్‌కు స్నేహితుడు, అనుయాయి దూను, వంశంలో మంచి పేరు, ప్రతిష్ఠలు ఉన్నవాడు.

ప్లేటో మంచి వంశం నుంచి వచ్చాడు. రాజకీయ సంబంధ బాంధవ్యాలు మిక్కుటంగా ఉన్న కుటుంబం. సవతి తండ్రి ద్వారా ఏథెన్స్‌కు ప్రజాస్వామ్యం తెచ్చి ఇచ్చి చరిత్రలో ప్రసిద్ధుడుగా కీర్తి సంపాదించిన పెరిక్లిస్‌తో అతనికి భావ సంపర్కం ఉన్నది. ముప్ఫయి సంవత్సరాలు ఏథెన్స్ రాజకీయాలలో ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన, పెరిక్లిస్‌కు 'ప్రజాస్వామ్య విలువలను ప్రవేశపెట్టినాడు' – అనే పేరు వచ్చింది. ప్లేటో తల్లివైపు బంధువులైన ఛార్మిడెస్ (Charmides), క్రిటియస్ (Critias) ఆ శతాబ్దంలో రాజకీయ చరిత్రలో గణతికెక్కారు.

ప్లేటో బాల్యాన్ని గురించి, తెలుసుకోవటానికి చరిత్రలో అంతగా ఆధారాలు కనిపించవు. అందరు గ్రీకు పిల్లల మోస్తరుగానే ఆయన మామూలు చదువులు నేర్చుకుని ఉంటాడు. అప్పటి విద్యా విధానం; చదవడం – వ్రాయడం – కవిత్వం అర్థం చేసుకోవడం, సమకాలిక చారిత్రక వాతావరణం అతనిపైన మంచి ప్రభావం చూపి ఉండాలి. ఆయన పుట్టటానికి ముందే ప్రారంభం అయిన యుద్ధం (Peloponnesian war), ఆయనకు ఇరవై మూడు సంవత్సరాల వయసు

వచ్చేంతవరకు కొనసాగుతూనే ఉండింది. ఈ యుద్ధంలో కట్టకడపటకు ఏథెన్స్ ఓడిపోయింది; ఈ పరాజయం దేశ స్థితిగతులను సమూలంగా మార్చివేసింది. పెరిక్లిస్ క్రీ.పూ. 425లో చనిపోవడంతో, క్లియన్ (Cleon), హైపర్‌బొలస్ (Hyperbolus) పెత్తనానికి వచ్చారు. వీళ్ళు ఇద్దరూ తక్కువ తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళు. క్లియన్ తోలుపని చేసేవాడు అయితే, హైపర్‌బోలస్ లాంతర్లు తయారుచేసే పనివాడు. పెరిక్లిస్ లాగానే వీళ్ళిద్దరూనూ బహుజనామోదం పొందడంలో విశ్వాసం ఉన్నవాళ్ళే అయినా, జనాన్ని నడిపించగల నేర్పరితనం, చాకచక్యం కలవాళ్ళు కాదు. జనాన్ని వేడుకలలో ముంచి ఎలాగో వారి ఆమోదాన్ని పొందుతూ ఉండటానికి ప్రయత్నించారు. స్వయం నిర్ణయం చేయగల స్తోమతు ఇద్దరికీ లేదు. వీళ్ళ నాయకత్వం లోనే ఏథెన్స్ యుద్ధంలో పరాజయం పొందడం జరిగింది. క్రీ.పూ. 404లో ఈ పని జరిగింది. రాజరికం పద్ధతి మారింది. ముప్పైమందితో కూడిన ఒక సమాఖ్య (Commission) ఏర్పడింది. వీళ్ళు క్రొత్త రాజ్యాంగం ఏర్పరచవలసి ఉంది. అయితే అధికారం తమ చేతిలోనే ఉంచుకొని పాతపగలు తీర్చుకోవడంలో మునిగిపోయారు. వాళ్లు చేసిన కొద్దిపాటి మంచిపనులు కూడా కిరాతక చర్యల ప్రాభవ ప్రాబల్యాల వల్ల పైకి రాకుండా పోయినాయి. ఎనిమిది నెలల పాలన అనంతరం ముప్ఫయి మందినీ ప్రజలు తరిమికొట్టారు; చంపివేశారు. తిరిగి ప్రజాస్వామ్యం నెలకొల్పారు. పాలన చక్కగానే కొనసాగుతూ వచ్చిందిగాని 399లో సోక్రటీస్‌కు విషం ఇచ్చి చంపాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రభుత్వం చేసిన క్షమించరాని నేరాలలో అది ప్రధానమైంది అంటాడు ప్లేటో. అతను 23–28 సంవత్సరాల మధ్య పడిన వేదన రగడలను వర్ణిస్తూ – వృద్ధాప్యంలో వ్రాసిన ఒక పుస్తకంలో ప్లేటో ఈ విషయం స్పష్టపరిచాడు; “ఆ రోజులలో యువత అంతా ఎంతో ఆశాపూరిత వాతావరణంలో పరుగులు తీస్తూ ఉండేది. నేను రాజకీయాలలో ప్రవేశిద్దామనుకున్నాను. రాజకీయ వాతావరణం కూడా ఇందుకు అనుకూలంగానే ఉండింది. అప్పటి రాజ్యాంగ చట్టాన్ని కాలదన్ని ముప్ఫయి మంది కొత్తవాళ్ళకు అధికారం హస్తగతం అయింది. ఈ ముప్పై మందిలో కొందరు నాకు స్నేహితులు, బంధువులు కూడా ఉన్నారు. వాళ్ళ ఆహ్వానం నాకు ఆహ్లాదదాయకంగా ఉంది. వాళ్ళు దేశాన్ని సుసంస్కరణలతో చక్కగా తీర్చిదిద్దుతారని ఆశించాను నేను కూడా. కాని అంతకు ముందు ఉన్న రాక్షసపాలనే ‘సువర్ణయుగం’ అనిపించేట్లుగా ప్రవర్తించసాగారు ఈ ముప్ఫయి మందీ. సోక్రటీసును ఒక పౌరుడిని అరెస్టు చేసి తీసుకు రావలసిన బృందంలో పంపాలని ప్రయత్నం చేశారు. సోక్రటీసు

నిరాకరించాడు. ఈ కార్యంలో తాను పాలుపంచుకోననీ, ఫలితం ఎంత దారుణంగా ఉన్నా ధైర్యంగా ఎదుర్కొంటాననీ నిబ్బరంగా నిలబడ్డాడు. ఈ తతంగం అంతా చూస్తూ ఉండిన నేను ముప్ఫయి మంది చర్యలతో విసుగెత్తిపోయి ఆ రాజరికపు మత్తుకు దాసోహం చేయబోవడమనే దుస్థితి నుంచి బయటపడిపోయాను... త్వరలోనే ముప్ఫయి మందినీ తరిమివేయగలిగాం. మళ్ళా కొత్త రాజ్యాంగం ప్రారంభం అయ్యింది. ఆ రోజులలో తిరిగి రాజకీయ రంగప్రవేశం చేయవలెనని నాకు కుతూహలం కలిగింది. దుష్కృత్యాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా కలిమి, ఓర్పు, పగ తీర్చుకోవడం పట్ల అనాసక్తత కనబరుస్తూనే వచ్చారు కొత్తవాళ్ళు. అయితేనేం ? నా నిరంతర స్నేహితులు సోక్రటీస్‌పై ఏదో అభియోగం తీసుకువచ్చి అతనికి విషం ఇచ్చారు. అభియోగం ఎంత మాత్రం యదార్థం కాదు. అయితేనేం, ఆ రాజరికం తమ పట్టు నెరవేర్చుకోగలిగింది.

సోక్రటీస్‌ను కలుసుకునే సమయానికి ప్లేటో ఇంకా యువకుడు. ఆయనను కలుసుకోవడం ప్లేటో జీవితంలో సరికొత్త మలుపు.

సోక్రటీస్ భావపటిమ, ప్రఖ్యాతి ఉన్నవాడు. ఆయన ఏమీ వ్రాయలేదు. ప్లేటో – ఇంకా ఇతరులు, సోక్రటీస్ సంభాషణలను పుస్తకాలుగా తయారుచేశారు. సోక్రటీస్ ఎక్కువగా నైతిక విషయాలను గురించి ప్రశ్నలు వేస్తూ తిరుగుతూ ఉండేవాడు. గ్రీసు దేశంలో ఉన్న అత్యంత జ్ఞాని 'సోక్రటీస్' అని డెల్ఫి (Delphi) దేవత సాక్ష్యం చెప్పింది. అయినా సోక్రటీస్ ఈ విషయానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. 'నాకు ఏమీ తెలియదు; కాకపోతే తెలియదనే విషయం మటుకు క్షుణ్ణంగా తెలుసును' అనేవాడు. ఇతరులకూ, ఆయనకూ అదే వ్యత్యాసం. సక్రమ వర్తనం ఎలా ఉంటుంది– అన్న సంగతి క్షుణ్ణంగా తెలిసి, నైతిక వర్తనం ఇంత ఛండాలంగా ఉండదు, అని ఆయన తరచు చెప్పేవాడు. సక్రమమైనది ఏమిటో తెలుసుకోవడం కోసం స్వపరిశీలన, పరపరిశీలన చేయడంలో విసుగు విరామం ఎరుగడు ఆయన. ఇలాంటి సోక్రటీస్‌కు మరణశిక్ష విధించిన ప్రభుత్వంతో – రాజకీయాలతో ప్లేటో సుతరామూ రాజీ పడలేకపోయాడు. రాజకీయాలలో ప్రవేశించాలనే కుతూహలాన్ని చంపుకున్నాడు. నమ్మకస్తులైన స్నేహితులు, సమర్థించేవాళ్ళు కరువైపోతున్న రోజులలో పాలన చాల కష్టం అయిన పని అని గుర్తించగలిగాడు. 'పాలన తప్పుదారులలో నడుస్తోంది, సంస్కరించటానికి వేరే మార్గం లేదు. సామాజిక న్యాయం చేకూర్చాలంటే తత్త్వదర్శనాన్ని ఆశ్రయించడం

తప్ప ఇంకొకమార్గం అగుపించలేదు ప్లేటోకు. మానవాళి ఎన్నో చిక్కులలో చింతలలో తగులుకుపోయి ఉంది. ఈ దురవస్థ నుంచి విడుదల దొరకవలెనంటే, తత్త్వదర్శనం పొందిన మనిషే రాజరికానికి రావాలి. రాజకీయవేత్తలు ఏదో మంత్ర ప్రభావం వల్ల తాత్త్వికులు కావాలి. అదొక్కటే మార్గం' అంటాడు ప్లేటో.

సోక్రటీస్ చనిపోయిన పది సంవత్సరాల తర్వాత, ప్లేటో తాను రాజకీయ రంగంలో ప్రవేశించబోవడం లేదు- అనే నిర్ణయం తీసుకున్నాడు. ఈ పదేళ్లలోను ప్లేటో అనేక దేశాలు, పలు ప్రాంతాలు ప్రయాణం చేశాడు. సిరిన్ (Cyrene), ఈజిప్ట్ (Egypt), ఫొనీషియా (Phoenicia) ప్రాంతాలు తిరిగాడు. ఎక్కువ కాలం మటుకు ఏథెన్స్‌లోనే గడిపాడు. మూడు దండయాత్రలతో ఏథెన్స్ తరఫున సైన్యంలో పనిచేశాడు. సోక్రటీస్ తదితరులతో తన ప్రారంభ సంభాషణలను పుస్తకరూపంలో వ్రాశాడు.

క్రీ.పూ. 388-87లో ప్లేటో దక్షిణ ఇటలీ వెళ్ళాడు. అక్కడి పైతాగరియన్ తత్త్వవేత్తల ఆలోచనా ధోరణులు గమనించడమే ఈ యాత్ర ఉద్దేశ్యం. ఆర్ఫిక్-పైతాగొరియన్ 'మరణానంతర జీవిత గతులు' (Orphic-Pythagorean Thoughts on after Life), పైతాగరస్ గణిత శాస్త్రానికి ఇచ్చిన ప్రాధాన్యము - అతడిని ఎక్కువగా ప్రభావితం చేసినాయి. ఇటలీ నుండి సిసిలీ (Sicily) వెళ్ళాడు. అక్కడ హింస-క్రౌర్యం ప్రత్యక్షంగా చూడగలిగాడు. పాలకుడు డియోనిసియస్ (Dionysius) బావమరిది డియోన్ (Dion) ప్లేటో అభిప్రాయాలకు సానుభూతిపరుడుగా తయారయ్యాడు. ఇద్దరూ పాలకుడిని పరిష్కరించాలి, అతనిలో భావ పరిణామం వచ్చేట్లు చేయాలి అనుకున్నారు. కాని ఈ ప్రయత్నం కొనసాగలేదు. పాలకుడు ఇతడిని బానిసగా అమ్మివేశాడు. ఎవరో స్నేహితుడి పుణ్యమా అని ప్లేటో ఆ బానిసత్వం నుండి వెలికి రాగలిగాడు.

ఏథెన్స్‌కు క్రీ.పూ. 386లో తిరిగి చేరుకున్నాడు ప్లేటో.

అక్కడ 'ఎకాడమీ' స్థాపించాడు.

జీవితాంతం ఈ ఎకాడమీలోనే బోధనలు చేస్తూ, దర్శకత్వం వహిస్తూ గడిపాడు.

రాజనీతిజ్ఞులకు పాఠశాల ఈ ఎకాడమీ.

వర్తమాన రాజకీయ నాయకులుససేమిరా మారరు. ఈ కృత్రిమ రాజకీయాలకు 'ముక్తి' లేదు; ముందు తరాల వారినైనా వివేకవంతుల్ని చేయడం కోసం ఈ ఎకాడమీ కృషి చేస్తుంది – అన్నాడు ప్లేటో.

రాజనీతిజ్ఞుడు ముందుగా తత్త్వవేత్త అవాలి. తరువాతనే అతడు పాలకుడుగా రూపొందాలి. అప్పుడే దేశానికి, ప్రజలకు క్షేమం, సంక్షేమం అని హృదయపూర్వకంగా నమ్మాడు ప్లేటో.

'తత్త్వ–రాజనీతి శాస్త్రజ్ఞుల'కు పాఠశాల అతని ఎకాడమీ.

ఈ ఎకాడమీయే మొదటిది అనుకోవటానికి లేదు. ఎందుకంటే అంతకు ముందుగానే ఐసోక్రటస్ (Isocrates) అనే సోఫిస్ట్ సంప్రదాయవాది ఏథెన్స్ నగరంలో ఒక పాఠశాల ప్రారంభం చేశాడు. అయితే సోఫిస్టులతో అభిప్రాయభేదాలు ఉన్నవాడు గనుక ప్లేటో తన ఎకాడమీని సరికొత్త పద్ధతిలో చూపించి నడిపించగలిగాడు.

చదువులను గురించిన అతని అభిప్రాయాలు వేరు.

పునరుక్తులు లేకుండా అభిప్రాయాలు సూటిగా, సులభంగా అర్థమయ్యేట్లుగా చెప్పగలగడం ఆయన అలవరచుకున్నాడు.

సమాజం ఎలా నడవాలి ? అలా నడవటానికి పాలకులు చేయవలసిన పనులు ఏమిటి ? తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి ?

ప్లేటో ఎకాడమీని ప్రారంభించి నడిపిన ప్రారంభ సంవత్సరాలలోనే రిపబ్లిక్ (Republic) అనే పుస్తకం రచించి ప్రచురించాడు. ఖచ్చితంగా ఫలానా సంవత్సరంలో ఈ రచన జరిగిందని చెప్పటానికి వీలులేదు కాని, చాలామంది చారిత్రకులు దీనికి క్రీ.పూ. 380వ సంవత్సరం నిర్దేశించారు. ప్లేటో ఎకాడమీకి సమగ్ర రూపదర్శనమే ఈ పుస్తకం.

రాజరికానికి వచ్చేవాడు తప్పనిసరిగా తత్త్వదర్శనపరుడై ఉండాలని ప్లేటో కలలు కన్నాడు. ఆ కలలు యదార్థం అవుతాయని ఎదురు చూస్తూ నివసించాడు. డియొనిసియస్ మరణించిన తరువాత (క్రీ.పూ. 367) ప్లేటో మిత్రుడు డియొన్ కొత్తగా ముఖ్యమంత్రి అయ్యాడు. డియొనిసియస్ కుమారుడిని (Dionysus - II) తరిఫీదు యివ్వమని కోరుతూ ప్లేటోను తిరిగి 'సిసిలీ'కి ఆహ్వానించాడు డియొన్. ఈ

రాకుమారుడికి అప్పటికి ఇరవై ఎనిమిది సంవత్సరాల వయస్సు. ప్లేటో జంకుతూనే ఈ పనికి అంగీకరించి ప్రయాణం చేశాడు. అతని పర్యటన కార్యక్రమం సుగమంగా జరిగిందని అనలేము. ఒక సంవత్సరంపాటు అక్కడ ఉండి నిరాశతో తిరిగి వచ్చేశాడు ఏథెన్స్‌కు. అయితే వ్యక్తిగతంగా డియొనిసియస్‌కు, ప్లేటోకు కొంత సాన్నిహిత్యం ఏర్పడింది. అతను ప్లేటోని తిరిగి 361లో ఆహ్వానించాడు. ప్లేటో అతనికి, అతని మంత్రి డియొన్‌కు సయోధ్య కల్పించటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. డియొన్ అంతకంతకు క్రూరమైన పాలకుడుగానే తయారయ్యాడు. దాదాపు నియంతృత్వ ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. 354 సంవత్సరంలో ప్రజలు అతన్ని హత్య చేశారు. ప్లేటో అతన్ని మార్చటానికి ప్రయత్నం చేసి విఫలమైపోయినా, అతనిపట్ల సానుభూతి అనుకంప మటుకు కోల్పోలేదు. అతని హత్య ప్లేటోను కుంగదీసింది. 'సిసిలీ'కి చెడ్డరోజులు వచ్చినాయని భావించాడు అతను. డియొన్ వ్యక్తిగా మంచివాడే; సాహసము, ధైర్యము, చొరవ ఉన్నవాడే. కాని రాజకీయ ఆదర్శాలలో మటుకు ఓ విధమైన దుర్భావన ఉన్నవాడు. తన అభిప్రాయాలతో ఏకీభవించని వాళ్ళను హింసించటానికి, బాధలపాలు చేయటానికి, చివరకు చంపటానికీ జంకడు.

ఆసియామైనర్‌కు ఒక మూలగా అటర్నియస్ (Atarneus) అని ఒక దేశం ఉంది. హెర్మియస్ (Hermias) అనే ఆయన ఈ రాజ్యాన్ని స్థాపించాడు. హెర్మియస్ ఏథెన్స్ వచ్చిన తరుణంలో ఎకాడమీని గురించి అక్కడి కార్యకలాపాలు, బోధనా పద్ధతుల గురించి విన్నాడు. ఈ సమాచారం అతనికి ఆమోదయోగ్యం అనిపించింది. ఈ ఎకాడమీకి చెందిన ఇరాటస్ (Erastus), కొరిసస్ (Coriscus) అనేవాళ్ళు ఇద్దరు తిరిగి హెర్మియస్ రాజ్యంలో తమ స్వస్థానం సెపెస్ (Scepsis) కు వెళ్ళినప్పుడు, ఆయన వారిని పిలిపించుకు మాట్లాడాడు. వారిని తన పాలనకు సలహాదారులుగా నియమించుకున్నాడు. ఎకాడమీ యొక్క ఉద్దేశ్యం కేవలం పాలకులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, రాజనీతిజ్ఞులు పదవీ పాలనంలో ఉన్నప్పుడు వారికి అండదండలుగా ఉండి సలహాలు, సంప్రదింపులు అందించడం కూడా – అని ప్లేటో విశ్వాసం. హెర్మియస్ ప్రథమంలో క్రూరుడుగా ఉన్నా, సలహాదారుల ప్రయత్నాలవల్ల సౌమ్యుడుగా సంక్షేమపాలకుడుగా తయారైనాడని చరిత్ర చెబుతోంది. ఈ సలహాదారులకు కానుకగా హెర్మియస్ అసాస్ (Assos) అనే ప్రాంతాన్ని బహూకరించాడు కూడా. ప్లేటో మరణానంతరం, ఈ ప్రదేశంలోనే అరిస్టాటిల్ ఆ ఇద్దరు శిష్యులను – ఇరాటస్,

కొరిసస్ – కలుసుకున్నాడు. అరిస్టోటిల్ కూడా అలగ్జాండర్ ది గ్రేట్ (Alexander the great) కు బోధకుడుగా ఉన్నప్పుడు, ప్లేటో తాలూకు ఆదర్శాలనే అమలుకు తీసుకు వచ్చాడు.

ఇదంతా ప్లేటో జీవితం చరమాంకంలో – చివరి పది సంవత్సరాలలో – జరిగిన సమాచారం.

రాజరికం ఒక్క మనిషి చేతిలోనే ఉండకూడదనీ, క్రౌర్యము – హింసలకు రాజరికంలో తావు లేదనీ ప్లేటో దృఢ విశ్వాసం. తనకు శక్తి ఉన్నంతవరకు పరిస్థితులను చక్కదిద్దటానికి ప్రయత్నించాడు.

క్రీ.పూ. 347లో ప్లేటో వృద్ధాప్యం పూర్తి అయింది. ఎనభై సంవత్సరాల వయసులో అస్తమించాడు. చివరి రోజులలో న్యాయ చట్టాలు (Laws) అనే పుస్తకం కూడా తయారు చేశాడు. అయితే Republic లో ఉన్నంత విస్తృత సమాచారం, స్ఫూర్తి ఈ గ్రంథానికి పొసగలేదని విమర్శకుల అభిప్రాయం.

# రచనలు

**చ**క్రవర్తి టిబెరియస్ (Tiberius) కాలంలో వ్యాకరణవేత్త త్రిసిలస్ (Thrasylus) అనే ఆయన ప్లేటో రచనలు ఏవి, ఏవి అని ఎంచడం ప్రారంభం చేశాడు. వీటిలో Apolugy of Socrates అన్న దానిని ప్రధానంగా తీసుకున్నాడు. తరువాత, Epistces అనేది. ప్లేటో తన శిష్యులకు, స్నేహితులకు వ్రాసిన ఉత్తరాల సంపుటం ఇది. తత్త్వ విషయాల మీద ముప్ఫయి నాలుగు సంభాషణలు, తరువాత ఉటంకించాడు. చరిత్రకారులు కొందరు ఎపిజిల్స్‌లో కొన్ని, సంభాషణలు కొన్ని ప్లేటోవి కాదు అంటారు. వస్తుగతంగా, విషయ వివరణలను పురస్కరించుకుని ఇలాంటి వివాదాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి.

ప్లేటో సంవాద పద్ధతిని అనుసరించటానికి ముఖ్య కారణం, అది సోక్రటీస్‌కు అతి ఇష్టమైన ప్రక్రియ కావడమే. ప్రశ్నలు వేసి ఇతరుల నుంచి విషయాలను, ఆలోచనలను, గుప్త–నిక్షిప్త – భావ పరంపరలను వెలుపలకు తీసుకురావడం సోక్రటీస్ అవలంభించిన పద్ధతి. ఒక విషయం మీద ఉపన్యాస ధోరణిలోనో, వ్యాస పద్ధతిలోనో చెప్పుకుపోవడం కంటె, సంభాషణల శైలి అమిత ఆకర్షకంగా, సహజంగా ఉంటుందని ప్లేటో భావించాడు. సోక్రటీస్ ఈ విషయాన్ని పదే పదే ఆచరించి చూపించడమే ప్లేటోకు ఈ ప్రక్రియ పట్ల ఇష్టం ఏర్పడటానికి కారణం అయి ఉండాలి. కొన్ని వ్యాసాలు వ్రాసిన వాటిలోనూ మధ్య మధ్య సంభాషణల పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సంవాద పద్ధతులలో అనేక సాహితీ ప్రక్రియలను కూడా చొప్పించాడు. సజీవంగా, నాటకీయంగా ఉండడంతోపాటు, చక్కగా చదివించుకు పోవడమే కాకుండా విషయాలు విశదీకరించడానికి ఎక్కువ ఆస్కారం ఉండడం– ఈ ప్రక్రియలో కనిపిస్తుంది.

సృష్టి నిర్మాణం – మనుగడ – సాంఘిక వ్యవస్థ – ముందు ముందు ఏమి జరగటానికి అవకాశం ఉన్నది – ఇలాంటి తాత్త్విక విషయాలను సైతం సంభాషణలు, సంవాదాల పద్ధతిలో వ్రాసుకు వెళ్ళి ప్లేటో కొత్తదనాన్ని తీసుకువచ్చాడు. తన

ఆలోచనలకు, చెపుతూ ఉన్న వస్తువుకు సముచితమైన శైలిని అనుసరించడం అనేది ప్లేటో రచనలలో బాహాటంగా చూస్తాము.

ప్లేటో యొక్క ఆలోచనా సరళి వికసించడంలో 'అయిదు' స్థితులు ఉన్నాయని చెబుతారు.

1. సోక్రటీస్ సంవాద పద్ధతి.
2. విద్యా పద్ధతులను గురించిన సంభాషణలు.
3. భావన, ఆదర్శాలను గురించిన ప్రాథమిక అభిప్రాయాలు.
4. భావన, ఆదర్శాలను గురించిన తరువాతి పరిష్కార అభిప్రాయాలు.
5. The Laws (న్యాయ చట్టాలను, సూత్రాలను గురించిన అభిప్రాయాలు).

జ్ఞానాన్ని జ్ఞానం కోసమే సేకరించడం, సముపార్జన చేయడం ఉపాసించడం అనే సిద్ధాంతం అయిదవ శతాబ్దంలో ఆచారంలో ఉంది. అయితే తత్త్వ దర్శనాలను అనుసరించే అప్పటి వ్యక్తులను మూడు ప్రశ్నలు వేధిస్తూ ఉండేవి :

1. అసలు ఈ ఉనికి అంతమేమిటి ? అస్థిత్వాన్ని గురించిన మూల విషయాలు ఏమిటి ?
2. జ్ఞానం అంటే ఏమిటి ?
3. జ్ఞానానికి, ఈ విశ్వానికి ఉన్న ఆంతరిక సంబంధం ఏమిటి ?

విశ్వ రూప నిర్మాణాలను గురించిన ఆలోచనలు కొందరిని సంతృప్తి పరిచేవి, కొందరికి ఇవే సమగ్రమైనవిగా అనిపించేవి కాదు.

క్రమానుగతమైన పద్ధతిలో ప్లేటో తన బృహత్‌రచనలు The Republic, The Laws లలో ఈ విషయాలన్నీ సమగ్రంగా పరిశీలించి వదిలాడు.

# ఆదర్శం - యదార్థం

**ప్లేటో** అభిప్రాయం ప్రకారం పాలకుడు అయిన రాజు తత్త్వవేత్త అయి ఉండడం శ్రేయస్కరం, విధాయకమూను. తన 'ఆదర్శ రాజ్యం' నిజంగా అవతరించాలంటే తత్త్వవేత్తయే పరిపాలకుడుగా ఉండడం తప్పనిసరి అని ఆయన చెప్పాడు.

'మానవాళి ప్రస్తుతం ఉన్న స్థితిలో ఎన్నో అసందర్భాలు, అసమగ్రతలు చూస్తున్నాం. రాజకీయ నిపుణత, అధికారము, తాత్త్విక దృష్టి – ఇవి ఒకే చేతిమీదుగా వచ్చినపుడు ఆ దేశ సౌభాగ్యం ఎంతైనా ఆనందదాయకంగా ఉంటుంది. ఈ మాట వినడానికి ఒక దానికి ఒకటి పొంతన లేనిదిగా కనిపించవచ్చును. కాని సుఖ జీవనానికి, జాతి పదునుగా ముందుకు నడవడానికి ఇంతకంటే మరో మార్గం లేదు' అంటాడు ఆయన.

'తత్త్వవేత్త' అనే మాటకు అనేక భాషలలో మాదిరిగానే గ్రీక్ భాషలోనూ, ఎన్నో అర్థాలు ఉన్నాయి. అందుచేత ప్లేటో ఆ మాటను 'నిర్వచించి' చెప్పడానికి ముందుగా ప్రయత్నం చేస్తాడు. తన దృష్టిలో తత్త్వవేత్త అంటే ఎలాంటివాడు, ఏ ఏ లక్షణాలు పుణికి పుచ్చుకున్న మనిషిని మటుకే తత్త్వవేత్త అనవచ్చును – అనేది స్పష్టం చేయటానికి ప్రయత్నిస్తాడు. సత్యం (Truth) అంటే మక్కువ, ఆదరం ఉన్నవాడు తత్త్వవేత్త. దీనిని వివరించటానికి ప్లేటో తన అభిప్రాయాలన్నీ ఏకరువు పెట్టవలసి వచ్చింది. అతని దృష్టిలో రెండు రకాల సత్యాలు ఉన్నాయి. దైనందిన జీవితంలో మన ఎదురుగా ఉన్న 'సత్యం' ఒకటి. అది కనిపిస్తూ ఉన్నది, మారుతూ ఉన్నది. ఇది కాకుండా ఎలాంటి మార్పులు, చేర్పులకు లోనుకాకుండా ఉండే, 'శాశ్వతమైన సత్య ప్రపంచం మరొకటి ఉన్నది. ఇది ప్లేటో చెప్పిన 'రూపాలకు' (Forms), అభిప్రాయాలకు, ఆదర్శాలకు చెందినది. దీనిని తెలుసుకోవటానికి అర్థం చేసుకోవటానికి మామూలు ఇంద్రియ పరిజ్ఞానం చాలదు. కేవలం మానసిక స్థాయిలోనే దీనిని తెలుసుకోవడం సాధ్యం. మూలకందమైన ఆదర్శాల శాశ్వత ప్రపంచానికి ఒక రకంగా 'ప్రతిబింబం' లాంటిది ఈ రెండవ ప్రపంచం. ఈ ప్రతిబింబం కూడా యథాతథమైనది అనుకోవటానికి వీలులేదు. బింబరూపంలో కొన్ని వంకరలు, వక్రతలు

ఉండటానికి అవకాశం ఉన్నది. మొదటి ప్రపంచం ప్లేటో మాటల ప్రకారం 'అభిప్రాయాలకు, విశ్వాసాలకు' చెందినది. దీనిని తెలుసుకోవటం ఎప్పటికీ సాధ్యం కాదు. అసలైన రూపాలతో నిండిన ప్రపంచం 'మంచితనం' సుందరత వంటి లక్షణాలతో విలసిల్లుతూ ఉంటుంది. ఈ రూపాలే నిజమైన జ్ఞాన ప్రతీకలు, ఇవే ప్రకృతి సూత్రాలు, న్యాయాలకు మూల రూపాలు కూడా. 'సూత్రం' అన్నది కనిపించని, అంతర్గత ఆధారం. ఎన్నో వస్తువులను ఆంతరికంగా కలిపి కట్టి ఉండేది. ఈ సూత్రానికి ఎన్నటికీ విరూపం లేదు. మార్పుకు లోను అయేది కాదు ఇది. మన మనస్సులు, వ్యవహార ధోరణులతో వీటికి సంపర్కం లేదు. వస్తువులను ఆశ్రయించుకు ఉన్న 'మూల తత్త్వం' ఒకటి ఉన్నది. అదే యదార్థమైనది అని ప్లేటో ప్రతిపాదిస్తాడు.

ఇంద్రియాలకు గోచరం లేని 'మరో ప్రపంచం' ఉంది.

ఇంద్రియాలకు తెలిసిన ఈ ప్రపంచం కంటే అది మరింత యదార్థమైనది. ఈ ప్రపంచానికి మూలం అదే.

అభిప్రాయాలు, రూపాలు, ఆదర్శాలు – ఇవి ప్రాతిపదికగా ఉన్న ప్రపంచమే నిజమైనది. వాటిని గురించి ఏదో 'తన్మయ' భావంతో తప్ప ఇతరత్రా తెలుసుకోలేము. వస్తువులను ఇంద్రియాల సహాయంతో 'నిజం'గా చూస్తున్న రీతిగానే, మరేదో 'చాకచక్యం' వల్ల ఆ రూపాలను చూడగలగడం సాధ్యం కావచ్చును. ఆ రూపాలు, ఆలోచనలు ఎక్కడో "స్వర్గంలో" ఉన్నాయి అనుకోవచ్చును. మనిషి క్రమంగా ఇటువంటి పరిణామం పొందుతాడు అనటానికి తార్కికమైన ఆధారం ఉన్నది.

తత్త్వవేత్తకు సత్యం అంటే మక్కువ, ప్రీతి.

ఇంద్రియాలకు మాత్రమే పరిమితమైన మారుతూ ఉండే ప్రపంచంతో అతనికి అంతగా సంవిధానం లేదు. జ్ఞాన ప్రతిపాదకమైన ఆ 'మారని ప్రపంచం' అంటేనే అతనికి ఇష్టం.

మంచి పరిపాలకుడికి ఎటువంటి లక్షణాలు, గుణ గణాలు ఎలా ఉండాలో అవన్నీ తత్త్వవేత్తకు తప్పనిసరిగా ఉండాలి.

శాశ్వత విలువల పైన మాత్రమే దృష్టి ఉన్న తత్త్వవేత్తలు పరిపాలకులు అయినట్లయితే, వాళ్ళు మారుతూ ఉన్న ప్రపంచాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా కాపాడుకుంటూ వస్తారు.

అతనికి 'సత్య సంధత' ఉండాలి. అసత్యాన్ని సమర్థించడం, వెనకవేసుకు రావడం కుదరదు అతనికి. సత్యాన్ని కావాలనుకున్నవాడు, అసత్యాన్ని దగ్గరకు చేరనీయడు కదా, ఒక లక్ష్యం వైపు తీవ్ర దృష్టితో పని చేసిన మనిషి మరో లక్ష్యం వైపు అడుగు వేయలేడు. అతనికి 'ఆత్మ నిగ్రహం' అలవడి ఉంటుంది. డబ్బుపట్ల ఆపేక్ష, దురాశ వంటి లక్షణాలు అతనికి ఉండవు.

మానసికంగా 'కొద్ది' తనం, 'నీచత్వం' అనే లక్షణాలు కూడా అతనికి లేవు. 'అల్పబుద్ధి' వాడు కాదు అతను. ప్రతిదానికీ సమగ్రంగా సమున్నతంగా చూడగల మనిషి, మానవ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూడగలడు. మృత్యువు అంటే భయం ఉండదు. అల్పత్వం, పిరికితనం అనే లక్షణాలు తత్త్వవేత్తను బాధించవు.

అతనికి మంచి 'స్మృతి' ఉంటుంది. బహుతేలికగా 'మరచి పోవడం' అన్న లక్షణం ఉన్న మనిషిని మనం మంచివాడుగా పరిగణించలేము. తగినంత సూక్ష్మత, ఉచితానుచిత పరిజ్ఞానం, సౌకుమార్యం అతనికి ఉంటాయి. హుందాతనం అనుకోవచ్చును దీనిని. ఇలా క్రమంగా... ఒక మంచి గుణం నుంచి దానికి ఆలవాలం, ఆలంబన అయిన ఇతర మంచి గుణాలను కేటాయించి చెబుతాడు ప్లేటో.

మంచి జ్ఞాపకశక్తి, ప్రతీదీ తెలుసుకోవాలన్న హృదయ లాలిత్యం, దూర దృష్టి, చురుకైన మానసిక ప్రవృత్తి. సత్యానికి – న్యాయానికి – ధర్మానికి – క్రమశిక్షణకు స్నేహశీలత... ఇలా వివరిస్తాడు.

వీటన్నిటినీ సేకరించుకుందుకు అవసరం అయిన చదువు, పరిపూర్ణత ఉండాలి. ఇలాంటివాళ్ళకే రాచరికం కట్టబెట్టటానికి వీలవుతుంది.

సాధారణంగా తత్త్వవేత్తలంటే సమాజానికి అంత మంచి అభిప్రాయం లేదు. వాళ్ళు సమాజానికి ఉపయోగపడే మనుషులు కాదనే భావం కూడా ఉంది. ప్లేటో అభిప్రాయం ప్రకారం, ఈ రకమైన ఆలోచన అసంబద్ధమైనది. తత్త్వవేత్త సమాజానికి చాలా అవసరం. సమాజం అతన్ని ఉపయోగించుకు తీరాలి.... అతను ఉపయోగ పడడం లేదూ, అంటే అది సమాజం తప్పు కాని తత్త్వవేత్త దోషం కాదు. మంచి మాటలు చెబుతూ, కృత్రిమంగా ప్రవర్తించే వాళ్ళను సమాజం ఆదరిస్తున్నట్లు కనిపిస్తుంది. మంచి మాటలు చెప్పడమే కాకుండా, ఆచరణలోనూ అదే వైఖరి అవలంభించగలవాళ్ళు మాత్రమే సమాజానికి కావాలి.

సత్యసంధత ఉన్న మనిషి తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ఇరకాటాలు, ఇబ్బందులు వచ్చినా ఈ లక్షణాన్ని వదులుకోవటానికి అంగీకరించడు. అతడు జనం ఏమనుకుంటున్నారు అన్న విషయం గురించి పట్టించుకోకుండా, 'సత్యసంధత' లక్షణం గీటురాయికి వచ్చే పద్ధతిలోనే తన ప్రవర్తన కొనసాగిస్తాడు. అందుచేతనే సామాన్యమైన మనుషులకు నిరుపయోగిగా, వ్యర్థుడుగా కనిపిస్తాడు. అతడు హృదయ వికాసం వైపు దృష్టి ఉంచుతాడు తప్ప జనాన్ని మెప్పించేందుకు పని చేయాలి అని చూడడు. సత్యసంధత కాని దానిని అతడు నిరాకరిస్తాడు, దూరంగా నెట్టివేస్తాడు. సత్యం పాలనలో ఉన్నప్పుడు మంచితనం, క్రమశిక్షణ, సత్శీలత వాటంతటవే అక్కడ చోటు చేసుకుంటాయి.

తత్త్వవేత్తకు కావలసిన లక్షణాలన్నీ ఒక మనిషిలోనే ఒనగూడడం మనం తరచుగా చూడ్డం, ఉదాత్తమైన ఈ లక్షణాల నడుమ అప్పుడప్పుడు వాటిని 'నీరస' పరిచే కొన్ని పరిమితులు కూడా ప్రవేశిస్తాయి.

'సజీవ పదార్థం ఏదైనా చక్కగా ఎదగవలెనంటే, చక్కని ప్రగతి సాధించవలెనంటే అందుకు తగిన వాతావరణం ప్రవర్తిల్లుతూ ఉండాలని అందరూ ఒప్పుకుంటారు. మనుషులైనా, దేశం అయినా సజీవమైనవే కదా. ఉదాత్తమైన లక్షణం కూడా – చెడ్డదారులలో పుట్టి పెరిగినప్పుడు – అంతగా విస్తరించలేదు. అందుచేత పాలకుడు అవవలసిన తత్త్వవేత్త చక్కగా చదువుకోవాలి. సుశిక్షితుడు కావాలి; ఈ పని అనానుకూలమైన వాతావరణంలో జరిగిందంటే ఆ తత్త్వవేత్త ప్రజాకంటకుడుగా తయారైనా ఆశ్చర్యం లేదు. మిడిమిడి జ్ఞానం మటుకే ఉన్న మనుషులు చెప్పే మాటలు విని, జనం పెడత్రోవల వెంట పోవడం మనం చూస్తూనే ఉన్నాం – అందుచేత పాలకులకు తగిన శిక్షణ ఇవ్వటానికి కొన్ని కేంద్రాలు ఉండాలి అంటాడు ప్లేటో.

మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్ళు మామూలు ప్రజలు ఏ ఏ అభిప్రాయాలను మెచ్చుకుంటారో వాటినే పదే పదే చెప్పి అందరి మన్ననలూ పొందాలని చూస్తారు. ఈ వాతావరణంలో కలిసిపోయిన తత్త్వవేత్త నుండి మనం మంచి పాలన ఆశించలేం. తత్త్వవేత్తను మామూలు మనుషులు తమ ప్రత్యేక ప్రయోజనాల కోసం వాడుకుందామని కూడా చూస్తారు. కనుక, తత్త్వశాస్త్రాన్ని దాని అసలైన విలువల కోసరమే వాడుకునే లక్షణం కూడా జనంలో పెరగవలసి ఉంటుంది. తలకుమాసినవాళ్ళు, మోస ప్రవృత్తులలో జీవనం సాగించే యుక్తులు నేర్చుకున్నవాళ్ళు తత్త్వశాస్త్రం వైపు రాకుండా

చూడవలసిన అవసరం కూడా ఉందంటాడు ప్లేటో. తత్త్వ శాస్త్రానికి ఎంత కాని రోజుల వచ్చినా, ఇంకా దానివల్ల గౌరవం, మర్యాద ఉన్నాయి. దీనిని పరిరక్షించుకోవలసిన అవసరం ఉంది.

తత్త్వవేత్త అయిన పాలకుడు దొరకడం కష్టం అని చాలామంది అంటారు. అయినా ఇలాంటి పాలకులను తయారుచేయడం 'అసాధ్యం కాదు' అంటాడు ప్లేటో, తత్త్వవేత్త రాజకీయ అధికారానికి రావచ్చును. లేదా పాలకుడుగా ఉన్న వ్యక్తి తత్త్వశాస్త్రం వైపు మొగ్గు చూపవచ్చును. తత్త్వవేత్త పాలకుడుగా శిక్షణ పొందాలి. ఇందుకు తగిన మార్పులను ప్రస్తుత సమాజంలో తీసుకురావాలి. ప్లేటో ఇందుకు అవిరళమైన కృషి చేశాడు.

పసిపిల్లలు, కుర్రవాళ్ళు, యువకులు – తమ వయసుకు తగిన 'తాత్త్వికత'ను సంతరించుకునేట్లు చేయాలి. వాళ్ళ వయసును, శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన శిక్షణ యివ్వాలి. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళు అయి, మనసు చక్కగా వికసించినప్పుడు మరింత సూక్ష్మమైన శిక్షణ ఇవ్వవచ్చును. నిజమైన తత్త్వవేత్త తన దృష్టిని ఎప్పుడూ శాశ్వతమైన విలువల వైపే సారించి ఉంచుతాడని అనుకున్నాం గదా.

ప్లేటో ఇలాంటి పాలకుడికి ఇవ్వవలసిన శిక్షణ ఎలా ఉండాలి అన్న సంగతి కూడా సమగ్రంగా చర్చించాడు.

తత్త్వవేత్తకు నిజమైన విలువలు తెలిసి ఉండాలి – అన్న వాక్యంతో ప్రారంభం చేస్తాడు ప్లేటో. ఈ విలువలు కల్తీ లేని, నికార్సయినవి.

సూర్యుడు బాహ్య ప్రపంచానికి మూలం. ఇంద్రియ గోచరమైన ప్రపంచానికి ఆయన పెరుగుదలను, కాంతిని ఇస్తున్నాడు. ఈ కాంతి, తేజస్సుల వల్లనే మనం ఇంద్రియాల సహాయంతో వస్తువులను పరికించి తెలుసుకోగలుగుతున్నాం అనేక సంగతులు. 'దృశ్యశక్తి' ఇలా ప్రవర్తిస్తోంది.

అలాగే 'జ్ఞాన వికాసం' కూడా ఏర్పడుతుంది అంటాడు ప్లేటో; దృష్టిని అనుచరమైన – అజ్ఞాతమైన విలువలవైపు సారించినట్లైతే 'మంచితనం' అన్నిటికీ మిన్న అయినది. అదే సత్యానికి మూలరూపం. వస్తువుల సూక్ష్మతను మనస్సు గ్రహించటానికి అవసరం అయిన చాకచక్యాన్ని అదే మనకు ప్రసాదిస్తోంది. మానసికంగా 'తెలివిడి' పొందటానికి ఇదే మనకు మార్గము ప్రబోధం అవుతోంది.

జ్ఞానానికి, మన నమ్మకాలకు నడుమ గీత గీసి చూపుతాడు ప్లేటో. నిత్య నైమిత్తకమైన సత్యం. శాశ్వతమైన సత్యం ఈ గీతకు రెండు ప్రక్కల ఉంటాయి. జ్ఞానానికి సూత్ర ప్రాయమైనవి వివేకము, ఆలోచన, తర్కము – ఇవి 'రూప' ప్రపంచాన్ని భావ ప్రతీకలకు మటుకే నిలయమైన ప్రపంచాన్ని చూపుతాయి. వీటికి దిగువ మెట్టున ఉన్నవి వస్తుగతమైన విషయాలు. వాటి తాలూకు నీడలు– జాడలు, మన అభిప్రాయాలు వస్తుగతమైనవనుకుంటే వాటి నీడలు మన భ్రమలు. ఇవి ఇంద్రియ జనితమైన దృష్టికి కనిపించేవి.

విషయాలను తెలుసుకునే ప్రయత్నంలో మనసు కొన్ని ఊహాలను, ప్రామాణికతలను ఆశ్రయించవలసి వస్తుంది. వాటి నుంచి 'అసలు' విషయాలకు తిన్నగా – ఎగబ్రాకటానికి మటుకు వీలు లేదు.

విశ్వవ్యాప్తమైన, స్వయం సమృద్ధమైన ఒక తత్త్వం (Principle) ఉన్నది. మనసు దేనిని ఊహించుకుంటుంది; అంచనా వేసుకుంటుంది. తరువాత మళ్ళీ కిందికి దిగి వస్తుంది.

మనస్సును ఈ పద్ధతిలో చూచినప్పుడు – నాలుగు అంతస్తులలో వర్తించడం సాధ్యమవుతోంది అనుకోవచ్చును.

వివేకము; తర్కము; అభిప్రాయము; అభ్యాస (Intelligence; Reason; Opinion Illusion) ఒకదాని కంటే ఒకటి అవగాహనలో ఉన్నతస్థాయికి చెందినది.

తత్త్వవేత్త తాలూకు గుహ (Philosopher's Cave) అన్న సాంకేతిక వర్ణన కూడా చేస్తాడు ప్లేటో. తత్త్వవేత్త తన మానసిక నిశితత్వం వల్ల వివేకస్థాయికి వెళ్ళి, తిరిగి మామూలు ప్రపంచంలోకి వచ్చేస్తాడు. తన తోటి వారిని – మామూలు ప్రజలను సేవించుకుంటూ కాలక్షేపము చేస్తాడు. అలా తిరిగి రావడంలో అతనికి ఉన్న విముఖతే అతను పాలకుడు అవటానికి ఉండే ప్రధాన అర్హత.

తత్త్వవేత్తలే ఇతరుల ఆలన, పాలన చూడటానికి అత్యంత అర్హులు. ఇందుకు తగిన శిక్షణను, యోగ్యతను వాళ్ళకు ఇస్తాము. దీని అవసరాన్ని వక్కాణించి చెబుతాము– అంటాడు ప్లేటో. తేనే తుట్టెలో రాజు ఈగలాగ పని చేయాలి. ప్రశాంతమైన రాజ్యపాలన కావాలంటే పాలనలో అనాసక్తత ఉన్న వాళ్ళే రాజులు కావాలి అని అనేక ఉపమానాలతో, తార్కిక వివరాలతో చెపుతాడు.

"శ్రమతో కూడిన పని గనుక, పాలనను వారు అంగీకరించకపోవచ్చును; మనం ఎన్ని వాదనలు చెప్పినా అన్నిటినీ తిరస్కరించి కూర్చోవచ్చును. అప్పుడు "ఏది దారి ?" అన్న ప్రశ్నకు కూడా ప్లేటో సమాధానం చెబుతాడు. "వాళ్ళు యదార్థాన్ని చూచి వచ్చినవాళ్ళు, తిరస్కరించరు. రాజ్యపాలన అనేది గూడా తప్పని అవసరంగానే అర్థం చేసుకుని ముందడుగు వేస్తారు" అంటాడు.

తత్త్వవేత్తకు ఇవ్వవలసిన శిక్షణను గురించి ప్లేటోకు ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి.

మొదటి మెట్టు : మనస్సు ఆలోచించటానికి తగినదిగా, తప్పనిసరిగా చురుకుగా పనిచేసేట్లు చూడడం.

దీనికి ఉపాంగంగా గణితశాస్త్రం (Mathematics) నేర్చుకోవాలి అంటాడు ప్లేటో.

1. లెక్కలు (Arithmetics)
2. రేఖాగణితం (Fure Geometry)
3. ఘనరేఖాగణితం (Solid Geometry)
4. నక్షత్ర శాస్త్రం (Astronomy)
5. సామరస్యం (Hermonics)

దీని తర్వాత తార్కిక శాస్త్రం అవసరం అంటాడు. Dialectic అనేది అన్నిటినీ సమశ్రుతికి తీసుకువస్తుంది. ఇది నేర్చుకుంటే ఇక ఆ పైన నేర్వవలసింది ఏమీ ఉండదు అంటాడు ప్లేటో.

పాలకులుగా శిక్షణ ఇవ్వవలసిన వాళ్ళను ఎంపిక చేసే విధానం కూడా సూచిస్తాడు ప్లేటో.

నైతిక విలువలు, మానసిక పరిశ్రమ – ఎరిగిన వాళ్ళయి ఉండాలి. పద్దెనిమిది సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు వాళ్ళు ముందు చెప్పిన సామాన్య విద్యా పద్ధతులు నేర్చుకుంటారు. తరువాత రెండు సంవత్సరాలు వ్యాయామం; మిలటరీ పద్ధతులు నేర్చుకుంటారు. ఇరవై–ముప్ఫయి సంవత్సరాల నడుమ గణిత శాస్త్ర ప్రక్రియలన్నీ ఆకళింపు చేసుకుంటారు. తరువాత అయిదేళ్ళు తార్కిక విజ్ఞానం (Dialectie) . ఇది పూర్తి అయిన మీదట పదిహేను సంవత్సరాలపాటు క్రింది తరగతి ప్రభుత్వ కచేరీలలో పనిచేస్తూ, పాలనా వ్యవహారాలలో ప్రత్యక్ష జ్ఞానం సంపాదిస్తారు.

ఇదంతా సజావుగా, సక్రమంగా పూర్తి చేసినవాళ్ళు 'తత్త్వవేత్త పాలకులు'గా అర్హత పొంది ఉన్నత స్థానాన్ని ఆక్రమిస్తారు. అప్పుడు వారు తమ సమయాన్ని తత్త్వ శాస్త్ర అధ్యయనానికి కొంత, రాజ్యపాలనకు కొంత కేటాయించుకుంటూ సమపాళ్ళలో వ్యవహారవర్తనం చేయగలుగుతారు.

ఈ స్థితి రావటానికి పురుషులు ఒక్కళ్ళే కాదు, స్త్రీ కూడా సమానంగా అర్హులు అని నొక్కి చెబుతాడు ప్లేటో. తగిన అర్హతలు సంతరించుకుంటే – నేను చెప్పిన అన్ని సంగతులూ... పురుషులకు; స్త్రీలకు సమానంగా వర్తిస్తాయి, అని గుర్తు చేస్తాడు.

సమాజము, సమాజ నిర్మాణ ప్రక్రియ, పాలనా పద్ధతులు – ఇవన్నీ చాలా కట్టుదిట్టంగా రూపొందించాడు ప్లేటో. కేవలం 'స్వాప్నిక జగత్తు' అనటానికి వీలులేదు దీనిని. దాని గుర్తింపు, ఆచరణ సాధ్యత కష్టమైన విషయం అయితే కావచ్చును. ముఖ్యమైన విషయం ఏమంటే రాజకీయ అధికారం యావత్తు ఒకరు లేక మిక్కిలి 'నిజమైన తత్త్వవేత్తల' ఆధీనంలోనే ఉండాలి. వాళ్ళకు ప్రాపంచికమైన మర్యాదలు, మన్ననలు ముఖ్యమైనవి కానే కాదు. సరైన పని చేయడం ఒక్కటే వాళ్ళకు ప్రామాణికమైన కలాపం. అలాంటి వాళ్ళే తాము పాలిస్తున్న సమాజాన్ని– రాజ్యాన్ని – చక్కగా ముందుకు నడిపించి, జనానికి అవసరం అయిన ప్రగతిని సాధించగలరు.

పది సంవత్సరాల వయసు వచ్చిన పిల్లలందరినీ తల్లిదండ్రుల నుంచి వేరు చేసి – వారికి తగిన బోధనా శాలలకు పంపాలి. అప్పుడే వారు తల్లిదండ్రుల జీవన విధానాల ప్రభావం నుంచి తప్పించుకోగలుగుతారు. సరికొత్త ఆలోచనా ధోరణులను తమంత తాము యోచించి కనుగొనగలుగుతారు. జన ప్రగతి తప్ప ఏ ఇతర అంశము వాళ్ళ మనసులను ఆకట్టుకోదు.

# రాజ్యాంగం

**ప్లేటో** వ్రాసిన రిపబ్లిక్ (The Republic) అనే పుస్తకం పది భాగాలుగా ఉంటుంది.

ప్రారంభ సూత్రాలు

(సాంఘిక వ్యవస్థ)

ప్రాథమిక విద్య అవసరాలు

రక్షకులు : అనుయాయులు

రాజ్యం: పౌరుడు: న్యాయం

స్త్రీలు: కుటుంబ వ్యవస్థ

తాత్త్వికుడైన పాలకుడు

తాత్త్వికునకు అవసరమైన విద్య

అక్రమమైన సంఘ వ్యవస్థలు

కళలు – సాహిత్యము

ఆత్మ అమృతత్వము, మంచితనానికి పారితోషికం

– ఇవి స్థూలంగా ఈ భాగాలలో చర్చించిన విషయాలు.

ఈ పుస్తకం సంవాద (సంభాషణల) రూపంలో ఉంటుంది. ఏథెన్స్ వాసులకు నాటకాలన్నా, సంవాదాలన్నా ఇష్టం, మక్కువ. వాళ్ళ రాజకీయ జీవితం గూడా కోర్టులలోను, రాజ్యసభలలోను సంవాదాల రూపంగానే నడిచింది. ఊసుపోక కబుర్లతోను, చర్చలతోను, వాద ప్రతివాదాలతోను, ఇతరుల భాషణలను వినడంతోను కాలం గడిపేస్తారు వాళ్లు. సోక్రటీస్ కూడా సంభాషణపరుడేగాని ఉపన్యాసకుడు, వక్త కాదు గదా!

వాదన అందుకున్న స్థాయినిబట్టి, సంభాషణలలో చురుకుదనం, సూటితనం ప్రవేశిస్తాయి. తేలిక సంభాషణలు, గంభీరవాదాలు, తాత్త్విక చర్చలు, వర్ణనలు, నాటకీయత – ఇవన్నీ ఇందులో అగుపిస్తాయి. నైతిక సాంకేతిక పదాలు, వివరణలు విస్తారంగా కనిపించడం సహజం. వాటికి కేవలం సాహిత్యపరమైన అర్థాలు మటుకే చెప్పుకోవటానికి వీలుండదు. 'సుందరము, శుభము అయిన దానిని వివరిస్తాను' అంటాడు. నైతిక విలువలను గురించి వ్రాస్తున్నప్పుడు కవిత్వాంశ ఎక్కువ ప్లేటోకు. సంభాషణలు సుదీర్ఘంగా నడుస్తాయి. ఎంతో జాగ్రత్తగా చూచుకుంటే తప్ప ప్లేటో ఏం చెప్పబూనుకున్నాడో తెలివిడి కాదు.

ప్లేటో ఆదర్శవాది.

ఆదర్శాలు, ధార్మికత తప్ప మరే లక్షణమూ పనికిరాదు అంటాడు. వర్తమానంలో ఈ రకమైన ధోరణి అర్థం చేసుకోవడం కష్టమైపోతుంది చదువరులకు.

రాజ్యము, పాలన ఎలా ఉండాలి అన్న అంశంపైన ఒక ఖచ్చితమైన ప్రణాళిక (Blue Print) తయారు చేశాడు. నిర్దాక్షిణ్యంగా, ఎలాంటి మార్పులు – చేర్పులకు లొంగకుండా, దీనిని అమలు పరచాలంటాడు.

గణిత శాస్త్రంలో ఎక్కువ అనుభవం, ఆత్మీయత ఉన్నవాడు గనుక రాజనీతి శాస్త్రం గూడా అలా ఖచ్చితంగా కొలతబద్ధలో ఇమిడి పోయేట్లుగా ఉండి తీరాలని సిద్ధాంతీకరిస్తాడు.

నిజానికి రిపబ్లిక్‌లో ఎక్కువ భాగం రాజకీయాలను గురించి కాదు, జనజీవనం, విద్య, శాశ్వతమైన విలువలు – ఇందులో ప్రధానంగా ప్రస్తావన అయినాయి. సాహిత్యము, విమర్శ ఇందులో చోటుచేసుకున్నాయి. సత్యంపట్ల ఆసక్తి, ధార్మిక విషయ ప్రస్తావన తాత్త్వికత, అనుషంగికంగా ఇంకా అనేక విషయాలు ఇందులో ఉన్నాయి.

రాజకీయాల దగ్గరకు వచ్చేటప్పటికి, ప్లేటో ప్రజాస్వామ్యవాది అనడం కూడా కష్టమైపోతుంది. ఏథెన్స్‌లో అమలులో ఉన్న రాజకీయ వ్యవస్థలను అతను ప్రత్యక్షంగా చూచాడు. దాని తప్పుల తడక వ్యవహారాలన్నీ బహుశా నిరసించాడు. ఇతర వ్యవస్థలను ఖండించినట్లుగానే ప్రజాస్వామ్యాన్ని గూడా నిరసించాడు. ఆయన విమర్శలను, ఆయన పరిష్కరించదలుచుకున్న అనేక సమస్యల సమగ్ర స్వరూపాలను మనం క్షుణ్ణంగా చూడాలి; పరిశీలించి గమనించాలి. తత్త్వదర్శనం పట్ల దృష్టి ఉన్న పాలకుడు

రూపొందడం అసాధ్యమే కావచ్చును; ఈ అభిప్రాయం యావత్తు కేవలం ఆదర్శచట్రంలోనే బిగిసిపోయి ఉండవచ్చును. మానవ స్వభావం ఉన్న తీరు దృష్టిలో పెట్టుకుని చూచుకున్నప్పుడు ఇదే పరిస్థితి. అయితే ప్లేటో ఎత్తి చూపిన ప్రమాణాలు తిరుగులేనివి, అప్రతిహతమైనవి. దైనందిన వ్యవహారంలో మానవాళిని ఇది ఎప్పటికప్పుడు ఎదురు నిలిచి కలవరపరుస్తూనే ఉంటాయి. వీటికి సమాధాన సరళి ఏర్పరచుకోవలసిన బాధ్యత మన మీద ఉండనే ఉన్నది.

## నైతిక సమస్య :

సెఫలస్ (Cephalus) అనే అతను శ్రీమంతుడైన ఒక యువకుడు. అతని ఇంటిలో ప్రారంభం అవుతుంది సంవాదం. ఇతర భాషణ కర్తలు గ్లౌకాన్ (Glaucon), అడీమాన్టస్ (Adeimantus) అనేవారు. ఈ రెండవ అతను ప్లేటో సోదరుడు. త్రసిమకస్ (Thrasymachus) అనే సోఫిస్ట్ (Sophist) కూడా వాళ్ళతో ఉంటాడు.

ప్లేటో విషయాలన్నిటినీ సోక్రటీస్ నోటి మీదుగా చెప్పిస్తాడు.

నీవు 'శ్రీమంతుడవు కనుక నీవే చెప్పగలగాలి.  సిరి సంపదల నుంచి నీవు అనుభవిస్తున్న సుఖ సౌభాగ్యాలు ఏమిటి చెప్పు' అని అడుగుతాడు సోక్రటీసు.

సెఫలస్ అంటాడు – 'సిరిసంపదలు ఉండడం గొప్ప ఆశీర్వాదం అనుకుంటాను. నేను శ్రీమంతుడిని కనుకనే ఉదారంగా, నిజాయితీగా, న్యాయంగా మనగలుగు తున్నాను.'

'న్యాయంగా ఉండడం అంటే ఏమిటి' – అని అడుగుతాడు సోక్రటీస్ తన సహజమైన ధోరణిలో. తరువాత సంవాదం అంతా తాత్త్వికతతో మిలమిలలాడి పోతుంది.

దేన్నయినా నిర్వచించగలగడం కష్టం. మనకు స్పష్టంగా అర్థమయ్యేట్లు చెప్పగలగటానికి ఎంతో నైపుణ్యం, చాకచక్యం కావాలి.

సోక్రటీస్ ఎదుటివారు ఎంత వివరంగా చెబుతున్నామని అనుకున్నా ఆ వివరాలను క్లిష్టమైనదిగా చూపించగల సమర్థత ఉన్నవాడు. 'సరళత' కోసం అతను చేసే ప్రయత్నం ఎదుటివారిని ఎన్నో చిక్కులలో, గందరగోళాలలో పడవేస్తుంది.

ఒక్కొక్కమారు సోక్రటీస్ అనుయాయులు అతని మీద తిరగబడడం కూడ జరుగుతూనే ఉండేది.

'ఎంత నిదానంగా ఉన్నా మమ్మల్ని రెచ్చగొడతావు. ఎంత తేలికగా చెబుతున్నామనుకున్నా వాటిలోనే ఏవో ముడులు చూపిస్తావు; నీకు అంతగా తెలుసుకోవాలని ఉంటే ఇతరులను ఇలా ప్రశ్నలు వేసి వేధించే బదులు, నీవే అన్ని విషయాలపైన ఉపన్యాసాలు ఇవ్వరాదూ ?' అనేవాళ్ళు.

తన స్నేహితులు ఎలా మాట్లాడినా సోక్రటీస్ చికాకు పడేవాడు కాదు. ప్రశ్నలు అడుగుతూనే ఉండేవాడు.

సోక్రటీస్ ప్రశ్నకు సోఫిస్ట్ ఇలా సమాధానం చెప్పాడు :

'బలవంతుడు చేసిన పనే సక్రమమైనదీ, న్యాయమైనదీని. బలవంతుడికి అనుకూలమైన పనే నీతివంతమైనది. మనకు ఎన్నో రకాల ప్రభుత్వాలు ఉన్నాయి, న్యాయచట్టాలు ఉన్నాయి. న్యాయచట్టాలు చేసినవాళ్ళకు అవి అనుకూలంగా ఉంటాయి. వాటిని అతిక్రమించినవాళ్ళు 'అన్యాయం' చేసినట్లు లెక్క. ఇతరుల ఆస్తిని దోచుకోవడం, తనకు చెందని దానిని పరిగ్రహించడం. ఇదంతా, అన్యాయమే... మూకుమ్మడిగా ఇటువంటి ప్రయత్నాలు బలవంతుడు తన కన్నా బలహీనులపైన చేస్తూనే ఉన్నాడు. ఒకడు ఉన్నాడు. వాడు పురజనుల డబ్బంతా దోచుకుంటాడు. వాళ్ళను బానిసలుగా మారుస్తాడు. వాడిని దోపిడీ దొంగగా, క్రూరుడుగా చెప్పుకోకుండా గొప్పవాడుగా, సుఖపురుషుడుగా కీర్తిస్తారు. తమకు కష్టాలు వస్తాయేమోనని భయపడేవాళ్ళు ఇలాంటి కథలన్నీ కల్పిస్తారు. అవకాశం వచ్చిందంటే చాలు తాము ఇతరులను మభ్యపెడతారు. ఇబ్బందుల పాలు చేస్తారు'.

– మరో సంవాదంలో కాల్లిక్లస్ (Callicles) అనే సోఫిస్ట్ ఏమంటున్నాడో చూడండి :

'బలవంతుల దౌర్జన్యాన్ని సమపాళ్ళుగా చేయటానికి బలహీనులు కనిపెట్టిన కొత్త సిద్ధాంతం నిజాయితీ అనేది.

'తమ తమ అభిరుచులకు, అవసరాలకు తగినట్లుగా ధూషణ భూషణాలను వినియోగిస్తారు. నిజాయితీగా లేకపోవడం తప్పు, గొప్ప అపరాధం, సిగ్గు చేటు అని చెబుతారు. ఇక్కడ నిజాయితీగా లేకపోవడం అంటే ఏమిటో తెలుసా ? నీ పొరుగువాడి కంటే నీవు ఎక్కువ ఐశ్వర్యవంతుడివి కావడం! – తమ బలహీనతలు తక్కువతనాలు తెలుసుకుని, గొప్పవారిని కించపరచి వారితో తామూ తులతూగగలమని చెప్పుకోవడం

కోసం ఎన్నో మాటలు కనిపెడతారు.. నిజానికి ఎవరైనా సరైన అధికారం ఉన్న మనిషైతే దీన్నంతటినీ చెల్లాచెదరు చేసేస్తాడు. మన సిద్ధాంతాలు, సూత్రాలు, లెక్కలు కాలరాచి పారేస్తాడు. ప్రకృతికి వ్యతిరేకంగా పనిచేసే మన పలుకులను నాశనం చేస్తాడు.... ఎవరైనా కానీ, తన ఇష్టం వచ్చినట్లు తనకు ప్రీతి కలిగేట్లు మసలుకోవాలనుకుంటాడు తప్ప ఇంకొక ఆలోచన రానివ్వడు. ఇదే సహజమైన నిజాయితీ, ఉదాత్తత అనుకుంటాను నేను. కానీ ఈ పని ఎక్కువమంది చేయలేరు. అందుచేత చేయగల సామర్థ్యం ఉన్న బహు కొద్దిమందిని నిందిస్తారు; తక్కువ చేసి మాట్లాడుతారు. తమ అసమర్థతకు తామే సిగ్గుపడుతూ ఉంటారు, ఒక ప్రక్క ఈ అసమర్థతను కప్పిపుచ్చుకోవాలని చూస్తారు. అందుకనే 'సహనం' అనే లక్షణం తీసుకువస్తారు. ఉదాత్తమైన విషయాలను తక్కువ చేస్తారు. పిరికితనంతో కూరుకుపోయి న్యాయం, నీతి అంటూ భూషణ వాక్యాలు పలుకుతారు' అంటాడు.

మనం నీతి, న్యాయం అని చెప్పుకుంటున్నది మనుషులకు యోగ్యమైంది కాదు బానిసలకు సరిపడేది మటుకే అంటాడు.

మనిషికి నిజంగా ఉండవలసిన గుణ గణాలు :

సాహసము – వివేకము అంటాడు ప్లేటో.

ఏథెన్స్ నగరంలో అప్పుడు అమలులోఉన్న విదేశీ వ్యవహారాల నియమావళి మీద తిరుగుబాటు ఇదంతా.

'నీ ప్రజల మంచి మీద కాక, నీ సౌకర్యం మీదనే ఆధారపడి ఉన్నాయి, నీవు అవలంభిస్తున్న చర్యలన్నీ.....' అన్నాడు పెరిక్లిస్ (Pericles).

ఏథెన్స్, స్పార్టన్ల మీద యుద్ధం చేస్తున్నప్పుడు ఈ పెరిక్లిస్‌యే ఇలా అన్నాడు: ఈ ప్రపంచరీతి నీతులు ఎలా ఉన్నాయంటే – బలవంతుడు ఎలాగైనా చేయవచ్చును; బలహీనుడు వాటినన్నిటినీ తట్టుకుని తిట్టుకుంటూ కూర్చోవడం తప్ప ఇంకేం చేయలేడు. సరి అయినదా కాదా అన్న ప్రశ్న సమఉజ్జీల మధ్య వస్తుంది గాని, ఒక్క పక్క బలవంతులు – మరొక పక్క బలహీనులు ఉన్నప్పుడు కాదు –' నీతికి, నైతిక వర్తనానికి మూలాధారమైన సూత్రం ఇక్కడ దొరుకుతోంది మనకు.

న్యాయం అంటే ఏమిటి – – ధార్మిక వర్తనమా లేక అధికార ప్రతిపత్తా ? మంచి ఉండడం మెరుగా, బలవంతుడై ఉండడం మేలా ?

ఈ ప్రశ్నలను సోక్రటీస్‌కు ప్లేటో, ఎలా సమాధాన పరచాడో తెలుసుకోవడం ఆసక్తిదాయకంగా ఉంటుంది.

నిజానికి అతడు వీటికి సూటిగా సమాధానం చెప్పడు.

న్యాయం అనేది మనుష్యుల మధ్య ఉన్న సంబంధాలకు సూత్రప్రాయత అంటాడు. సాంఘిక వ్యవస్థ మీద ఆధారపడి ఉంటుందంటాడు. వ్యక్తిగత వర్తనంలో దాన్ని పరిశీలించడం కంటే ఏదో దేశ వాతావరణం, సమగ్రతల దృష్ట్యా చూడడం మంచిదంటాడు. న్యాయానికి మూర్తిమంతం అయిన రాజ్యాన్ని తయారు చేసుకోగలిగితే అప్పుడే న్యాయమూర్తి అయిన మనిషిని తయారుచేసుకున్నట్లు అవుతుంది.

మనిషి 'దృష్టి'ని పరీక్షించేటప్పుడు ముందు పెద్ద అచ్చు అక్షరాలు చూపించి చదవమంటాము. తరువాత క్రమక్రమంగా చిన్న సైజు అక్షరాలు చూపిస్తాము, అలాగే– ముందుగా మూకుమ్మడిగా జన సందోహం అంతటికీ సంబంధించిన విషయం పరిశీలించగలిగితే తర్వాత ఒక్క మనిషిని ఆసరా అయినది అదే బయటపడుతుంది– అని అతని ఉపమానం.

అలా అని ప్లేటో కప్పదాటు వేస్తున్నాడు అనుకోవటానికి లేదు. ఆయన సామూహికము, వ్యక్తిపరము అయిన పరిశీలనలు రెండూ జరుపుతున్నాడు. సాంఘిక రాజకీయ పునర్నిర్మాణము అంతా విపులీకరిస్తున్నాడు. ఓ గొప్ప 'ఆదర్శం' ఆయన హృదయములో స్థావరించుకు వుంది. దాన్ని ఎలాగైనా మనకందరకు అందచేయాలనే ఆయన తాపత్రయం. తప్పించుకున్నట్లే కనిపించడం, పక్కదారులు పట్టించడం... ఇవన్నీ ప్లేటో పుస్తకంలో అనుసరించే పద్ధతులు.

## న్యాయం

న్యాయం (Justice) లేక క్రమము (Right) అంటే ఏమిటి ? గ్రీక్ భాషలో ఈ పదానికి చాలా విస్తృతమైన అర్థం ఉన్నది. వ్యక్తిపరమైన ధర్మం మొదలు సాంఘిక నైతిక వర్తనం వరకూ ఈ అర్థం విస్తరిస్తుంది. అందుచేత ప్లేటో వ్యక్తిపరంగానూ, సామాజిక పరంగానూ – నీతి దృష్ట్యా, రాజకీయ దృష్ట్యా – దీనిని వివరిస్తాడు.

నిజం చెప్పడం, తాను చెల్లించవలసిన బిల్లులన్నీ అరమరిక లేకుండా చెల్లించడం– అని జవాబు చెప్తాడు సెఫలస్ (Cepholus) అనే పాత్ర, ప్లేటో

సంభాషణలలో, అయితే ఈ లౌకికమైన వివరణ చాలదని ప్లేటో సవివరంగా పేర్కొంటాడు.

ధార్మికంగా ఉండేవాళ్ళు, అధర్మ వర్తనులు ఉన్నారు భూమి మీద. వీళ్ళలో ఎవరు భూమి మీద సుఖపడతారు ఎక్కువగా ? – అన్న ప్రశ్న కూడా ఉత్పన్న మవుతుంది ఈ సంభాషణలో. మనిషి తన ధర్మాన్ని నిర్వర్తించడం అంటే – తన పని తాను సక్రమంగా నిర్వర్తించవలసి ఉంటుంది. ఈ ధర్మాలు ఎట్లా సహజ సిద్ధంగా రూపొందుతాయో చూపిస్తాడు.

ఈ సంభాషణ భాగం చూడండి :

'మన జీవన విధానం అంతా ఈ ప్రశ్నకు చెప్పుకునే సమాధానం మీదనే ఆధారపడి ఉంది. ధర్మ మార్గానువర్తి, అధర్మ వర్తనుడు– ఈ ఇద్దరిలో ఎవరు ఎక్కువ సుఖపడతారు ? ఒక గుఱ్ఱం ఉంది – దానికి ఓ ధర్మం ఉంది, అవునా ?"

'అవును'

'ధర్మాన్ని గుఱ్ఱం మటుకే నిర్వహించగలదు గాని మరెవరి వల్లా కాదు. అదే దానికి పరమ ధర్మం అవుతుంది.'

'నాకు అర్థం కావడం లేదు.'

'మరో విధంగా – తేలికగా చెబుతాను. మనం కళ్ళతో మటుకే చూడగలుగుతాం, అవునా ? చెవులతో మటుకే వినగలుగుతాం'.

'నిజం'

'అలాగే ఒక కొమ్మను కత్తిరించటానికి గొడ్డలి, చాకు, కత్తి, బాకు ఇలాంటివి అనేకం ఉపయోగించవచ్చును. కొమ్మను కత్తిరించటానికి తయారు చేసుకున్న చిన్న కత్తితో ఈ పనిచేస్తే బాగుంటుంది. ఆ కత్తి ధర్మం ఈ పని అని చెప్పవచ్చు.'

'అవును, చెప్పవచ్చును'.

'అది మాత్రమే చేయగలదీ, చక్కగా నిర్వర్తించగలదీ... ఆ పనిముట్టు యొక్క ధర్మం అని చెబుతున్నాను.'

'అవును, ఇప్పుడు తెలిసింది.'

'అవునా ? ప్రతి వస్తువుకూ తనదే అయిన ధర్మం, కర్తవ్యం ఒకటి ఉండటానికి వీలుంది గదూ. ఆ పనిని ఆ వస్తువు చక్కగా చేయగలుగుతుంది. ఇందాకటి పోలిక పెడితే, కళ్ళు ఉన్నాయి. చూడడం వాటి పని. ఆ పనిని కళ్ళు చక్కగా చేస్తాయి.'

'అవును.'

'అలాగే చెవులు ఇతర వస్తువులు కూడా. కళ్ళకు తమ పనిని తాము చక్కగా చేయగల చాకచక్యంతోపాటు, మరో అవలక్షణం గూడా ఉంటే ఏమవుతుంది ?'

'అంటే కళ్ళకు గుడ్డితనం వంటిది ఉంటేనా ?'

'అది ఏమైనా కావచ్చును. నేననేది, ఒక నైపుణ్యంతో పాటు మరో లోపం కూడా ఉంటే ఏమవుతుంది అని అడుగుతున్నాను.'

'ఆ లోపం కూడా పనిలో కనిపిస్తుంది.'

'సరి, తరువాతి చర్చ. మనసుతో తప్ప ఇతరత్రా చేయటానికి అసాధ్యం అయిన పని అంటూ ఏదైనా ఉన్నదా ? ఉదాహరణకు గమనిక కలిగి ఉండడం, నిభాయించుకోవడం, సంభాషణ కొనసాగించడం ఇలాంటిది. ఇలాంటి పనులను మానసిక వ్యాపారం నుండి వేరు చేసి చూడటానికి వీలవుతుందా ?'

'ఉహు....'

'మరి, జీవితం ఉన్నది గదా... అది మనసు తాలూకు వ్యాపారమేనా ?'

'అవును'

'అంటే మనసుకు ప్రత్యేకమైన సుగుణం – లక్షణం ఉంటుందన్న మాటే గదా.'

'ఉంటుంది.'

'ఈ లక్షణం విడదీసినట్లయితే, తొలగించినట్లయితే మనసు తన వ్యాపారాన్ని, వ్యవహారాన్ని సజావుగా చేయలేకపోతుంది గదూ.'

'అవును'.

'సరి. ఇప్పుడు చూద్దాం. మంచితనం అనే లక్షణం ఉంది. అది మనసుకు తన పనులు తాను చేయడానికి నిపుణంగా ఉండటానికి దోహదం చేస్తుంది. అది లేకపోతే మనసు తన జీవితాన్ని కోల్పోతుంది. పనిలో చెడ్డతనం ప్రవేశిస్తుంది.'

'అలాగే జరుగుతుంది'.

'సరే, మనం "న్యాయం" అనేది మనసు తాలూకు ప్రత్యేకమైన లక్షణమనీ, అన్యాయం దాని వ్యతిరిక్తమైన లోపమనీ యింతకు ముందు చూచాం గదూ'.

'అవును'.

'అంటే న్యాయయుతమైన మనసు ఉన్నవాడికి జీవనం సజావుగా, సరళంగా ఉంటుంది. అది లేనివాడికి అన్నీ ఎగుడు దిగుడులు, కష్టాలు కలుగుతాయి.'

'తార్కికంగా అంతే.'

'న్యాయయుతంగా జీవితం గడుపుతున్నవాడు సుఖంగా, ప్రశాంతంగా ఉంటాడు. అలా కానివాడు దుఃఖభాజనుడైపోతాడు.'

'అవును.'

'అంటే, న్యాయబద్ధమైన మనిషి సుఖవంతుడు. అది కానివాడు ఖేదపరుడు.'

'సరీగ్గా అంతే.'

'కనుక ఖేదం, దుఃఖం అనేవి ఎప్పటికీ సుఖజీవనాన్ని తీసుకురావు. అందుచేత న్యాయం-అన్యాయం కంటె మిన్న అయినదీ, కోరుకోదగినదీ అని తీర్మానించుకోవచ్చును.'

'ఈ రోజుకు ఇంక సెలవు తీసుకుందాము.'

'అలాగే నా మాటలు కావని విమర్శ చేయకుండా నాకు సంతోషం కలుగ జేస్తున్నావు. అంత మాత్రంచేత నాకు అంతా కులాసాగా గడిచిపోతుందనుకోవటానికి లేదు. ఇదంతా నా తప్పే, నీది కాదు. నేను ఊరికే తొందరపడి ఎక్కువ విషయాలు ప్రస్తావిస్తున్నాను. న్యాయం అంటే ఏమిటీ – అని ప్రస్తావన ప్రారంభించాం. దానికి జవాబు రాకముందే అది సుగుణమా, దానికి జ్ఞానంతో నిమిత్తం ఉన్నదా, న్యాయా న్యాయాలలో ఏది మిన్న. ఇలాంటివన్నీ చర్చించుకున్నాం. ఇంత చర్చ జరిగిన తర్వాత కూడా నేనేమీ అంత జ్ఞానిని అయినట్లు అనిపించడం లేదు. ముందుగా న్యాయం అంటే ఏమిటో అర్థం అయితే తప్ప, అది సుగుణం అవునా, కాదా, దానివల్ల మనిషికి సుఖమా, దుఃఖమా అనేది తేలదు కదా!'

ప్రభుత్వ రూపాలను గురించి ప్లేటో వివరిస్తాడు. అప్పటి స్పార్టన్ రాజ్యంలో ఉన్న రూపం అతనికి ప్రముఖమైనది. దీనిలోని కొన్ని సద్‌లక్షణాలను తన ఆదర్శ రాజ్యంలోనికి తీసుకున్నాడు.

స్పార్టన్‌లు యుద్ధ నైపుణ్యం ఉన్న నిరంకుశులు. వీరు మామూలు ప్రజలను తమకు దాసానుదాసులుగా చేసుకొని వాళ్ళచేత వ్యవసాయం, పాలేరుతనం వంటి పనులు చేయించుకుంటూ ఉంటారు. అవసరం అయినప్పుడు యజమానుల తరఫున యుద్ధం కూడ చేస్తారు. ఒక్కొక్కసారి తమ దాస్యం నుండి విముక్తిని కూడా సంపాదించుకుంటారు. మామూలుగా మటుకు వాళ్ళకు ఎలాంటి హక్కులు, అధికారాలు లేవు. ప్రతి సంవత్సరం న్యాయపాలకులు వాళ్ళమీద యుద్ధం ప్రకటించేవాళ్ళు. వాళ్ళను చంపటం వీరోచిత కార్యంగా పరిగణన అయ్యేది. స్పార్టన్ల రహస్య దళాలు వాళ్ళమీద గూఢచారి చర్యలు చేసి తమకు అస్తవ్యస్తంగా కనిపించిన వారిని నిర్ధాక్షిణ్యంగా నరికి పారేసేవారు.

స్పార్టన్‌లు వీరోచిత జాతి, సంఖ్య తక్కువలో ఉన్నారు. మామూలు ప్రజలు తిరుగుబాటు చేస్తారేమోనని ప్రతిసారీ భయమే, అనుమానమే. అందుకే ఇలాంటి జీవన విధానాన్ని ఎన్నుకున్నారు.

ప్రతి పౌరుడు సైనికుడే, వాళ్ళ చదువు, వివాహము, నిత్యజీవన విధానము... ఇవన్నీ కూడ సైనిక పద్ధతులకు అనుగుణంగా నైపుణ్యానికి తగినట్లుగా జరుగుతాయి.

## రాజకీయ సమస్య :

మనుష్యుల వర్తనం సరళంగా ఉండేట్లయితే, న్యాయ పరిపాలన కూడా సరళంగా ఉంటుంది అంటాడు ప్లేటో.

ప్లేటో మాటలలోనే చెప్పవలెనంటే –

‘జీవన విధానం ఎలా ఉన్నదో చూడండి. ప్రజలు ఏం చేస్తున్నారు ? పంటలు పండిస్తున్నారు; ఆహార పదార్థాల తయారు చేస్తున్నారు, బట్టలు, చెప్పులు ఇత్యాది ఇతర జనోపకరమైన సామగ్రి తయారు చేస్తున్నారు. తమ కోసం, సుఖ నివాసం కోసం – ఇళ్ళు కట్టుకుంటున్నారు. వేసవి కాలంలో హాయిగా గుడ్డలు విప్పేసుకుని, ఇళ్ళలోనే కూర్చొని తమ తమ పనులు చేసుకుంటారు. చలికాలంలో శరీరం అంతా ఉన్ని దుస్తులతో కప్పుకుని కూర్చుంటారు. బార్లీ, గోధుమ రొట్టెలు తయారు చేసుకుంటారు. హాయిగా భోజనాలు చేసి చాపలు పరుచుకుని విశ్రాంతి తీసుకుంటారు. పండుగలు, పబ్బాలు వచ్చినాయంటే కొత్త కొత్త పానీయాలు తయారుచేసుకుని, వంటకాలు ఆరగించి స్నేహితులతో, బంధువులతో కులాసాగా కాలం గడిపేస్తారు. దేవుళ్ళను కీర్తిస్తారు. కుటుంబాలు అదుపు మీరిపోకుండా చూచుకుంటారు. మంచి

పంటలు పండుతాయి. ఆరోగ్యకరమైన ఆహారంతో చాలాకాలం బతుకుతారు. హాయిగా ఉంటారు. తమ తరువాతి తరాలవారు గూడా ఇలాగే కులాసాగా కాలం గడపటానికి అవసరం అయిన పనులన్నీ చేస్తారు'...

ఆషామాషీగా చెబుతున్నట్లే ఉన్నా కుటుంబ నియంత్రణం గురించి ఇందులో సూచన ఉన్నది. మాంసాహారం తినకుండా శాఖాహారం మీదనే బతకడం గురించి ప్రస్తావన ఉన్నది. అతడు ఇంత సరళంగా, సాదాగా వర్ణించి చెప్పిన ఈ రాజ్యం ఎందుకు ఎన్నాళ్ళకూ అవతరించకుండా ఉండిపోయింది; కేవలం 'ఆదర్శం'గానే నిలిచిపోతోంది ?

దీనికి సమాధానం గూడ ఆయనే చెబుతాడు.

జనుల లాలస, దురాశల వల్ల!–అని.

జనానికి సరళమైన జీవితం అంటే ఇష్టం లేదు. వాళ్ళకు పైపోటీ మనోభావం ఎక్కువ. దురాశ ఎక్కువ. ఈ రోజు కులాసాగా ఉన్నాం అనే తృప్తి లేదు. రోజు రోజుకూ లాలసత, సౌకర్యాలు పెరిగిపోతూ ఉండాలి. లేనిదాని కోసం అంగలారుస్తూ ఉంటారు. ఇతరుల దగ్గర ఉంటే తప్ప ఏ వస్తువైనా తమకు కూడా అవసరం అనే విషయం స్ఫురణకు రాదు. దీనికంతటికీ పరిణామం ఏమిటి ? పక్క రాజ్యం మీద దండయాత్ర చేయవలసి రావడం; పక్కవాడిని గురించి అసూయతో కుమిలిపోతూ ద్వేషం పెంచుకోవడం, యుద్ధాలు మారణహోమాలూను.

వర్తకము, వాణిజ్యము పెరుగుతాయి. కొత్త రకాలైన విభజనలు తీసుకువస్తాయి. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు రకరకాలుగా విడివడిపోయి శాఖోపశాఖలుగా చీలి పరస్పరం ద్వేషం పెంచుకుంటారు.

ఏ నగరమైనా చూడండి; ఏ పట్టణమైనా గమనించండి. ప్రతీది రెండు రకాలుగా చీలి ఉంటుంది. బాగా ఉన్నవారు, ఏమీ లేనివారు. వారి వీధులు వేరు, వీరి వీధులు వేరు, వారి తోటలు వేరు, వీరి తోటలు వేరు. ఒకళ్ళను చూస్తే మరొకళ్ళకు గిట్టదు. అంతా ఒకటే నగరం, ఒక్కటే పట్టణం, ఒక్కటే ఊరు అనుకుంటున్నారంటే మీది పొరపాటు. ప్రతీది విధిగా రెండుగా చీలిపోయి ఉంటుంది. రెండుగా చీలిపోయిన ఈ భాగాలలోను ఇంకా వీలునుబట్టి అతిశయాన్ని అనుసరించి మరిన్ని చీలికలు, భాగాలు, అంతఃకరణలు వేరు వేరు.

ఓ వర్తక సమాఖ్య ఉన్నదనుకోండి. దానిలోని సభ్యులు తమ ఐశ్వర్యం ఆధారంగా అనేక వర్గాలుగా రూపొందుతారు. సాంఘిక స్థాయిని బట్టి, ఆచార

వ్యవహారాలనుబట్టి వేరు వేరు గుంపులుగా తయారవుతారు. తమ భార్యలకు, కుటుంబంలోని స్త్రీలకు రకరకాల ఉడుపులు, నగలు,, అలంకార ప్రాయమైన వస్తువులు తీసుకువస్తారు. ఎవరు ఎంత ఎక్కువ సరుకు వంటిమీద వేసుకుంటే అంత గొప్ప.

వాణిజ్యపరంగా వచ్చిన ఈ మార్పులు సాంఘిక పరిణామాలను రాజకీయ మార్పులను తీసుకువస్తాయి. వాణిజ్యంలో ఉన్న మనిషి, పంటలు–పొలాలు చూచుకున్న వాడికంటె ఎక్కువ శ్రీమంతుడు అవుతాడు. అప్పుడు రాజకీయాలలో అతనికి ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. అతనే రాజ్యం ఏలే పరిస్థితి కూడా వస్తుంది.

రాజ్యపాలన ప్రజల పురోభివృద్ధి అవసరాల దృష్ట్యా సాగవలసి ఉంది. కాని అది ఇప్పుడు వాణిజ్యపరుల ఆర్థిక వసతిని పెంచటానికి మటుకే ప్రయత్నం చేస్తుంది. పాలనలో ఏ అంశం అయినా ఈ శ్రీమంతులను మరింత శ్రీమంతులను చేయటానికే ఉపకరించేట్లు రూపొందుతుంది. అధికారం కోసం వెంపర్లాటలు, పోట్లాటలు, ఎలాంటి దుర్మార్గమైనా బాహాటంగా చేయ పూనుకోవడము – అతి సామాన్యమైన విషయంగా తయారవుతుంది.

ప్రాథమిక విషయాలు అత్యంత విరూపం చెందడంతో ఏ రాజకీయ వ్యవస్థ అయినా దెబ్బతింటుంది, కుంగిపోతుంది. అధికారం అతికొద్దిమంది చేతులలో చిక్కుకు పోతుంది. తక్షణ ఐశ్వర్యం కోసం వెంపర్లాట ఎలాంటి వాళ్ళనైనా తప్పనిసరిగా వినాశనానికే తీసుకుపోతుంది.

ఏది ఏమైనా, చివరకు 'అంతరంగ విప్లవం' రావడం తప్పనిసరి అవుతుంది. అతి చిన్న చిలిపి కారణాలమీద ఈ విప్లవం అంకురించినట్లు అగుపిస్తుంది ముందు. అయితే అది ఎన్నో సంవత్సరాలుగా వ్యవస్థలో పాతుకుపోయిన తప్పిదాల, తాత్సారాల ఉగ్ర స్వరూపం. మామూలు మనిషి ఆరోగ్య విషయమై అశ్రద్ధ చేసి చిన్న, చిన్న సుస్తీలకు తగిన చికిత్స చేయించుకోకుండా ఉంటాడనుకోండి, కొన్నాళ్ళ తరువాత ఆ చిన్న సుస్తీకే పెనురూపం ధరించి అతన్ని ముంచి వేస్తాయి. జీవితాన్ని చరమదశకు తీసుకువస్తాయి. అలాగే రాజ్యవ్యవస్థ కూడా!

ఫలితంగా ఏమవుతుందంటే ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడుతుంది. ప్రజలు తమకు అడ్డం వచ్చిన వారిని నరికి పోగులు పెట్టి రాజరికాన్ని తమ కైవసం చేసుకుంటారు. పనికిరానివాళ్ళను దేశం నుండి బహిష్కరించేస్తారు. అందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సరిసమానంగా ప్రకటించుకుంటారు.

కాని ఈ ప్రజాస్వామ్యం కూడా హద్దులు మీరిపోతే తనను తానే నాశనం చేసుకుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రధానమైన అంశం ఏమిటంటే – పాలనలో ప్రజలందరికీ సమాన అవకాశాలు, సమాన అధికారాలు, పాలన సూత్రాలు తయారు చేసుకోవడంలో అందరికీ భాగస్వామ్యం ఉంటుంది.

ఇది ముందుగా చూడటానికి చాలా ఆనందదాయకంగా, హర్షనీయంగానే అనిపిస్తుంది, కనిపిస్తుంది. అయితే ప్రజలకు తమ నాయకులను ఎన్నుకోవడంలో తగిన ప్రజ్ఞ లేకపోవడం వల్ల, ఏది మంచి, ఏది మంచిది కాదు అని విచక్షణగా తెలుసుకుందుకు అవసరమైన చదువు సంధ్యలు లేనందువల్ల ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ అతి త్వరలోనే కుళ్ళిపోయి మురుగు కంపు కొట్టడం మొదలవుతుంది.

సామాన్య ప్రజలకు సరైన అవగాహన ఉండదు; వాళ్ళు తమ నాయకులు ఏమి చెబితే దానినే విశ్వసిస్తారు, అనుసరిస్తారు. ఒక పాలన సూత్రాన్ని ఆమోదింప చేయాలన్నా, తిరస్కరింప చేయాలన్నా దానిని ప్రజల ముందు అర్థమయ్యే తీరులో ప్రదర్శించవలసి ఉంటుంది. ఏమీ తెలియని వాళ్ళ పాలన అలలకు ఆలవాలం అయిపోయే పడవ ప్రయాణం మాదిరి తయారవుతుంది. వాక్చాతుర్యం ఉంటే ప్రజలను మభ్యపెట్టడం బహు తేలిక అయిపోతుంది. ప్రజలకు కూడా పొగడ్తలు రుచిగా ఉంటాయి. ప్రజా కంటకుడైనవాడు కూడా ప్రజలను దైవ సమానులుగా కీర్తించి స్తుతించి వారి ఆమోదంతోనే పాలకుడుగా రూపొందటానికి అవకాశం ఉంటుంది.

ఒక పక్క వాణిజ్యపరుల చేతిలో అల్లకల్లోలం అయిపోతుందనుకున్న వ్యవస్థ– మరొక పక్క ఏమీ తెలియని మూఢ ప్రజల ఎన్నికవల్ల కలిగే దురవస్థ – ఈ రెంటినీ ప్లేటో చక్కగా వివరించి చెప్పాడు.

చెప్పులు తయారు చేయటానికి – ఆ మనిషికి కొంత శిక్షణ ఇస్తాము. కొన్ని సంవత్సరాలపాటు ఆ 'విద్య' నేర్చుకుంటాడు. దానిలోని మెలుకువలు తెలుసుకుంటాడు. అలాగే వైద్యం చేయవలెననుకునే మనిషి కొన్ని సంవత్సరాలపాటు ఆ 'విద్య' నేర్చుకుంటాడు. పనితనం, కుశలత సాధిస్తాడు. మరి పరిపాలన చేయదలుచుకున్న మనిషికి ఏ విధమైన 'శిక్షణ' ఉండనవసరం లేదా ? రాజ్యం అంతా అతని చెప్పుచేతులలో ఉంచి, అతనికి మంచి–చెడు విచక్షణా జ్ఞానం ఉన్నదో లేదో తెలుసుకోకుండా వదిలి వేయడం ఎట్లా ? ఇదీ ప్లేటో వేస్తున్న ప్రశ్న.

చేతకానితనం, వంచన ప్రవృత్తి ఉన్న మనుష్యులకు రాజరికం కట్టబెట్టడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు.

అందరి మంచిని, సంక్షేమాన్ని, శ్రేయస్సును మటుకే కోరుకునే వ్యక్తులే పరిపాలకులు.

ఈ పరిస్థితిని సమరసంగా అర్థం చేసుకుని పరిష్కారాలు కనిపెట్టగల దారి త్రొక్కడం ఎలా ?

– అదీ ప్లేటో ముందు ఉన్న ప్రశ్న.

## మానసిక సమస్య :

సమస్యకు రాజకీయ కారణం చెప్పుకున్నా, సాంఘిక కారణం చెప్పుకున్నా దాని వెనుక తప్పనిసరిగా ఉండేది మానసికత. అందుచేత కొంతలో కొంత మానసిక శాస్త్రం తెలుసుకోవడం, దాని ఆనుపానులు కనుక్కోవడం తప్పనిసరి.

'ప్రజలు ఎలా ఉంటారో వారి రాజ్యమూ అలాగే ఉంటుంది'–అంటాడు ప్లేటో.

మనుషుల మానసిక వర్తనాన్ని ఆధారం చేసుకుని, వాళ్ళ రాజ్య వ్యవస్థ రూపొందుతుంది.

ప్రజలలో ఎన్ని అవలయలు, అవినీతులు ఉంటాయో అవన్నీ రాజ్య వ్యవస్థలో, పాలనలో తప్పకుండా ప్రతిబింబిస్తాయి.

మంచి 'రాజ్యం' కావాలంటే మనుషులు 'మంచివాళ్ళు' అయి ఉండాలి. పైపైన ఎన్ని మార్పులైనా తీసుకురావచ్చును. ఇవేమీ వ్యవస్థను సమూలంగా మార్చలేవు.

ప్రజలు అమాయకులు, కల్లా కపటం తెలియనివారు – రోగాలు రొష్టులు వస్తే వాటికి పరిష్కారం డాక్టర్లు చూపుతారని వాళ్ళ దగ్గరకి వెడతారు. వాళ్ళు చెప్పిన ప్రకారం చేస్తారు. కాని రోగం నయం కావడం లేదు. కాగా ఇంకా ఎక్కువ అయిపోతుంది రోజురోజుకు – ఇదీ ఉపమానం. వ్యవస్థకు మూలపురుషులుగా ఉన్న అవినీతిపరులను పదవుల నుంచి తొలగించే పనిలో ఎన్నో రాజకీయ చతురతలు!

ప్లేటో ఈ పరిష్కారాలను పరిపూర్ణంగా పరిశీలించాడు.

మానవ స్వభావాన్ని వివరించి చెప్పాడు ఈ ప్రసక్తిలో.

కోరికలు, రాగభావాలు, జ్ఞానం... ఇవి మూడు పేర్లు.

కోరిక, ఆకలి, ఉత్సుకత, తాపత్రయం ఇవన్నీ ఒక గుంపు.

రాగభావం, ఆశాపాశం, చురుకుదనం, సాహసం – ఇవి రెండో గుంపు.

జ్ఞానం, ఆలోచన, వివేకం, తర్కం – ఇవి మూడో గుంపు.

మొదటి గుంపుకు మానవ శరీరంలో మూలస్థానం తొడలు. రెండవ గుంపుకు హృదయం, మూడో గుంపుకు మేధస్సు.

వీటి శక్తియుక్తులు అందరు మనుషులలోనూ సమానమే. అయితే ప్రమాణంలో మటుకు ఎక్కువ తక్కువలు ఉంటాయి. కొందరు కోరికలలోనే కూరుకుపోయి ఉంటారు. మరి కొందరు చురుకుగా వ్యవహరించగలుగుతారు. తతిమ్మా వాళ్లు తెలివిగా ఆలోచించి వ్యవహరిస్తారు.

కోరికలకు దాసులైన వాళ్లు అవి తీర్చుకోవడం కోసం యేమైనా చేయ బూనుకుంటారు. పోట్లాటలకు, పై పోటీలకు, వైరుధ్యాలకూ తయారవుతారు. వాణిజ్య పరమైన పనులలో ఉండవలసిన వాళ్ళు ఇలాంటి వాళ్లు.

చురుకుదనము, సాహసం ఉన్నవాళ్ళు వాణిజ్య వ్యవహారాలకు పనికిరారు. వీళ్ళు సంరక్షకులుగా సరిపడతారు. యుద్ధ సమయంలో, దేశ పరిరక్షణలో వీరి శక్తి యుక్తులు చక్కగా వినియోగం అవుతాయి.

అవగాహన, ధ్యానమగ్నత ఉన్నవాళ్ళు... మూడో గుంపుకు చెందినవాళ్లు. వీళ్ళకు కోరికలపట్ల, విజయంపట్ల మక్కువ లేదు. తమ ఆధిక్యత ఋజువుపరచు కోవాలని, తమ మాటే నెగ్గించుకోవాలనీ అనుకోరు. వీళ్ళకు ఎంతసేపూ జ్ఞానతృష్ణ. అందరి బాగూ వీళ్ళకు కావాలి. జ్ఞాన ఉపాసకులు, మూర్తులు వీళ్ళు. ప్రపంచంలో అందరిచేత అశ్రద్ధ చేయబడుతున్న వాళ్లు.

కోరిక, ఉత్సాహం, వివేకం – మూడూ కలిసి పనిచేస్తాయి మనిషిలో అయినా, రాజ్యంలో అయినా.

ఏ గుంపు వాళ్ళు ఆ యా పనులు చేసుకుంటూ ఉంటారు. ఒకళ్ళ పనిలో మరొకళ్ళు జొరబడరు. అప్పుడు అంతా సవ్యంగా ఉంటుంది.

ఇది ప్లేటో సూచించే పద్ధతి.

వర్తక వాణిజ్యాలలో తరిఫీదు పొందిన మనిషి 'రాజు' అయితే దేశానికి అరిష్టం తప్ప ఇంకేం ప్రాప్తించదు.

శ్రామికులు – సంరక్షకులు – పరిపాలకులు ఇలా మూడు తరగతులుగా విభజించాడు ప్లేటో మానవ స్వభావరీత్యా, మానవ వర్గాన్నంతా.

శ్రమ చేసి తరించగలవారు పంటలు, వాణిజ్యము చూచుకుంటూ దేశ సౌభాగ్యానికి దోహదం చేస్తారు.

సంరక్షకులు దేశ పరిరక్షణ పనులలో మునిగి ఉంటారు.

పాలకులు రాజనీతిలో చతురులు అయి ఉంటారు.

రాజనీతి అనేది కళ, శాస్త్రము కూడా. దీని కోసం ప్రత్యేక శిక్షణ అవసరం.

తాత్త్వికుడు అయిన రాజే (పాలకుడే) ప్రజల శ్రేయస్సును చక్కగా సమర్థవంతంగా తీర్చిదిద్దగలడు.

తత్త్వవేత్తలు రాజులు అయితే తప్ప, రాజులు తత్త్వవేత్తలకు ఉండవలసిన అనాసక్తత అలవరచుకుంటే తప్ప–విజ్ఞానము రాజనీతి చతురత ఒక్కుమ్మడిగా పనిచేయవు. అప్పటికిగాని రాజ్యంలోని అవకతవకలు, రుగ్మతలు తొలగిపోవు. మానవజాతి సర్వతోముఖంగా అభివృద్ధి పొందాలంటే తాత్త్వికుడైన పాలకుడు తప్పనిసరి.

– ప్లేటో రాజనీతిజ్ఞత హర్మ్యంలో ఇదీ బంగారు వాకిలి.

## మానసిక పరిష్కారం :

సరే, ఇదంతా బాగానే ఉంది. ఇప్పుడేం చేయాలి ?

దేశంలోని పిల్లలందరినీ పోగుచేయాలి. పదేళ్ళు పైబడినవాళ్ళ నందరినీ ఒకచోట చేరదీయాలి. అప్పుడు వాళ్లు తల్లిదండ్రుల దుష్ప్రభావాల నుంచి దూరం అవుతారు, అంటాడు ప్లేటో.

మనం ఆదర్శ రాజ్యాన్ని వ్యవస్థాపన చేయాలనుకుంటున్నాము. ఈ పని ఇప్పటికే కుళ్ళిన మనసులతో కుమిలిపోతున్న వాళ్ళతో చేయలేము. మనకు తాజా మనసులు, తాజా మనుషులు కావాలి. కడిగిన ముత్యాల వంటివాళ్ళు అవసరం. ఎవరో ఒక మహారాజు రావచ్చును, పాలకుడు ఉద్భవించవచ్చును. ఆయన తన రాజ్యంలో కొంత జాగా మనకు కేటాయించి ఈ పని చేయండి అని మనను పురమాయించవచ్చును. అందుకని మనం – అనుక్షణము తయారుగా ఉండాలి.

ఏది ఏమైనా ప్రతి బాలుడికి మనం విద్య విషయాలలో సమాన అవకాశాలు ఇవ్వాలి. ఎక్కడ ఏ కాంతి రేఖ ఏ రూపంలో ఉద్భవిస్తుందో మనం చెప్పలేం. దాని కోసం మనం అనవరతము వెదుకుతూ ఉండాలి. కనిపెట్టుకుని ఉండాలి. ఏ వీధిలో, ఏ జాతిలో మనకు అవసరం, అనుగుణం అయిన మణులు దొరుకుతాయో మనకు ముందుగానే తెలియదు గదా!

చదువులో ఎలా ఉండాలి ?

మొదటి పది సంవత్సరాలు – శారీరక శిక్షణతో సరిపోతుంది. ప్రతి పాఠశాల సరసన వ్యాయామశాల, ఆటస్థలం ఉంటాయి. ప్రతి కుర్రాడు ఆటపాటలలో హుషారుగా తయారవ్వాలి. ఈ పదేళ్ళ శిక్షణ పూర్తి అయ్యేసరికి, జీవితాంతం మందులు, మాకులు అక్కరలేని పరిపూర్ణ ఆరోగ్య పరిస్థితి అతడికి ఏర్పడాలి. ఇదీ గమ్యం.

సోమరితనం మప్పినందువల్ల – అశ్రద్ధ, అనారోగ్యం వస్తాయి. మందులు మాకులు సేవిస్తూ శరీరారోగ్యం గురించి గమనం ఇవ్వడంతోనే సరిపోతుంది, జీవిత కాలం అంతా. ఈ స్థితిని మెరుగు పరచాలి. ఎవరికీ సుస్తీ పడి తీసుకుంటూ కూర్చొనే అర్హత లేదు.

ఉదాహరణకు ఒక వడ్రంగి ఉన్నాడనుకోండి. అతనికి సుస్తీ చేసింది. వెంటనే నయం కావాలని డాక్టర్ దగ్గరకు వెడతాడు! తక్షణ వైద్యం చేయమంటాడు. ఈ పూటే తన వృత్తి నెరవేర్చుకునేందుకు తగిన ఆరోగ్యం వచ్చే– ఇచ్చే – మందులు ఇవ్వమంటాడు. అంతేగాని తగిన విరామ యుక్తమైన ఆహారం, విహారం అవసరం అన్న సంగతి అతనికి తట్టదు. అతనికి అర్థమయ్యే విషయమల్లా సుస్తీపడటానికి తగినంత సమయం, విరామం తనకు లేదని ఏ పూట సంపాదన ఆ పూట చేతిలోనికి రాకపోయినట్లయితే తన కుటుంబ పోషణ కష్టం అయిపోతుందనీని.

ప్లేటో అంటాడు – ఆదర్శ రాజ్యం (Utopia) ముందు మనిషి శరీరంతో ప్రారంభం కావాలి.

ఎంతసేపూ శరీర పోషణ, రక్షణ, వ్యాయామం నేర్పుతూ ఉంటే మనిషి పెరుగుదలలో ఒక పక్కకే గమనం ఇచ్చినట్లు అవుతుంది. మరి అతనికి ఉదార స్వభావం, సాహసోపేతమైన వర్తనం నేర్పడం ఎలా ? ఈ రెండూ పరస్పర విరుద్ధమైన విషయాలుగా కనిపిస్తాయి. ఆటల పోటీలలో బహుమతులు, షీల్డులు సంపాదించడం మటుకే చేతనైన వాళ్ళు మనకు అవసరం లేదు. బహుశా సంగీత సాధన కొంత శాంతం, సరళత, సమరసత తీసుకు వస్తుందేమో! కొంతమటుకు న్యాయ వర్తనం కూడా నేర్పుతుంది, లయబద్ధమైన సంగీతం. ఈ తరంగాల వెనుక వెళ్ళి మనిషి తన ఆత్మ సౌందర్యాన్ని చూడగల స్థాయికి ఎదగవచ్చును. సంగీతం శీలసంపదను సరిదిద్దుతుంది; సాంఘిక రాజకీయ వ్యవహారాలలో సరైన భాగం వహించటానికి దోహదం చేస్తుంది.

సంగీతంలోని స్థాయిలు మారటంతోపాటు, రాజ్యంలోని స్థితి గతులు గూడా మార్పు పొందుతాయని అంటాడు ప్లేటో.

మనిషిలో లాలిత్యము, సౌకుమార్యము తీసుకురావడమే కాకుండా మంచి ఆరోగ్యం, మనస్సు ఏర్పడటానికి కూడా సహాయం చేస్తుంది సంగీత ప్రసారం.

సంగీతం వల్లనే నయం కాగల జబ్బులు కొన్ని ఉంటాయి. కోరింబాటిక్ పురోహితులు (Corybantic Priesis) జబ్బుపడ్డ స్త్రీలకు వేణునాదంతో చికిత్స చేసేవాళ్ళు, వేణునాదం వింటున్నంత సేపూ ఆ స్త్రీలు ఎగిరిగంతులాడుతూ, నృత్యం చేస్తూ చివరకు ఓపిక సడలి నేల కూలిపోతారు, స్పృహ కోల్పోతారు. వాళ్ళకు సేదతీర్చి తిరిగి స్పృహకు తీసుకు వచ్చినప్పుడు వెనుకటి జబ్బులు మళ్ళీ కనిపించవు. మెదడులో గూడు కట్టుకుపోయిన అనవసరమైన ఆలోచనలన్నిటికీ ఈ చికిత్స బాగా పనిచేస్తుంది.

ప్లేటో ఈ సందర్భంలో మాట్లాడుతూ ఉన్నప్పుడు, మానసిక విశ్లేషణం (Psycho-analysis) గురించి ఆ పేరు చెప్పకుండా ప్రస్తావిస్తాడు. మన రాజకీయ వాతావరణం కలుషితం అయిపోయింది. ఎందుకంటే మనిషి ఆలోచనా ధోరణిలో చిత్త ప్రవృత్తులలో ఉన్న అనేక కోణాలను, మూలలను విస్మరిస్తున్నాము. కలలు ఉన్నాయి. మనిషికి వచ్చే కలలను బట్టి అతని అవసరాలు, అవస్థలు అంచనా వేయటానికి వీలున్నది.

'కొన్ని కొన్ని సుఖాలు, కామనలు అనగత్యమైనవి; ఇవి న్యాయ సమ్మతమైనవి కూడా కాదు. ప్రతి మనిషిలోను ఇవి ఉంటాయి. కొందరిలో చట్టరీత్యా', తార్కిక ధోరణివల్ల అదుపులోనికి వస్తాయి. అనగత్యమైన కామనల స్థానంలో అగత్యమైనవి, అంతకంటే ఉదాత్తమైనవి చోటు చేసుకోవచ్చును. సుఖాల బలం తగ్గిపోవచ్చును. అది నీరపడవచ్చును. తార్కికత, వివేకము, నిద్ర పోతున్నప్పుడు మనిషిలో కలిగే వాంఛలు, మనిషి తనను తాను అదుపులోనికి తెచ్చుకున్నప్పుడు మటుమాయం అయిపోతాయి. మనలో పశుప్రవృత్తి ఉన్నది. మద్య మాంస సేవనం వల్ల అది ప్రకోపిస్తూ ఉంటుంది. దాని అభంకారంలో మునిగిపోతాం చాలా వరకు. అందుకనే యుక్తాహార విహారంలో శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ఎంత విశ్రాంతి కావాలి, విశ్రాంతి అనంతరం మనస్సు ఎలా తాజాగా ఉంటుంది. ఈ విషయాలన్నీ మనిషికి తత్త్వతః, ప్రత్యక్షంగా – అనుభవ పురస్సరంగా తెలియాలి. అప్పుడే అతను దురాలోచనలు, దుష్ట సంకల్పాలు లేకుండా సరళ ప్రవృత్తితో కాలక్షేపం చేయగలుగుతాడు. ఎంతో మంచివాళ్ళు అనుకుంటున్న వారిలో కూడా పశు ప్రవృత్తి నిద్ర సమయంలో ప్రకోపించి చరించటానికి అవకాశం ఉంది'.

సంగీతము, లయ మనసుకు, జీవితానికి అవసరం అయిన ఆరోగ్యాన్ని తీసుకు వస్తాయి. ఎక్కువ వ్యాయామం ఎంత చేటో, ఎక్కువ సంగీతం శ్రవణం, సాధన కూడా అంతే చేటు. ప్రతి దానికి 'యుక్తత' అనే ప్రమాణం ఉండాలి. మంచి అంగ సౌష్టవం ఉన్నంత మాత్రం చేత అతడు సత్పురుషుడు మాత్రం కాదు. అతడు కేవలం ఆటవికుడే. సంగీత సంప్రదాయాలు తెలుసుకున్న మనిషి తన ప్రవృత్తులను, ప్రకృతిని కరగదీసుకుని స్వర్గ ద్వారాలకు సమీపంగా వెళ్ళగల స్థితిలో ఉంటాడు. రెండింటినీ జాగ్రత్తగా మిళితం చేయడం అవసరం.

పదహారు సంవత్సరాల వయసు వచ్చిన తరువాత ప్రత్యేక సంగీత సాధన ఆగిపోవాలి. బృందగానాలు, భజన కీర్తనలలో పాల్గొనడం మటుకే ఉంటుంది. జీవితాంతం ఆటల పోటీలలో అప్పుడప్పుడు చేరినట్లు. అంతేకాదు, సంగీతం కేవలం సంగీతంగానే ప్రసారం కాకూడదు. జీవితంలోని ఇతర కళలతో దాని సమన్వయాన్ని సాధించాలి. చదువులన్నిటినీ సంగీత ప్రయుక్తంగా, చక్కని గేయాలుగా మలచి ఎందుకు బోధించగూడదో నాకు అర్థం కాదు – అంటాడు ప్లేటో. చదువులైనా, అసంసిద్ధ మనస్కులకు అందచేసే ప్రయత్నం ఉండకూడదు. దేనికీ బలవంతం, ఒత్తిడి ఉండకూడదు. ఆత్మ వికసించేందుకు తగిన విశ్రాంతి ఉండాలి; స్వేచ్ఛ ఉండాలి.

మనిషి స్వతహాగా స్వేచ్ఛ ఉన్నవాడు. అతనికి ఏం నేర్చుకోవాలి. ఏది అక్కరలేదు అనే స్వేచ్ఛ కూడా ఉన్నది. బలవంతాన నేర్చుకున్న విద్య మనసును ఆకట్టుకోదు, నిలవదు.

మనసు ఇలా స్వేచ్ఛగా ఉండి, శరీరానికి తగిన ఆహార విహారాలు, వ్యాయామ రీతులు ఒనగూడినప్పుడు మన ఆదర్శరాజ్యం అన్ని ప్రగతులకు, వికాసాలకు దోహదకారి అయిన వాతావరణంలో విలసిల్లుతూ ఉంటుంది. దీనినంతటినీ ఓ నీతి ప్రాతిపదిక క్రిందకు కూడా తీసుకురావాలి. రాజ్యంలోని ప్రజలందరినీ ఒక 'తాటి' క్రిందకు తెచ్చే ప్రయత్నం అవసరం. ఒక నీతి, ఒక రీతి ఉండాలి అందరినీ కలిపి కట్టేందుకు మనమంతా ఒక సమాఖ్యలో సభ్యులం సుమా అన్న సుహృద్భావం ఉండాలి అందరికీ. ఇది సహజంగా – తెచ్చి పెట్టుకున్నది కాకుండా – ఏర్పడాలి. సమాఖ్యలో సభ్యులు ఒకరి కొకరు సహాయకారులుగా మెలగాలనే విషయం కూడా సహజంగానే తెలిసి రావాలి. పరస్పర అవగాహన ఏర్పడాలి. మనిషి వస్తుతః దురాశా పరుడు. అన్నీ తనకే కావాలి అనుకునేవాడు. అలాంటి వాడిని ఇతరుల కోసం

కొంతలో కొంత మర్యాదగా, అనునయంగా ప్రవర్తించమని చెప్పడం, బోధించగలగడం ఎలా ? ప్రతి మనిషికీ ఒక పోలీసును వేయలేము కదా! అది దారుణమైన పని. ఖర్చుతో కూడినది, చికాకు కలిగించేదీని. ఇంతకంటే సుగమమైన మార్గం ఒకటుంది. సమాఖ్య నైతిక అవసరాలకు ఒక ఉన్నత అధికార పోషణ ఇవ్వడం, ఇదే మతం.

ప్లేటో అభిప్రాయాల ప్రకారం భగవంతునిలో విశ్వాసం లేకపోయినట్లయితే ఏ జాతి, ఏ రాజ్యము బలంగా, వీర్యవంతంగా ఉండదు. భగవంతుడు అని పేరు పెట్టకుండా, ప్రథమ కారణం అనో ప్రధాన తత్త్వం అనో పేరు ఇచ్చినందువల్ల తగినంత స్ఫూర్తి లభించదు. భక్తి ప్రేరణ జరగదు. అందుకు త్యాగాలు చేయడం సబబేననే దృష్టి ఏర్పడదు. హృదయం వ్రయ్యలైన వాళ్లకు, దురదృష్ట స్థితిగతులలో పడిపోయినవాళ్ళకు ఆరాధనా వస్తువు అవసరం. ఆత్మకు ఊరట కలిగించే బాహ్య వస్తువు కావాలి. ఈ పనులన్నీ భగవంతుడు అనే మూర్తి చేస్తుంది. అంతేకాదు; దురాశాపరులైన వ్యక్తులకు కాస్తో కూస్తో సంయమనం నేర్పటానికి, తమ దుష్ప్రవర్తనను కొంతలో కొంత సంబాళించుకోవటానికి కూడా భగవంతుడు అవసరం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే – భగవంతునిలో విశ్వాసం ఉంటే వ్యక్తిగతమైన మోక్షం, ముక్తి మొదలైన సౌకర్యాలలోను విశ్వాసం ఏర్పడుతుంది. మరో జన్మ ఉంది. అప్పుడు మరింత అనుకూలమైన వాతావరం ఏర్పాటు అవుతుంది అనుకున్నప్పుడు ఈ జన్మలో తగినంత ఊరటతో చనిపోవటానికి వీలవుతుంది. భక్తి విశ్వాసాలు మన బలాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచుతాయి.

ఈ విశ్వాసాలను ఋజువు చేయలేక పోవచ్చును.

భగవంతుడు కేవలం మన భక్తి, ఆశలకు మూర్తిమంతమైన వ్యక్తే కావచ్చును.

ఆత్మ అనేది సంగీత పరికరాన్ని ఆశ్రయించుకు ఉన్న తరంగం వంటిది కావచ్చును. పరికరం పోవడంతోటే అదీ వినాశం అయిపోవచ్చును :

... అయినా భగవంతుని పట్ల విశ్వాసం ఉండడంలో ఎలాంటి అవలయ, అస్తవ్యస్తమూ లేదు; దాని వలన ఎలాంటి ఇబ్బంది కలగదు. పైగా మనకు మన పిల్లలకు అచంచలమైన సుఖం, ఊరట, మంచి సంప్రాప్తం అవుతాయి, ఈ భావన వల్ల.

పిల్లల మనసులు కోమలమైనవి. వారికి మనము ప్రతిదీ వివరించి, విశదీకరించి అర్థం అయ్యేట్లుగా చెప్పలేకపోవచ్చును. వాళ్ళకు ఇరవై సంవత్సరాల వయసు వచ్చి స్వంతంగా నిర్ణయాలు తీసుకోగల స్థితికి వచ్చినప్పుడు మనం చెప్పే

మాటలు వాళ్ళకు రుచికరం కాకపోవచ్చును. తమ అభిప్రాయాలకు, అభిరుచులకు విరుద్ధంగా కనిపించిన భావాలను వాళ్ళు పక్కకు నెట్టివేయ చూస్తారు. ఇది జీవితానికి సంబంధించిన ప్రశ్న. కేవలం చదువులకు, అభిప్రాయాలకు పరిమితమైనది కాదు. వాళ్ళు కొన్ని కష్టదశలు గడపవలసి రావచ్చును. దుఃఖాలు సంప్రాప్తం అవవచ్చును. సంఘర్షణలకు ఆలవాలం కావచ్చును. ప్రతి సామర్థ్యము, చాకచక్యము కూడా తనకు అనుకూలమైన పరిస్థితుల కోసం ఎదురుచూస్తూ కూర్చుంటుంది. ప్రతి మూఢమైన ఆలోచన వెలుగులోనికి వచ్చి దానిని గురించి ఖచ్చితమైన పరిష్కారం తీసుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. ఈ పరీక్షలో నెగ్గుకు రాలేని వాళ్ళను, వాణిజ్య ఆర్థికపరమైన పనులలో నిమగ్నులను చేస్తాము. వ్యాపారులుగా, గుమాస్తాలుగా, ఫ్యాక్టరీ పనివారుగా, పొలాలలో శ్రమించే వాళ్ళుగా రూపొందుతారు వాళ్ళు. ఈ పరీక్ష నిష్పక్షపాతంగా వ్యక్తిగత ప్రమేయాలు ఏమీ లేకుండా జరుగుతుంది. ఒక మనిషి పాలకుడు కావలెనా, పారిశ్రామికుడు కావలెనా అనే విషయం గుత్తాధికారాల ఆధిపత్యం వల్ల, ఆశ్రితజన పక్షపాతం వల్ల తీర్మానం కాదు. మనుషుల ఎంపిక ప్రజాస్వామ్యం కంటె ప్రజాస్వామికం అయిన తీరులలో జరుగుతుంది.

ఈ పరీక్షలో నెగ్గినవాళ్ళు మరో పది సంవత్సరాలు చదువుకుంటారు; శిక్షణ పొందుతారు. శరీరము, మనస్సు, శీల సంపద – వీటన్నిటికీ గమనం ఉంటుంది శిక్షణలో. తరువాత వాళ్ళ మొదటి పరీక్ష కంటే పెద్దదైన, క్లిష్టమైన రెండవ పరీక్ష ఉంటుంది. దీనిలో తప్పినవాళ్ళు సహాయక బృందాలలో చేరుతారు. రాజ్య పాలనలో ఉపాంగశాఖలలో ఉద్యోగస్తులు అవుతారు. ఈ స్థితిలోనే ఎంపిక ఎక్కువ న్యాయ బద్ధంగా, నిష్పక్షపాతంగా జరగాలి. తప్పినవాళ్ళు, తను తక్కువ స్థానాలకు ఆనందంగా, అనుద్వేగకరంగా అంటుకుపోయి ఉండేట్లు చూడాలి. మొదటి పరీక్షలోను, రెండవ పరీక్షలోను తప్పినవాళ్ళు – తమ శక్తియుక్తులన్నిటినీ ఒకచోట చేర్చి మన ఆదర్శరాజ్యాన్ని వ్యతిరేకించి పనిచేయకుండా చూడడం ఎలా ?

వాళ్ళలో వాళ్ళు కూడబలుక్కుని, తమదే ఆధిపత్యం అయిన రాజ్యాన్ని సంస్థాపించరని ఏమిటి నిదర్శనం ? సంఖ్యాబలం ఉన్నది వాళ్ళకు. ప్రజాస్వామ్యంలో ఉన్న దురవస్థ – మందీ, మార్బలం సంఖ్యల పరిగణన – మన ఆదర్శరాజ్యాన్ని తలక్రిందులు కాకుండా చూచుకోవడం ఎలా ?

ఇందుకే మతము, మత విశ్వాసాలు మనకు మార్గదర్శకత్వం కావాలి. మతం పేరుతో వారి దురాగ్రహాన్ని రూపుమాప గలగాలి. మనం దేవుని పేరు మీదుగా దైవశాసనం దృష్ట్యా మనం వాళ్ళను శాసించగలగాలి.

'ప్రియ ప్రజలారా! మీరంతా పురజనులు; సోదరులు. అయినా భగవంతుడు మిమ్మల్ని వేరే తీరుగా నిర్మాణం చేశాడు. కొందరికి శాసించగల అధికారం, ప్రజ్ఞ ఉన్నాయి. వాళ్ళను భగవంతుడు బంగారంతో తయారుచేశాడు. అందుకనే వాళ్ళు ఎక్కడ ఉంటే అక్కడ పూజ్యత పొందుతారు. కొందరిని భగవంతుడు వెండితో తయారు చేశాడు. వాళ్ళు ఉపాంగ శాఖలలో మాత్రమే పని చేయవలసి ఉంటుంది. మరికొందరిని భగవంతుడు ఇత్తడి, ఇనుములతో తయారు చేశాడు అనిపిస్తుంది. వాళ్ళు కాయకష్టానికి, శరీర శ్రమకు మాత్రమే తమ కాలాన్ని వినియోగించవలసి ఉంటుంది. కాని మీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ఓ బంగారు తండ్రి ఒక్కొక్కసారి వెండి కొడుకును తీసుకు రావచ్చును. వెండి తండ్రి బంగారు తనయుడిని వెలికి తేవచ్చును – ఇదంతా భగవత్ శాసనం. బంగారు తండ్రి వెండి తండ్రికి – ఇనుము, ఇత్తడుల పుత్రులు కలిగినట్లయితే అప్పుడు వృత్తుల మార్పిడి అవసరం అవుతుంది. బంగారు తండ్రి తన తనయుడిని పాలకుడుగా చూడగూడదు. అతడు శరీర శ్రమకు పాలవుతున్నాడే అనే అనుకంప ఉండగూడదు. కాయకష్టం చేస్తున్న వాళ్ళ పిల్లలు ఒక్కమారు పాలక వర్గానికి బదలాయింపు కావచ్చును గదా! దైవ శాసనం ఏమిటంటే, ఇనుము, ఇత్తడుల పౌరులు, పాలకులు అయినట్లయితే, ఆ రాజ్యం నాశనం అయిపోతుంది 'చెదిరిపోతుంది, మాసిపోతుంది'.

–ఇలాంటి స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు, ఉపదేశాలు ఇచ్చి మనం అందరినీ వారి వారి స్థానాలలోనే ఉంచి, మన ప్రణాళిక ముందుకు పోయేట్లుగా చూచుకోవాలి.

సరే, రెండవ పరీక్షలో నెగ్గుకు వచ్చిన కొద్దిమందికి ముందు ముందు ఎలాంటి విద్యా శిక్షణ జరుగుతుంది ? చూద్దాం.

వాళ్ళకు తత్త్వశాస్త్ర బోధన జరుగుతుంది. ఇప్పుడు వాళ్ళ వయసు దాదాపు ముప్ఫయి సంవత్సరాలు గదా. అందుచేత అప్పుడే వాళ్ళకు కులాసాగా కాలక్షేపం చేసే అవకాశం ఇవ్వడం, వాళ్ళను చెడగొట్టడమే అవుతుంది. యువకులు – వాళ్ళకు తత్త్వశాస్త్ర వాద ప్రతివాదాలు రుచికరంగా అనిపిస్తే, ఖండన మండనాలే యుక్తమైనవిగా తయారైతే అంత మంచిది కాదు. కాట్ల కుక్కల మాదిరి తయారు కాకూడదు వాళ్ళు.

తత్త్వశాస్త్రంలో రెండు ముఖ్య విభాగాలున్నాయి :

ఒకటి : స్పష్టంగా ఆలోచించగలగడం

– ఇదే వేదాంత పరిశ్రమ

రెండు : చక్కగా, తెలివిగా పరిపాలించగలగడం

– ఇదే రాజకీయ నైపుణ్యం.

ముందు మన యువకులు చక్కగా, స్పష్టంగా, సూటిగా ఆలోచించగలగడం నేర్చుకోవాలి. అందుకోసం అభిప్రాయాల (ఆదర్శాల) సిద్ధాంతాలు (Doetrine of Ideas) చదువుకోవాలి.

ఈ సిద్ధాంతం ఇలా ఉంటుంది :

మనం చూస్తున్న విషయాల అన్నిటి వెనుక ఒక అభిప్రాయం మాత్రం, ఆదర్శం ఉంటుంది. ఇదే శాశ్వతమైనది, ఉదాహరణకు –

మనిషి ఉన్నాడు. అతని పేరు రామయ్యో, వెంకయ్యో, పుల్లయ్యో కావచ్చును. ఈ పేర్లు అంతరించి పోవచ్చును. కాని మనిషి అంటూ ఉన్నాడు. మనిషి స్వరూపం శాశ్వతమైనది.

నా చేతిలో పెనసలు ఉన్నది. దానితో కాగితం మీద ఒక సున్న గీస్తాను. తరువాత రబ్బరు తీసుకువచ్చి ఆ సున్నను చెరిపి వేస్తాను. నేను పెనసలుతో గీసిన సున్న ఆకారం చెరిగిపోయింది గాని, అసలు 'సున్న' అంటూ ఒకటి ఉండనే ఉన్నది గదా!

ఈ చెట్టు నిలిచి ఉంది. ఆ చెట్టు పడిపోయింది. ఏ ఆకారం, ఏ రూపం ఎప్పుడు పడిపోవాలి, ఎప్పుడు విడిపోవాలి అని సూత్రప్రాయంగా నిర్ధారణలు చేసే సిద్ధాంతం ఒకటి ఉంటుంది. ఆ సిద్ధాంతానికి ఆది, అంతం అనేవి లేవు. అది ఎప్పటికీ అచంచలంగా అమలులో ఉంటుంది. ఇంద్రియ జ్ఞానంతో – దృష్టితో – మనం ఈ ప్రపంచంలోని వస్తువులను చూస్తూ ఉన్నాము. అలాగే జ్ఞానదృష్టితో – మానసిక ప్రక్రియతో సిద్ధాంతాన్ని, వస్తువుల వెనక ఆశ్రయించుకు ఉన్న సిద్ధాంతాన్ని చూస్తున్నాము. పైకి ఇది మనకు గోచరం కాకపోవచ్చును. కాని ఉండనే ఉన్నది. సృష్టి ఆరంభం కావడానికి ముందు నుంచి, సృష్టిలోని అన్ని వస్తువులు అంతరించిన తరువాత కూడా ఇది ఉండనే ఉంటుంది.

ఒక వంతెన చూస్తున్నామనుకుందాం. కొన్ని వందల టన్నుల కాంక్రీట్, ఇనుము కనిపిస్తూ ఉన్నది స్థూలమైన దృష్టికి. కాని ఇంజనీరింగ్ కళ్ళకు మెకానికల్ సూత్రాలు, ఆకర్షక సూత్రాలు ఆలంబనగా ఒక నిర్మాణం అగుపిస్తూ ఉన్నది. అన్ని వంతెనలు ఈ సూత్రాల ప్రాతిపదికమీదనే నిర్మాణం అవుతాయి. ఈ సూత్ర ప్రాతిపదిక లేకపోతే వంతెనలు నిలువవు, కూలిపోతాయి. ఈ సూత్రాల సమన్వయ కర్తే భగవంతుడు. ఆయన ఈ సృష్టినంతటిని తన అరచేతిలో పెట్టుకుని చూస్తున్నాడు; గమనిస్తున్నాడు; రక్షిస్తున్నాడు.

ఈ సూత్రాల ప్రాతిపదిక, సాధారణ అవలంబన లేకుండా ఈ ప్రపంచం మనకు ఏ మాత్రమూ అర్థం కాదు. పసిపిల్లవానివలె మనం తెల్లబోయి తేరిపార చూడవలసి వస్తుంది. ఎన్నో వస్తువులు, పదార్థాలు వరుస, వావి లేకుండా గందర గోళంగా, చిందర వందరగా ఉన్నట్లు కనిపిస్తాయి. వీటిని వింగడించడం ద్వారా, సూత్రీకరించడం ద్వారా మనం ఒక అర్థాన్ని కల్పిస్తున్నాము. వాటి తత్త్వాన్ని బట్టి ఉపయోగాన్ని అనుసరించి కార్యకలాపాల తీరున మనం కొన్ని గుంపులుగా, శాఖలుగా విభజించి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. పుస్తకాల జాబితాలలో ఏ మాత్రం విభజన, వర్గీకరణ లేకుండా అన్నీ ఒక రాశిగా పోసి ఉంటే ఏమవుతుంది ? గుహకు ఆవల ఉన్న కాంతిపుంజం వల్ల ఏర్పడిన నీడలలా అవన్నీ జాడలు ప్రసర్తిస్తూ ఉంటాయి, అంతేకదూ ?

కనుక పై చదువుల ఉద్దేశ్యం ఏమిటంటే, ఈ మూల సిద్ధాంతాన్ని – అభిప్రాయాల సిద్ధాంతాన్ని – అర్థం చేసుకోవడం, వస్తువుల వెనకాల ఉన్న సామాన్య తత్త్వం ఏమిటి, వాటి పరిణామ గతులు ఎలా ఉన్నాయి, అభివృద్ధి ప్రణాళికలు ఎలా ఉన్నాయి, వీటి మధ్య ఉన్న ఆంతరిక సంబంధం – అర్థం – సంవిధానం ఏమిటి, అవి ఏ ప్రయోజనాన్ని తెలియచెప్పడం కోసం ఉన్నాయి. ఇదంతా ఆకళింపు కావాలి. బుద్ధి, చురుకుతనం, వివేకం ఇందుకు ఉపయుక్తం అవాలి.

ఈ సిద్ధాంత ప్రతిపాదనలో, ప్రభావాలలో అయిదేళ్ళపాటు శిక్షణ పొందిన తర్వాత దీనిని మనుషుల ప్రవర్తనలకు అన్వయం చేసుకోవడం కూడా తెలుసుకున్న తర్వాత, అప్పుడు వాళ్ళు పరిపాలకులుగా పనిచేయటానికి అర్హులవుతారు. అప్పటికి వయసు ముప్పై ఐదు సంవత్సరాలు వస్తుంది. రాజోచితమైన దుస్తులు ధరించి, ఆ కార్యకలాపాలను నెరవేర్చటానికి యోగ్యత పొందుతారు.

ఇంతటితో అయిపోయిందనుకోవటానికి వీలున్నదా ? లేదు. ఇంతవరకు జరిగినది సిద్ధాంతాలలో ప్రవచనమే. ప్రత్యక్ష అనుభవం దీనికి జత కావాలి. జీవిత పుస్తకం చూచి, చదువుకుంటూ వీళ్ళు సరికొత్త పాఠాలను నేర్చుకోవాలి. ఈ పరిశ్రమ మరో పదిహేను సంవత్సరాలు నడుస్తుంది. ఈ సంకీర్ణ శిక్షణను గూడా గడిచి కృతార్థులైనవాళ్ళు పాలకులుగా రూపొందుతారు.

యాభై సంవత్సరాల వయసు వచ్చింది. జీవితంలో పోరాటాలు, సందిగ్ధాలు, అతిశయాలు అన్నీ గడిచిపోయాయి. ఇప్పుడు సంప్రదాయము, అనుభవము, సంస్కృతి, సంఘర్షణ ఒక్కుమ్మడిగా ఇవ్వగల జ్ఞానాన్ని వీరు పొంది ఉంటారు. అప్పుడు రాజ్యపాలకులుగా ప్రవర్తిస్తారు.

## రాజకీయ పరిష్కారం :

ప్రజాస్వామ్యం అంటే అందరికీ సమాన అవకాశాలు, ముఖ్యంగా చదువులో, విద్యా సముపార్జనలో ప్రతి మనిషి పాలనా వ్యవహారాలకు అవసరం అయిన ప్రతిభను సంపాదించటానికి సమాన అవకాశాలు ఉంటాయి. అయితే ఇలా ప్రతిభ పొందినామని ఋజువు చేసుకున్నవాడు మట్టుకే, అన్ని పరీక్షలు గడిచి కృతార్థులైన వారు మట్టుకే – పాలనకు అర్హులు అవుతారు.

ఉద్యోగస్తులను ఎన్నుకోవడం ప్రజలలో నుంచి, ఓట్ల ద్వారా కాదు. అందుకు తగిన అర్హతలను కష్టపడి సంపాదించుకున్నప్పుడే. ప్రతి ఉద్యోగానికి కొంత శిక్షణ విధాయకంగా ఉంటుంది. క్రింది ఉద్యోగాలలో అనుభవం ఉండడం గూడా తప్పనిసరి షరతు.

అన్ని పనులు – రాజ్యాంగ ప్రక్రియలు నిజాయితీతో, నిష్పక్షపాతంగా జరుగుతాయి.

తత్త్వవేత్తలకు తగిన శిక్షణ ఇవ్వడం వల్ల వారివల్ల ఎలాంటి పొరపాట్లు జరగటానికి వీల్లేకుండా పోతుంది – అంటాడు ప్లేటో.

కేవలం ఆలోచనలకు, అభిప్రాయాలకు పరిమితమైన వాళ్ళు కారు, తత్త్వవేత్తలంటే కార్యాచరణలోనూ ఉత్సుకత ఉన్నవాళ్ళు.

పాలకుల ఋజు వర్తనకు ఆస్కారం ఇచ్చేందుకుగాను ప్లేటో కొన్ని నియమాలు కూడా చెప్పాడు.

వారికి ఆస్తిపాస్తులు ఉండవు. తప్పనిసరిగా ఉండవలసిన కనీసపు ఆస్తులు మాత్రమే ఉంటాయి. తమకై ప్రత్యేక ఏర్పాట్లు ఉన్న ఇళ్ళు, నివాస గృహాలు ఉండవు. ఎవరైన వారిని స్వేచ్ఛగా కలుసుకోగల సదుపాయం ఉంటుంది. కొద్దిపాటి జీతభత్యాలు మాత్రం ఉంటాయి. ధన, కనక, వస్తు వాహనాలు ఉండవు వారికి. ఇవి పోగుచేసుకున్నట్లయితే పాలక వర్గం నుండి దిగిపోయి క్రింది తరగతులకు వచ్చేస్తారు.

వాళ్ళ అవసరాలు గడుస్తూ ఉంటాయి. కనుక దొంగచాటు వ్యవహారాలతో నిమిత్తం లేదు. దురాశ, దురహంకారం ఏర్పడకుండా వాళ్ళకు ఇచ్చిన శిక్షణ 'రక్షా కవచం'గా ఉండనే ఉన్నది.

ప్రత్యేక ఆస్తులు లేనట్లుగానే ప్రత్యేక సంసారాలు, భార్యలు ఉండరు. కుటుంబ రక్షణ, బాధ్యతలు వాళ్ళకేమీ లేవు.

## నైతిక పరిష్కారం :

న్యాయం అంటే ఏమిటి ?

న్యాయం, సౌందర్యం, సత్యం – ఇవి మూడూ ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన అంశాలు. నిజానికి ఇవే ముఖ్యం. తతిమ్మావన్నీ పొల్లు.

వీటిని నిర్వచించటానికి కుదరదు.

ఎవరి స్వధర్మాన్ని వారు పాలించుతూ ఉండడమే న్యాయం అంటాడు ప్లేటో.

ఎవరి పని వారు చేసుకుంటూ ఉంటే అప్పుడు రాజ్యం ఎలాంటి అరమరికలు లేకుండా నడుస్తుంది.

ప్రతి మనిషి విశ్వమంతటినీ తనలో ఆవిర్భవించుకుని ఉన్నాడు; కోరికలు, రాగభావాలు, ఆలోచనలు అతనిలో గందరగోళంగానే ఉండవచ్చును. అయితే వాటికి ఒక సమరసత సాధిస్తాడు అతడు.

న్యాయం – ధర్మం అంటే ఒక క్రమత, సౌందర్యం.

చెడు – అక్రమం – అంతా అసమరత.

మనిషి తనలో తాను, తన పరిసరాలతోను, ప్రకృతితోను సమరసత సాధించాలి.

సమరసతతో కూడిన బలమే ధర్మం.

## ఆచరణలో అసాధ్యం :

ప్లేటో తన 'రిపబ్లిక్' లో రూపొందించిన ఆదర్శరాజ్యం ప్రత్యక్షంగా అవతరించడం అసాధ్యం అన్న సంగతి తనకు తాను ఎరుగును. అయితే ఊహాశక్తిని, ఆలోచనలను సుదీర్ఘంగా సారించి ప్రతి మనిషీ తన శక్తికి తగినట్లుగా పనిచేయడం మటుకు అవసరం అని సూచిస్తాడు. అప్పుడు కొంతలో కొంత ఈ ఆదర్శరాజ్యం భువికి దిగి వస్తుంది.

ఇదంతా ఊహలలో చిత్రణ. ఎప్పటికైనా ఇది ఊపిరి పోసుకోవచ్చును.

అసంగతమైన రాజ్యంలో కూడా సక్రమమైన మనిషి ఈ సూత్రాలను ఆచరించవచ్చును.

387 (క్రీ.పూ)లో ప్లేటోకు ఈ ఆదర్శరాజ్య ఆచరణకు సారథ్యం వహించే అవకాశం వచ్చింది. డెయొనిసియస్ (Dionysius) ఆయనకు ఆహ్వానం ఇచ్చాడు. అయితే ఆ రాజుకు త్వరలోనే తెలిసి వచ్చింది, తాను తత్త్వవేత్త అయితే రాజరికాన్ని వదులుకోవలసి వస్తుందని, అప్పుడు వెనక అడుగు వేశాడు.

ప్లేటో కడగండ్లతో ఆ రాజ్యం నుండి బయట పడవలసి వచ్చింది.

# ఆంతరికశాస్త్ర ప్రమాణాలు

**ప్లే**టో విశ్వాంతర్గతమైన ఆంతరిక శాస్త్రం ఎరిగినవాడు. విశ్వానికి సంబంధించిన అనేక మర్మాలు, రహస్యాలు ఆయనకు తెలుసును అనడానికి అతని రచనలలో ఎన్నో తార్కాణాలు కనిపిస్తాయి. తత్త్వశాస్త్రానికీ, ఆధునిక విజ్ఞాన శాస్త్రానికీ ఆలవాలమైన అనేక అభిప్రాయాలు ప్లేటో తన పుస్తకాలలో గుది గుచ్చాడు. విశ్వానికీ, సృష్టికీ సంబంధించిన రహస్యాలను చెప్పేటప్పుడు ఆయన తగు జాగ్రత్త తీసుకుని ఎంతవరకు బయలుపరచ వచ్చునో, ఏమేమి సంకేతంగా సూచనగా మాత్రమే చెప్పవచ్చునో గమనంలో ఉంచుకున్నాడు. ఈ ప్రపంచమంతా ఆదర్శరూపంగా – బీజవంతంగా– ఏదో మూలరసాన్ని ఆధారం చేసుకుని ఉన్నదన్నాడు ప్లేటో. బాంక్వెట్ (Banquet) అన్న పుస్తకంలో సృష్టిని గురించి, సిమియస్ (Simoeus) అన్న పుస్తకంలో పరిణామ ప్రక్రియ – విశ్వ నిర్మాణము సాంకేతికంగా చెప్పాడు.

భగవంతుడు అంటే విశ్వమంతా ఆవరించి ఉన్న వివేకం, బుద్ధి (Universal mind), ఆత్మకు అమృతత్వం ఉన్నదనీ అనడంలో ప్లేటో, పైతాగొరస్ సిద్ధాంతాలను పునర్వ్యక్తీకరిస్తున్నాడు.

* * * * *

ప్లేటో అనుయాయులు, శిష్య పరంపర ఆయన చెప్పిన మానసిక సిద్ధాంతాలను మటుకే ఎక్కువగా ప్రచారంలోనికి తీసుకు వచ్చారు.

పైతాగొరస్ తన సమకాలికుల బుద్ధి వివేకాలకు, విశేషానికి దోహదకారి అయ్యే బోధనలు చేశాడు. అతని సిద్ధాంతాలు ప్లేటోని... అత్యధికంగా ఆకర్షించాయి. అతని మనసులో హత్తుకుపోయాయి. పైతాగొరస్ సంఖ్యాశాస్త్ర పాఠాలకు ఇతడు తప్పుడు భాష్యాలు ఇచ్చాడని ఒక వాదం ఉంది. అరిస్టాటిల్, ప్లేటో–పైతాగొరస్ చెప్పని సంగతులు కొన్ని చెప్పాడన్నాడు. మనం అరిస్టాటిల్ చెప్పిన విషయాలను యధాతథంగా నమ్మలేము, తీసుకోలేము.

* * * * *

ఆర్ఫియుస్ (Orpheus), పైతాగొరస్ (Pythagoras) ల రచనలు క్షుణ్ణంగా చదువుకుని ప్లేటో ఈ ఆంతరంగిక విషయాలను తెలుసుకోగలిగాడు.

భగవంతుడు రేఖాగణితం (Geometry) ప్రయుక్తంగా విశ్వ నిర్మాణం జరుపుతాడు (భగవంతుడు అంటే ఒక మనిషి, వ్యక్తి అనుకోగూడదు. Universal mindకు సృష్టి స్థితిలో ఈ పేరు) అన్న సిద్ధాంతాన్ని ప్లేటో ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ఇతర దేశాల గుప్త సిద్ధాంతవేత్త (Occultists) – ముఖ్యంగా హిందూ ఆర్యులు, యాదులు – అంగీకరించినదే.

'మనిషి లౌకిక వ్యవహారాలలో తల మున్కలుగా మునిగిపోయి తన రెక్కలు కోల్పోయాడు. అంతకు ముందు అతను ఆధ్యాత్మ ప్రపంచంలో దేవతలతో సమంగా నివసిస్తూ ఉండేవాడు. ఆ ప్రపంచంలో అంతా యదార్థమూ– పవిత్రమూను' అన్నాడు ప్లేటో మనిషిని గురించి. రెక్కలు కోల్పోవడం సాంకేతిక ప్రయోగంగా అర్థం చేసుకోవాలి మనం. మనిషి ఇంకా రూపుకట్టుకోక ముందు కేవలం తేజోరూపంతో వ్యవహరిస్తూ ఉండేవాడు అని గూడా అన్నాడు.

సూర్యుడిని 'అమృతమయుడైన సజీవ మూర్తి' అన్నాడు ప్లేటో.

* * * * *

ప్లేటో తత్త్వ దర్శనం అంతా Mysteries లోనే ప్రదర్శితమైంది అంటాడు పోర్ఫరి (Porphyry). ఇతడు నియోప్లటనిక్ స్కూల్‌కు చెందినవాడు.

నిజం చెప్పినందుకు సోక్రటీస్ పొందిన శిక్షలు చూచి ఉన్నాడు గనుక ప్లేటో తాను చెబుతున్న విషయాలకు మూలాధారం ఏమిటో బయటపెట్టలేదు. 'చర్చి' అధికారులకు కోపం తెప్పించే పదజాలం వాడలేదు. 'అక్కెమిష్టులు' వాడే పదజాలాన్ని మటుకే ఉపయోగించాడు.

మన సాంప్రదాయ రచనలలో అంతరార్థం కోసం వెదకాలన్నాడు ప్లేటో. 'సిద్ధాంతాలు అంతం అవటంతోటే, ముగింపుకు రావడంతోనే – ఇతిహాసాలు (Mythics) బయలుదేరుతాయి.'

ఇంద్రజాలం, భూతాలను గురించి ఉన్న మూఢ నమ్మకాలతో వ్యతిరేకించి, వాటిని శతధా తిరస్కరించి వాదిస్తూనే, వాటికి కొంత తార్కికత, వేదాంత పరమైన యదార్థత తీసుకువచ్చాడు. ఇంద్రియ పరిజ్ఞానానికి అతీతమైన ఆధ్యాత్మ దృష్టి (Intution) గురించిన నమ్మకాలు ఉన్న వాళ్ళకు ప్లేటో చెప్పిన సంగతులు చాలా సమంజసంగానే కనిపించినాయి.

పరమ ఉన్నతమైన మనసు (Supreme Mind) అనేది ఒకటి ఉన్నదని, మనసులోని ఉన్నతాంశ (Spirit) దీనితో ముడిపడి ఉన్నదని – అందుచేతనే శాశ్వతమైన విలువలను అందుకోగలగడం మనిషికి సాధ్యం అవుతుందనే సిద్ధాంతీకరించాడు.

సత్యాన్ని ప్రత్యక్షంగా చూడగల సామర్థ్యము, సన్నివేశము భగవంతునకు (God) మటుకే ఉన్నాయి. ఈ సామర్థ్యం పట్ల కాంక్ష, సాధన, జ్ఞానతృష్ణ ఇదే తత్త్వశాస్త్రం (Philosophy). సత్యాన్ని కాంక్షించడం, ప్రీతిగా చూచుకోవడం అంటే మంచితనాన్ని కోరుకోవడం, కావాలనుకోవడమే. మనిషి తన సాధన క్రమంలో కృతార్థుడై దైవత్వంతో తాదాత్మ్యం పొందుతాడు. భగవంతునితో సారూప్యం పొందుతాడు. జీవయాత్ర ఉద్దేశ్యం ఇదే; దివ్యత్వం పొందడం జ్ఞానంతో సరితూగుతూ పవిత్రంగా ఉండడం.

⁕ ⁕ ⁕ ⁕ ⁕

ప్లేటోకు తత్త్వశాస్త్రము, ఆధ్యాత్మ శాస్త్ర అవలంబనము వేరు వేరు విషయాలు కావు. ఆయన దృష్టిలో రెండూ జతప్రోతంగా కలిసిపోయి ఉన్నవే. ఆయన ఉద్దేశ్యం ప్రకారం మానవులు సాధించవలసిన ఒకే ఒక లక్ష్యం: నిజమైన జ్ఞానం (Real Knowledge). ఇంద్రియాలకు గోచరమవుతూన్నంత మటుకే కాకుండా, వస్తువుల నిజ స్వరూపాన్ని చూడగలిగిన వాళ్ళే తత్త్వవేత్తలని, సత్యాన్ని ఉపాసిస్తున్న వాళ్ళని ప్లేటో అభిప్రాయం. క్షణ క్షణము మారుతూ ఉన్నది సరే, దానిని అలా ఉంచు; ఎప్పటికీ మారకుండా శాశ్వతంగా ఉండే లోకం ఒకటున్నది. ఈ లోకానికి ప్రతిరూపమే – ప్రతిబింబమే మనకు కనిపిస్తున్న ప్రపంచం, సృష్టి.

జగత్తుకు ఉపాదాన కారణం – అనుషంగిక కారణాలతోపాటు, అన్ని న్యాయాలు, సూత్రాలు, ప్రకృతి ధర్మాలు కలిపి – అయిన ఒక వివేకం (Intelligece or mind). ఇదే అన్ని తత్త్వాలకు మూలాధారమైన తత్త్వం. అన్ని ఆలోచనలు ఈ ప్రధాన సూత్రం పైన ఆధారపడే చరిస్తాయి. ఇదే జగత్తుకు అధినేత, నియంత. సృష్టిలోని వస్తువులన్నీ తమ రూపాలను, ఆంతరిక తత్త్వాన్ని – సత్యాన్ని – దీనిలో నుంచే పొందుతున్నాయి. ప్రథమ కారణం, ప్రధాన కారణం ఇదే. విశ్వమంతటినీ ఆవరించి ఉన్న సమరసత, సౌందర్యము, పరిపూర్ణత, మంచితనము – అన్నిటికీ నిలయమైన మూలరూపం ఇదే. పరమ శుభమైనది; భగవతత్త్వము అంటారు కొందరు దీనిని.

⁕ ⁕ ⁕ ⁕ ⁕

ప్లేటో వ్రాసిన The Republic అన్న పుస్తకంలో అతని జీవిత వేదాంతం అంతా ఇమిడి ఉంది. వేదాంతం, నీతి శాస్త్రం, మతం, వాచాలత్వం, రాజకీయాలు, కళలు – ఒకటేమిటి మానవ విషయ పరిజ్ఞానం అంతా ఇందులో విపులంగా చర్చించడం జరిగింది. ఆధునికము, సమకాలికము అయిన సమస్యలన్నీ ఇక్కడ సమాధానాల కోసం వెదుకుతాయి. కమ్యూనిజము, సోషలిజము, స్త్రీల ప్రత్యేక సమస్యలు, కుటుంబ నియంత్రణం మొదలైన విషయాల ప్రసక్తి ఈ సంవాదనలలో ఉంటుంది. ముందు తరాల తత్త్వవేత్తలకు ఆధార భూతమైన విషయాలు ఇక్కడ ఎన్నో ఉన్నాయి. ఆఖరుకు ఫ్రాయిడ్ విస్తృతపరచిన 'సైకోఎనాలిసిస్'కు బీజాలు కూడా ఈ గ్రంథంలోనే ఉన్నాయి. అందుకే ఎమర్సన్ అనే ఆయన 'ప్లేటోయే తత్త్వశాస్త్రం : తత్త్వశాస్త్రం అంటేనే ప్లేటో' అన్నాడు మెచ్చుకోలుగా.

రిపబ్లిక్ పుస్తకంలో ఏముందో తెలుసుకోవాలంటే దాన్ని చదవడం తప్ప ఇంకో మంచి మార్గం లేదు.

* * *

మనిషి అంటే – అవసరాన్ని పురస్కరించుకుని ఈ సృష్టిలో ఆటబొమ్మలా ప్రవేశించినవాడు అంటాడు ప్లేటో. అతని మీద బాహ్య ఆకర్షణల ప్రభావం ఎంతైనా ఉన్నది. భౌతికంగా పవిత్రుడైన మనిషి సుఖవంతుడు, అదృష్టవంతుడూను. ఎందుకంటే శరీరం పవిత్రంగా ఉంటే, అది సూక్ష్మ శరీరాలను కూడా పవిత్రంగా ఉండేందుకు ప్రోత్సహిస్తుంది. ఆత్మ తన పరిమితుల వల్ల తప్పులు చేయడానికి ఉద్యుక్తం అయినప్పటికీ తార్కికత ముందుకు వచ్చి మనిషిని పశుప్రాయుడు కాకుండా కాపాడుతుంది. మనిషికి కామ పూరితమైన వాంఛలు కలుగుతున్నాయీ అందుకు కారణం – వినాశం, విరూపం అయిపోయే వీలున్న స్థూల శరీరం. ఒక్కొక్క మారు అతడు నేరాలు చేసినా – శరీరానికి రుగ్మత చేసినట్లుగా – ఇందుకు కారణాలు భిన్నంగా ఉంటాయి. తప్పు చేయడం అనేది అతనికి కొన్ని పరిస్థితుల ప్రాబల్యం వల్ల తప్పనిసరి అవుతోంది. బాధ, భయం, కోపం – ఇలాంటి భావతరంగాలు అందువల్లనే సంప్రాప్తమవుతున్నాయి. వీటిని జయించగలిగితే, అధిగమించ గలిగితే అప్పుడు సక్రమ జీవన వర్తనం సమకూరుతుంది. అలా కాకుండా మనిషినే ఈ లక్షణాలు లోగొనేట్లయితే, వేరే చెప్పనవసరం లేకుండానే అతడు అక్రమ వర్తనంలో కూరుకుపోతాడు, బురద గుంటలో పడిపోయిన జంతువులా.

# స్త్రీలు – సంసారాలు

**ప్లేటో** పాలకులకు, రెండవ తరగతికి చెందిన రక్షక ఉద్యోగులకు వివాహం కూడదన్నాడు.

ప్రత్యేకమైన ఆస్తిపాస్తులు పనికి రావన్నాడు.

ప్లేటో అభిప్రాయాలు చాలా వింతగా, విడ్డూరంగా కనిపిస్తాయి.

'భార్యలు, పిల్లలు' జాతికంతకూ చెందిన ఆస్తి; ఎవరికీ స్వంతం కాదు.

స్త్రీలు వ్యాయామ పరిశ్రమలలో భాగం వహించాలి.

ప్లేటోకు అన్నిటికంటె రాజ్యము, రాజ్యాంగము ముఖ్యము – ఏ విషయాన్నయినా ఆయన దానికి ఉపాంగంగానే చూస్తాడు.

పురుషులకు, స్త్రీలకు అంగ సౌష్టవంలో కొద్దిపాటి వ్యత్యాసం ఉన్నది తప్ప, గుణగణాలలో ఏమీ తేడా లేదు. ఇద్దరికీ సమాన సామర్థ్యాలు ఉన్నాయి గనుక సమాన అవకాశాలు ఇవ్వాలి. అప్పుడే సంఘం ఇద్దరివల్ల తగినంత ప్రయోజనం పొందగలుగుతుంది.

'సంసారం' అనే వ్యవస్థనే మాఫీ చేయాలంటాడు ప్లేటో ఒకసారి.

అయితే మనుషుల లైంగికఅవసరాలు తీరాలి; కొత్త మనుషులు భూమిపై అవతరించాలి. అంటే సృష్టి కార్యం కొనసాగుతూ ఉండాలి.

జంతువులను సామూహికంగా పెంపొందించుకున్నట్లే, సంసారాలను గూడా తయారు చేసుకోవటానికి అవకాశం లేదా – అంటాడు ప్లేటో. పాలకులే జంటలను కూరుస్తారు. అందుకు ప్రత్యేక సన్నివేశాలైన వేడుక సమయాలలో సమాగమం జరుగుతుంది. పిల్లలు సమాజానికి ఉమ్మడిగా చెందినవాళ్ళు.

ఈ ఏర్పాటువల్ల కొంత మంచి ఉంది.

ఏమిటంటే – ఉత్తమ పౌరులు తయారవుతారు.

మనుషుల్లో పై పోటీలు, అనవసరమైన మమకారాలు, వివాహ వ్యవస్థలో ఉన్న లోటు పాట్లు తొలగిపోతాయి.

రక్షకులందరూ ఒకటే ఉమ్మడి కుటుంబం అవుతారు.

స్త్రీ రక్షకులు రాజ్యం కోసం పిల్లలను కంటారు.

మనుషుల కంటె రాజ్యమే మిన్న అయినది గదా ఆయన దృష్టిలో.

# వేదాంత విషయాలు

**మా**నసిక ప్రవృత్తి (ప్రకృతి) రెండు రకాలుగా ఉంటుంది. వస్తు ప్రపంచ ద్రవ్యంతో తయారైనది ఒకటి, శాశ్వత ప్రపంచ ద్రవ్యంతో తయారైనది రెండవది.

ప్రస్తుత భూలోక యాత్ర ఒక రకంగా పతనావస్థ; శిక్ష. ఆత్మ – శరీరంలో కూరుకుపోయి బాధలు పడుతూ ఉంటుంది. అంతకు ముందు ఉన్న సుషుప్తి అవస్థలో ఎన్నో పాఠాలు నేర్చుకుంది.

ఈ జీవితం యదార్థం అనుకోవడం కన్నా, స్వప్నం అనుకోవడం సబబు, సజావు.

లోయ (Cave) లో చిక్కుకుపోయిన మనుషుల మాదిరి మనం గోడమీది నీడలను మాత్రమే చూచి వాటినే యదార్థం అనుకుంటున్నాము. వెలుగును చూడడమే లేదు. అద్వైతంలో చెప్పే 'మాయ' ఇలాంటిదే. తత్త్వశాస్త్రం యొక్క ప్రయోజనం ఏమిటంటే– ఇటువంటి భ్రమ ప్రమాదాల నుంచి మనిషిని అవతలి గట్టుకు చేర్చటమే.

మనిషి తన అసలు రూపాన్ని (దివ్యమైన స్వస్వరూపాన్ని) ఒక్కమారైనా చూచి ఉండనట్లయితే, ఈ ఆకారాన్ని ఇప్పుడు పొందడం జరిగేది కాదు. అంతా పూర్వ స్మృతే. వీటిని గురించి సమాలోచన చేసుకోవడంవల్లనే దివ్యత్వం ఏర్పడుతుంది. మనిషి క్రమంగా పరిపూర్ణుడై, దివ్యజ్ఞాన జలధిలో ప్రయాణం చేయగలుగుతాడు.

⁕ ⁕ ⁕ ⁕ ⁕

ప్లేటో తత్త్వ దర్శనంలో ఒక క్రమత, పద్ధతి, ప్రయుక్తి ఉన్నాయి. ప్రపంచాలు, అందులోని జీవరాశులు ఆవిర్భవించడం (Species)– వాటి పరిణామం; విశ్వాన్ని నడిపించే శక్తి అంతర్గతంగా ఉంది, ఇది అన్నిటినీ సమరసంగా ప్రవర్తింప చేస్తుంది అనడం; వస్తు రూపాన్ని అధిగమించి ముందుకు వెళ్ళడం, ద్రవ్యము– శక్తి గూడా అవినాశమైనవి అని చెప్పడం... ఇవన్నీ ముందు తరాల విజ్ఞానవేత్తలకు, ఆలోచనలకు, ఋజువుల సముదాయాలను కనుగొనటానికి దోహదం చేసిన అంశాలు.

ప్లేటో వంటి ప్రగతిశీలమైన వేదాంత తత్త్వవేత్తను మరొకరిని చూపగలగడం కష్టం. అతడు తన బాల్యంలో, యవ్వనంలో అప్పటికి ప్రచారంలో ఉన్న రెండు సంప్రదాయాలను పరికించాడు.

హెరక్లిస్ అభిప్రాయ పరంపరలు.

సోక్రటీస్ ఆలోచన ధోరణులు.

ఈ రెంటినీ తన రచనలకు, అభిప్రాయాలకు ప్రాతిపదికగా చేసుకుని కాలానికి అనుగుణమైన పద్ధతిలో వాటిని చదువరులకు అందచేశాడు. తన శిష్యులకు, శ్రోతలకు ముఖతః చెప్పాడు.

ప్లేటోను కేవలం వేదాంత-తత్త్వవేత్తగానే భావించడం సరికాదు. అతడు పరిణత పొందిన శాస్త్రవేత్త కూడా (Man of Science). అతని వేదాంతపరమైన ఆలోచనలు, వస్తుగతమైన పరిణామాలనూ తమలో ఇముడ్చుకున్నాయి. జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం ఇతోధికంగా విస్తరించి పరిశీలనలు జరపటానికి దోహదం చేసినాయి.

ప్లేటో ఆత్మకు ఇచ్చిన నిర్వచనం :

'తనంత తానే కదలగల కదలిక'

'ఆత్మ అన్నిటికంటె సనాతనమైనది. కదలికకు ప్రారంభం ఇదే'.

'ఆత్మ శరీరం కన్న ముందుగానే ఆవిర్భవించింది. శరీరం ఉపాంగం; అనుషంగికం కూడా. ఆత్మకు అనునయంగా ఉండడం తప్ప దానికి మరో పని లేదు'.

'అన్నిటిని అన్ని దిక్కుల కదిలించి పాలించే ఆత్మ, స్వర్గాన్ని కూడా శాసించ గలుగుతుంది.'

ఈ అభిప్రాయాల మీద ఎన్నో వివరణలు, భాష్యాలు వచ్చినాయి.

ప్లేటో సామాన్య జనులకు వేదాంత విషయాలను వివరించగలగడం ఎంత వరకు సాధ్యమో, సబబో అంత మేరకే మాట్లాడాడు, వ్రాశాడు. విశ్వాన్ని గురించిన కొన్ని విషయాలను పూర్వ సంసిద్ధత లేనివారికి చెప్పగల అవకాశం లేదు. ఒక వేళ చెప్పినా సాంకేతికంగానో, మార్మికంగానో మాత్రమే చెప్పాలి. తగిన మాయలను (Blinds) ఇమడ్చాలి.

ఈ సంగతి అంతగా తెలియని వారికి, తెలిసినా దీనిని యదార్థము, సబబు అని నమ్మని వారికి ప్లేటో ఏదో 'తప్పించుకుపోయే మనిషి'గా కనిపిస్తాడు తప్ప

బాధ్యతగల వేదాంతిగా అగుపించడు. ఈ పరిస్థితిని మెరుగుపరచటానికి ఏమీ చేయలేము.

ప్లేటో ఇంకా కొన్ని పరమ ఏకాంతికమైన, వేదాంత విషయాలు వెల్లడించాడు.

'ఆత్మ అమృతమయం. ఎందుచేతనంటే దానిలో అంతర్గతంగా ఉన్న ఒక పొరపాటువల్ల అది తనను తాను నాశనం చేసుకోలేదు' అంటాడు ప్లేటో.

ఆత్మపరమైన జీవనం అంటే మంచితనాన్ని ఉపాసించడం. మంచితనానికి ప్రతిఫలం అంటూ ఏమీ లేదు. మంచితనం కోసమే దానిని ఉపాసించాలి. ఫలితం ఏమైనా సరే; దాని నుండి విడివడకూడదు.

అయితే మంచి మనిషి ఈ జీవితంలోనే తన సంఘం చేత, సమాజం చేత గౌరవించబడతాడు; మొదట్లో కొన్ని కష్టాలకు, నిష్ఠూరాలకు లోనైపోయినా.

మంచి మనిషి మరణానంతరం కూడా కొన్ని పారితోషికాలను పొందటానికి అవకాశం ఉంది. ఈ విషయలు 'ఎఱుక' అయినందువల్ల మనిషి బాధ్యత మరింత ఎక్కువ అవుతుంది. పునర్జన్మను గురించి కూడా ప్రస్తావిస్తాడు ప్లేటో. ఆయన అభిప్రాయాలన్నీ ఎక్కువగా ఆర్ఫిక్ (Orphic) సంప్రదాయం నుండి తీసుకున్నవే.

## దివికి భువికి లంగరు :

విశ్వ నిర్మాణాన్ని, పరివర్తన పద్ధతులను గురించి చెబుతూ ప్లేటో The Spindle of necessity అని ఒక సిద్ధాంతాన్ని ప్రవేశ పెడతాడు. అవసరాల కదురు లేక అత్యావశ్యకమైన కదురు అనుకోవచ్చును దీనిని.

భూమి కేంద్ర స్థానంలో ఉంది. స్థిరమైన నక్షత్రాలు దీనికి సుదూరంలో స్థావరించుకు ఉన్నాయి.

సూర్యుడు, చంద్రుడు ఇతర గ్రహాలు భూమికి, ఈ నక్షత్రాలకు నడుమ తమ తమ కక్ష్యలలో తిరుగుతూ ఉంటాయి.

ఇతర గ్రహాలు :

సూర్యుడు, చంద్రుడు, శుక్రుడు, బుధుడు, కుజుడు, బృహస్పతి, శని.

కదురు కేవలం సాంకేతికంగా ఉపయోగించిన మాట. ఇది భూమికి, స్వర్గానికి కలిపి కట్టే సాధనం.

దీనిని గురించి అనేక వాదోపవాదాలు ఉన్నాయి. ఎన్నో వ్యాఖ్యానాలు ఈ సిద్ధాంత ప్రతిపాదనను గురించి వెలువడ్డాయి.

# పునరవలోకనం

**ప్లేటో** అసలు పేరు అరిస్టోక్లిస్ (Aristocles). ఇతడు క్రీ.పూ. 327 మే నెలలో 26నో 27నో జన్మించాడు. కొందరు ఇతని పుట్టిన తేదీని 5 లేక 6 జూన్ 428 (క్రీ.పూ.) అని అంటారు.

ప్లేటో సంపన్న కుటుంబంలో పుట్టాడు. తండ్రి అరిస్టోన్ (Ariston), తల్లి పెరిక్షన్ (Perictione). అరిస్టోక్లిస్ (ప్లేటో) చిన్నతనంలో తన దేశంలో లభ్యం అయిన చదువులు చదివాడు. సంగీతం, వ్యాయామం నేర్చుకున్నాడు. మిలటరీ సర్వీస్ విధాయకంగా చేశాడు. చిన్నతనం నుంచి ఇతనికి కవిత్వం అన్నా, ఆవేశంతో–ఉద్వేగంతో ఊగిసలాడించే రచనలన్నా ఎక్కువ ఇష్టం. నాటకాలు, పురాణేతిహాసాల కథలు, జానపద సంగీత ధోరణులు ఇతనికి ఎక్కువ మక్కువ అయిన విషయాలు. రాజకీయ జీవితం కోసం ఇతడు కొంత ఉత్సాహపడిన మాట వాస్తవమే. 407 సంవత్సరంలో ఇతనికి సోక్రటీస్‌తో పరిచయం అయింది. అప్పటి నుంచి అతనికి 'అంతేవాసి'గా రూపొందాడు. సోక్రటీస్ భావపరంపరను ఇతడు పుణికి పుచ్చుకున్నాడని చెప్పవచ్చు.

సోక్రటీస్ చనిపోయిన తరువాత, ప్లేటో ఏథెన్స్ నగరం వదిలి వెళ్ళిపోయాడు. మెగర (Megara) లో యుక్లిడిస్ (Eucleides) అనే ఆయన దగ్గర ప్రవాసం ఉండిపోయాడు. దరిమిలా అయిదు సంవత్సరాల తరువాతనే అతను ఏథెన్స్‌కు తిరిగి రావడం జరిగింది. తరువాతి ప్రయాణాలలో ఈజిప్ట్, సిరిస్, మగ్నగ్రేషియా, సిసిలీ దేశాలు తిరిగాడు.

సిరకూస్ (Syracuse) లో ఉన్నప్పుడు ఇతడు, డియోన్ (Dion) తో సహవాసం చేశాడు. డియోన్ బావమరిది, దుర్మార్గుడు అయిన డియొనిసస్ (Dionysus) తోనూ స్నేహం చేశాడు. ప్లేటో రాజనీతిలోని దుర్మార్గాన్ని, హింసాకాండను గురించి చేసిన కొన్ని వ్యాఖ్యానాలు డియొనిసస్‌కు నచ్చలేదు. ఇద్దరికి విరోధం వచ్చింది. డియొనిసస్, ప్లేటోను స్పార్టన్ లౌకికవేత్త పొల్లిస్ (Pollis) అతనికి ధారాదత్తం చేసివేశాడు. పొల్లిస్ ఇతడిని ఎజినా (Ageina) అనే మార్కెట్ స్థలంలో – విపణి వీధిలో–అమ్మివేశాడు :

అందరు యుద్ధ ఖైదీలను అమ్మినట్లుగానే సిరీస్‌కు చెందిన అన్నిసెరిస్ (Anniceris) అనే అతను ప్లేటోను క్రయంలో కొని, అతనికి స్వేచ్ఛను ఇచ్చాడు. ఇందుకోసం అన్నిసెరిస్ చేసిన ఖర్చులను తిరిగి ఇచ్చివేసి అతడిని (ప్లేటోను) ఋణవిముక్తుడిని చేయాలని అతని స్నేహితులు తలపెట్టారు. అయితే అన్నిసెరిస్ వారి కోరికను మన్నించ లేదు, ఆ డబ్బును ఎకాడమీకి కావలసిన చోటును కొనడంలో ఉపయోగించడం జరిగింది. ఇది కట్టుకథే అంటారు కొందరు. నిజం అయినా, కాకపోయినా పుస్తకాలలోనికి ఎక్కిపోయింది గనుక మనం చెప్పుకోవచ్చును. నిజమని దేనినీ నమ్మవలసిన పనిలేదు.

ఏథెన్స్‌కు తిరిగి వచ్చిన ప్లేటో కొన్నాళ్ళు వ్యాయామకళాశాలలో ఉన్నాడు; తరువాత తను స్థాపించిన సంస్థను విస్తృతపరచి 'ఎకాడమీ' చేశాడు. ఆతని జీవితశేషం అంతా ఇక్కడే గడిచింది. జీవనము, చింతనము, బోధన, రచనా వ్యాసంగము అన్నీ 'ఏథెన్స్' నగరంలోనే చేశాడు.

ఎకాడమీలో కేవలం ఉపన్యాసాలు ఇవ్వడమే కాకుండా కొందరు ప్రత్యేక శ్రద్ధ ఉన్న శిష్యులకు ఆంతరిక విషయాలు బోధిస్తూ ఉండేవాడు. తాను వ్రాసిన 'సంభాషణల'ను ఉపయోగించుకుని, వాటిని వివరిస్తూ, విశదీకరిస్తూ విద్యార్థులతో విద్యా వ్యాసంగాలు చేసేవాడు.

జీవితం చివరి రోజులలో మటుకు ఎక్కువ ఉపన్యాసాలు, బోధనలు చేయకుండా – ఆ పనిని తన శిష్యులకు అప్పగించాడు.

సిరక్యూస్ (Syracuse) కు రెండవమారు ప్రయాణం చేసి అక్కడ డియోనిసస్ (Diunysus) ను తత్త్వదర్శనం వైపు మళ్ళించటానికి మరో ప్రయత్నం చేసి విఫలమయ్యాడు.

తరువాత సిసిలీకి మరోమారు ప్రయాణం చేసి డియొనిసస్‌కు, ఆతని మేనమామ డియొన్‌కు సయోధ్య కుదర్చటానికి ప్రయత్నం చేశాడు. అదీ విఫలమే అయింది.

ప్లేటో ఏథెన్స్ నగరంలో 347 (క్రీ.పూ.) మరణించాడు.

*　*　*　*　*

ప్లేటో కడపటి సంవత్సరాలు చాలా వరకు సుఖమయంగానే గడిచాయని చెప్పవచ్చును. ఆయన 'ఎకాడమీ'లో చదువుకున్న విద్యార్థులు చాలామంది పాలన వ్యవహారాలకు వెళ్ళారు. సమర్థవంతంగా పాలన చేశారు.

ప్లేటో తన ఎకాడమీలో పాఠాలు చెప్పుకుంటూ, శిష్యులకు కొత్త కొత్త సమస్యలు ఇస్తూ వాటి పరిష్కారాలు పరిశోధించి తెలుసుకుందుకు సహాయపడుతూ కాలం గడిపాడు.

శిష్యులను ఆప్యాయంగా చూచుకున్నాడు.

శిష్యులు ఆయనను ఆదరంగా గౌరవించారు.

* * * * *

ప్లేటో శిష్యుడు ఒకతను వివాహం చేసుకున్నాడు. వివాహ వేడుకలకు రమ్మని గురువుగారిని ఆహ్వానించాడు.

ఎనభై సంవత్సరాల ప్లేటో ఆనందంగా ఆ వేడుకలలో పాల్గొన్నాడు.

కొంతసేపు అయిన మీదట, ఆ ఇంటిలోనే ఒక విశ్రాంతి మందిరంలోనికి వెళ్ళి చిన్న కునుకు తీయనారంభించాడు.

తెల్లవారింది.

విందు సంరంభం అంతా సద్దుమణిగింది.

ఎవరో ఆయనను మేలుకొల్పటానికి వచ్చారు.

అదే ప్లేటోకు 'దీర్ఘనిద్ర' అయిందని గమనించారు.

రాత్రి – ఎవరికీ ఎరుక లేకుండా, ఏ మాత్రం సవ్వడి లేకుండా ప్లేటో దివంగతుడైనాడు.

ఏథెన్స్ నగరవాసులందరూ ఆయన అంతిమ ప్రయాణానికి నిట్టూర్పులు విడిచారు. తమ ప్రియతమ వేదాంతి, తత్త్వవేత్తను భారంగా సాగనంపారు.

**– సమాప్తం –**

# అరిస్టాటిల్

**ఏ**థెన్స్ నగరానికి ఉత్తరంగా దాదాపు రెండు వందల మైళ్ళ దూరంలో ఉంది స్టాగిర (Stagira) అనే నగరం. ఛాల్సిడి (Chalcidie) ద్వీపకల్పంలో ఉంది ఇది.

ఈ నగరంలో క్రీస్తుకు ముందు 384 సంవత్సరంలో జన్మించాడు అరిస్టాటిల్.

ఆయన తండ్రి అమింటస్ (Amyntas) అనే మసెడాన్ (Macedon) రాజుకు వైద్య సలహాదారు, స్నేహితుడూను. ఈ రాజు మనుమడే అలెగ్జాండర్ (Alexander).

ఆక్లెపాడ్స్ (Asclepiads) లోని వైద్యబృందంలో ఇతడు దరిమిలా సభ్యుడైనాడు; వైద్యశాస్త్ర పరిశోధనా రంగాలలో పని చేశాడు. తద్వారా శాస్త్రీయ దృక్పథం, పరిశీలనా దృష్టి అలవడినాయి. గొప్ప శాస్త్ర విజ్ఞానవేత్తగా రూపొందటానికి తగిన భూమికను సంతరించుకున్నాడు చిన్నతనంలోనే.

డెమస్తనిస్ (Demosthenes) కు సమకాలికుడు ఇతడు. ఇతని యవ్వనం దేశంలోని రాజకీయ కల్లోల పరిస్థితుల మధ్య గడిచిపోయింది. మెసడోనియన్ వంశం రాజరికంలో పాతుకుపోవటానికి కావలసిన అంతఃకలహాలు, యుద్ధాలు, తగాదాలు ఇతను కళ్ళారా చూచాడు.

అరిస్టాటిల్ చివరి రోజులు గూడా చారిత్రకమైనవే. ఈయన శిష్యుడు అలెగ్జాండర్ ది గ్రేట్ (Alexander The Great) పర్షియన్ల రాజ్య ప్రాబల్యాలను కూలదోసి తన ప్రాభవాన్ని యమునా నదీతీరం వరకూ తీసుకువచ్చిన రోజులు.

అరిస్టాటిల్ రాజకీయ సిద్ధాంతాలను గురించి పరిశీలించేటప్పుడు మనం ఈ విషయాలను గమనంలో ఉంచుకోవడం అవసరం. మహనీయుడు, మహానుభావుడు అయిన ఒక వ్యక్తి ఇంత సంకుచితంగా, కొద్దిగా ఎలా ప్రవర్తించగలిగాడా... అని మనకు విచికిత్స ఏర్పడకుండా ఉండాలంటే ఆనాటి చారిత్రక అవసరాలను గమనంలో ఉంచుకోవాలి. దృష్టిలో పరిమితులు, ఆలోచన ధోరణిలో కుదింపులు, ఆచరణ తీరులలో మదింపులు... మనకు బోలెడు అగుపిస్తాయి. 'బార్బేరియన్లు' సహజంగా

చిన్న తరగతికి చెందినవారు, కొద్దివారు. వీరిని అణగద్రొక్కడమే మనం అవలంభించవలసిన పద్ధతి – అన్న దానిలో అరిస్టాటిల్‌కు ఎలాంటి అపనమ్మకము లేదు. ఈ నాటికీ జాత్యహంకారం ఏదో రూపంలో, ఏదో రకంగా ప్రదర్శితమై ప్రజలను కల్లోలాలపాలు చేస్తూనే ఉన్నది. 'రంగు తేడా' జనానికి సహజమైన సత్శీలతను తీసుకురాలేక పోతున్నది.

సంకుచితమైన ప్రాంతీయ దృక్పథం, చిన్న చిన్న నగరాలే రాజ్యాలుగా విస్తరించ వచ్చుననే అభిప్రాయం పట్ల సంతృప్తి, రాజరికం పట్ల మక్కువ ఏకచ్ఛత్రాధిపత్యం మటుకే మంచిదనే అభిప్రాయం, విద్యా విధానాలలో తీసుకురావలసిన విస్తృత ధోరణులు, సాంఘిక సమస్యలను సృష్టించకుండా ఉండడము, మహోన్నతమైన ఆశయాలపట్ల – అతి ప్రాచీనమైన సంప్రదాయాలపట్ల ఉదాసీనత ప్రదర్శించడము– ఇవన్నీ గమనించినప్పుడు అరిస్టాటిల్ ఏ మాత్రమూ గతము, భవిష్యత్తు లేనటువంటి ఓ చిన్న ద్వీపకల్పం నుంచి వచ్చినవాడు సుమా – అనే సంగతి గుర్తుపెట్టుకోవడం అవసరం.

ఛాల్సిడిన్ నగరాలు, ఛాల్సిన్ నగరానికి వలస 'కాలొని"లుగా ప్రతిష్ఠాపన అయినాయి. కోరిన్త్ (Corinth) నగరం కూడా ఇటువంటి 'కాలొని'లను స్థాపించడంలో ముందంజ వేసింది. ఎథీనియన్ల సామ్రాజ్య సార్వభౌమతత్త్వం తారాస్థాయిలో ఉన్నప్పుడు, పెరిక్లిస్ (Pericles) పాలనలో ఈ జిల్లా పరగణా అంతా అతని ఆధిపత్యంలోనికి వచ్చింది. అర్కిమిడియన్ యుద్ధాల చివరి రోజులలో ఈ ఏథెన్స్ ఆధిపత్యం నుంచి తప్పించుకుని ఇవతలపడింది. ఇందుకు స్పార్తాన్ యోధుడు లౌకిక రాజ్యాంగవేత్త బ్రిసిదస్ (Brasidas) కారణం.

నాలుగవ శతాబ్దం ప్రారంభకాలంలో ఛాల్సిడిన్ నగరాలన్నీ కలిసి ఒక సమాఖ్యగా రూపొందవలెనని ప్రయత్నం చేశాయి; సంకల్పించుకున్నాయి. అయితే స్పార్తాన్లు ఈ ఉద్దేశ్యాన్ని ప్రతిఘటించారు, నిరోధించారు. ఫలితంగా ఈ నగరాలు మెసడొనియన్ రాజ్యవంశీయుల ఆధీనంలోనికి వచ్చి చేరుకున్నాయి. అరిస్టాటిల్ బాల్యంలో – శైశవంలో – ఉండిన పరిస్థితి ఇది.

ఒక తరం తరువాత –

మసెడాన్ (Macedan) కి చెందిన ఫిలిప్ సహాయంతో జరిగిన ఏర్పాటు ఫలితంగా ఈ ద్వీపకల్పం మెసెడొనియన్ రాష్ట్రంలో భాగంగా విలీనం అయిపోయింది.

అరిస్టాటిల్ వైద్యరంగానికి చెందినవాడని ఇంతకుముందు సూచనగా చెప్పుకున్నాం గదా; వీరిది అక్లెపైడే (Asclepiadae) సంప్రదాయానికి చెందిన వృత్తిరంగం. ఈయన తండ్రి పేరు నికొమస్ (Nichomachus), ఛాల్సిడిన్ రంగాన్ని స్పార్తాన్లు అణగద్రొక్కారు.

వైద్యరంగంతోను, మెసెడొనియన్ రాజకీయ పరిస్థితులతోను అతి బాల్యం నుండి సంబంధం ఉండడం వల్లనే అరిస్టాటిల్ ఆలోచన క్రమం, అది రూపొందిన తీరులో తయారైంది.

పద్దెనిమిది సంవత్సరాల వయసులో –

అంటే 367 – 66 సంవత్సరాలలో –

అరిస్టాటిల్ ఏథెన్స్ నగరానికి వెళ్ళాడు.

తత్త్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రాలలో పై చదువుల కోసం – అక్కడి ప్లేటోనిక్ ఎకాడమీలో (Platonic Academy) ప్రవేశించాడు. అక్కడ ప్లేటో (Plato) అనుయాయుడుగా, అంతేవాసిగా ఉన్నాడు దాదాపు ఇరవై సంవత్సరాలపాటు. విజ్ఞానశాస్త్ర విభాగంలో ప్రముఖ శిష్యుడుగా, విద్యార్థిగా తయారైనాడు.

347–46 సంవత్సరంలో ప్లేటో చనిపోయిన తర్వాత అరిస్టాటిల్ మూడు సంవత్సరాలపాటు ఆసియామైనర్ (Asiaminor) కు వెళ్ళాడు. తన స్నేహితుడు, సహ విద్యార్థి అయిన హెర్మియస్ (Hermeias) తో కలిసి ఇతడు తన శక్తి సామర్థ్యాల వల్ల ట్రాడ్ (Troad) లోని అటర్నస్ (Atarneus) కు రాజు అయ్యాడు. పెర్షియన్ రాజుల విరోధాన్ని తట్టుకుని తన ప్రాబల్యాన్ని అతి కష్టం మీద నిలుపుకోగలుగుతున్నాడు. ఈ హెర్మియస్ (Hermeias) కు దగ్గరి బంధువు అయిన (Niece) పిథియాస్ (Pythias) అనే అమ్మాయిని అరిస్టాటిల్ వివాహమాడాడు. వివాహం కులాసాగానే గడిచింది; జీవితం నిదానంగానే నడిచింది. మెరైన్ బయాలజీ (Marine Biology) కి అరిస్టాటిల్ చేసిన కైంకర్యం అయొలిక్ తీరానికి (Aeolic Coast), ఇతర దగ్గరి ద్వీపాల తీరాలకు ఎంతో ఉపయుక్తంగా రూపొందింది. హెర్మియస్‌తో కలిసి గడిపిన రోజులలో ఇతను ప్రధానంగా చేసిన పని ఇది. ప్లేటో తన విద్యార్థి ఈ రకమైన పరిశ్రమకు అనుకూలమైన మానసిక వాతావరణాన్ని పొందేందుకు తగిన రీతిగా శిక్షణ ఇచ్చాడు. ఎకాడమీలో ఇతడి పరిశోధనాంశాలు ఎక్కువభాగం జీవశాస్త్రానికి (Biology) చెంది ఉన్నాయి. ప్లేటో వంశీయుడైన స్పెసిపస్ (Speusippus) కూడా ఈ దిశలోనే కృషి చేశాడు;

అతడే ప్లేటో అనంతరం ఈ ఎకాడమీకి ప్రధాన ఆచార్యుడు అయినాడు. ప్లేటో అనంతరం, కొందరు ప్రధాన శిష్యులు తమ గురువుగారి రచనలను సంకలనం చేసి ప్రచురించే పనిలో నిమగ్నులైనారు. అంత వరకు ప్రచురణ కాని అనేక ఉపన్యాసాలను సేకరించి భద్రపరచగలిగారు. అరిస్టాటిల్ ఈ శిష్యవర్గంలో ప్రధానమైన వ్యక్తి.

343లో హెర్మియస్‌ను పెర్షియన్లు హత్య చేశారు. అరిస్టాటిల్ ఆతని స్మృతి చిహ్నంగా ఒక గీతాన్ని రచించాడు. భగవంతుని కళ్యాణ గుణాలు ఆయనలో ఎలా మూర్తీభవించినాయో ఆ గీతంలో వివరంగా ప్రోది చేశాడు.

తరువాత అరిస్టాటిల్ మెసిడోనియన్ కోర్టుకు తరలాడు. అలెగ్జాండర్‌కు 'ప్రయివేట్ ట్యూటర్' (బోధకుడుగా) నియామకం అయ్యాడు. అప్పుడు అలెగ్జాండర్‌కు పదమూడేళ్ళ వయసు. తరువాత ఇతడే అలెగ్జాండర్ ది గ్రేట్‌గా చరిత్ర ప్రసిద్ధి అయిన చక్రవర్తిగా రూపొందాడు. అరిస్టాటిల్ వంటి తత్త్వదర్శన సంపన్నుడు, అలెగ్జాండర్ వంటి సమతూకమైన సార్వభౌముడు – గురుశిష్యులుగా ఉండి తరువాతి తరాలవారు మెచ్చుకునే – కీర్తించే – పనులు ఎన్నో చేశారు. గ్రీక్ ప్రాచీన రచయిత అలెగ్జాండర్ జీవిత చరిత్ర వ్రాశాడు. ఈ పుస్తకంలో ఈ ఇద్దరి సంబంధం గురించి, అరిస్టాటిల్ ఎలా అలెగ్జాండర్ను ప్రభావితం చేసిందీ. అతను సమున్నత స్థానాన్ని అందుకునేందుకు దోహదం చేసిందీ వివరించాడు. అయితే ఇదంతా నిజం అనుకోవటానికి వీలులేదు. చరిత్రకారులు వ్రాసేదానికి, యదార్థాలకు పొంతన లేకపోవడం వింత కాదు.

అరిస్టాటిల్ నీతి శాస్త్రం, రాజకీయ శాస్త్రములపై (Ethics, Politics) వ్రాసిన పుస్తకాలు చూచినట్లయితే ఆయనకు రాజరికాలు, రాజ్యాంగాలు, ఆ హంగులు, అట్టహాసాలు ఎంత అయిష్టమో మనకు స్పష్టంగా తెలుస్తుంది. చిన్న నగరం, ఎలాంటి రాజకీయ పెరుగుదల, దురాక్రమణ వృత్తి లేకుండా స్వయం సమృద్ధిగా ఉండడం – ఇదే అతనికి ఎక్కువ ఇష్టం. అలెగ్జాండర్‌కు తన గురువుగారి కవిత్వరీతులు మటుకు కొన్ని వచ్చినట్లుగా చరిత్రకారులు ఉదాహరణలు చూపుతారు. ప్రపంచ సామ్రాజ్యాన్ని స్థాపించాలని అలెగ్జాండర్ కృషి చేస్తున్న రోజులలోనే గురువు తన సాంఘిక వ్యవస్థల గురించిన అభిప్రాయాలను రూపొందించాడు.

అలెగ్జాండరుకు గురువుగా ఎన్నుకోబడటానికి ముందు అరిస్టాటిల్‌కు ఆలోచనాపరుడుగా అంత గొప్ప పేరు లేదు. అంతకు ముందునుంచే వంశ

పారంపర్యంగా రాజరికపు దర్బారుతో ఆయనకు ఉన్న సంబంధం కారణం కావచ్చును. ప్లేటో శిష్యుడుగా కొంత పరిగణన మటుకు ఉన్నది. సిసిలి (Sicily) రాజకీయాలలో కొంత ప్రమేయం ఉన్నది. తన దండయాత్ర నడుమ బహుశ అలెగ్జాండర్ అప్పుడప్పుడు అరిస్టాటిల్‌ను కలుసుకుని 'జంతు సంబంధమైన నమూనాలను' అందచేస్తూ ఉండేవాడు.

ఇంతకూ చెప్పవచ్చిన విషయం ఏమిటంటే :

విధివశంగా అలెగ్జాండర్, అరిస్టాటిల్ ఒకచోట కలిసి ఉండి ఉండవచ్చును; పరస్పర అభిప్రాయ వినిమయం జరిగి ఉండవచ్చును. కాని ఇద్దరి అభిరుచులు వేరు, ఆసక్తులు వేరు, అంతరంగాలు వేరు. అవి కలుసుకోగల, కలిసిపోగల అవకాశం లేదు. అందుచేత ఒకరి అభిప్రాయం మరొకరిపైన ఉండినదని చెప్పటానికి తగిన ఆస్కారం కనిపించదు.

336లో అలెగ్జాండర్ తండ్రి మరణం సంభవించింది. ఆయనను దారుణంగా హత్య చేశారు. అలెగ్జాండర్ రాజరికపు బాధ్యతలు తీసుకోవలసి వచ్చింది. అప్పుడు అరిస్టాటిల్ యొక్క అవసరం ఏమీ లేకపోయింది ఆ స్థానంలో. అందుచేత ఆయన ఏథెన్స్‌కు తిరిగి వచ్చేశాడు. తన శాస్త్ర పరిశోధనలు, పరిశ్రమలలో మునిగిపోయాడు.

సరిగ్గా ఆ సమయంలోనే స్ఫుసిఫస్ (Speusippus) మరణం వల్ల ఎకాడమీ అధ్యక్ష పదవికి గూడా ఖాళీ ఏర్పడింది. ఈ స్ఫుసిఫస్ అనే అతడు అరిస్టాటిల్‌కు, జంతుశాస్త్ర పరిశోధనా విషయలలో – సహాధ్యాయి అయితే, ఎకాడమీకి అరిస్టాటిల్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకోకుండా ఛాలీడన్ (Chaleedon) కు చెందిన క్సెనొక్రటిస్ (Xenocrates) అనే అతడిని ఎన్నుకున్నారు. దీనివల్ల కూడా అరిస్టాటిల్‌కు కొంత నిరాశ ఏర్పడి ఉండవచ్చును. అయినా ఆయన ఎకాడమీతో తన సంబంధాన్ని మటుకు తెంచి వేసుకోలేదు. కాకపోతే 335లో లిసూమ్ (Lyceum) వద్ద దీనికి పోటీగా మరో ఎకాడమీని స్థాపించాడు. ఎపొల్లొ లైసూమ్ (Appollo Lyceum) అనే దేవాలయానికి చెందిన వ్యాయామ పాఠశాల సరసన ఈ కొత్త అకాడమీ ప్రారంభం అయింది. దీనికి అరిస్టాటిల్‌తోపాటు కొందరు ఇతర బోధకులు గూడా ప్లేటో ఎకాడమీ నుంచి వచ్చి చేరారు.

తరువాత పన్నెండు సంవత్సరాలూ ఆయన ఈ పాఠశాలను అభివృద్ధి చేయడం కోసమే శ్రమించాడు. విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రాల పరిధిలో ఎన్నో ఉపన్యాస

వేదికలు, పరిశోధనాలయాలు, బోధన ప్రక్రియలు ఉండేవి ఈ ఎకాడమీకి ఉపాంగాలుగా.

ప్లేటో ఎకాడమీకి ఈ పాఠశాలకు ప్రధానమైన భేదం ఒకటి ఉంది. ప్లేటో ఎకాడమీలో వైజ్ఞానిక పరిశోధన అంతా 'గణితశాస్త్రం' కేంద్రంగా, పరంగా జరుగుతూ ఉండేది. అయితే ఈ కొత్త పాఠశాలలో మటుకు ఈ పరిశోధనలన్నీ 'జంతుశాస్త్రం, చరిత్రల' ప్రాతిపదికలో మటుకే జరుగుతూ వచ్చాయి.

అలెగ్జాండర్ జీవిత చరమదశలో మళ్ళీ ఆయన గురువుగారిని తలుచుకోవడం జరిగింది. అరిస్టాటిల్ బంధువు కల్లియోధెనెస్ (Callisthenes) అనే అతను చరిత్రకారుడుగా అలెగ్జాండర్ పరివారంలో ఉండేవాడు. అలెగ్జాండర్ రాజరికపు దర్పం ఇతనికి అంతగా రుచించలేదు. తన పరివారం పైన ఇలాంటి దురహంకార ప్రదర్శనలు జరగడం సహించలేకపోయాడు. కాని అలెగ్జాండర్ దృక్పథంలో ఎలాంటి మార్పు లేదు. చరిత్రకారుడి మీద ఒక సిపాయి నౌకరును చంపాడనే నేరారోపణచేసి, అతనికి శిక్ష విధించడం జరిగింది. ఉరిశిక్షలో చంపివేయడమో, లేక పాడుబడ్డ గోతిలో త్రోసివేసి – జైలులో బందీచేసి నింద, నేరము పరిష్కారానికి రాకముందే అతడు చచ్చిపోవడం జరిగింది. ఏమైనా ఈ చిన్న ఉద్యోగి తిరుగుబాటు ధోరణిని ప్రదర్శించాడానికి కారణం అరిస్టాటిలే అనే ఆలోచన అలెగ్జాండర్ మనస్సులో స్థావరించుకుపోయింది. ఆయన్ను ఎలాగైనా భంగపరచాలనీ, పగ తీర్చుకోవాలని ఆలోచన చేశాడు. అయితే ఇండియా మీదకు దండయాత్ర సన్నాహాలు చేయడంతో– ఈ ఆలోచనలకు కార్యరూపం ఇవ్వటానికి తీరిక లేకపోయింది.

323లో అలెగ్జాండర్ మరణించాడు. ఏథెన్స్‌లో మెసెడోనియన్లకు వ్యతిరేకంగా ఓ చిన్న తిరుగుబాటు ఉద్యమం రూపం ధరించింది. ఫిలిప్; అలెగ్జాండర్ల అభిప్రాయాలతో ఏ మాత్రము సంబంధము సానుభూతిలేని వాడైనా, అరిస్టాటిల్ ఈ ఉద్యమకారుల ఆగ్రహానికి గురికావలసి వచ్చింది, సోక్రటీస్ మాదిరే ఇతని పైన కూడా అభియోగాలు తీసుకువచ్చారు. ఎప్పుడో ఇరవై సంవత్సరాల క్రితం స్నేహితుడు హెర్మియస్ గురించి వ్రాసిన కవిత్వంలో అతడిని దైవాంశ సంభూతుడుగా సాక్షాత్తు భగవంతుడే అన్నట్లుగా చూపించి రచన చేశాడు అనేది అభియోగం. ఇది కేవలం కుంటిసాకు. నిజమైనది రాజకీయ కారణం : మెసిడోనియన్ నాయకుడు అంటిపేటర్ (AntiPater) తో సంబంధం ఉన్నదనేది. ఈ నేరం ఋజువు కావడం, శిక్ష పడడం

అనేది తథ్యం గనుక అరిస్టాటిల్ తన శిష్యులు, అంతేవాసిలతో కలసి ఛాల్సిస్ (Chalcis)కు తరలి వెళ్ళిపోయాడు.

ఆయన ఈ నగరంలోనే ఆ మరుసటి సంవత్సరం మరణించాడు. అప్పుడు ఆయన అరవై సంవత్సరాల వయసు దాటి రెండో, మూడో ఏళ్ళయింది.

అరిస్టాటిల్ ఎలా ఉండేవాడు అనేది ఆయన శిలావిగ్రహాలు చూచి తెలుసుకోగల అవకాశం ఉంది. ఆయన స్ఫురద్రూపి, సుందరుడు.

ఆయనను గురించి ప్రచారంలో ఉన్న కథలు, ఉదంతాలలో అరిస్టాటిల్ దయార్ద్ర హృదయుడు, ఉదాత్తుడుగా కనిపిస్తాడు. పుస్తకాలలో కనిపించే 'అహంభావం' ఆయన జీవనసరళిలో ఉన్నట్లు అగుపించదు.

ఆయన వ్రాసిన 'విల్లు' ఇప్పటికీ భద్రపరచబడి ఉంది. దాని ప్రకారం – తాను కులాసా అయిన కుటుంబ జీవితం గడిపానని చెబుతాడు. కుటుంబ సంరక్షణకు, పిల్లల పోషణకు, పరివారం శ్రేయస్సుకు ఎన్నో ఏర్పాట్లు చేశాడు ఆ విల్లులో.

అరిస్టాటిల్ రెండు వివాహాలు చేసుకున్నాడు.

మొదటి భార్య పిథియాస్ (Phthias).

రెండవ భార్య హెర్‌పిలిస్ (Herpyllis) ఈమె వల్ల ఒక కుమారుడు, ఒక కుమార్తె కలిగారు.

కుమారుడి పేరు నికొమకస్ (Nicomachus).

హెర్‌పిలిస్ మంచితనాన్ని గురించి విల్లులో ప్రత్యేక ప్రస్తావనలున్నాయి. ఆమె భవితవ్యానికి ఎన్నో ఏర్పాట్లు చేశాడు. అయితే మొదటి భార్య పిథియాస్‌తో ఆయనకు ఉన్న ఆత్మీయత సూచిస్తూ విల్లులో చేసిన ఏర్పాటు ఏమంటే... ఆమె చనిపోయిన తర్వాత ఆమెను తన సమాధి చెంతనే చేర్చాలని, చితాభస్మం కూడా ఒకచోటనే ఉండాలని!

ఇంకా సేవకులకు, ఇతర పరివారానికి ఎన్నో ఏర్పాట్లు చేశాడు. ఇవన్నీ చూచినప్పుడు తప్పకుండా అనిపించేదేమంటే – ప్లేటో చరమదశ కంటె, అరిస్టాటిల్ అంత్యదశ ఆర్థిక వసతితో హాయిగా, నిదానంగా గడిచిందని; ఆ గురువు కంటె ఈ శిష్యుడు మరింత ప్రశాంతంగా జీవించి, మరణించాడని.

# రచనలు

**అ**రిస్టాటిల్ రచనలు మనకు కొన్ని సమస్యలను, సందిగ్ధాలను తీసుకు వస్తాయి.

ప్లేటో నుంచి అరిస్టాటిల్ వంక మళ్ళడంతోటే మనం విభిన్నమైన వాతావరణంలోనికి వచ్చాం అనిపిస్తుంది.

"The Discourses of Socrates" 'సోక్రటీస్ ప్రవచనం ప్రబంధం' అన్నది ప్లేటో రచనల సంపుటం.

ఇది గద్య రచన.

సృజనాత్మకమైన శైలి.

హృదయంగమంగా చదివించుకుపోయే రచన.

తార్కిక పరిశీలన తగుమాత్రంగా కలిసిపోయిన ఉద్గ్రంధం.

చదవడంలో ఎలాంటి విసుగు, బరువు అనిపించకుండా అడప దడప– మధ్య మధ్య – హాస్యోక్తులు, పరిహాస ప్రసంగాలు చక్కగా రూపొంది ఉంటాయి.

మొత్తంమీద ఇది మహోన్నతమైన గ్రంధరాజం.

దీనికి భిన్నంగా – అరిస్టాటిల్ వచన శైలి బహు పెళుసుగా ముందుకు నడిపించుకుపోకుండా మరీ పదబంధాలతో, పడికట్టు మాటలతో ముంచెత్తుతూ ఉంటుంది. హృదయంగమంగా ఉండదు. శైలి సమరసమైనదికాదు. అప్పుడప్పుడు సామాన్య వ్యాకరణ సూత్రాలకు అతిక్రమణలు కూడా కనిపిస్తాయి.

అయితే విచిత్రం ఏమిటంటే –

తరువాత రచయితలైన సిసిరో (Cicero) మున్నగువారు అరిస్టాటిల్ రచనా రీతిని శైలిని సంవిధానాన్ని బహుళంగా పొగడుతారు; ఆకాశానికి ఎత్తుతారు. వారు చూసిన చెప్పిన మృదుత్వము, తీయదనము మనకు అరిస్టాటిల్ రచనలలో సుతరామూ కనిపించదు.

ఈ రెంటినీ సమన్వయం చేసి అర్థం చేసుకునేందుకు ఒకటే ఒక సులభ సూత్రం.

ప్లేటో, అరిస్టాటిల్ ఇద్దరూ గూడా ఉద్దండ పండితులు, రచయితలుగా నాణ్యత పొందినవారు. ఇద్దరూ సామాన్య పండితులకు, చదువరులకు అందుబాటులో ఉండవలెననే పుస్తకాలు వ్రాశారు. ప్రత్యేక శిక్షణ పొందుతూ ఉన్న శిష్యుల కోసం ఉపన్యాసాలు, ప్రవచనాలు చేశారు. ప్లేటో ప్రసంగాలు మనకు ఇప్పుడు యధాతథంగా లభ్యం కావు. కాని ఆయన పుస్తకాలు మాత్రం ఉన్నాయి. అరిస్టాటిల్ పుస్తకాలు మాత్రం మటుమాయం అయిపోయినాయి. కాని ఆయన ప్రసంగాలు, ప్రవచనాలు మాత్రం ఉన్నాయి.

సిసిరో ఇత్యాదులు ప్రస్తుతించిన అరిస్టాటిల్ రచనలు ఏమిటన్నమాట ? – ఆ వేదాంత, తత్త్వపరమైన సంభాషణలు. ఇదే నమూనాలో సిసిరో కూడా తన రచనా సాంప్రదాయాన్ని కొనసాగించాడు. ఇవి మచ్చుకైనా లేకుండా పోయినాయి. ఆయన శిష్యులు ఇక్కడ, అక్కడ ఉటంకించిన ఏ కొద్దిపాటి మాత్రమే మిగిలినాయి.

అందుచేత అరిస్టాటిల్ రచనలు అని చెప్పుతూ ఉన్నవి, ఆయన తదనంతరం ఆయన శిష్యులచేత గుదిగూర్చి సంలకనం చేయబడిన సరంజామా, దీనికి తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయి. నీతిశాస్త్రం, ప్రవర్తన తీరులపై ప్రసంగం (Ethics or Discourse on conduct) అనే పుస్తకం చూస్తే దీని రెండు రూపాంతరాలు (పాఠాంతరాలు) మనకు అందుబాటులో ఉన్నాయి. మొదటిది అరిస్టాటిల్ కుమారుడు నికోమకస్ తయారుచేసినది. రెండవది యూడిమస్ (Eudemus) అనే శిష్యుడు తయారుచేసినది.

కొడుకు తయారుచేసిన గ్రంథంలో అరిస్టాటిల్ శైలి, పద ప్రయోగం యధాతథంగా – కొరుకుడు పడటానికి కష్టంగా ఉన్నాయి.

శిష్యుడు తయారుచేసిన పాఠాంతరం కాస్త చదవటానికి వీలుగా అవగాహనకు అందుబాటులో ఉన్నది.

ఇటీవల ఈజిప్ట్ తీరాలనుంచి, అరిస్టాటిల్ రచన అంటూ 'ఏథెన్స్ నగర రాజ్యాంగం' అనే ఉపన్యాస వ్యాసం లభ్యం అయింది. ఈ వ్యాసం శైలి ముదావహంగా ఉంది. అంటే అట్లా వ్రాయదలుచుకున్నప్పుడు అరిస్టాటిల్ గూడా ప్రజల చేత చదివించేటట్లుగా, సుందరంగా, హుందాగా వ్రాయగలడన్నమాట.

# శాస్త్రీయ వర్గీకరణం

**సా**ధారణంగా జ్ఞానాన్ని ధనార్జనతో ఇతర సముపార్జనలకో ఉపయోగిస్తారు మనుష్యులు. అలా కాకుండా జ్ఞానాన్ని అనాసక్తంగా చూడగలగడం, దానివల్ల ఏదో ప్రయోజనాన్ని పొందాలనుకోకుండా ఉండడం అవసరం అంటాడు అరిస్టాటిల్. జ్ఞానం జ్ఞానం కోసమే, ఆత్మ సంతృప్తిని ఇచ్చేదే జ్ఞానం. కాని – నాలుగు రూకలు తెచ్చిపెట్టేది, ఇతర ప్రఖ్యాతులు తీసుకువచ్చేదీ జ్ఞానం అంటే.

ఈ రకమైన జ్ఞానాన్ని పోగుచేసుకుంటూ క్రమానుగతంగా తీర్చిదిద్దుకుంటూ ఉండడమే తత్త్వశాస్త్రం (Philosophy) యొక్క ప్రయోజనం అంటాడు ఆయన.

మనిషిలో అంతర్గతంగా ఒక ఉత్సుకత ఉంది. తన చుట్టూ కనిపిస్తున్న మహాద్భుతమైన ప్రకృతిని, సన్నివేశాలను చూచి ఆశ్చర్యంతో నోరు తెరుచుకు ఉండిపోవడం; ఆ వైచిత్రికి నిర్ఘాంతపోవడం. దీనితోనే కాలక్షేపం చేస్తూ కూర్చోవడం కుదరక పోవచ్చును. జీవితావసర వస్తువులు మరెవరైనా సేకరించి ఇస్తారన్న భరోసా లేకపోయినప్పుడు.

మానవ మేధస్సు సృష్టిలోని వైచిత్రిని చూచి ముందుగా పులకరించిపోయింది. ఆహా! ఏమి ఈ వస్తు సముచ్చయం! ఈ గ్రహాలు, ఇవి కాలగతిని అనుసరించి ప్రమాణాలు, పరిధులు ఏర్పరచుకోవడం, ఋతువులు క్రమంగా నడుస్తూ ఉండడం, గాలులు, ఉరుములు – మెరుపులు – ఇలాంటివన్నీ ఎంత విచిత్రంగా అనుభూతులను తీసుకువస్తాయి.

గ్రీస్ దేశంలో ముందుగా ఈ గ్రహ గోళాలను గురించి, ఆకాశ వర్తుల సంచారాలను గురించి అక్కజం మనసులలో చోటుచేసుకుంది.

తరువాత, ఈ చింతన ముదిరి మనిషి గణితంవైపు దృష్టి సారించాడు. రేఖాగణిత రూపాలు, అంకెలు వారి మేధస్సును మరికొంత దూరం తీసుకుపోయినాయి. ఖచ్చితమైన జ్ఞానాన్ని పొందటానికి అవకాశం ఉన్నదని ఒక భరోసా ఏర్పడింది. ఒక శాస్త్రంలో నిజమైన నిరూపణ అయిన సిద్ధాంతాలను ఇతర శాస్త్రాలలోనూ అవలంభించటానికి అవకాశం ఉన్నది సుమా... అనే మెలుకువ కూడా ఏర్పడింది.

సృష్టిని గురించి, పరమ సత్యాన్ని గురించి చెప్పే శాఖోప శాఖల విజ్ఞాన శాస్త్రంలో అంతిమస్థాయి ఈ తత్త్వదర్శనమే సుమా... అని దృఢ విశ్వాసం కూడా తయారైంది.

అరిస్టాటిల్ తన పరిశోధనల, ఆలోచనల ఫలితంగా తెలుసుకున్న విషయాలే సర్వశాస్త్ర పరిశీలనలోను 'చివరిమాట' అనుకున్నాడు. తన ముందు ఉండిన శాస్త్రవేత్తలు ఏదో ప్రేరణవల్ల కొంత కొత్త విషయ పరిగ్రహణం చేయగలిగినప్పటికీ, వారికి ఈ చివరిమాట అవగతం కాలేదని అది తనకే లక్ష్యం అయిందనీ తలపోశాడు. అందుచేతనే విజ్ఞానశాస్త్రంలోని అనేక శాఖలను పునర్వ్యవస్థీకరించడానికి పూనుకున్నాడు. వాటిలో ఒకదానితో మరొకటి ఎలా సమన్వయం పొంది ఉన్నాయో చెప్పటానికి, చూపటానికి ప్రయత్నించాడు. ఒకదాని వెంట మరోదాన్ని వేరుచేసి చూపడం ఎలాగో గూడా ఇతను చెప్పగలిగాడు. ఈ ప్రక్రియను మనమూ కొంతలో కొంత చూడగలిగితే తప్ప అరిస్టాటిల్ వివేకాన్ని స్పర్శించలేము.

ముందుగా – తత్త్వ శాస్త్రానికి రెండు విరోధి వర్గాలు ఉన్నాయి. అవి (Dislectle, Sophistry) డయలెక్టిక్, సాఫిస్ట్రీ అనేవి.

డయలెక్టిక్ అంటే దత్తాంశాన్ని పురస్కరించుకుని – అది నిజమైనా కాక పోయినా – తర్కపద్ధతిలో చర్చించుకుంటూ వెళ్ళిపోవడం. దీని విలువ దీనికి ఉన్నది. ఆ సంగతికి తరువాత వస్తాము. అయితే ఇది నిజము, అబద్ధము అనే మీమాంసను గురించి అసలు పట్టించుకోరు. అబద్ధాలైన ప్రాతిపదిక మీద సైతం వాదించుకుంటూ పోవచ్చును. పరిష్కారం ఎంత అసంబద్ధంగా ఉంటుంది అనేది చూపించవచ్చును. కాక, తాత్కాలికంగా కొన్ని ప్రాతిపదికలు తీసుకుని అది ఎంతవరకు సమంజసంగా నడిపించుకు వెడతాయి అనేది గూడా తార్కికంగా పరిశీలించవచ్చును. ఈ రెండు పద్ధతులలో దేనిని అవలంభించినా, సత్యం ఏమిటి అనేది తెలుసుకోవడం గమ్యం కానే కాదు. తార్కికతలో ఎంత నిబద్ధత, సంబద్ధత ఉన్నది అనేది ముఖ్యాంశం అయి కూర్చుంటుంది.

విజ్ఞానశాస్త్రంగానీ, తత్త్వ శాస్త్రంగానీ 'సత్యం' అనే దానిని పట్టుకోవడం కోసం అవగాహన చేసుకోవడం కోసమే కృషి చేస్తుంది, చేయాలి. సత్ఫలితాలు పొందవలెనంటే మనం తీసుకున్న ప్రాతిపదిక, దత్తాంశము 'సత్యస్ఫూరక'మైనవే కావలసి ఉంది. కనుక విజ్ఞాన శాస్త్రానికి, డయలెక్టిక్ వ్యత్యాసం ఏమంటే –

–విజ్ఞానశాస్త్రం సత్యప్రాంగణం నుండే బయలుదేరుతుంది.

–డయలెక్టిక్ అనేది 'బహుశ', 'కావచ్చును', 'అయివుండవచ్చును' అనే ఊహాపోహలతో బయలుదేరుతుంది.

పోతే, తన నైతిక సంవిధానంలో విజ్ఞానశాస్త్రానికీ, సోఫిస్ట్రీకి వ్యత్యాసం ఉన్నది. కేవలం తార్కిక ప్రజ్ఞను, వాదనాపటిమను ఉపయోగించి శాస్త్రీయ – లేదా నైతిక అసంబద్ధతలను నిజమని నిరూపించ బూనుకోవటం సోఫిస్ట్రీ. ఇదే జీవనోపాధిగా తిరుగాడేవాళ్ళు కొందరు ఉండేవాళ్ళు. Sophists అని వాళ్ళకు వ్యవహార నామం. అబద్ధమో, సుబద్ధమో తన వాసనలమీద నిరపేక్షగా నిరాక్షేపణీయంగా జీవనం గడిపేవాడు సోఫిస్ట్. అబద్ధాలపుట్టను గూడా ఆశ్రయించుకు ఉండి దాని ప్రచారం వల్లనయినా సరే – జీవనం నెరుపుకుందామని అనుకోవడం తప్పు పని. జ్ఞానాన్ని వ్యాపారసరళిగా ఉపయోగించుకోవడం అన్నమాట. తన ఉపన్యాసానికి శ్రోతల దగ్గర నుంచి రుసుము (పారితోషికం) వసూలు చేసుకోవడమే సోఫిస్ట్‌కు ముఖ్యమైన కర్తవ్యం. పోతే విజ్ఞానశాస్త్రంగానీ, తత్త్వశాస్త్రంగానీ సత్యాన్ని యధాతథంగా తెలుసుకుందుకు నిరాసక్తంగా చేసే ప్రయత్నం అని ఇదివరలోనే చెప్పుకున్నాం గదా.

ఈ రకమైన విభజన చేసుకున్నాక తర్వాత, ముందడుగు వేసి మరికొన్ని విషయాలు పరిశీలించేందుకు అవకాశం ఉంది.

సిద్ధాంత పరము, ఊహాపోహలపైనే ఆధారపడినదీ అయిన శాస్త్రవిజ్ఞానం; ప్రయోగాత్మకత సంతరించుకున్న శాస్త్రవిజ్ఞానము–ఈ రెండింటికీ వ్యత్యాసం ఉంది.

మూలంలో శాస్త్రానికి, కళలకు వ్యత్యాసం ఉంది. (పారిశ్రామికము – సాంకేతికము అయిన కళలు, లలితకళలు కాదు.) సిద్ధాంత శాస్త్రవిజ్ఞానానికి, ప్రయోగశీలవిజ్ఞానానికి వ్యత్యాసం ఏమిటంటే– ప్రయోజనంలోను, గమ్యంలోనూ స్పష్టత, వస్తు విషయంగాను తార్కిక పద్ధతిలోను భేదం.

అనాసక్తంగా జ్ఞాన సముపార్జన చేయడం; జ్ఞానాన్ని దాని కోసమే ఉపాసించడం, అది తీసుకువచ్చే లాంఛనప్రాయమైన పారితోషికాల కోసం కాకుండా చూచుకోవడం, సత్యాన్ని తెలుసుకోవడం ఒకటే గమ్యం.

ప్రయోగశీల శాస్త్రవిజ్ఞానంలో కూడా తెలుసుకోవాలనే గమ్యం ఉండనే ఉంది; అయితే ఇంత మాత్రంతో ఆగకుండా – ఈ జ్ఞానాన్ని ప్రయుక్తం అవుతున్న సన్నివేశాలకు, సంఘటనలకు అన్వయించుకుని కూడా పరిశీలించడం. నైతిక సాంఘిక

శాస్త్రాల పరిశీలనలో తటస్థపడే సమస్యలను గురించి అరిస్టాటిల్ ఈ వ్యత్యాసాలను నిష్కర్షగా చూపించాడు. మనకు మానవునికి సంబంధించిన నైతిక సాంఘిక ప్రకృతిని తెలుసుకోవడం కేవలం లాంఛనప్రాయమైన విద్య, మానసిక వ్యాయామం కోసం కాదు. తద్వారా విద్య, పాలన, రాజకీయం ప్రభుత్వ యంత్రాంగం, నీతి, మంచి చెడుల అనుషంగిక పరిచర్య – వీటినన్నిటినీ సరిదిద్దగలగడం తగిన రీతిని పునర్నిర్మించుకోవటం అవసరం ఉన్నదని ప్రయోగశీలవిజ్ఞానం చెబుతోంది.

అంటే తత్త్వశాస్త్ర పరిశోధనలో ఈ రెండురకాల వ్యత్యాసము ఉన్నదన్నమాట. విషయాలను తెలుసుకోవడం సిద్ధాంతపరంగా చర్చించుకోవడం ఒకటి అయితే, ఆ విషయాలను సిద్ధాంతాలను మానవ వర్తనానికి అన్వయించి చూచుకునేది మరొకటి– ఈ రకంగా చూచుకున్నప్పుడు కేవలం రాజనీతి శాస్త్రమే కాకుండా, వైద్యశాస్త్రము – ఆర్థిక శాస్త్రము గూడా ప్రయోగశీల విజ్ఞాన శాస్త్రంగా రూపొందుతాయి అనడంలో ఎలాంటి సందేహము లేదు.

సిద్ధాంత, ప్రయోగశీలక శాస్త్రాలలో ముగింపును గురించిన వ్యత్యాసం కూడా ఒకటి ఉన్నది. సిద్ధాంత శాస్త్రం యొక్క ప్రతిపాదనలు తమంత తాము రుజువు పరుచుకునేది అయిఉంటాయి. తార్కికంగా అతి సహజ సిద్ధంగా వాటిని రాబట్టుకోవచ్చును. ఇవి సార్వజనికమైనవి. పోతే ప్రయోగశీల శాస్త్రసంబంధమైన సూత్రాలు ఇలా సార్వజనికము, సర్వసమర్థనీయము అయినవి కాదు. సాధారణ సూత్రాలు – ఒక్కొక్కటి యదార్థం అవటానికి అవకాశం ఉంటుంది; ఇంత పరిమితమైన ప్రయోజనమైనవే అవి. కొన్ని కొన్ని సత్యాలకు సమన్వయం చేసినప్పుడు కొంతవరకు మినహాయింపులు కూడా ఏర్పడుతాయి. తత్త్వవేత్త తన తార్కిక జ్ఞానంలో నిష్ణాతుడు కాకపోవడంవల్ల ప్రయోగశీల సిద్ధాంతశాస్త్రం వంక దృష్టి మరలుస్తాడు. విషయం అనుకూలించినంత వరకు నిశ్చితము, నికార్సు అయిన ఫలితాలను పొందుతాడు కనుక అరిస్టాటిల్‌కు అవసరము – తప్పనిసరి మధ్య వ్యత్యాసం నిజమైనది. ఊహాజనితం కాదు. జీవితానికి సంబంధించిన అన్ని పరిశీలనలోను, శాస్త్రాలలోను 'జరగడానికి అవకాశం' ఉన్న పరిస్థితులే మార్గదర్శక సూత్రాలు అవుతున్నాయి.

సిద్ధాంత ప్రాతిపదికమీద ఆధారపడిన తత్త్వశాస్త్రంలో ఎన్ని విభాగాలు ఉన్నాయో చూద్దాం.

ప్లేటో ఇలాంటి విభాగాలంటూ ఏమీ లేవన్నాడు.

శాస్త్ర విజ్ఞానాలన్నీ అంతిమ సిద్ధాంతాల ఏకైక సంపుటం నుంచి ప్రవహించేవే; ఉత్పన్నం అయ్యేవే. దీనికే 'డయలెక్టిక్' అని ప్లేటో పేరు పెట్టాడు.

అరిస్టాటిల్ ఉద్దేశ్యం ఇది కాదు.

సిద్ధాంతపరమైన తత్త్వశాస్త్రం ఎన్నో విభాగాలుగా రూపొందటానికి వీలున్నదని ఆయన అభిప్రాయం. ప్రతి విభాగానికి దానికే స్వంతం అయిన ప్రాతిపదిక సూత్రాలు, పరిశోధన సూత్రాలు ఉంటాయి. ఈ విభాగాలు ప్రధానంగా మూడు :

1. తత్త్వశాస్త్రం (Philosophy)
2. గణితశాస్త్రం (Mathematics)
3. భౌతికశాస్త్రం (Physics)

తత్త్వశాస్త్రాన్నే – మధ్యయుగాల తర్వాత వేదాంతశాస్త్రం అని పేరు పెట్టి పిలుస్తూ వచ్చారు. అది అరిస్టాటిల్ మాటలలోనే చెప్పాలంటే అస్థిత్వాన్ని (Being) గురించి ప్రస్తావనలు చేస్తుంది. తెలుసుకోవటానికి వీలైన సత్యాన్ని గురించి (Reality) విశ్వజనీనము, ఆమోదదాయకము అయిన సిద్ధాంతాలను ప్రతిపాదిస్తుంది. అస్థిత్వాన్ని గురించిన సూత్రాలనన్నిటినీ క్రోడీకరిస్తుంది.

తత్త్వశాస్త్రం మటుకే అపురూపమైన కారణాల రూపురేఖలను గురించి చర్చిస్తుంది.

అరిస్టాటిల్ సిద్ధాంతరీత్యా భగవంతుడే (God) ఇలాంటి – ప్రముఖ – ప్రధాన ఉన్నత కారణం.

ప్రథమ తత్త్వశాస్త్రం (First Philosophy) ఈ భగవంతుని తత్త్వ పరిజ్ఞానాన్ని పోగుచేయడం ప్రధాన కర్తవ్యంగా భావిస్తుంది. అందుకనే దీనికి (Theology) ధర్మశాస్త్రం అని గూడా పేరు. ఈ రోజున 'Theory of knowledge' అని మనం పిలిచే సంగతులు, వేదాంత పరిచర్చ – జ్ఞానపరాకాష్ట, నిజమైన అస్తిత్వానికి చెందిన క్రమత – ఇవన్నీ దీనిలో భాగాలు.

గణితశాస్త్రానికి పరిమితమైన అవకాశాలు మటుకే ఉన్నాయి. ఈ శాస్త్ర అధ్యయన విషయాలు నిజానికి 'నిజమైనవి' కాదు. సంఖ్యలకు రేఖాగణిత సూత్రాలకు మటుకే నిజమైనవి.

సంఖ్య రూపము – ప్రత్యక్షంగా ఉన్న వస్తువులకే పరిమితమైనవి. గణిత శాస్త్రం తన అనుకూలం కోసం వీటిని సిద్ధాంతపరంగా ఉపయోగిస్తుంది. అందుచేత అరిస్టాటిల్ గణితశాస్త్రానికి, ప్రథమతత్త్వశాస్త్రానికి వ్యత్యాసం ఉన్నదంటాడు.

ప్రథమ తత్త్వశాస్త్ర ఉద్దేశ్యం – వస్తువుకు, కదలికలకు సంబంధించినది కాదు. గణితశాస్త్ర పరిశీలనలు మటుకు, కదలికలకు ఆస్కారం లేకపోయినా వస్తువును ఆశ్రయించుకు ఉంటాయే తప్ప వేరే అస్తిత్వంలో ఉండవు.

భౌతికశాస్త్రం వస్తువుల (Matter) తోను, వస్తువుల కదలిక (Motion) తోను ముడిపడి ఉంటుంది. అందుచేత వస్తువుల ప్రాథమిక పరిమితులపైన ఆధారపడి ఉంటాయి, ఈ మూడు శాస్త్రాల మధ్య ఉన్న వ్యత్యాసాలు.

ప్రథమతత్త్వశాస్త్రం అపరిమితమైన విస్తారం ఉన్నది. దీనితో ప్రమేయం ఉన్నది, దానితో ప్రమేయం లేదు– అన్న ఆటంకం దీనికి లేదు. ఆలోచన ఎంతవరకు విస్తరించగలదో అంతమేరకు ఇది చేతులు చాపగలదు. సత్యము, తెలుసుకోగలది అంతా ఈ పరిధిలోనికే వస్తుంది.

భౌతికశాస్త్రం (Physics) పరిమితమైన దనడంలో ఎలాంటి అభ్యంతరము లేదు. ఇది కేవలం వస్తు పరమైన విశ్వానికి సంబంధించినదే. అంతేకాకుండా దీని తాలూకు వస్తువులన్నీ మార్పుకు లోనైనవి, నాశనం అయితీరేవీని.

గణితశాస్త్రం – ఈ వరుసలో మాదిరిగానే – మధ్య మార్గాన్ని ఆక్రమించు కుంటుంది, ఆశ్రయించుకుంటుంది. భౌతిక శాస్త్రానికి ఉన్న ఒక అభ్యంతరం దీనికి లేదుగాని – ఆ రేఖలకు, అంకెలకు అపరిమితమైన విస్తృతి ఉన్నది, గణిత శాస్త్రజ్ఞుడి అంకెలు – వాటికవే హద్దులు; రూపాలకు పరిమితమై ఉంటాయి.

గణితశాస్త్ర ప్రతిపాదనలు తత్త్వశాస్త్ర ప్రతిపాదనల కంటె సరళంగా సూటిగా ఉంటాయి. భౌతికశాస్త్ర ప్రతిపాదనలు గణితశాస్త్ర ప్రతిపాదనల కంటె మరింత సూటిగా ఉంటాయి. గణిత శాస్త్ర ప్రతిపాదనలు మూడు విభాగాలకు సంబంధించినవేగాక తమకు తాము ప్రత్యేకంగా యదార్థం అయిఉండాలి, భౌతికశాస్త్రం కదలికకు లోనయ్యే అన్ని వస్తువులకూ చెందిన యదార్థాలను ప్రతిపాదనలుగా తీసుకు వస్తుంది. అందుచేత, ఈ మూడు విభాగాలు వేరు వేరు అయినవిగా భావించినా అవి ఒకదానికొకటి సంబంధంలేనివి కాదు.

పునర్వ్యక్తికరణ చేసి చెప్పుకోవాలంటే, ఈ మూడు విభాగాల పరస్పర సంబంధ, వ్యత్యాసాలు ఇలా ఉంటాయి :

శాస్త్ర విజ్ఞానమంతా రెండు తరగతులు :

1. సిద్ధాంత పరమైనది.

2. ప్రయోగశీలమైనది.

తిరిగి సిద్ధాంత పరమైన దానిలో ఈ మూడు విభిన్న విభాగాలు ఉన్నాయి.

1. ప్రథమతత్త్వశాస్త్రం లేదా ధర్మశాస్త్రం.

2. గణిత శాస్త్రం.

3. భౌతిక శాస్త్రం.

ప్రయోగశీలమైన శాస్త్ర విజ్ఞానాలలో ఎలాంటి విభాగాలను అంగీకరించలేదు అరిస్టాటిల్. కాని ఆయన తరువాతి శిష్యులు మాత్రం విభాగాలను తీసుకువచ్చి చెప్పారు. అవి :

నీతిశాస్త్రం (Ethics) : వ్యక్తిపరమైన ప్రవర్తన తీరులు.

ఆర్థిక శాస్త్రం (Economics) : గృహ వ్యవహారాల యాజమాన్య సిద్ధాంతాలు.

రాజనీతి శాస్త్రం (Politics) : రాజ్యాంగ వ్యవహారాల యాజమాన్య సిద్ధాంతాలు.

అరిస్టాటిల్ మటుకు ఈ విభాగాలను చేయలేదు, అంగీకరించలేదు అన్న విషయం మనం గమనించాలి.

ప్రవర్తన తీరులకు, రీతులకు ఆయన పెట్టినపేరు రాజనీతిశాస్త్రం (Politics) వ్యక్తి పరమైన ప్రవర్తనకు రాష్ట్ర రాజ్యగతమైన ప్రవర్తనకు ఆయన ఉద్దేశ్యంలో చెప్పుకోదగ్గ వ్యత్యాసం లేదు. వ్యక్తి పరమైన ప్రవర్తనారీతులను గురించి ఆయన ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని తయారుచేసి ఇచ్చాడు. (Ethics) అయితే ఈ పుస్తకం ప్రారంభంలోనే నేను చెప్పబోతున్నది రాజనీతిశాస్త్రం అన్నాడు ఆయన. సామాజిక వ్యవహారాల ప్రసక్తినుంచి వేరు చేసి వ్యక్తిపరమైన విద్యా విధాన పద్ధతులను ప్రత్యేకంగా చెబుతూ ఉన్నందుకు సంజాయిషీ లాంటి క్షమాపణలు చెప్పుకున్నాడు.

కళల తాత్త్వికతకు (Philosophy of Art) అరిస్టాటిల్ మాటలలో ప్రత్యేకమైన స్థానం లేదు, గుర్తింపు లేదు.

ఆయన శిష్యులు మటుకు–సృజనాత్మకతను మానసికతకు జోడించి తత్త్వ శాస్త్రాన్ని కూడా మూడు విభాగాలు తయారుచేశారు.

1. సిద్ధాంతపరము (Theoretical)

2. ప్రయోగశీలము (Practical)

3. ఉత్పాదకము (Productive)

దీని ఉద్దేశ్యం అరిస్టాటిల్ ప్రముఖ రచనలైన Poetics కు Rhetoric కు వక్తృత్వం, రచనలపై ఉద్గ్రంథాలు – సముచితమైన స్థానాన్ని సంపాదించిపెట్టటమే. కాని నిజానికి ఈ రకమైన మూడు విభాగాలకు తత్త్వ శాస్త్రంలో ఆస్కారం, అవసరం లేదు. ఎందుకంటే Rhetoric, Poetics అనే పుస్తకాలు తత్త్వశాస్త్ర విషయాలకు–చింతనకు సంబంధించినవి కానే కాదు. అవి కేవలం ఒక కరపత్రమో కాక విషాదాంత నాటకమో తయారు చేయటానికి ఇచ్చిన ఆధారసూత్రాలు. సాహిత్యపరమైన రసచర్చలు క్లిష్ట పరిశీలనలు ఇందులో లేవు. పదిహేడవ శతాబ్దానికి చెందిన నాటక కర్తలు, ప్రయోగకర్తలు ఈ విషయాన్ని స్పష్టంగా చూచి చెప్పగలిగారు. వారు అరిస్టాటిల్ ఉద్దేశ్యాలను అతిగా ఉత్ప్రేక్షించి చెప్పారు. కొన్ని మాటలకు వారు చెప్పిన అర్థాలు కూడా సరైనవి కాదు. ఒక విషయం వాళ్ళు చెప్పింది మటుకు నిజం; అరిస్టాటిల్ చెప్పిన సూత్రాలన్నీ అవలంబించి వ్రాసినట్లయితే తప్పకుండా విజయవంతమైన నాటకం తయారవుతుంది.

అరిస్టాటిల్‌కు కళలకు సంబంధించిన తత్త్వశాస్త్ర ప్రక్రియ ఏదైనా ఉంటే అది అతని విద్యా విషయక సూత్రాలకు అన్వయించి ఉంటుంది. కనుక Politics పుస్తకంలో విద్యను గురించి ఆయన చెప్పిన సంగతులు చూచుకుంటే చాలు.

మనం 'తర్కం' అని ప్రస్తుతం పిలుస్తున్న దానిని అరిస్టాటిల్ Anaiytics అనే పేరుతో వ్యవహరించాడు. ఎనైటిక్స్ అంటే శాస్త్రీయపరమైన విశ్లేషణ. సాక్ష్యాధారాలను బేరీజు వేయడం – తూనిక వేసుకు నిర్ధారణకు ఉపకరించేలా తయారు చేసుకోవడం. 'ఋజువు' అనేది అన్ని శాస్త్రాలలోను దాదాపు ఒకటే పద్ధతిగా ఉంటుంది. అన్నింటికీ సరిపడే ఈ పరిశీలనను అరిస్టాటిల్ ఎక్కువగా ప్రవేశపెట్టాడు. దరిమిలా, ఈ పద్ధతిలోని సబబును గురించి అనేక ప్రస్తావనలు వచ్చినాయి. తర్కం అనేది ప్రత్యేకంగా ఒక శాస్త్రంగా కొందరు పరిశీలించారు గూడా.

అరిస్టాటిల్ తార్కిక శాస్త్ర రచనలకు ఆర్గనాన్ (Organon) అని పేరు పెట్టాడు. ఆర్గనాన్ అంటే సాధనం; శాస్త్రం వినియోగించే నియమావళి – అని అర్థం. ఏ శాస్త్రమైనా తన పరిశోధనా ఫలితాలను సమీకరించటానికి అవసరం అయిన 'పనిముట్ల'ను ఈ తర్కం అందచేస్తుంది.

ఆయన తార్కిక సంప్రదాయసరళిని, విషయ పరిజ్ఞాన సిద్ధాంతాన్ని (Theory of Knowledge) కొంతలో కొంత తెలుసుకుందుకు ప్రయత్నిద్దాం.

స్టొయిక్ (Stoiec) సంప్రదాయానికి చెందిన వాళ్ళు తొలుత ఈ ప్రక్రియను ఆశ్రయించారు.

ఒక ఆలోచన ఉన్నది. అది ఒక విషయాన్ని అంగీకరించడమో, త్రోసిపుచ్చడమో చేస్తుంది. అందుచేత దాని ప్రాధాన్యత అవసరం.

ఒక ఆలోచన రూపం (Thought Form) సరైనదా, కాదా అనే విషయాన్ని ఇది నిర్ధారిస్తుంది. దీనిని ఆయన Subject, Predieate లుగా విభజన చేసి చూపాడు. దేనిని గురించి మనం అవుననో, కాదనో అంటున్నామో అది విషయం (Subject). దేనివల్ల అవునని, కాదనీ నిర్ధారణ అవుతున్నదో అది ప్రత్యయం (Predicate). దీనినే 'లక్షణం' అని గూడా చెప్పుకోవచ్చు. అందుచేత– ఆయన పదాల వర్గీకరణలలో ప్రవేశపెట్టిన సిద్ధాంతం, వస్తువుకు ప్రత్యయానికి ఉన్న సంబంధం మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇలా రెండూ సమపాళ్ళలో సమన్వయం కావాలనే అంశాలు గూడా మనకు అరిస్టాటిల్ రచనలలో అగుపిస్తాయి. పది వస్తు వివరణలు (Ten Categories) అని వాటిని ప్రస్తావించాడు అరిస్టాటిల్. తరువాతి కాలంలో వీటినే దురవస్థలు (Predicaments) అని రచయితలు ఉదహరించారు. ఒక వస్తువును మరొక వస్తువును పోల్చి చూపడంలో ఈ ప్రయోగాలు వస్తాయి.

ఒక సింహం ఉన్నది.

సింహం తెల్లగా ఉన్నది లేదా తెలివి అయినది.

– మొదటి వాక్యం 'వస్తువు'ను తెలుపుతోంది.

– రెండవ వాక్యం ఆ వస్తువు యొక్క లక్షణాన్ని వ్యక్తం చేస్తుంది.

– సింహం పొడుగ్గా ఉంది. అది అయిదు అడుగుల పొడుగు.

– ఈ వాక్యం లక్షణం యొక్క వివరాన్ని తెలుపుతోంది.

ఈ వస్తువు ఇతర వస్తువులతో ఎలా సంబంధితమై ఉంది; అన్నది తరువాత అంశం.

ఇతనికి అతడు తండ్రి; ఇతనికి అతడు కుడివైపు కూర్చున్నాడు..... అటువంటి పోలిక.

ఈ నాలుగు వస్తు వివరణలు గురించి అరిస్టాటిల్ ఎక్కువగా ప్రస్తావించాడు.

తతిమ్మా వివరణలు :

స్థలం, కాలం, స్థితి – శాశ్వతము, అశాశ్వతము;

జరుగుతున్న పని; ఈ పనినే కర్మణి ప్రయోగంలో చెప్పడం;

ఈ సందిగ్ధతలు, దురవస్థలు – సమగ్రంగా ఇక్కడ రూపొందిస్తున్నామని ఆయన చెప్పలేదు.

మొత్తం మీద ఈ అయిదు వర్గీకరణలలో ఒక సమగ్రత ఉన్నదని అరిస్టాటిల్ చెబుతాడు.

వస్తువును గురించిన లక్షణ వాక్యం. ఆ లక్షణ వాక్యం అన్ని వస్తువులకు సంబంధించడం, సంబంధించకపోవడం ఇక్కడ విశదంగా పరిశీలించడం జరిగింది.

'అ' అనే అతను జీవపదార్థం.

జీవ పదార్థాలన్నీ ఒకటి కాదు.

'ఆ' అనేది మరో జీవ పదార్థం.

'అ' లన్నీ 'ఆ'లు కావచ్చును; కాని 'అ' అన్నీ 'ఆ' లు అవుతాయని తప్పనిసరిగా చెప్పలేము.

మనిషి ఆలోచన పుణికి పుచ్చుకున్న జీవి.

తార్కికమైన యోచన పరిజ్ఞానం ఉన్న జీవి.

– ఈ వాక్యాలు మనిషి యొక్క ఆంతరిక స్వభావాన్ని, లక్షణాన్ని తెలియ చేస్తాయి.

మనుష్యులందరూ నవ్వగలరు.

నవ్వగల జీవులన్నీ మనుష్యులు –

అంతమాత్రం చేత మనిషి స్వభావానికి 'నవ్వు' మూల కందమైన విషయం అనుకోలేము.

మనుషులందరూ ఆలోచనాపరులు.

ఆలోచనా పరులందరూ మనుషులు–

ఇక్కడ ఆలోచన అనేది మనిషియొక్క లక్షణంగా ప్రస్తావితం అవుతుంది.

నిర్వచనం, ప్రతిపాదన, మూలాధార లక్షణం, వ్యత్యాసం, సంఘటన పరము... అన్న అయిదు వర్గీకరణలు అగుపిస్తాయి (Definition, Proprium, Genus, Difference, Accident).

ఈ వర్గీకరణను అరిస్టాటిల్ చూపినట్లే యధాతథంగా వాడుకోలేదు తరువాతి తరాలవారు.

ముఖ్యంగా నవ–ప్లాటోనిక్ (Neo-Platonic) తత్త్వ దర్శనవేత్త అయిన పోర్ఫిరీ (Porphyry) అనేక మార్పులు చేశాడు ఈ సిద్ధాంతాలకు, ఇతని మార్పులనుబట్టి వర్గీకరణలో స్థానభ్రంశం జరిగింది. మధ్యయుగంలో ఇది Genus, Species, Difference, Proprium, Accident వరుసలో రూపాంతరం పొందింది.

సోక్రటీస్ ఎవరు ?

ఒక గ్రీసు దేశవాసి –

ఒక తత్త్వవేత్త.

– ఈ రెండు సమాధానాలు ఒకటే అని చెప్పలేము.

మనం చేసే నిర్వచనాలు, వర్గీకరణలు అన్నీ – నియామకంగాను, ఆత్మాశ్రయంగాను ఉంటాయని అనలేము.

గుణ గణ విభాగంలో ప్రతిమారు సక్రమమైన తీరునే వ్యవహరిస్తున్నామని అనలేము – అంటాడు అరిస్టాటిల్.

ప్రకృతే సహజంగా కొన్ని విభాగాలు, వర్గీకరణలు చేసింది. వాటిని మనం జాగ్రత్తగా గమనించి పాలించగలగాలి. ఇదే మనిషి ఆలోచనా ధోరణికి తార్కాణం.

గుర్రానికి, గాడిదకు మధ్య సహజ సిద్ధమైన వ్యత్యాసం ఉన్నది. ఈ రెంటి సంపర్కం వల్ల ఉత్పన్నం అయ్యే కంచరగాడిద (Mule) తనంత తాను ఉత్పత్తి చేయలేదు అనలేము గదా.

కంచరగాడిద ఒక రకమైన విపర్యయం. సహజతకు భిన్నమైన జాతి.

ఈజిప్టియన్లను, గ్రీకువాసులను పోల్చి చూచినప్పుడు వస్తుతత్త్వంలో వ్యత్యాసం కనిపించకపోయినా, ఏదో వ్యత్యాసం ఉండే తీరుతుంది.

సోక్రటీస్ ఒక మనిషి – అన్నప్పుడు మనకు సోక్రటీస్ ఏమిటో తెలుస్తుంది. సృష్టిలో ఉన్న అనేక జీవరాశులలో సోక్రటీస్ 'మానవ వర్గం'కు చెందినవాడు అని తెలిసి వస్తుంది.

ఆయన చాలా తెలివైనవాడు, లేక వృద్ధుడు; లేదా తత్త్వవేత్త అన్నప్పుడు సోక్రటీస్ యొక్క లక్షణాలు, గుణాలు మనకు అవగతం అవుతాయి. నిజము, సహజసిద్ధము అయిన వ్యత్యాసాలను గమనించడంలో, నిర్వచించడంలో ఉన్న ఇబ్బందులు శాస్త్ర పరిజ్ఞానానికి ఎంతగానో దోహదం చేస్తాయి.

సాధారణంగా మనం అన్నిటినీ వర్గీకరణ చేసి చూపటానికి అలవాటుపడి ఉంటాము. అయితే ఈ వర్గీకరణ ప్రత్యేకతలన్నిటినీ – విలక్షణాలు అన్నిటినీ సమాధానపరచలేదు. వెలికితెచ్చి చూపలేదు. సర్వజనీనమైన సూత్రాలవైపు మొగ్గు చూపుతాము. ఒక సమూహంలోని వస్తువును, భాగాన్ని, ఒక ప్రత్యేక వస్తువుగా చూపించటానికి ప్రయత్నిస్తాము.

అంటే, ప్రతి వస్తువుకు ఏదో పేరు ఇచ్చి, ఈ పేరుకు ప్రతీకకు ఇచ్చి నిర్వచనాన్ని అందులో చూడాలని అనుకుంటాము. దీనికి నామినలిస్ట్ (Nominalist) అభిప్రాయ ప్రకటన అని పేరు.

అందుచేత ఒక సముదాయంలో ఎన్ని వస్తువులు ఉంటాయో అన్ని నిర్వచనాలు కూడా ఉండటానికి అవకాశం ఉంది. అయితే అరిస్టాటిల్ అభిప్రాయాల దృష్ట్యా ఇది చాలా క్లిష్టంగా తయారవుతుంది. ప్రకృతి చేసిన విభజనను గమనించాలి– అనడం ఇది మరింత కఠినతరం అవుతోంది.

శాస్త్రపరిజ్ఞానంలో ఏదో 'ఒక నిర్వచనం' అంటూ ఇస్తే సరిపోదు. వర్గీకరణకు మూలాధారమైన నిర్వచనం కావాలి. ప్రకృతి ఏర్పాటు చేసిన విభజనలను అనుసంధించి ఉండిన విభాగ లక్షణం గూడా ఈ నిర్వచనంలో వ్యక్తం కావాలి. ఇదీ అరిస్టాటిల్ చెప్పే కొండ గుర్తు. నిర్వచనం వల్ల ఆ వస్తువు యొక్క స్థానం మనకు ఇతమిద్ధంగా తెలియాలి. స్థితి అవగతం కావాలి; ప్రకృతి ప్రసాదించిన విభాగాలకు మరింత వివరప్రాయంగా ఉండాలి.

ఆధునిక పరిణామ శాస్త్రవేత్తలు ఇప్పుడు అరిస్టాటిల్ చెప్పిన విషయాలకు దగ్గరగా వస్తున్నారు తమ పరిశీలనలలో. అయితే ప్రథమ ప్రాధాన్యతలో మటుకు వారికి ఇంకా వ్యత్యాసం ఉన్నది. ప్రకృతికి ఎక్కువ ఆస్కారం ఇవ్వకుండా పరిణామంలో క్రమానుగతంగా వచ్చే మార్పులకు ప్రాధాన్యం ఇస్తారు వాళ్ళు. పరిణామం గూడా ప్రకృతిలో అంతర్భాగమే గనుక ఈ వ్యత్యాసాన్ని మనం అంతగా లెక్కలోనికి తీసుకో నక్కరలేదు. పరిణామం – మధ్యలో ఎదుగుదలకు పోషణకు ఆస్పదం ఇవ్వని 'స్పెసీస్' (Species) ను మరుగుపరచి, కాస్తో కూస్తో శాశ్వత రూపాలను ఇచ్చే తరగతులకే ప్రాధాన్యం ఇస్తుంది. తద్వారా నామ మాత్రమైన నిర్వచనానికి, నిజమైన నిర్వచనానికి కొంత దూరం ఏర్పడుతుంది. తతిమ్మా వాటితో తగినంత వ్యత్యాసాన్ని పొందిన రూపాల విషయంతోనే సరిపెట్టుకోకుండా, వాటి నుంచి పూర్తిగా విడివడి చారిత్రక అభివృద్ధి పొంది నిలచిన వాటికే ప్రాధాన్యం ఇస్తుంది పరిణామశాస్త్రం. ప్రథమ తత్త్వ శాస్త్ర పరిశీలనలో ఈ విషయాలను ఎక్కువగా విపులీకరిస్తాడు అరిస్టాటిల్.

ప్రతిపాదనల సిద్ధాంతంలో (Doctrine of Prepositions) గుణాలను అన్వయించే నాలుగు వ్యత్యాసాలకు కాక తద్విరుద్ధమైన అంశాలకు ప్రాముఖ్యం ఇస్తాడు.

సార్వత్రికమైన లేక ప్రత్యేకమైనదా; సరళమైనదా లేక విరసమైనదా అనే లక్షణాలను అటుంచి, మరింత ప్రాథమిక విషయాలకు తీసుకుపోతాడు అరిస్టాటిల్ తన చర్చలను.

రాశి, గుణముల మాదిరే (Quantity, Quality) రూప విధానం గూడా (Modality) ముఖ్యమే. ప్రకృతిలోని నియమాలలో నీటి ఉత్పన్నతకు తగినంత కారణాలు ఉన్నాయి.

మనం తీసుకునే అంతిమ నిర్ణయాలు కొత్తవి అవడం అంత ముఖ్యం కాదు, అవి ఋజువుకు లొంగడం అవసరం.

ఒక సత్యం యొక్క అంతిమ రూపాన్ని మనం ముందే ఎరిగి ఉండవచ్చును. అయితే దీనిని మనకు తెలిసివున్న అన్ని విషయాలతోనూ ముడిపెట్టుకుని సరిచూచుకోవలసిన పని ఉంది. దీనిని తగిన విధంగా సమీకరణం (Induction) చేసుకుని, ఇది ఎందుకు సత్యమైనదో నిర్ధారించుకోగలగాలి.

సమీకరణలు సహజంగా, సక్రమంగా ఉండాలని అరిస్టాటిల్ వాదం. ప్రత్యేక విషయాల నుంచి సామాన్య విషయాలకు విస్తరించడం ఒక పద్ధతి. ప్రత్యేకతలన్నీ చక్కగా, సంపూర్ణంగా పరీక్షించినప్పుడే అంతిమ నిర్ణయం రుజువు అయినట్లు. నిశ్చితంవైపు దారితీసిన సమీకరణం ప్రత్యేక అంశాలతో ప్రారంభం కాదు. ఒక పెద్దరాశిలో ఒక ప్రత్యేక గుంపు విషయంలో నిజమైన విషయం ఆ రాశి అంతటిలోనూ తప్పనిసరిగా నిజం అయి తీరాలనటానికి కుదరదు. ప్రాతిపదికలన్నీ అతి సామాన్యమైనవి, సమీకరణాన్ని రుజువు అనుకోవటానికి కుదరదు. నైతిక శాస్త్రాలలో, విశ్వజనీనమైన విషయాలను నిర్ధారణ చేయడం కోసం సోక్రటీస్ ఈ పద్ధతిని అవలంబించాడు.

జ్ఞానం ఒక అంతస్తు, దాని ప్రయోగం మరో అంతస్తు.

పడవ నడపడం బాగా 'తెలిసిన' మనిషి – పడవ పరిజ్ఞానం, ఆ శాస్త్ర విషయాలన్నీ ఎరిగి ఉండడం సాధ్యం కావచ్చును. అయితే అతను ప్రమాదాలను తట్టుకోగల 'పడవ నడిపే మనిషి'గా రూపొందుతాడనలేము. రథం నడపడం గురించి సిద్ధాంతపరంగా తెలిసిన వ్యక్తి, చక్కగా రథ చోదకుడు అవుతాడని భావించలేము. ఒక ప్రత్యేక పరిశీలన జరిగిందే తప్ప ఆ విషయం తాలూకు వివరాలన్నీ గుదిగుచ్చి పరీక్ష చేసుకోవడం జరగలేదన్నమాట. కనుక తార్కికంగా యదార్థమైన సంగతి తప్పనిసరిగా యదార్థం అయి ఉండాలని చెప్పలేము.

ఒక ఉదాహరణను తీసుకోవడం, దానిని పరీక్ష చేయడం, సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చును.

థేబ్స్ (Thebes) కు, ఫోసిస్ (Phocis) కు మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధం మంచి ఫలితాలను తీసుకు రాలేదు. ఇది ఉదాహరణగా చూపించి థేబ్స్‌కు, ఏథెన్స్‌కు (Athens) నడుమ యుద్ధం జరగకూడదు అని నిర్ధారణకు రాగూడదు. రెండు ఉదాహరణలకు సమన్వయించి ఉండే అన్ని వివరాలను విశదంగా, క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారణకు రావడం అవసరం.

సామాన్యమైన మాట ఏమంటే 'రెండు ఇరుగు పొరుగు రాజ్యాల మధ్య యుద్ధం శ్రేయోదాయకం కాదు.'

ఇలాంటి విషయాలను రాజకీయవేత్తలకు మటుకే వదిలి వేయటానికి వీలులేదు. రాజకీయవేత్త, తాను మాట్లాడుతున్న విషయం తాలూకు సామాన్య పరిజ్ఞానం తన

శ్రోతలకు ఉంటుందని ఊహిస్తాడు; ఈ ఊహ ప్రాతిపదికమీదనే తన అంచనాలు నిర్మించుకుంటాడు.

అరిస్టాటిల్ తత్త్వదర్శనంలో అడుగడుగునా ఇటువంటి ఇబ్బందులు తటస్థ పడతాయి. ముఖ్యంగా ఇందుకు కారణం ఏమిటంటే – ఆయన సిద్ధాంతాలకు ప్లేటో సిద్ధాంతాలకు వ్యత్యాసం ఉన్నదని శ్రోతలను, చదువరులను గుర్తించగలిగేట్లు చేయటానికి చాల జాగ్రత్తలు తీసుకుంటాడు. ఈ జాగ్రత్తలో తనకు అన్ని విషయాలు తెలుసునన్నట్లుగా, తనకు తెలియని విషయం అంటూ ఏదీ ఎక్కడా లేదన్నట్లుగా కనిపిస్తాడు. తీరా వచ్చి ఆయన నిర్ధారణలు, నిశ్చితాలు (Conclusions) ప్లేటోతో సరితూగుతాయి. ఇద్దరూ ఒకే విషయాన్ని చెబుతున్నట్లు స్ఫురిస్తుంది. వినేవారికి, చదివేవారికి, తత్త్వశాస్త్రం తాలూకు సహజ ప్రాతిపదికల విషయంలో వ్యత్యాసం ఉన్నట్లు అగుపిస్తున్నా ఇద్దరూ తమ తమ వాదాలను పరాకాష్ఠకు తీసుకువెళ్ళడంలో ఎంతో మార్మికతను, తార్కికతకు అందని తన్మయతను (Mysticism) ప్రదర్శిస్తారు.

ఈ రకమైన అస్తవ్యస్తతలు, అసందిగ్ధాలు ఆయన వేదాంత చర్చలలోను, మానసిక–నైతిక చర్చలలోను అగుపిస్తాయి. అరిస్టాటిల్ ముమ్మూర్తుల ప్లేటో శిష్యుడు, అనుయాయుడు. ఆయన చెబుతున్న విషయాలలో ప్లేటో దర్శన సూక్తులే కనిపిస్తాయి గనుకనే ఆయన ఆలోచనాపరులను ఆకట్టుకోగలుగుతాడు.

ప్లేటో ధోరణి ఎలా ఉంటుందో చూద్దాం :

ఇంద్రియ పరిజ్ఞానానికి, శాస్త్రీయ పరిజ్ఞానానికి వ్యత్యాసం ఉన్నది. ఇది అనుమానంలేని మాట. శాస్త్ర పరిజ్ఞానం ఖచ్చితమైనది, నికార్సయినదీని, అది ఒకమారు ఋజువు అయిందంటే – ఎప్పటికీ నిజమైనదిగానే భావించవచ్చును. 'కాలదోషం' పట్టదు దానికి. శాస్త్రం, దాని పరిజ్ఞానం – ఇలా ఖచ్చితంగా తన ప్రతిపాదనలను దర్శించాలని ప్లేటో ఉద్దేశించాడు. గణితశాస్త్ర ప్రవచనాలన్నిటినీ ఇలాగే సూత్రీకరించాడు. మనకు కనిపిస్తూ, స్పర్శకు అందుతూ ఉన్న ప్రపంచానికి సంబంధించిన విషయాలలో ఈ సూత్రం అవలంబనకు రాదు. ఇంద్రియ పరిజ్ఞానం బహు పరిమితమైనది. రంగులు, రుచులు, ఆకారాలు– ఇవన్నీ వేరు వేరు మనుషులకు వేరు వేరుగా కనిపిస్తాయి; ఒకే వస్తువును చూస్తున్నప్పటికీ, అంటే ఎవరి ఇంద్రియ పరిజ్ఞానం వారిది. అందరూ ఒకేరకంగా భావించవలెనన్న నియామకం చేయటానికి వీల్లేకపోవడం ప్రత్యక్షమైన సంగతి. అంతేగాక ఈ వస్తువులు అతి తరచుగా, అతి

త్వరగా మారిపోతూ ఉంటాయి. ఎన్ని రకాలుగా ఏర్పాటు చెందుతాయో మనం ఒక్కొక్కమారు ఊహించలేము గూడా. రెండు సరళరేఖలను చూచామనుకుందాం. అవి మన కంటికి సమానమైన పొడవు ఉన్నట్లే అనిపిస్తాయి. కాని నిజంగా వాటి పొడవు ఒకటేనని మనం నిర్ధారణగా చెప్పలేము. వాటి అసమానత అతి కొద్దిది, సూక్ష్మము అయివుండి మన కళ్ళకు గమనానికి అందనంతది కావచ్చును. ఒక వృత్తంగానీ, చతురస్రం గానీ రేఖాగణిత శాస్త్రజ్ఞుడు చెప్పినంత ఖచ్చితంగా మనం గీయలేకపోవచ్చును. అందుచేత, ప్లేటో అనేది ఏమంటే 'శాస్త్ర విజ్ఞానం' అనే మాటకు పరిపూర్ణమైన అర్థంలో వాడినప్పుడు, మన ఇంద్రియాలకు గోచరమయ్యే ప్రపంచానికి ఏ శాస్త్రవిజ్ఞానము సరిపడదు. మనము ఒక రకంగా 'ఉజ్జాయింపు', 'దాదాపు'గానే తెలుసుకోగలుగుతున్నాము. ఏ వస్తువును గురించి అయినాగానీ, మన అభిప్రాయాలను 'బహుశ' అనే ముందుమాటతో మటుకే వెలిబుచ్చ వీలవుతుంది. గణిత శాస్త్రజ్ఞుడు వస్తువులను నికార్సుగా, ఏమీ తేడా లేకుండా, ఖచ్చితంగా లెక్కవేసుకుంటాడు. ఇది ఇంద్రియాలకు సాధ్యమయ్యే విషయం కాదు. ఇంద్రియ జనితమైన జ్ఞానం ఊహాపోహలతో, ఆలోచనలతో మిళితమై పోయినది. గణితశాస్త్రంలో నమూనాలు, బొమ్మలు చూపడంలో ఉద్దేశ్యం మనకు యధాతథమైన రూపాలను, చిత్రాలను చూపుతున్నామని కాదు; వీలయినంత దగ్గరగా ఉన్న చిత్రణచేస్తున్నామనే ఈ రూపాల ద్వారా మనకు అసలైన విషయాలను స్ఫురణకు తీసుకురావడం జరుగుతోంది. ఇంద్రియ పరిజ్ఞానం ఎంత సునిశితమైనదైనా యదార్థానికి దగ్గరగా రాలేదు.

అలాగే నైతిన శాస్త్రాల విషయంలో గూడా – సుగుణాలను గురించి మనకు ఎంత క్షుణ్ణంగా తెలిసి ఉన్నప్పటికీ నిత్యజీవితంలో ఇవి అసలు – నికార్సయిన వర్తనానికి దగ్గరకు రాజాలవు. ధైర్యశాలి – నీతిమంతుడు అని పరిపూర్ణంగా చెప్పగల మనిషి మనకు తారసపడకపోవచ్చును. అయితే ఒక మనిషికంటె మరొకడు ధైర్యశాలి, నీతివంతుడు అన్న విషయం మనకు దైనందిన జీవితంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. అప్పుడు అసలైన ఆ లక్షణాల వంక – సుగుణాల పట్ల – మన ఆలోచన పారుతుంది. మనం వర్ణించేటప్పుడు మటుకు ఈ అసలైన లక్షణాలనే (Absolute) దృష్టిలో ఉంచుకుంటాము. ఇది దీని తత్త్వ విచారణ.

### ముఖ్యమైన విషయాలు రెండు :

1. శాస్త్రవిజ్ఞానం ఎప్పుడూ వస్తువులను గురించి, ఆ వస్తువుల నడుమ ఉండే సంబంధాలను గురించి మాట్లాడుతుంది. అది కేవలం భావపురస్కారం మానసిక వర్తనం, ఇంద్రియాలు ఇందులో జొరబడవు.

2. శాస్త్రవిజ్ఞాన వస్తువులు, పదార్థాలు ఇలాంటివి అయినప్పుడు వాటిని గురించిన భావం, అభిప్రాయం, సామాన్యత – మన అనుభవాల ప్రాతిపదిక మీద ఉండదు.

ప్రత్యేకమైన వస్తువు – సార్వజనికము, సామాన్యతను ఉజ్జాయింపుగా మటుకే ప్రదర్శిస్తుంది. వీటికి సామాన్యత లేదనుకోలేము.

ఇంద్రియ పరిజ్ఞానం వల్ల, మనం పోగుచేసుకుంటున్న అనుభవం, ఆదర్శానికి దగ్గరగా, చేరువగా మటుకే వస్తుంది తప్ప దానిని 'తల స్పర్శ' చేయలేదు.

ఈ పరిజ్ఞాన సిద్ధాంతంలో అరిస్టాటిల్, ప్లేటో ఉద్దేశ్యాలను కాస్సేపు పక్కన పెట్టివేస్తాడు. శాస్త్ర జ్ఞానానికి ఇటువంటి 'ఆదర్శాలు', ఉద్దేశ్యాలు ఏమీ అవసరం లేదు. ఇంద్రియ పరిజ్ఞానాన్ని మీరి పోనక్కరలేదు. అవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఒక వస్తువుకు పైన మరో వస్తువు ఉండనవసరం లేదు. అనేక వస్తువులను చూచి, అనుభవించి – సర్వసామాన్యమైన సూత్రీకరణ చేసుకోవచ్చును.

సామూహిక వస్తు సముదాయం యొక్క గుణ గణాల రాశే విశ్వమయమైన భావన. ప్రత్యేక లక్షణాలను మినహాయించి, అన్ని వస్తువులకూ సామాన్యంగా ఉన్న ధర్మాలనే మనం సూత్రీకరింప బూనుకుంటున్నాం.

అంటే – మనం చూస్తున్న వస్తువులన్నిటి గుణగణాలు ఇంద్రియ జనితమైనవే. పోతే వాటి సామాన్య ధర్మాలు మటుకు వాటి వర్తనంలో మనకు అంతటా గోచరమవుతూ ఉన్నవి. ఇంత మాత్రంతోనే ఆగినట్లయితే అరిస్టాటిల్ చెబుతున్నదంతా నైమిత్తిక సత్యంగానే మిగిలిపోతుంది. అయితే వీటికి మూలాధారంగా కొన్ని సూత్రాలు ఉన్నాయని చెప్పడంతో తాత్త్వికత ప్రదర్శితం అవుతోంది. వస్తువులకు పైగా వేరుగా అసలు రూపం ఉన్నది.

శాస్త్ర పరిజ్ఞానం అంటే ఋజువులకు తట్టుకునే విజ్ఞానం.

ఋజువు అనగానే కొన్ని ప్రతిపాదనలు, వాటికి తగిన ఉదాహరణలు, ప్రతీకలు తప్పవు. ప్రతిపాదనలకు అనునయంగా వచ్చే సిద్ధాంతాలు, శాస్త్రరీత్యా తెలిసిన విషయం దానంతట అది ఒంటరిగా నిలబడదు. ఋజువు అనగానే – నిర్ధారిత సూత్రాల నుంచి అవగాహన చేసుకున్న సత్యం. మన ప్రయోగంలో ఆసరాగా నిలచిన ఇతర సూత్రాలు, వస్తువులు అలా ఎందుకు ఉన్నాయి – అన్న విషయాన్ని శాస్త్ర పరిజ్ఞానం

చెబుతుంది. కారణాలు వెలికి తెస్తుంది. కారణాల ద్వారా; తార్కికత ద్వారా వస్తు తత్త్వాన్ని తెలుసుకోవడం అనేది అరిస్టాటిల్ ప్రవేశపెట్టిన ఆధారసూత్రం.

శాస్త్ర విజ్ఞాన సత్యాలను వివరించేటప్పుడు, ముందుగా – తేలికగా అర్థం అయ్యేది, అవగాహనకు వచ్చేది అయిన సూత్రంతో ప్రారంభించి దాని నుంచి కారణాలను, ఆధార సూత్రాలను వెదికి వెలికి తీయటానికి ప్రయత్నిస్తాము. ఎన్నో అంతస్తులలో ఊహలు చేస్తాము. క్లిష్టతరమైన ప్రతిపాదనలకు వస్తాము; ఎంతో పరిశ్రమ చేసిన మీదట తప్ప కారణాలు అవగతం కావు. తార్కికంగా ముందుకు పోవడం మీద ఆధారపడక తప్పదు.

సృష్టిలో ఎక్కువగా, విరివిగా తెలుసుకోగలది ఏమిటి; ప్రకృతి సూత్రాలలో తేలికగా మనకు అర్థం అయ్యేది ఏమిటి అనే దానినుంచి మన ఆలోచనను ప్రారంభం చేస్తాము– అంటాడు అరిస్టాటిల్. ఇది సరళంగా మనకు సామాన్యంగా తెలిసిన విషయమై ఉంటుంది. ఇంద్రియ జనితమైన పరిజ్ఞానం నుంచి, క్లిష్టతల నుంచి దూరంగా వెడుతున్నాయి.

పరిశోధనా పర్వంలో ఈ క్రమాన్ని తల్లకిందులు చేస్తాము. క్లిష్టమైనవి, మనకు పరిచితమైనవి అయిన సత్యాలతో ప్రారంభం చేసి, వాటి వాటి తత్త్వాలను మరింతగా తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తాము. సరళమైన సూత్రాలు వీటిలో ఇమిడిపోయి ఉంటాయి.

ఇంద్రియ పరిజ్ఞానం – శాస్త్రీయ పరిజ్ఞానం, ఈ రెంటికీ ఉన్న వ్యత్యాసం మీదనే అరిస్టాటిల్ ఎక్కువగా ఆధారపడి తన సిద్ధాంతాలను రూపొందిస్తాడు. ఇంద్రియ పరిజ్ఞానం దానంతట అది ఎప్పటికీ మనకు శాస్త్ర పరిజ్ఞానాన్ని ఇవ్వలేదు. యదార్థం ఇట్లా ఉండటానికి వీలున్నది. అనే సంగతి మటుకు చెబుతుంది. అది యదార్థానికి ఇతర వస్తువులకు ఉన్న సంబంధాన్ని ఎత్తి చూపడం దానికి చేతకాదు.

చూపులకు అగుపిస్తున్న జ్ఞానం ఎప్పుడూ తక్షణమైనది, మనకు ఎదురుగా ఉన్నది. అందుచేతనే అది ఎన్నటికీ శాస్త్రీయం కాలేదు.

మనం చంద్రునిమీద నిలబడి, మనకు సూర్యునకు మధ్య భూమి ఉండటం గమనించగలిగినట్లయితే.... అప్పుడు గూడా మనం 'గ్రహణాలు' ఎందుకు ఏర్పడుతున్నాయో అర్థం చేసుకోలేము. ఎందుకు ? అనే ప్రశ్న మనకు ఎప్పుడూ తల ఎత్తుతూనే ఉంటుంది.

అలాగే 'అనుమానం' (Induction) శాస్త్రీయమైన సత్యాన్ని తీసుకు రాలేదు. అనుమానం తీసుకువచ్చినది ఏదో ఉన్నది సుమా అని చూపుతున్నాడు తప్ప మరింక ఇతరమేమీ ప్రదర్శించలేక పోతున్నాడు.

శాస్త్ర పరిజ్ఞానంలో మనం తీసుకువచ్చే ప్రశ్నలు నాలుగు విభాగాలుగా పరికించి చూచుకోవటానికి అవకాశం ఉంది.

1. ఈ వస్తువు నిజంగా ఉన్నదా ?
2. ఈ సంఘటన జరుగుతున్నదా ?
3. వస్తువు అంటూ ఉంటే, అది నిజంగా ఏమిటి ?
4. సంఘటన జరుగుతూ ఉన్నట్లయితే, ఎందుకు అలా జరుగుతోంది ?

మొదటి రెండు ప్రశ్నల నుంచి బయటపడి పైకి వెళ్ళగలిగే శాస్త్రపరిజ్ఞానం తన పనిని పూర్తిగా చేసినట్లు కాదు.

శాస్త్రజ్ఞానం, వస్తువుల సంఘటనల జాబితా కాదు.

నిజమైన తత్త్వం పట్ల పరిశోధన, గుణగణ పరిశీలన, సంఘటన మధ్య ఉన్న సంబంధాల వివరణ – ఇదంతా పరిపూర్ణంగా సమకూడాలి.

శాస్త్ర పరిప్రశ్నలను పరిశీలించినట్లయితే, అది చేస్తున్న అన్వేషణల పూర్తి రూపం మనకు తెలిసి వస్తుంది. నిర్ధారణలు, వాటికి దారితీసే ప్రతిపాదనలపరంగా ఉన్న సంబంధాలు – ఏకతాటి కిందకు చేరుకోవాలి.

ఆ వస్తువు నిజంగా ఉన్నదా ? అలాంటి సంఘటన జరిగిందా – అని ప్రశ్న వేస్తున్నప్పుడు ఆ వస్తువుకు సంఘటన తీరుతెన్నులకు మధ్యవర్తిగా ఏదైనా సంబంధం ఉన్నదా అని అడుగుతున్నాం అన్నమాట. ఈ రెండింటికీ ఉన్న సమన్వయ సూత్రం సర్వసామాన్యమైనదిగా తీసుకుని అన్వేషణ సాగిస్తున్నామన్న మాట.

కనుక శాస్త్రజ్ఞానం మూడు భాగాలుగా విభజించి పరిశీలించటానికి వీలున్నది.

1. విషయ నివేదనకు ఆస్కారం ఇచ్చే వస్తువులు, వాటి విభాగాలు, వర్గీకరణము (దత్తాంశం).
2. మన పరిశీలనకు ఆధారభూతం అయిన ఎన్నో సూత్రాలు, సిద్ధాంతాలు, ప్రతిపాదనలు.

వీటిలో కొన్ని అన్ని శాస్త్రాలకూ పరిగణన అయి ఉంటాయి. కొన్ని మటుకు పరిశీలిస్తున్న శాస్త్రానికి మటుకే పరిమితంగా ఉంటాయి.

3. పరిశీలన వస్తువులు గుణగణాలు, తీరుతెన్నులు, శాస్త్ర పరిశోధనల నిర్ధారిత అంశాలు ఇవే.

ఒక త్రిభుజం ఉంది. దీనిలోని మూడు కోణాలు ఎన్నెన్ని డిగ్రీలు ఉన్నాయో కొలిచి చూచాము. ఈ మూడింటి మొత్తం రెండు లంబకోణాల మొత్తంతో సమానంగా ఉన్నదని తెలుసుకున్నాం.

అంతమాత్రం చేత త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలు ఉంటుంది–అన్న శాస్త్ర ప్రమాణం మనకు కరతలామలకం అయిందని అర్థం కాదు.

అలాగే ఎన్నో త్రిభుజాలను కొలిచి చూచి, రేఖాగణిత సూత్రాలను సరిపోల్చుకుని, నిర్ధారణకు వచ్చినప్పుడు శాస్త్రప్రమాణం మనకు తెలిసి వచ్చినట్లు లెక్క.

మనకు ఇప్పుడు ఈ విషయంలో నిర్ధారణగా తెలిసిన సంగతి ఇది. అలా ఎందుకు అవుతుందో కూడా మనకు తెలుస్తోంది. గణితశాస్త్ర ప్రాథమిక సూత్రం ఒకదాని యదార్థం, దీని యదార్థం ఇప్పుడు మనకు అవగతం అయింది.

ఇప్పుడు అరిస్టాటిల్ ప్రవేశ పెట్టిన మరో ప్రధానాంశం మనకు చేరువ అవుతోంది.

శాస్త్ర పరిజ్ఞానం ప్రయోగశీలత కలది. అది సరళమైన సత్యాల నుండి కొన్ని నిశ్చిత సత్యాలు వస్తాయన్న మాట. అలాగే ఏ శాస్త్రానికి సంబంధించినవైనా, కేవలం ఊహల వల్లనే మనం సత్యాలను తెలుసుకోలేము. నిర్ధారిత అంశాలు యదార్థం కనుక, వాటికి అనునయంగా ఉన్న విషయాలన్నీ యదార్థం అనుకోలేము. అన్ని సత్యాలనూ ఇలాగే ప్రయోగశీలతతో నిర్ధారించలేము. ప్రతి సత్యమూ ఋజువు కావలసినమాట యదార్థమే అయినా, ప్రతిదీ ప్రయోగం చేసి చూచుకోవాలంటే ఆ పరిశ్రమకు దరిదాపు, అంతు ఉండదు కనుక, ప్రతి సత్యాన్ని రుజువు చిక్కించుకోవడం అసాధ్యం అయిపోతుంది. ప్రాథమిక సూత్రాలు ఇంద్రియ పరిజ్ఞానం ఏర్పడినంత సులభంగా తెలిసి రావాలి. ఇది తక్షణ జ్ఞానం. ఎప్పుడో, ఎక్కడో దొరికేది కాదు. అలా అయితే అటువంటి వాటిని తెలుసుకోవడం ఎలా ?

ఈ ప్రశ్నకు అరిస్టాటిల్ చెప్పే సమాధానం, ముందు చూపులకు అస్తవ్యస్తంగా, అసందిగ్ధంగా ఉంటుంది. పరస్పర విరుద్ధం అని గూడా అనిపిస్తుంది.

ఈ సరళ సూత్రాలు, సత్యాలు సహజ జ్ఞానంవల్లనే (Intuition) తెలియ రావాలి. లేక పరీక్ష పెట్టి చూచినందువల్ల తెలియాలి. వివేకము, మనస్సుల లాగానే యధాతథంగా అవగాహన కావాలి.

మరో మాటకూడా చెబుతాడు అరిస్టాటిల్.

ఈ సత్యాలు మనకు ఇంద్రియ పరిజ్ఞానం ద్వారా గూడా తెలియరావచ్చును. ఇంద్రియ అనుభవాలను విస్తరించుకున్నందువల్ల, లోతుకు వెళ్ళి చూచుకోవడం వల్ల తెలియవచ్చును.

రెండు ప్రశ్నలకు ఒకేమారు జవాబు చెప్పటానికి ప్రయత్నించినందువల్ల ఈ సందిగ్ధం ఏర్పడినట్లు కనిపిస్తోంది.

1. ఈ సూత్రాలను విచారణ చేయడం ఎలా ?

2. వాటి సత్యానికి ఋజువులు ఏమిటి ?

మొదటి దానికి సమాధానంగా 'అనుభవం నుండి నేర్చుకుంటాం' అంటాడు.

ఇంద్రియ పరిజ్ఞానాన్ని అదేపనిగా కొనసాగించినప్పుడు – ఒకే ఆలోచనను విడవకుండా పరిశీలించినప్పుడు – ఏదో అనుభవైక్యత ఏర్పడవచ్చును. ఒక అనుభూతిని తరచి తరచి ఆలోచించుకున్నప్పుడు, సమ్యగ్పరిశీలనం చేసుకున్నప్పుడు సర్వసామాన్యమైన సరళమైన సూత్రం మనస్సుకు స్ఫురించవచ్చును.

దీనికి ఉదాహరణగా మనమో విషయం చెప్పుకోవచ్చును.

రెండు, రెండు కలిపితే 'నాలుగు' అవుతుంది అని పసిపిల్లవానికి తెలియ చెప్పటానికి ఏం చేస్తాము ?

రెండు నారింజపళ్లు తీసుకుంటాము. తరువాత వాటితో మరి రెండు నారింజపళ్ళను జతచేసి, అప్పుడు పిల్లవాడిని ఎంచి చూడమంటాము. అలా అనేక వస్తువులను కలిపి ఎంచి చూపించి, అప్పుడు 'నారింజపండు' అనే విషయం మనసులో నుంచి తీసివేయమంటాము. రెండు రెండు కలిపితే నాలుగు అవుతుందని వాడు సరళ సూత్రాన్ని సజావుగా తెలుసుకుంటాడు. ఏ వస్తువుకైనా ఈ సూత్రం అన్వయిస్తుందని అర్థం చేసుకుంటాడు.

ఊహను జోడించడం, సరిపోల్చి చూచుకోవడం అని అరిస్టాటిల్ చెప్పేది ఇదే. సరిపోల్చి చూచుకోకముందు సరళ సూత్రం కుర్రవాడి మనసులో లేదు.

అంతిమ సత్యాలకు, సూత్రాలకు ప్రత్యేకించి రుజువులు అవసరం లేదని గూడా అంటాడు అరిస్టాటిల్.

ఊహ విస్తరణవల్ల సూత్రాన్ని తెలుసుకున్న తర్వాత ఆ సూత్రం యొక్క యదార్థత నిర్థారణ చేసుకోవాలి. ఇంద్రియ పరిజ్ఞానంలో మోస్తరుగానే చూడగానే దాని యదార్థత మనసుకు పొడగట్టుతుంది. ఎర్రరంగు, నీలిరంగులను విచక్షణంగా తెలుసుకున్నట్లే, యదార్థతను గూడా మనస్సు ఆకళింపు చేసుకుంటుంది.

శాస్త్రీయ విజ్ఞాన సూత్రాలు తెలుసుకోవడం, శాస్త్రీయ పరిజ్ఞానం అవదు అంటాడు అరిస్టాటిల్. అందుకే ఆయన వివేకం (Intelligence) అనిపించే దానికి మానసిక సహజ జ్ఞానం లేక అంతర్దృష్టి (Intellectual Intution) అనుకోవచ్చును.

శాస్త్ర విజ్ఞానాన్ని గురించి ప్లేటో అభిప్రాయాలనే అరిస్టాటిల్ పునర్వ్యవస్థీ కరిస్తాడు. సామాన్యమైన సూత్రాల నుంచి విషయ పరిజ్ఞానాన్ని వెలికి తీస్తాడు.

శాస్త్ర విజ్ఞానానికి కొన్ని సూత్రాలు ఉన్నాయి. చూడగానే అవి యదార్థంగా పొడగట్టుతాయి. ఒక మనిషికి యదార్థంగా కనిపిస్తున్నది, మరొక మనిషికి లీలా మాత్రంగా కనిపించవచ్చును. ఇంకొక మనిషి 'ఏమీ లేదు, పొమ్మ'న వచ్చును.

అభ్యంతరాలు చెబుతున్న వారిని ప్రయోగాలు చూపి నిశ్శబ్ద పరచడం – అనుమాన రహితం చేయడం – అన్నది అసాధ్యం. ఎందుకంటే నికార్సయిన ఏ సత్యము ప్రయోగానికి లొంగేది కాదు. కాదంటున్న వారిని పరిశీలించి చూచుకో మనడమే మార్గం. ఇది నిజం కాకపోతే ఏమవుతుంది – అని ఆలోచించగలిగితే, అది నిజం అవక తప్పదు అన్న విషయం నిర్థారితం అవుతుంది. అంటే దోష ప్రకటనాత్మకంగా విషయాలను ఋజువు చేయడం అన్నమాట. యదార్థాన్ని సత్యమని నిరూపించడం కాదు ఇప్పుడు చేస్తున్నపని; ఆ యదార్థాన్ని అసత్యమని నిరూపించడం.

రుజువు చేయటానికి సాధ్యపడని సూత్రాలను అభ్యంతరాల నుంచి తప్పించటానికి ఈ రకమైన Dialection ఉపయోగిస్తాడు అరిస్టాటిల్. ఇది ఒక చక్కని విధానంగా రూపొందింది.

# ప్రథమ తత్త్వ శాస్త్రం

'**త**త్త్వశాస్త్రం' (Philosophy) అనే మాటను సోక్రటీస్ మొదటగా వాడాడు.

ఈ మాటకు వ్యుత్పత్తి అర్థం 'జ్ఞానం పట్ల ప్రీతి' (Love of Wisdom).

సోక్రటీస్ అభిప్రాయం ప్రకారం మనుష్యులందరూ మూడు వర్గాలు విభజన అవటానికి అవకాశం ఉంది.

1. సుఖాపేక్ష ఉన్నవారు.
2. పనిపట్ల ఆసక్తి ఉన్నవారు.
3. జ్ఞానతృష్ణ ఉన్నవారు.

తత్త్వశాస్త్రం యొక్క ప్రయోజనం, ఆయన మాటలలో, అభిప్రాయస్పష్టత ద్వారా స్వస్వరూప జ్ఞానాన్ని (Self-Knowledge) పొందడం.

తరువాత, ప్రతి తత్త్వవేత్త కూడా తన అభిప్రాయాల ప్రకారం తత్త్వశాస్త్రం అంటే ఏమిటో, దాని ప్రయోజనం ఎలా ఉండాలని తాను అభిలషిస్తున్నాడో అనేక మాటలలో వర్ణిస్తూ వచ్చాడు.

అరిస్టాటిల్ అభిప్రాయం ఇలా ఉంది :

తత్త్వశాస్త్రం అనేది అద్భుతాలను, వైచిత్రిని చూడటంతో ప్రారంభం అవుతుంది. వస్తువులకు కారణం ఏమిటి, వాటి తత్త్వం ఏమిటి తెలియచెప్పేదే తత్త్వశాస్త్రం, అంటే మానవ పరిజ్ఞానానికంతటికీ రూపకల్పన అన్నమాట. అయితే 'తత్త్వశాస్త్రం' అన్న ఈ సాధారణ పదంలో విభాగంగా 'ప్రథమ తత్త్వశాస్త్రం' అనేది ఒకటి ఉన్నది అని అరిస్టాటిల్ అభిభాషణ. ప్రథమ తత్త్వశాస్త్రమే 'ధర్మశాస్త్రం' కూడా (Theology). దీనిలో వస్తువుల పరమ స్వరూపం ఏమిటి. వాటి తత్త్వము – కారణాలు ఎలా ఉంటాయి అన్న విషయాలు చర్చించాడు. 'భగవంతుడు' అన్న అభిప్రాయం కూడా ఈ విభాగంలో చేరినదే. తత్త్వాల కన్నిటికీ పరమతత్త్వం, కారణాల కన్నిటికీ పరమ కారణం... భగవంతుడు అన్న అభిప్రాయానికి వివరణ.

ప్రథమ తత్త్వశాస్త్రం తతిమ్మా శాస్త్రవిజ్ఞానాల కంటె భిన్నమైనది.

వస్తువులను ఉన్నది ఉన్నట్లుగా – యధాతథంగా – పరిశీలించడం దీని పని. విశ్వాన్ని ఆవరించుకుని ఉన్న సూత్రాలు ఏమిటి ? ఈ విశ్వమంతా అల్లకల్లోలం అయిపోకుండా అవి ఎలా నిలిపి ఉంచుతున్నాయి– అన్నవి పరిశీలనాంశాలు.

అనేక వస్తువులు ఉన్నాయి.

ద్రవ్యము (Substance), మనుషులు, గుఱ్ఱాలు – ఇలా ఎన్నో జీవరాశులు అవన్నీ వస్తువులు.

గుణాలు – లక్షణాలు ఉన్నాయి. ఎరుపు, నలుపు, మధురిమ – ఇలాంటివి. ఇవి వస్తువులు కాదు, వస్తువులను ఆశ్రయించుకు ఉంటాయి.

పనులు ఉన్నాయి. ఉదాహరణకు ఇళ్ళు కట్టడం, నడవడం, చంపటం – ఇలా ఇవి వస్తువులు కాదు, గుణాలు కాదు. వీటి ప్రవర్తన వల్ల వస్తువులు ఉండడమో, లేకపోవటమో, మారిపోవడమో జరుగుతుంది.

వీటన్నిటి తత్త్వం ఏమిటి అన్నది తెలుసుకోవడం–ప్రథమ తత్త్వశాస్త్రం ఉద్దేశించే పని. అయితే ఇది వస్తుగతమైన లక్షణాలకు ఎక్కువగా సంబంధించి ఉంటుంది.

పదార్థం అనే మాటకు రెండు ప్రసక్తులు ఉన్నాయి.

ప్రకృతిలో కనిపించే మనుషులు, గుఱ్ఱాలు – ఇటువంటి జీవపదార్థాలు ఒకటి, ఈ మనిషి, ఈ గుఱ్ఱం అనే ప్రత్యేకత. రెండు పదార్థాలకు ఈ ప్రత్యేకత ఉండనే ఉంటుంది. ప్రత్యేకతకు మటుకు తనదైన అస్తిత్వం లేదు.

మనిషి ఒక పదార్థంగా ఉన్నాడు. అతనికి పెరుగుదల, వృద్ధాప్యం ఉన్నాయి. అన్ని స్థితులలోను అతను ఆ మనిషే. ఇటువంటి ప్రత్యేక లక్షణాలకు, పనులకు సిద్ధించదు. ఒక రంగు ఉన్నదనుకోండి, అది ముందు నల్లగా ఉండి తరువాత ఎర్రగా మారలేదు. ఒక పని ఉన్నదనుకోండి, అది ముందు చెడ్డదై తరువాత మంచిది కాలేదు. మారిపోతున్న ప్రపంచంలో మనుషులవంటి జీవపదార్థాలు, స్థిరమైనవి– శాశ్వతంగా ఉండేది. అస్థిత్వం యొక్క రూపాంతరాలు ఇవి. వాటిలో ఎన్నో ప్రక్రియలు జరుగుతూ ఉంటాయి. పుట్టింది మొదలు గిట్టేంత వరకు ఎన్నో మార్పులు, చేర్పులు తటస్థిస్తాయి. అవి పనులు చేస్తాయి; ఇతరులు చేసే పనులకు ప్రభావితం అవుతాయి.

వాటి లక్షణాలు మార్పు పొందుతూ ఉంటాయి. ప్రమాణాలు మారుతాయి. కాని ఆ పదార్థం ఉన్నంత వరకు అది 'ఒకటి'గానే ఉంటుంది. ఎన్ని మార్పులు జరిగినా దాని అస్థిత్వం ఒకటే. విశ్వం ఎలా అస్థిత్వం కలిగి ఉందో ఈ వస్తువులూ అంతే. వాటికి గుణాలు, కదలికలు ఉంటాయి. చర్య ప్రతిచర్యలకు ఆలవాలం అవుతాయి.

ఉన్నది ఏమిటి ? – అస్థిత్వం అంటే ఏమిటి – అన్న పరిశీలనతో ప్రారంభం చేస్తాడు అరిస్టాటిల్. ఇంద్రియాలకు గోచరం అయిన రీతిలో వస్తువులు ఎలా ఉన్నాయి, ఎలా క్రమగతిలో ప్రవర్తిస్తున్నాయి ?

ప్రతి వస్తువును ఎన్ని విభాగాలు చేసి పరిశీలించటానికి అవకాశం ఉన్నది ?

దానికి మనం గమనిస్తున్న ఈ ప్రత్యేక లక్షణం ఎలా సంప్రాప్తం అయింది!

ఈ ప్రశ్నలకు జవాబు మళ్ళీ రెండు విభాగాలుగా చెబుతాడు.

ద్రవ్యము (Matter), రూపము (Form) అవ్యక్తంగా, గర్భితంగా ఉన్నది (Potestial) పైకి కనిపిస్తూ ఉన్నది (Actual).

కారణం (Cause) అనే దానికి అరిస్టాటిల్ ఎప్పుడూ ఈ నాలుగు ప్రాథమిక విభాగాలుగా చేసి చెప్పుతున్నాడు.

**ద్రవ్యము – రూపము :**

వస్తువుగా పరిపూర్ణంగా వ్యక్తమయ్యే దేన్నయినా పరిశీలించండి.

అది మనిషి తయారు చేసిన రాగిపాత్ర కావచ్చును, లేక ప్రకృతిలో సహజ సిద్ధంగానే ఉన్న చెట్టు కావచ్చును; గుఱ్ఱం కావచ్చును.

రాగిపాత్ర తీసుకుందాం ముందు, దానిలాగ తయారైన పాత్రలు అనేకం ఉండవచ్చును. అదే ఆకృతి, అదే రూపం.

లేక అదే ద్రవ్యంతో మరో రూపంలో, ఆకృతిలో తయారు చేసిన పాత్రలు ఉండవచ్చును. ఒకటి నీళ్ళు మోసుకోవటానికి ఉపయోగించవచ్చు; ఇంకొకటి పూలు అందంగా ప్రదర్శించటానికి పనికి రావచ్చును. ఇలా అనేక ప్రయోజనాలకు తగిన పాత్రలు అదే ద్రవ్యముతో తయారుచేయటానికి సంభవం ఉన్నది.

చెట్టుకో, గుర్రానికో అంతర్భాగంగా ఉన్న విభాగాలు ఏమిటి అన్నది తెలుసుకోవాలంటే మనం వృక్షశాస్త్ర పండితుడినీ, జంతుశాస్త్ర పండితుడినీ అడగాలి. వాళ్ళు వివరంగా అన్నీ చెబుతారు. ప్రతి వస్తువులోను విధిగా రెండు విభాగాలు

ఉంటాయి. ఆ రకమైన వస్తువులు తయారుకావటానికి అవసరం అయిన ద్రవ్యం ఆ ద్రవ్యాన్ని ఆశ్రయించుకు ఉన్న లక్ష్యం. ఈ రెండూ విధాయకంగా కలిసి మెలిసి ఉంటాయి. ఒకదాని ప్రక్క ఒకటి ఉండడం గాదు. ఒకదానిలో మరొకటి అంతర్భాగంగా ఉంటాయి. అరిస్టాటిల్ ఈ విషయాన్ని నొక్కి చెబుతాడు: ద్రవ్యము, రూపము– ఒక క్రమమైన పద్ధతిలో, పూర్వనిశ్చితంగానే ఏర్పాటైన రూపంలో ఉండేది ద్రవ్యము. ద్రవ్యము అంటే అసలు అర్థం 'కలప' అని, ముఖ్యంగా పడవకు ఉపయోగించే కలప. పైథొగరస్ ప్రపంచం అంతటినీ ఒక పడవకు పోల్చి చెబుతాడు. అరిస్టాటిల్ తన సిద్ధాంతాలు, ఉపమానాలు ఆయన నుంచే తెచ్చుకున్నాడు. రూపము అంటే క్రమానుగతంగా ఏర్పాటు అయినది. అరిస్టాటిల్ ఈ విభాగాన్ని వస్తువులకు, వస్తువులకు అతీతంగానూ ఉపయోగిస్తాడు. ఒక క్రమత, పద్ధతి ఉన్న ప్రతి పదార్థానికి ఈ రెండు విభాగాలు తప్పనిసరిగా ఉంటాయంటాడు.

పయోధికుడైన మనిషిని తీసుకుందాం. అతని రూపం, ఆకృతి స్థిరమైనది. అతన్ని తయారు చేసిన ముడి సరుకులు – వైఖరులు, వ్యవహార రీతులు. ఇవి సుశిక్షితమైన వాతావరణంలో అతనికి సంక్రమించినాయి. మనకు ఈ రూపకల్పనలకు జతకూడింది. మంచి పౌరుడుగా తయారవటానికి అవసరం అయిన విద్య, శిక్షణ అతనికి ఇచ్చారు. అవి అతని శీలసంపద. అయితే అతని శీలం వస్తువు కాదు. అది అలవాట్లు, చర్య ప్రతిచర్యల సముదాయం. ద్రవ్యము, రూపము అవి రూపంలో కూడా కలిసి ఉంటాయనటానికి ఇదో ఉదాహరణ. ద్రవ్యం అంటే కేవలం శరీరానికే పరిమితం చేయడు అరిస్టాటిల్. రూప నిర్మాణంలో పూర్వ నిశ్చితమైన ఏర్పాటుకు లొంగి ఉండేదంతా ద్రవ్యమే. అది స్పర్శకు అందేదైనా కాకపోయినా ఫరవాలేదు. వేదాంత పరిభాషలో ఇదే స్పష్టమైన విషయం. వేరు విభాగాలుగా రూపాంతరం పొందినా వాటి మూల స్వరూపం, తరగతి ఒకటే. ద్రవ్యం అనే దానికి పూర్వ నిశ్చితమైన రూపం లేదు. రూపం దానికి ఒక ఆకృతిని తీసుకువస్తుంది.

ద్రవ్యం, రూపము – ఇవి పరస్పరాశ్రయమైనవి.

ద్రవ్యము రూపాన్ని ఆశ్రయించుకు ఉండి, దానికి నియామకమైన ఆకృతిని ధరిస్తుంది. రూపం ఆ వస్తువుకు తగిన చివరి నిర్ణాయకం, దానివల్లనే వస్తువుకు పరిపూర్ణత వస్తుంది. ద్రవ్యమునకు ఇంకా ఇటువంటి చివరి నిర్ణాయకం సంప్రాప్తం కాలేదు.

ఒక రాగిగోళం ఉన్నదనుకోండి. గోళాకారం దాని ఆకృతి, రాగి దాని ద్రవ్యం.

మానవ శరీరంలో – ద్రవ్యం అంటే నరాలు, కండరాలు, ఎముకలు, చర్మము వగైరా. గోళానికి, శరీరానికి – సంబంధించిన ఈ భిన్న విభాగాలు అన్నీ తమ పరిపూర్ణత కోసం వేచి ఉన్నాయి... అంటాడు అరిస్టాటిల్. రాగి ఒక మూల పదార్థం (Element) కాదు; మిశ్రమం. అలాగే మనిషి శరీరంలోని నరాలు, కండరాలు కూడా. గోళానికి గాని, జీవ పదార్థానికి గాని సంబంధించిన ద్రవ్యం, రూపానికి సంబంధించి నంతవరకు ఒక ఆకృతికి పెరుగుదలకు నియామకమైనది. మూల పదార్థాలు... భూమి, నీరు, నిప్పు, గాలి... అన్నీ రసాయనిక పదార్థాలకు ద్రవ్యం, ప్రతి మిశ్రమం యొక్క ఆకృతి ఏదో ఒక సామూహిక సూత్రానికి లోబడి ఉంటుంది. జంతు శరీరానికి సంబంధించిన నరాలు, అరిస్టాటిల్ శాస్త్ర విశ్లేషణను అనుసరించి ఆ జంతువు తాలూకు 'తల్లి'లో ఉండిన అధిక రక్తం. దీన్లోంచే శిశువు తాలూకు సదాశయం ఏర్పాటు అవుతోంది. శిశువులో ఉన్న రక్తం, తల్లి తీసుకున్న ఆహార పదార్థాల పరిణామ రూపం. వారి ద్రవ్యం భూమి – నీరు – నిప్పు, వాయువులతో నిర్మాణం అయింది. అలా ప్రతి అంతస్తులోను– నిర్మాణం జరుగుతున్న ప్రతి దశలోను – పెరుగుతున్న దశలలోను, ఓ కొత్త రూపం అందులో ప్రవేశపెట్టడం జరుగుతోంది; లేదా లోపల నుంచే తయారై ఉపయోగం లోనికి వస్తోంది. అది ద్రవ్యానికి, రూపానికి అప్పటికే మిశ్రితమై ఉంది. ఈ ఆలోచనాక్రమాన్ని జాగ్రత్తగా పరికించి చూచినట్లయితే, ప్రతి జీవపదార్థం తాలూకు ద్రవ్యము ఒక్కటే. ఈ విశ్వమంతటిలోనూ ఉన్న జీవరాశుల శరీరం ఒక్కటే. దీనికే నియామకమైన రూపం అంటూ లేదు. రూప ప్రవేశము, నియామకమైన ఏ ఆకృతి అయినా బయటి నుంచి వచ్చి చేరేదే. ఎందుకంటే నిరాకారమైన ద్రవ్యం ప్రత్యేక నియామకం ధర్మాన్ని సంతరించుకుని ఉండదు.

అరిస్టాటిల్ ఉద్దేశం ప్రకారం 'స్వచ్ఛమైన ద్రవ్యం' (Purematter) అనేది మన ఆలోచనల సృష్టి. నిజానికి ద్రవ్యం యొక్క అతి మూల రూపం ఏమిటంటే – Element అనే మూల పదార్థం. అరిస్టాటిల్ భౌతికశాస్త్రంలో ఈ మూల పదార్థాలు ఒకదాని నుంచి మరొకటిగా రూపాంతరం పొందటానికి అవకాశం ఉన్నది. అప్పుడు మూలపదార్థాలు కూడా పూర్వ నిశ్చిత రూపానికి లోబడినవే అవుతాయి. ఎందుకంటే– మూల పదార్థం (Prime matter) ఎప్పుడూ సరళంగా నిరతిశయంగా ఎక్కడా కనబడదు.

## అవ్యక్త గర్భితం : పైకి కనిపించేది

ఇంత వరకూ ప్రత్యేక వస్తువుల వివరాలు పరికించాము.

ద్రవ్యము, రూపము గూడా – అంసపూర్ణ స్థితిలోనే నియామకత పొందడం, పొందకపోవడం గమనించాం.

ఈ వ్యత్యాసాన్నే ఇంకొక రకంగా పరిశీలించటానికి వీలున్నది. వస్తువులను తయారుచేసే పద్ధతి, వస్తువుల పెరుగుదలను దోహదపరచే ప్రక్రియ ఇది. అంతవరకు అనిశ్చితంగా ఉన్నది. అసంపూర్ణంగా ఉన్నది ఇప్పుడు నిశ్చితాన్ని, సంపూర్ణతను పొందుతాయి. ద్రవ్యము, రూపము అనే వ్యత్యాస స్థితులు ఇప్పుడు అవ్యక్తంగాను, గర్భితంగాను ఉన్న స్థితి; పైకి కనిపించే స్థితిగా మారిపోతాయి.

ఒక సజీవ పదార్థం యొక్క పెరుగుదలను ఉదాహరణగా తీసుకుని చూద్దాం.

రెండు జంతువుల అండాలనో, రెండు చెట్ల బీజాలనో తీసుకుందాం.

జంతు శాస్త్రవేత్త అయినా, శరీర నిర్మాణ శాస్త్రంలో పండితుడైనా ఈ అండం, బీజం; ఏ మూల పదార్థానికి (Species) చెందినదో చెప్పలేడు, నిర్ణయించలేడు. రసాయనిక విశ్లేషణ చేసినా మనకు అంతగా జవాబు దొరకకపోవచ్చును. పెరుగుదల ఒక స్థాయికి వచ్చిన తర్వాత చూచుకున్నా ఒక గుడ్డు మరో జాతి గుడ్డునే పోలి ఉంటుంది చాలావరకు. అయితే ఏ బీజం దాని తాలూకు చెట్టుగానే పరిణామం చెందుతుందనేది మాత్రం నిర్ణాయకం అయిన సంగతే. వాటిని ఈ స్థితిలో మాత్రం మనం వేరుచేసి చూడలేకపోయినా, తెలుసుకోలేకపోయినా వాటిలో అంతర్గతంగా ఉన్న లక్షణాలు మాత్రం వేరు వేరు అయినవి అనడంలో సందేహం లేదు. వాటి అభివృద్ధి లేక పరిణామ సూత్రాలు కూడా వేరు వేరు అయినవే.

ఒక విత్తును తీసుకుని చూచినప్పుడు అది ఆ రకం చెట్టుగానే ఎదుగుతుందని చెబుతాముగాని మరోరకం అయిన చెట్టుగా తయారవుతుందని పొరపాటున గూడా చెప్పము. అందుచేత పెరుగుదల, పరిణామాల విషయంలో ముందుగా అంతర్గతంగా ఉండిన లక్షణాలే విజృంభిస్తున్నాయి గాని కొత్తవి చేర రావడంలేదు. అంతర్గతంగా – గర్భితంగా ఉండిన లక్షణమే క్రమంగా పెరిగి పెద్దదై నిర్ణాయక రూపాన్ని సంతరించుకుంటుంది. అందుచేత ద్రవ్యము, రూపములకు ఉండిన సహజ వ్యత్యాసం కొంత లుప్తమైపోయి మనం ఇంకొక రకంగా చెప్పుకోవటానికి వీలు ఏర్పడుతోంది. ద్రవ్యము అనేది అంతర్గతంగా ఉన్న వాహిని. దీనిలో రూపం యొక్క పరిణామం జరుగుతోంది. నిశ్చిత మార్గాన్ని చేరుకున్న రూపం పైకి కనిపించేది; దీని అంతర్గతం ఇంకా నిర్ణాయకం కాని ద్రవ్యం. ప్రకృతిలోని బీజోత్పత్తి, పుట్టుక, పెరుగుదల లేదా

లలితకళలలో వచ్చే ప్రకృతి అనుకరణ – ఇవి రూపకల్పన వల్ల ఏర్పడుతున్నాయి. వ్యవస్థ సూత్రాలను అనుసరించి జరుగుతున్నాయి. దీనికి ఉపకరించే ద్రవ్యంలో అంతర్గతంగా ఈ లక్షణాలన్నీ ఉండనే ఉన్నాయి.

ఒక రూపం పరిపూర్ణత పొందే ప్రక్రియను వివరంగా, స్పష్టంగా చెబుతాడు అరిస్టాటిల్. దీనికి Energeia అని పేరు పెట్టాడు. పరిణతి చెందిన రూపం నుంచే ఇది ఆవిర్భవిస్తుందంటాడు. ఒక్కొక్కమారు ఈ పేరును (Energeia) రూప వ్యక్తీకరణకు కూడా వాడతాడు.

ఈ ప్రక్రియలో ఒక సంగతి మనం గమనించాలి. పూర్తిగా ఆవిర్భావం చెందని సామర్థ్యాల, శక్తియుక్తులతో, నిరవధికంగా జరగే పని కాదు ఇది. చరమదశ అనే పరిపూర్ణ రూపంలో దీనికి అంత్యం ఉండనే ఉన్నది. పెరుగుదల విషయంలో మనం దీనిని స్పష్టంగా చూడవచ్చును. కంకి, మొక్కగా తయారవుతుంది. మొక్క, చెట్టుగా ఎదుగుతుంది. అయితే ఆ చెట్టుకు మరో తరువాతి మెట్టు లేదు : పూర్వస్థితి అయిన మొక్కకు ఉన్నట్లుగా చెట్టు ఇంకేదో అయిపోదు. అంతర్గత స్థితి నుంచి యదార్థస్థితికి పరిణామం – ఈ ఉదాహరణలో చెట్టు తయారవడంతో ఆగిపోతుంది. అదే జీవదార్థాల విషయంలో అయితే – వస్తువు నుంచి మరొక వస్తువు సృష్టి అవటానికి అవకాశం ఉంది. సృష్టిని కొనసాగించగల శక్తి ఉన్నది ఇక్కడ. ఈ శక్తిని గురించి చెబుతూ దానిని పరిపూర్ణంగా చూపించడమే అరిస్టాటిల్ నీతిశాస్త్రం (Ethics) అన్న పుస్తకంలో ఆధారసూత్రంగా వర్ణించబడింది.

**నాలుగు కారణాలు :**

రూపము, ద్రవ్యము, అంతర్గతము, పైకి కనిపించేది – అని నాలుగుగా విభజించిన ఈ పరిశీలనలో పరిపూర్ణత ఎలా రూపొందుతుందంటే.... వస్తువుల తయారీకి అవసరమైన పరిస్థితులను వర్ణించడం నాలుగు కారణాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించడమూను.

గ్రీక్ తత్త్వ చర్చలలో కేంద్రస్థానం వహించిన ఈ సమస్యకు పరిష్కారం తీసుకురావడానికి అరిస్టాటిల్ పూనుకుంటాడు.

ప్రపంచ క్రమతకు కారణం ఏమిటి ?

ఇంతకు ముందు వచ్చిన తత్త్వ సిద్ధాంతాలన్నీ ఈ ప్రశ్నకు నికార్సయిన సజావైన జవాబు ఇవ్వలేకపోయినాయనీ తాను ఆ లోటును పూరిస్తున్నాననీ అరిస్టాటిల్ భావిస్తాడు.

అందుచేత ఈ సిద్ధాంతాన్ని మనం గూడా పూర్తిగా చర్చించుకుని తెలుసుకుందుకు ప్రయత్నించడం అవసరం.

'కారణం' అనే మాటకు గ్రీక్ భాషలో అరిస్టాటిల్ ఉపయోగించిన పదానికి అర్థం : పరిస్థితికి న్యాయబద్ధమైన బాధ్యత. ఒక పనికి– అది మంచిదైనా చెడ్డదైనా– న్యాయమైన బాధ్యత. ఈ పరిణామానికి మూలాధారం.

ఇక ఒక పరిస్థితిని గురించి పరిశీలిస్తూ ఇది ఇలా రూపొందటానికి కారణం ఏమిటి అని ప్రశ్నించుకుంటే దానికి జవాబు నాలుగు రకాలుగా దొరుకుతుంది. ఈ నాలుగూ ఒక్కొక్క కారణానికి అన్వయిస్తాయి. పూర్తి జవాబు కావాలనుకుంటే ఈ నాలుగింటినీ గుదిగుచ్చవలసిన అవసరం ఉన్నది.

1. ఆ వస్తువు యొక్క ద్రవ్యం, లేదా ద్రవ్య కారణం.
2. అది ఎదిగిన సూత్రం; లేదా రూపకారణం.
3. ఎదగటానికి లేదా మారటానికి ముందుగా ప్రోద్బలపరిచింది ఎవరు ?– ప్రారంభ కారణం ఏమిటి ?
4. పూర్తి ప్రక్రియ యొక్క పరిపూర్ణ ఫలితం. – అంత్య కారణం.

వీటిలో ఏ ఒకటి వేరుగా ఉన్నా, ఫలితంగా అవతరించిన వస్తురూపంలో కూడా వ్యత్యాసం ఉండి ఉండేదే. అందుచేత ఈ నాలుగింటినీ విధిగా పరిశీలించి తెలుసుకోవలసిందే.

బాహాటంగా కనిపించే ఉదాహరణలు ఇవ్వవచ్చును :

మానవ నైపుణ్యం వల్ల తయారయ్యే వస్తువులు. అయితే జంతు సంబంధమైన పెరుగుదల, పునరుత్పాదనతో ప్రారంభించాము గనుక ఈ పరిశీలనకు, ఇది చాలదు.

ఒకానొక స్థలంలో ఇప్పుడు ఫలానా చెట్టు ఎందుకు ఉన్నది – అని ప్రశ్న వేసుకుందాం.

పరిశీలనలో అంశాలు ఇలా ఉండటానికి అవకాశం ఉంది :

1. ఒక విత్తు ఉన్నది. దాని నుంచి ఈ చెట్టు వచ్చింది. ఆ విత్తులోనే చెట్టు పుట్టటానికి, పెరగటానికి అవసరం అయిన శక్తి అంతర్గతంగా ఉండింది. అందువల్లనే ఇప్పుడు ఇక్కడ ఈ చెట్టు ఉన్నది.
2. ఈ విత్తు నిర్ణాయకమైన పద్ధతిని అనుసరించి ఉండాలి. పెరుగుదలకు అనుకూలమైన పద్ధతి అది. అది చెట్టుగానే పెరగగలదు. మరో రకంగా పెరగలేదు.

3. ఆ విత్తు ఎక్కడినుండో ఊడిపడలేదు. అది అంతకు ముందు ఉండిన చెట్టులో నుంచే వచ్చింది. పూర్వపు చెట్టు దాని నుండి వచ్చిన కంకి, ఆ కంకిలో గింజ–ఇదంతా ఈ చెట్టు ఎదగటానికి అవసరం అయిన కారణాలు కల్పించాయి.

4. పెరుగుదల అంతా సమన్వయం అయి, పరిపూర్ణత చెందే స్థాయి ఒకటి ఉండి ఉంటుంది. ఆ సమన్వయ సూత్రం ప్రకారం ఈ విత్తు, చెట్టుగా పెరిగి తిరిగి కంకులను ఇవ్వగల స్తోమతు కలిగి ఉంది.

ఇదీ ఈ ప్రక్రియ కంతటికీ తుది రూపం.

అరిస్టాటిల్‌కు ఉన్న వృక్షశాస్త్ర పరిజ్ఞానం వల్ల ఆయన ఈ తుది రూపాన్ని ఊహించుకోగలిగేడు; ఉద్దేశించగలిగాడు. ఇవి ప్రత్యేకించి ఊహించినదీ, ఉద్దేశించినవీ కాకపోవచ్చును.

వాటంతట అవి ఆ గాడిలో పడ్డాయి.

ఇటువంటి పరిస్థితుల సముదాయం అపురూపం గనక, ఇదేదో సహజ పరిణామంగానే జరిగింది సుమా అనుకోవటానికి వీలులేదు. అందుచేత ఇది యాదృచ్ఛికంగా జరిగింది అంటాము. ఈ యాదృచ్ఛిక పరిణామానికి మధ్యయుగాల నీతిశాస్త్రంలో బల పరిగణన వచ్చింది.

**చలనం (Motion) :**

కారణం సహజమైనది అయినా కృత్రిమమైనదైనా, ద్రవ్యం పైననే ఆధారపడి ఉంటుంది. ఏదో నిమిత్త కారణం వల్ల, మరేదో ప్రోద్బలం చేత రూపం ద్రవ్యం మీద తన ప్రభావం చూపుతోంది. ఈ ప్రోద్బలం ద్రవ్యం మీద ఎలా ప్రవర్తిస్తోంది. చివరకు ఆ రూపాన్ని ఎలా తీసుకు రాగలుగుతోంది ?

అరిస్టాటిల్ దీనికి చలనం (Kinesis) అని సమాధానం చెబుతాడు.

ఈ ప్రోద్బలం తీసుకువచ్చే మాధ్యమం (Agent) ద్రవ్యం మీద ఒక చలనాన్ని ప్రవేశ పెడుతోంది. ఈ చలనం ఫలితంగానే ఆ రూపం నిర్మాణం అవుతోంది. ఆ మాధ్యమమే చలనంతోపాటు తాను గూడా ఉండాల్సిన నిమత్తం లేదు. అది చలనాన్ని కలిగించగలిగితే చాలును. అంటే ఉద్దేశ్య పూర్వకమైన పనులన్నింటిలోను,

తుది రూపానికి దోహదం చేసే కారణం ఏమిటంటే, 'ఫలానా ఫలితం రావాలి సుమా అనే అభిప్రాయమే' ఈ అభిప్రాయం తనంత తాను చలనంలో పాల్గొనదు.

మనసులో ఆ అభిప్రాయం స్థావరించుకొని, అది మరో శరీర భాగాన్ని ఆ పనికి నియమిస్తోంది. తాను కదలకుండానే మరొకదానిని కదిలించడం అనే కారణం –అరిస్టాటిల్ ధర్మశాస్త్రంలో ఆయువుపట్టు అయిన ఆలోచన. అంతర్గత లక్షణం నుంచి పైకి కనిపించే వస్తువు తయారవడం అనే ప్రక్రియకు, మార్గానికి – కదలిక మూలకందం. ఇది ద్రవ్యంలోనే అంతర్గతంగా ఉంది, పనిచేస్తోంది. ఈ కదలిక ఒకవైపు నుంచే ఎందుకు రావాలి ? మరోవైపుకు ఎందుకు పోదు – అన్న మీమాంసల పైని అరిస్టాటిల్ గందరగోళ పడడు. ఆ పని తరువాత వచ్చిన ప్రకృతి ప్రక్రియల యాంత్రికతను పరిశీలించిన ఆధునికులు చేపట్టారు. అది వేరే విషయం.

అరిస్టాటిల్‌కు, ప్రకృతిని గురించి ఉండిన అభిప్రాయాలు ఇతమిత్థమైనవి. కేవలం యాంత్రికతకు సంబంధించినవి కావు.

కళలలో – ఒక రూపాన్ని మనసుకు పట్టి ఇవ్వడం, అతడిచేత ఒకానొక ద్రవ్యంపై దాన్ని ముద్రించేట్లుగా, మలిచేట్లుగా చేయడము– అనేది వస్తువు తయారు అవటానికి దోహదం చేస్తుంది. దీనినే విస్తరించి చూచినప్పుడు, ప్రకృతిలో ఉన్న నైపుణ్యం కారణం ఆలోచనమీద పనిచేసి వస్తువును తయారుచేయడం అనేది– ప్రకృతే ఈ పని చేస్తోంది అనిపించే స్థాయిలో ఉంది. ద్రవ్యం ఈ నైపుణ్య కారణానికి ప్రభావితం అవుతుంది. దీని ఫలితంగా, కొన్ని నియామకాలను వరుసగా ఆపాదించుకుంటూ పోతుంది. అంతర్గతమైన లక్షణాలను, వాసనలను, నియమితమైన తీరులలో విస్తృత పరుచుకుంటూ పోతుంది.

'చలనం' అనే పదాన్ని అతి విస్తృతమైన భావంలో వాడతాడు అరిస్టాటిల్. వస్తువులన్నీ ఇప్పుడు తాము పొందిన రూపాన్ని సంపాదించుకుందుకు పని చేసిన ప్రక్రియలన్నీ అతని దృష్టిలో ఈ చలనమే. చలనంలో వివిధ అంతస్తులను ఆయన ఏకరువు పెడతాడు.

**ఉత్పాదన :** అంటే ఒక నియామక వస్తువు ఈ రూపానికి రావడం, దానికి వ్యతిరేకమైన లక్షణం వినాశం అవుతుంది లేదా భ్రష్టం అవుతుంది.

**మార్పు :** వస్తువులోని గుణం మారిపోతుంది.

**పెరుగుదల :** సంకుచితం అవడం; వస్తువు యొక్క ప్రమాణంలో మార్పులు రావడం.

**స్థలం ద్వారా చలనం :** మార్పు జరుగుతున్న ప్రక్రియలో వస్తువు ఇదివరకు ఆక్రమించుకున్న స్థలాన్ని కాకుండా అటు ఇటు పాకడం, జరగడం.

– ఈ చివరి అంశాన్ని అరిస్టాటిల్ ఎక్కువగా వివరించి చెబుతాడు. ఎందుకంటే ఇదే అన్నిటిలోను ముఖ్యమైనది.

**చలనం యొక్క నిత్యత్వం :**

నైపుణ్య కారణం పరిశీలిస్తున్నప్పుడు కొన్ని ముఖ్యమైన ఫలితాంశాలు తారసపడినాయి.

అరిస్టాటిల్ తన పూర్వీకులు చెప్పిన 'పరిణామ' ప్రక్రియ అభిప్రాయాలతో ఏకీభావం లేదు. అతని సిద్ధాంతం ప్రకారం మనిషి మనిషిలో నుంచే రావాలి. పసిపిల్ల ఉన్నదంటే – దానికో తండ్రి ఉండాలి. ప్రకృతిలో పగుళ్ళు వచ్చి బాగా ఎదిగిన తల్లిదండ్రుల ద్వారా యువకులే ఉత్పత్తి కావడం జరగని పని. ఒక జాతి Species నుంచి మరో జాతి ఉద్భవించడం కూడా జరగదు.

ప్రతి పసిపాపకు ఒక తండ్రి ఉండాలి. ఆ తండ్రి కూడా తాను ఇంత పెద్దవాడు కాకముందు పసిపాప అయి ఉండాలి. అందుచేత పునరుత్పాదక సూత్రం ఆవలంబనలో ఉన్నంత కాలం – దీనికి ఆది, అంతం అనేవి ఉండవు.

విశ్వం (Cosmos) క్రమశీలత ఉన్న ప్రపంచం – తప్పకుండా శాశ్వత మైనది. చలనం గూడా ఎప్పటికీ ఉండేదీ, ఎప్పుడూ పనిచేస్తూ ఉండేదీని, దీనికి ఆపు, అడ్డు లేవు.

భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఏమీలేనిస్థితి (Nothing) నుండి సృష్టించాడు అన్నప్పుడు – మన ఉద్దేశ్యం ఏమంటే ఆయన అంతకు ముందు నుంచి ఉన్న ద్రవ్యం నుండి సృష్టించలేదు – అని. జగత్తు తన అస్తిత్వం కోసం కేవలం ఆయన (భగవంతుడు) మీదనే ఆధారపడి ఉన్నదీ – అని.

**భగవంతుడు :**

ప్రపంచం శాశ్వతమైనది– అన్న సిద్ధాంతం అరిస్టాటిల్ ప్రథమ తత్త్వ దర్శనానికి పతాక స్థాయికి చెందినది.

భగవంతుడు శాశ్వతుడు. అన్ని మార్పులకు, కదలికలకు, ప్రక్రియలకు మూలము. కాని ఆయనకు మాత్రం మార్పు లేదు.

చలనం అంతా ద్రవ్యంపైన జరిగే ప్రక్రియ. అంతర్గతంగా ఉండిన రూపాలు పైకి ఆవిర్భవిస్తున్నాయి.

ఈ ప్రక్రియ అంతా నైపుణ్య కారణంగా జరుగుతోంది.

సహజ ప్రక్రియల శాశ్వతత్వం గురించి చెప్పినప్పుడు శాశ్వతచలన మూలాధారాలు ఒకటిగాని ఎక్కువగాని ఉండాలి.

ఇలా శాశ్వతమైన చలన రూపాలను మనం అంగీకరించక పోయినట్లయితే, ఈ ప్రపంచం (జగత్తు) – ప్రక్రియ అంతా కొన్ని చలనాల మూలంగా ఏర్పడింది అని అనుకోవలసి వస్తుంది. ఈ అభిప్రాయం ఈ పని నిరాఘాటంగా, ఏకబిగిని జరగడానికి ఆటంకంగా తయారవుతుంది. ఏవో ప్రక్రియలు ఉన్నాయి, అవి అప్పుడప్పుడు తటస్థిస్తాయి – అనుకుంటే, అవిచ్ఛిన్నతకు అంతరాయం ఏర్పడుతుంది. కనుక చలనం నిరాఘాటంగా జరగవలెనంటే అందుకు శాశ్వతమైన మూలాధారాలు ఒకటిగాని, కొన్నిగాని ఉండాలి. ఒకటే అనేకమా అని మళ్ళీ ప్రశ్నించుకున్నప్పుడు అరిస్టాటిల్ చెప్పే సమాధానం : 'తాను కదలకుండా అన్నిటినీ కదిలించే సర్వ శక్తివంతుడు ఒక్కడే' అని.

జగత్తు ఉద్దేశ్యం నెరవేరడానికి ఒక్కడే చాలును. ఎక్కువమంది ఉన్నారను కోవడం అపసవ్యం అవుతుంది.

భగవంతుడు, జగత్తు,ఈ రెంటికీ ఉన్న పరస్పర సంబంధాన్ని గురించి అరిస్టాటిల్ అభిప్రాయాలు ఇవీ –

భగవంతుడు ఒక్కడే. మార్పుకు లోనుకాని మహత్తరశక్తి ఆయన ఒక్కడే. ఆయన సాక్షాత్కారానికి జగత్తు అంతా ప్రతిస్పందిస్తుంది. తత్ఫలితంగా బ్రహ్మాండ రచన జరుగుతుంది. ద్రవ్యంలో అంతర్గతంగా, గర్భితంగా ఉన్న అనేక రూపాలను వెలికి తెచ్చే పరమపురుషుడు ఆయనే.

ఈ ప్రక్రియ అంతటికీ ఆవల నిలబడి, తన సంకల్పం చేతనే ఆయన సృష్టి అంతా పల్లవించేట్లు చేస్తాడు. రూపము, ద్రవ్యము కలిసిన సముదాయం కాదు. ఆయన మనం చూస్తున్న వస్తువుల మాదిరి ఆయన అనేక ఉపాంగాల సమ్మిశ్రితం కాదు. ఆయన కేవలం అనంతరూపుడు; సత్యం. ఆయన వెనక చరిత్రకు లోబడిన

పెరుగుదల; పరిణామము లేవు. ఆయన అప్రాకృతమైన మానుషీ రూపుడు. జగత్తు అస్తిత్వానికి ఆయన తప్పనిసరి. అయితే ఆ జగత్తుకు ఆవల, అతీతంగా నిలిచి ఉంటాడు. ఆయన సాక్షాత్కారం వల్లనే అన్ని పనులూ అవుతాయి. ఆయన కదలకుండానే జగత్తు, సృష్టి ఎలా సంభవిస్తాయి అన్న ప్రశ్నలకు గూడా అరిస్టాటిల్ సమాధానం చెబుతాడు. 'మంచితనం' అన్న కళ్యాణగుణం మూర్తీభవించి ఉన్నవాడు గనుక కదలకుండానే తన మంచితనాన్ని ప్రసరింప చేసి అన్ని పనులు జరిపిస్తాడు. విశ్వమంతా తన ఇరుసు మీద అవిచ్ఛిన్నంగా నిర్విరామంగా కదిలేటట్లు కటాక్షిస్తాడు. చలనం అంతా విశ్వానికి ఆవల ఎక్కడో స్వర్గంలో – కలదని కేంద్రం నుంచి జరుగుతుంది గనుక దాని ప్రభావం విశ్వమంతటా ఆవరించి ఉంటుంది.

భగవంతుడు విశ్వాన్ని చలింపచేసేవాడు, శక్తి ఉత్పాదకుడు – అంటాడు అరిస్టాటిల్. అంతేగాని ఆయనే సృష్టికర్త అనడు. జగత్తు శాశ్వతం అయినదైనా – సృష్టికి ఆయనకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు చెప్పాడు.

పూర్వమే ఉన్న ద్రవ్యం పైన ముద్రింపబడిన రూపం వైపు పురోగమించేటట్లు చేయడమే ఆయన సాక్షాత్కారం వల్ల విశ్వంలో జరుగుతూ ఉన్న పని.

భగవంతుడు లేకపోయినట్లయితే, 'రూపం' ఉండదు; క్రమత ఉండదు.

ప్రకృతి అంతా నాలుగు మూల ద్రవ్యాలుగా విభాగం అయినా, ఆ 'మూల ప్రకృతి' భగవంతుని కంటె భిన్నమైనది కాదు. జరుగుతున్న వాటి కన్నింటికీ మూలరూపం అదే.

సృష్టికర్త కానట్లే అరిస్టాటిల్ నిర్వచించే భగవంతుడు జీవుల విధికి, గతికి పరిపాలకుడు కాడు.

జగత్తును నిర్విరామంగా, నిరాటంకంగా చలింపచేస్తూ ఉండడమే ఆయన పని.

అది సంకల్పబలం. భగవంతుని ధ్యానం.

సంకల్పాన్ని గురించే సదా ధ్యానిస్తూ ఉండడం ఆయన పని.

నిరాటంకంగా జరిగే అన్ని పనుల వలెనే, ఇది కూడా సుఖదాయకం. ఈ సుఖం కూడా నిరాటంకమైనదే.

మనం కూడా, ఇలాగే పవిత్రమైన ధ్యాన నిమగ్నతకు అలవాటు పడగలిగితే, ఆ దివ్య జీవనాన్ని అందుకోగలుగుతాము. భగవంతుని సుఖసంపదలో పాలు పంచుకోగలుగుతాము.

# భౌతిక శాస్త్రం

**ప్లే**టో 'భూమి'కి చలన స్వరూపం ఉన్నదనీ, విశ్వంలో 'భూమి' కేంద్ర స్థానంలో లేదని బోధించాడు. కోపర్నికస్ సిద్ధాంతం ప్లేటో 'ఎకాడమీ' లోనే పుట్టి ఊపిరి పోసుకుందన్న విషయం కూడా చరిత్రకారులు చెబుతారు.

అయితే ప్లేటో శిష్యుడు, అనుయాయి అయిన అరిస్టాటిల్ మటుకు ఈ విషయాలు గురువుగారి అభిప్రాయాలను ఖండిస్తాడు.

అరిస్టాటిల్ ఆలోచనా సరళి ప్రకారం 'భమి' ఈ విశ్వంలో కేంద్ర స్థానంలో ఉన్నది. దానికి చలనం అనేది లేదు.

నాలుగు మూలపదార్థాల విషయంలో గూడా అరిస్టాటిల్ ప్లేటోను వ్యతిరేకిస్తాడు.

అలాగే మానవ శరీరం విషయంలోగూడా, అంతకు ముందు తత్త్వవేత్తలు, విజ్ఞానులు – ప్లేటోతో సహా మనసుకు ప్రాధాన్యం ఇస్తే, అరిస్టాటిల్ మనస్సు కాదు, హృదయం కేంద్రస్థానం అంటాడు. నరాశయం అంతా హృదయగతం అని ఆయన వాదం.

స్థలము, కాలము ఊహాజనితమేనని, యదార్థమైనవి కావని పూర్వులు చెప్పిన మాటను గూడా అరిస్టాటిల్ వ్యతిరేకిస్తాడు. స్థలం (Space) గురించి అరిస్టాటిల్ అభిప్రాయం ఇది :

అది ఒక ఘటాకారంలో ఉంది. దానిలో అనేక ద్రవాలు గుమ్మరించటానికి వీలున్నది. ఒకసారి దానిలో నీళ్ళు ఉంటే మరో మారు గాలి ఉంటుంది.

సమయాన్ని గురించి (Time) అరిస్టాటిల్ ఆలోచనలు ఇలా ఉంటాయి.

సమయం – కదలిక మార్పులతో విడదీయరాని సంబంధం కలిగి ఉంటుంది. మార్పు జరిగినప్పుడు, సమయం గడిచిపోయిందన్న విషయం మనం గమనిస్తాం. అయితే సమయం – మార్పు ఒకటి కాదు. మార్పు ఎన్నో రకాలు. స్థలం మార్పు రంగు మార్పు – ఇలా.

అలాగే సమయం, కదలిక ఒకటి కావు. కదలికలో అనేక వేగాలు ఉన్నాయి. కదలికలోని నిర్విరామత, సమయానికి, స్థలానికి గూడా వర్తిస్తాయి.

* * * * *

**మానసిక శాస్త్రం :**

మనస్సు ఎదుగుతుంది, వికసిస్తుంది గనుక మానసిక శాస్త్రం కూడా భౌతిక విజ్ఞాన శాస్త్రాలలో భాగమేనంటాడు అరిస్టాటిల్. మనస్సుకు అంతర్గతం కదిలే లక్షణం ఉంది.

మానసిక శాస్త్రాన్ని గురించి అరిస్టాటిల్ అభిప్రాయాలు తెలుసుకునే ముందు మనం రెండు సంగతులు మనసుకు పట్టించుకోవాలి.

1. సైకి (Psyche) లేదా ఆత్మ : మనం ప్రస్తుతం చైతన్యం, ప్రజ్ఞ (Consciousness) అని వాడుకుంటున్న మాట ఇచ్చే భావంకంటే అరిస్టాటిల్ 'సైకి' విస్తృతమైనది. నిజానికి చైతన్యం అనేది దరిమిలా చాలా కాలానికి ప్రచారంలోనికి వచ్చినమాట. ఆహార క్రమము, పెరుగుదల, బాహ్య స్థితిగతులకు స్పందించడం – ఇలాంటివన్నీ గూడా గ్రీక్ సంప్రదాయంలో 'సైకి' అనే మాట ద్వారానే వివరణ పొందుతాయి.
2. శారీరక, మానసిక అభివృద్ధి – ఈ రెండూ అరిస్టాటిల్ ఒకే క్రమానికి చెందినవిగా భావిస్తాడు. శరీరం ఎదిగి, పెద్దవాడైన రీతిగానే మనసు గూడా ఎదిగి శీలసంపదను సంతరించుకుని ఆలోచనాపరుడుగా, పౌరుడుగా తయారవుతాడు మనిషి. ఆత్మకు నిలయం శరీరం.

అరిస్టాటిల్ ఒక ఉదాహరణ చెబుతాడు. శరీరం అంతా ఓ పెద్ద కన్ను అనుకుంటే, చూడడం అనేది దానికి ఆత్మ. కన్ను చూడటానికి ఉపయోగించే పరికరం. మన శరీరంలో భాగం, అలాగే శరీరం గూడా మనం జీవించటానికి సాధనంగా ఉన్న ఒక పరికరం. అంటే "ఆత్మ" శరీరం యొక్క గమ్యం అన్నమాట. ఆత్మ ఒక్కటే శరీరం లేకుండా ఉండలేదు. మనం జీవించి ఉండాలంటే మనకు ఆత్మ ఒక్కటే ఉంటే చాలదు. మనం నిద్రపోతున్నప్పుడు ఆత్మ ఉంటుంది. మనం అవివేకులమైనప్పుడూ, తప్పుదారిని నడుస్తున్నప్పుడూ ఉంటుంది. అయితే వివేకయుతంగా, నైపుణ్యంతో జీవించాలంటే శరీరంతోపాటు ఆత్మ గూడా బాగా వికసించాలి. అందుచేత దీనికి విద్యాబుద్ధుల ద్వారా సత్శీలం నేర్పాలి. ఆలోచన చురుకుగా చేయగల స్థాయికి

దీనికి శిక్షణ ఇవ్వాలి. భావ ప్రపంచంలోనూ, బయటి ప్రపంచంలోను చక్కగా వ్యవహరించటానికి ఆత్మకు తగిన చాకచక్యం అవసరం. ఆత్మ ఉండడం అనేది సుఖజీవనానికి మొదటి మెట్టు. అంటే శరీరము, ఆత్మ పరస్పర ఆశ్రయంగా ఉంటాయి.

అరిస్టాటిల్ ఈ వికాసానికి మూడు అంతస్తులు చెబుతాడు.

1. చక్కని ఆహారం (Nutritive)
2. సునిశితత్వం (Sensitive)
3. వివేకం (Intelligency)

సజీవపదార్థానికి, నిర్జీవపదార్థానికి మొదటి తేడా ఏమిటంటే సజీవపదార్థం చక్కగా భోజనం చేయగలదు. జీర్ణం చేసుకోగలదు. అందువల్ల శరీరం పెంపుదలకు కారణం కాగలదు.

వృక్ష సంతతిలో ఈ ప్రక్రియ ఇక్కడితో ఆగిపోతుంది.

జంతు సంతతికి వచ్చేసరికి మనం రెండవ లక్షణాన్ని చూడగలుగుతాము. వాటికీ కోపతాపాలు, ఇష్టాఇష్టాలు ఉంటాయి. సుఖదుఃఖాలు జంతువులకూ ఉ ంటాయి. అవి గుర్తుపెట్టుకోవడం లాంటి పనులు కూడా చేయగలవు. నడవడం అనేది జంతుస్థాయిలోనే ప్రారంభం అవుతుంది. వృక్షాల మాదిరి అవి తమ దగ్గరకు వచ్చిన ఆహారాన్ని మాత్రమే తీసుకునే పరిమితి లేదు. జంతువులు నడిచి వెళ్ళి తమ ఆహారాన్ని వెదుక్కోగలవు.

మూడో అంతస్తు అయిన 'వివేకం' మనిషికి మాత్రమే సాధ్యం. సరిపోల్చి చూచుకోవడం, అంచనాలు వేయడం, ఆలోచించడం, జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం– ఇవన్నీ మానవులే చేయగలరు.

విశ్వవ్యాప్తమైన సంగతులను గుర్తుపట్టగలగడం, క్షణికమైన లాలసలకు లొంగిపోకుండా ఆలోచించి జీవించగలగడం మానవులకు మాత్రమే సాధ్యం.

వస్తువుల గుణగణాలను తెలుసుకోగలగడం విచక్షణ చూపడం అనేది ఇంద్రియ జనితమైన జ్ఞానంగా చెబుతాడు అరిస్టాటిల్. లక్క కరిగించి పోసి దాని మీద ఇనుప ముద్రను వొత్తినప్పుడు, ఆ లక్క ముద్రకు అనుగుణమైన రూపును పొందుతుంది. అలాగే ఆత్మ కూడా తాను చూస్తున్న వస్తువు తాలూకు ఆకారాన్నే పొందుతుంది అంటాడు ఆయన.

ప్రతి ఇంద్రియము తనకు ప్రత్యేకించిన పనులనే చేయగలుగుతుంది. ఇంద్రియాల పనిని సమన్వయం చేసేది హృదయం (Heart).

ఊహలు లేకుండా ఆలోచించడం అనేది కుదరదు. ఆలోచించడం అంటే చూస్తున్న వస్తువులను, ఊహలను వాటి అర్థాలతో సహా గ్రహించగలగడం. ప్రపంచం యొక్క నిజ స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఆలోచనను సుశిక్షితం చేసుకోవడం అవసరం.

ఆలోచనకు సార్థక్యం ఏమిటంటే అసలైన రూపాలను (Forms) గుర్తించ గలగడం.

వస్తువుల మధ్య ఉన్న పరస్పర సంబంధాలను తెలుసుకోవడం, వివేకానికి లక్షణం. ఆలోచన వివేకయుతం అయితే తప్ప ఈ పని సాధ్యం కాదు.

చూస్తున్న వస్తువుల ద్వారా, మానసిక లక్షణాల ద్వారా మాత్రమే మనం ఆలోచించగలిగితే విశ్వ ప్రతీకలైన రూపాలను చూడలేము.

విశ్వ సత్యాలను గురించి ఆలోచించడం, ఆ సత్యాలు వేరు వేరు అయినవి కావు.

శాస్త్ర పరిజ్ఞానం అంటే పుస్తకాలలో వ్రాసిపెట్టిన ముక్కలు మటుకే కాదు. మనసు ఆలోచనలతో నిండిపోవాలి; వస్తువులను యదార్థంగా చూడగలగాలి. తనను తాను అర్థం చేసుకోగలగాలి. మనస్సు, జీవిత సత్యాలను అవగాహన చేసుకోగలగాలి.

ఆలోచన (భావన) అనేది మనిషికి సాధ్యమైన అత్యున్నత శక్తి, సామర్థ్యం.

ఆలోచన తాను అర్థం చేసుకున్న సత్యాలను సృష్టించుకో గలుగుతుంది.

వివేకం ద్రవ్య సంబంధమైనదిగాదు, ఆలోచనలో అంతరాయం ఉండగూడదు. ద్రవ్య సంబంధిత నుంచి దూరమైపోతే తప్ప అది అమృతమయము, శాశ్వతము కాదు.

– అరిస్టాటిల్ ఈ శాస్త్ర విషయాలలో చెప్పిన సంగతులు ఎక్కువగా వివరించాడు. ఆయన వ్రాసినవి చదివినప్పుడు ఆయన ఏం చెప్పదలచుకున్నాడో మనకు స్పష్టంగా అర్థం కాదు. ఆయన శిష్యులు 'భాష్యాలు' తయారు చేయడమైతే చేశారు గాని, ఒకరు చెప్పిన దానిని మరొకరు కాదని మనను మరింత గందరగోళంలో పడవేస్తారు.

Alexander of Aphrodisias అనే ఒక శిష్యుడు ఈ ఇబ్బందిని కొంతలో కొంత తొలగించటానికి ప్రయత్నించాడు. ఇతను రెండవ శతాబ్దానికి చెందినవాడు. ఇతను ఏం చెప్పాడంటే :

వివేకం (Active Intelligence) అందరు మనుషుల్లోను దాదాపు సరిసమానంగానే ఉంటుంది. ఇది భగవత్సమానమైనది.

ఎవరికి వారికి మటుకే ఉండే Passive Intelligence భగవదుద్దీపనం కోసం వేచి ఉంటుంది.

ఈ వివరణ ఫలితం ఏమిటంటే, వివేకం అనేది మానసిక శాస్త్ర పరిధి నుంచి వైదొలగిపోతుంది.

పన్నెండవ శతాబ్దంలో వచ్చిన మరొక శిష్యుడు అవెరొస్ (Averroes) ఏమన్నాడంటే :

'Active, Passive' వివేకములు విడదీయటానికి తార్కిక సహాయం కావాలి.

'నిజంగా చెప్పవలెనంటే మనుషులు అసలు ఆలోచించరు... ఈ విశ్వమంతటిలోను ఒకే ఒక వివేకం ఉంది. మనం ఆలోచన అనుకుంటున్నది మనది కాదు, భగవంతుడిది.

మూడవ భాష్యం ఏమంటే... 'Active Intelligence' అనేది భగవంతుడు కాదు, అది అందరు మనుష్యులకు సమానం గూడా కాదు. అది మనిషిలో ఉన్న అత్యుత్తమాంశ. దానికి శరీరగతమైన ఇంద్రియం లేదు."

# అనుష్ఠాన తత్త్వశాస్త్రం

ఇంతవరకు ఆలోచనలకు, ఊహాజనితమైన విషయాలకు సంబంధించిన జ్ఞాన శాఖలను గురించి చెప్పుకున్నాము. ఇప్పుడు ప్రయోగశీలత ఉన్న శాఖలను గురించి చూద్దాం.

అనుష్ఠానం, ప్రయోగం, (Practice) కూడా మనసుకు సంబంధించిన విద్యే. అయితే మనసుతో ఆలోచించి ఊరుకోవటంతో ఇది తృప్తిపడి కూర్చోదు. నిజమైన భావ పరంపరలు, ఆలోచనల ప్రసారాలను మించి ఏదో ఉత్పాదకత వైపు తీసుకు వెడుతుంది మనసు. ఏదో ఫలితం ఉత్పన్నం కావాలి. ఇదీ దీని తత్త్వం. ఉదాహరణకు, ఇంజనీరింగ్ విద్య ఉన్నదనుకోండి, అందులో ఒక భాగంగా వంతెనలు కట్టడం ఎలానో చెబుతారు. ఈ విద్య నేర్చుకున్నవారు వంతెనలు కట్టడం ఎలాగో నేర్చుకుంటాడు. అంతమాత్రంచేత అతడు తెలుసుకున్నదంతా పూర్తి అయిందనుకోవటానికి కుదరదు. అతడు వంతెన నిర్మాణంలో గూడా ప్రత్యక్షంగా పాల్గొని ఉత్తీర్ణుడవడం అవసరం. అలాగే మానవ ప్రవర్తనా రీతులను గురించి చదువుకున్న మనిషి – కేవలం చదువుకే దీనిని పరిమితం చేయకుండా మానవ సమాజంలో దీనిని అభ్యాస పూర్వకంగా అమలు జరపటానికి చూడాలి. మానవ వ్యవస్థను తీర్చిదిద్దడంలో పాలు పంచుకోవాలి.

వంతెన కట్టడం ఎలాగో ప్రత్యక్షంగా తెలియాలి, చేతనవ్వాలి.

అలాగే మనలోను, మనతోటి వారిలోను 'మంచితనాన్ని' పెంచడం మనకు చేతనవ్వాలి. సమాజం అంతటిలోను సత్సంబంధాలు నెలకొల్ప గలగాలి. నైతిక సాంఘిక సమస్యలను గురించి ప్రస్తావించినప్పుడల్లా అరిస్టాటిల్ ఈ సంగతిని అతి స్పష్టంగా చెప్పాడు.

మంచితనం అంటే ఏమిటి – అని దానిని పదే పదే వర్ణించి చెప్పడం కాదు ఆయన ఉద్దేశ్యం. తన శ్రోతలందరినీ మంచివాళ్ళుగా మలచడం, తయారుచేయడం. ఈ విషయం మనం ముందుగా గమనించాలి. అలాగే Politics అనే పుస్తకం ఆయన తన పాండిత్య ప్రకర్షకోసం వ్రాయలేదు; రాజ్యపాలన వ్యవహారం చేయడం ఎలా

అన్న సంగతి రాజకీయ వర్తనులకు – లెజిస్లేటర్లకు – తెలియాలని; వారికి ఎప్పటికప్పుడు మార్గదర్శకంగా ఉండే ఒక మంచి పుస్తకాన్ని ఇవ్వాలనీ వ్రాశాడు.

అలాగే నీతిశాస్త్రం, రాజకీయశాస్త్రం – దృష్ట్యా గూడా సత్యాన్ని కనుగొనటానికి, ఉపాసించటానికి అవకాశం ఉన్నదని ఆయన ప్రతిపాదన. సూక్తులు ఆచరణయోగ్యం అయినవిగా ఉండాలి; అంతేగాని పుస్తకాలలో అలంకారప్రాయంగా ఉంటే చాలదు. ప్రయోగశీలమైన విజ్ఞాన శాస్త్రాల మానవవర్తన రీతులతో, సమాజ నిర్మాణ వ్యవహారాలతో అనుదిన జీవన ప్రక్రియలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండాలి. క్లిష్టమైన విషయాలకు, మార్పులు చేర్పులకు లోనుకాని సందర్భాలకు తగిన ఆచరణ సూత్రాలు తయారుకావాలి. అందుచేత, ప్రధాన వర్తనంతో సమంజసంగా కనిపించే సూత్రాలు అవగాహనకు వస్తే చాలును – అనుకోవాలి మనం. వైద్యంలో అన్ని రోగాలకు ఒకే మందు ఉంటే బాగుండును అనుకోలేము గదా! కొన్ని ప్రాతిపదిక సూత్రాలు – వాటిని అనుసరించటానికి అవగాహన అంశాలు, ప్రయోగం చేస్తున్నవారి అనుభవానికి, నేర్పరితనానికి వదిలివేసే నిర్ణాయక సూత్రాలు ఉంటే చాలు.

ఈ సూత్రాలు ఒకదానికొకటి సంబంధించి ఉంటాయి.

ఆయుధాలు తయారుచేసే మనిషి ఉన్నాడు. వాటిని తయారుచేయడమే ఆ మనిషి పరమావధి. వాటిని ఉపయోగించే మనిషి వేరే ఉన్నాడు. వాటిని శక్తివంతంగా, యుక్తిగా ఉపయోగించడం అతని శాఖ. వృత్తిపరమైన ఉపయోగం ఇలా విభిన్నతను ప్రదర్శిస్తుంది గదా! రాజనీతిజ్ఞుడికి ఇదంతా కేవలం సాధనే (Means) ఆయుధాలు ఉపయోగించే మనిషి తయారుచేసే మనిషికి తనకు ఎటువంటి ఆయుధాలు కావాలో చెబుతాడు. వాటి లక్షణాలను, గుణగణాలను వ్యక్తీకరిస్తాడు. మళ్లీ రాజనీతిజ్ఞుడే, ఈ ఉపయోగించే మనిషికి వాటిని ఎక్కడ ఎప్పుడు ఉపయోగించాలో నిర్దేశించి చెపుతాడు. అందుచేత ఉపయోగించేవాడు, తయారుచేసే వానికంటె మిన్న. తయారుచేసేవాడు కేవలం కింద తరగతివాడు.

కనుక, అత్యంత ప్రముఖమైన విద్య – రాజనీతి వ్యవహారం. ఎందుకంటే దీని అవలంబకుడే ఇతర వస్తువుల ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు నిర్దేశకులు.

రాజ్యం సురక్షితంగా సంక్షేమంగా ఉండటానికిగాను, ఏ వస్తువులు ఎలా ఎప్పుడు ఏ రకంగా తయారుచేయాలో చెప్పే పని రాజనీతిజ్ఞుడిది. రాజనీతిజ్ఞుడు నిర్దేశించిన వస్తువులను తయారుచేసే వాళ్ళందరిలోనూ మళ్ళీ ముఖ్యమైన స్థానం

విద్యాబోధకుడిది (Educator). రాజనీతిజ్ఞుడు తప్పనిసరిగా తన పౌరులు, జనులు ఒక రకమైన – ఒక స్థాయికి చెందిన మానసికత శీలసంపద కలిగి ఉండాలని ఆశిస్తాడు. ఈ రకమైన శీలసంపదను మానసిక వ్యవస్థను తీర్చిదిద్ది సంభవం చేసే పని విద్యాబోధకుడిది. నైతిక, మానసిక శిక్షణ ఇచ్చేది వీళ్ళే. కనుక రాజనీతి శాస్త్రంలో వీళ్లకు ప్రత్యేకమైన స్థానం. పురజనుల మానసిక నైతిక ప్రవర్తన రీతులను తీర్చిదిద్దేది వీళ్ళు. రాజనీతిజ్ఞుల ప్రధాన కర్తవ్యం ఏమవుతుందంటే – తమ రాజ్యంలో ఎలాంటి నైతిక మానసిక వర్తన రీతులు ఉండాలో నిర్ణయించుకోవడం, దానిని నేరుగా విద్యాబోధకులకు ఆదేశించడం.

అరిస్టాటిల్ తన Ethics అన్న పుస్తకంలో వివరంగా చర్చించింది ఈ విషయాలే. వ్యక్తిపరమైన విషయాలను ఆయన ఎప్పుడూ విడిగా చూడడు. అవి విధిగా రాజ్యాంగ విషయాలతోనే ముడిపడి ఉంటాయి. వ్యక్తిని సమాజపరంగానే చూస్తాడు. వ్యక్తిని సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న వాడుగానే పరికిస్తాడు. సమాజంలోని సభ్యుడుగా ఒక వ్యక్తి ఎలా 'మంచి' పనులలో నిమగ్నుడై పని చేయాలి ?– అనేదే ఆయన చర్చించిన విషయం. మంచి జీవితాన్ని, జీవిత గమనాన్ని 'సుఖంగా' రూపొందించడం మామూలు ప్రక్రియ. కాని నిజంగా సుఖం అంటే ఏమిటి ? ఇది ఎలా ఒనగూడుతుంది ? ప్లేటో మాటల ప్రకారం సుఖజీవనానికి మూడు రకాల పరీక్షలున్నాయి.

1. ఆ పని దాని కోసమే అది ఉండాలి. దాని ద్వారా ఇంకేదో సంపాదించాలనుకుంటే అప్పుడు దానిని 'సుఖం' అనడానికి లేదు.
2. ఆ పని మనను సంతృప్తులను చేయగలిగేదై, స్వయం సమృద్ధమై ఉండాలి.
3. దానికి ప్రత్యామ్నాయం అంటూ ఇంకొకటి ఉండగూడదు. ఇదా, అదా అన్న విచక్షణ ఉపయోగించటానికి ఆస్కారం ఉండగూడదు. విజ్ఞుడైనవాడు అతి సహజంగా ఆ పనికి ఉద్యుక్తుడవ్వాలి.

ఈ షరతులకు అనుగుణమైన జీవితం ఏదో – ఎలాంటిదో తెలుసుకోవటానికి సూత్రం ఏమిటి ? కొలబద్ధ ఏమిటి ?– ఇదీ ఆలోచించవలసిన విషయం.

ఇది ఇదమిత్థంగా తెలుసుకోవలెనంటే –

ప్లేటో, అరిస్టాటిల్ 'పని' అంటూ దేనిని పిలుస్తారు. ఏది మనిషి యొక్క కర్తవ్యంగా భావిస్తారు అనే సంగతులు ముందుగా మనం తెలుసుకోవాలి.

చేయగల పని అంటే ఏమిటి ? – ఆ వస్తువు మాత్రమే చేయగల పని. ఎవరైనా ఏ పరికరమైనా చయగల పని అని – ఇలా విభజనలు ఉండనే ఉంటాయి.

ఉదాహరణకు 'కన్ను' ఉన్నది. చూడడం అనేది దీని పని. శరీరంలో ఏ ఇతర అంగం వల్ల మనం 'చూడడం' అనే పని చేయించలేము. చక్కగా చూడటం చేతనైనప్పుడు ఈ కంటిని 'మంచికన్ను' లేక 'సుదృష్టి' అంటాము.

సజీవ పదార్థం యొక్క పని ఏమిటి అంటే – పనిచేస్తూ ఉండడమే. నిపుణంగా, చాకచక్యంగా బతకడం అనేది చేతనైనప్పుడు ఆ సజీవ పదార్థాన్ని 'మంచి మనిషి' అంటాము.

వస్తువైనా, మనిషైనా తన పనిని – విద్యుక్త ధర్మాన్ని – చక్కగా సుందరంగా సజావుగా, నిపుణతగా, శోభాయమానంగా చేయగలగడం ఆ వస్తువు లేక మనిషి యొక్క పని, నైపుణ్యం లేక సుగుణం. మనిషికి సంబంధించినంత వరకూ ఏమిటీ అంటే నిపుణుడుగా జీవించడం. అయితే జీవితం అనేది అనేక అంతస్తులకు చెందినది. మనిషి యొక్క పని ఏమిటి అని ప్రశ్న వేసుకుని, దానికి సమాధానం రాబట్టుకోగలిగితే అప్పుడు – మనిషి మాత్రమే నివసించగల 'రూపం' అంటూ ఒకటి ఉండటానికి వీలున్నది అది ఎలా ఉండాలి – అని నిర్ధారించుకోగలుగుతాము.

ఆహారం తీసుకోవడం, దానిని జీర్ణం చేసుకోవడం, ఆహార పానీయాలవల్ల శరీరాన్ని వృద్ధి చేసుకోవడం... ఈ మాత్రం పని అన్ని జీవరాశులూ చేస్తున్నాయి. అన్ని ప్రాణులూ ఈ పనిని యధావిధిగా చేస్తూనే ఉన్నాయి. అయితే వీటన్నిటికి మిన్నగా, మనిషి బ్రతకగలగాలి. ఏదో నియమం, నియతి ప్రకారం తన పనులను తాను నియోగించుకుంటూ, అర్థం చేసుకుంటూ విజ్ఞతతో బతకడం మనిషికి మటుకు సాధ్యం అయిన పని. మనిషి ఇటువంటి జీవితం సాగించాలి. అది అతని పని. ఈ రకమైన జీవితాన్ని నిపుణంగా, సమర్థవంతంగా, శోభాయమానంగా గడపడమే మనిషికి సంబంధించినంత వరకు 'సుఖం' అని చెప్పుకోవచ్చును. 'నిపుణంగా – ఈ నైపుణ్యానికి అనేక మార్గాలు, రీతులు ఉన్నట్లయితే అన్నిటిలోను అత్యంత నిపుణమైన మార్గంలో – చురుకుగా జీవనం గడపడం' సంపూర్ణంగా జీవించడం అనే మాటను గూడా మనం కలుపుకోవచ్చును. ఇలా జీవిస్తాను – అని తీర్మానం చేసుకుంటే చాలదు గదా. నిజంగా అలా జీవించి చూపించగలగాలి, అంటే ఆలోచనకు ఒక కృతకృత్యత

రావాలి. ఈ పరిపూర్ణత లేకపోయినట్లయితే అసలు మానవ జీవితానికి 'సుఖం' అనే మాటతో సంపర్కమే ఉండదు.

చురుకైన చలాకీ అయిన జీవితం కావాలి. ఆ జీవితంలో మనుషుల్లో ఉన్న సామర్థ్యాలు, శక్తులు అన్నీ పరిగణనకు రావాలి, ఉపయోగంలోనికి రావాలి. ఆ జీవితం తనంత తానే, స్వయం సమృద్ధంగానూ, ఇంకేదో ప్రయోజనం కోసం పాకులాడకుండానూ ఉండాలి. అప్పుడు మనం ప్లేటో ఇచ్చిన మూడు పరీక్షలలోనూ నెగ్గినట్లు అవుతుంది.

మనుష్యులను శాశ్వతంగా సుఖ సంతృప్తులతో ఉంచగలిగేది కూడా ఇటువంటి జీవితమే. అయితే ఇటువంటి జీవితం గడపగలగాలి అంటే – దానికి ముందుగా కొన్ని పూర్వ సంసిద్ధతలు. ఆశీర్వచనాలు ఉండాలి. అంటే – ఒక రకంగా, భగవదనుగ్రహం ఉండాలి అని చెప్పుకోవచ్చును.

మన శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేందుకు తగినంతగా అవకాశాలు లేకపోయినట్లయితేనూ, మనకు ఆరోగ్యం తిన్నగా అనుకూలముగా లేకపోతేనూ, స్నేహితులు, అనుయాయులు మనను తప్పుదారి పట్టించకుండా ఉంటేనూ, దారిలో సంభవించే కష్టనష్టాలు మనను క్రుంగదీయకుండా ఉంటేను – ఇటువంటి జీవితం గడపటానికి అవకాశం ఉంటుంది. ఈ జీవితం చివరిదాకా కొనసాగడం గూడా చాలా అవసరం. మార్గమధ్యంలో ఆగిపోగూడదు. బయటకు మంచివిగా కనిపించేవన్నీ సుఖజీవనానికి దారితీస్తాయని అనుకోవటానికి వీలులేదు. సుఖజీవనానికి అవసరం అయిన మన సామర్థ్యాలను వికసింప చేసుకోవడంలోనే మెలకువ ఉన్నది.

సుఖ జీవనాన్ని నిర్వచిస్తున్నప్పుడు మంచితనము లేక నైపుణ్యము దానిని ఆశ్రయించుకు ఉండాలని అనుకున్నాము గదా. అయినా ఈ నైపుణ్యము, మంచితనము ఒకటికాక ఎక్కువ రీతులలో ఉన్నప్పుడు ఏం చేయాలి ?.... బాగా ఆలోచించిన మీదట అనిపించే సంగతి ఏమంటే సుఖజీవనానికి రెండు రకాలైన మంచితనం ఉండాలి. ఒక నియమావళిని విజ్ఞతతో, బుద్ధి పూర్వకంగా అనుసరించి వెడుతూ ఉండడమే సుఖజీవనం. కనుక, సుఖజీవనం గడపవలెననుకున్న మనిషి ముందుగా ఆ సుఖజీవనం అంటే ఏమిటో తెలుసుకోవాలి. దానికి ఉన్న నియమావళి ఎలాంటిదో తెలుసుకోవాలి. దానిని తప్పనిసరిగా అనుసరించాలి.

కొంతమంది బాహాటంగా, కావలెననే తప్పుదారులు త్రొక్కి క్రూరులుగా, దుర్మార్గులుగా పేరు తెచ్చుకునేవాళ్ళు ఉన్నారు. మరికొందరు మంచిమార్గం అంటే ఏమిటో ఎరుగుదురు. దానినే అనుసరించవలెనని అనుకుంటారు. అయితే తమ ఇంద్రియాలు.... మనస్సు దానికి అంటిపట్టుకోలేక, తగినంత నిగ్రహం, సంకల్పం, బలం లేక ఆ సన్మార్గాన్ని చివరిదాకా కొనసాగించలేకపోతారు. ఒక్కోమారు ఆరంభమే చేయలేకపోతారు. అంటే వారికున్న నైతికబలం చాలడం లేదన్నమాట. అందుచేత సుఖజీవనం గడపవలెనంటే రెండు రకాల మంచితనం కావాలి.

సక్రమ నియమావళి ఏది... అని తెలుసుకోగల వివేకం ఉండాలి. తమంత తాము దీనిని తెలుసుకోలేకపోయినా, ఇటువంటిది తమ ముందు ప్రదర్శితం అయినప్పుడు దానిని గుర్తించగలగాలి. గురువులో – ధర్మశాస్త్ర గ్రంథంలో చెప్పిన విషయాలను ఆకళింపు చేసుకోవడం చేతనవాలి. తరువాత ఇంద్రియాలు, రాగభావాలు, కోరికలు, అభిరుచులు ఇవన్నీ విధేయంగా అట్టిపెట్టుకోవడం చేతనవాలి. వీటిని సుశిక్షణకు లోనుచేసి ఉంచుకొని, అవి నియమావళిని తప్పనిసరిగా అనుసరించేటట్లు చేసుకోవాలి.

అందుకనే, నైపుణ్యం అనండి – మంచితనం అనండి.... సుగుణం అనండి ఏదైనా రెండు రకాలుగా విభజన అయిపోతుంది.

**మొదటిది :** వివేకం యొక్క మంచితనం, అంటే ఏది మంచిదో తెలుసుకునే విచక్షణా జ్ఞానం.

**రెండవది :** శీలసంపద యొక్క మంచితనం. అంటే నైతిక వర్తనం, అభిరుచులు, కోరికలు, రాగభావాలకు సమిష్టి అయినమాట 'శీలం.' దీనిని మానవ ప్రకృతిలో సమరసంగా మలుచుకోవడం.

విద్యా విధానంలో – శీల సంపదను పెంపొందించుకోవడం శిక్షణ ద్వారా, అభ్యాసం ద్వారా నేర్చుకోవడం ఒక ప్రక్రియ. దీని తరువాతనే వివేకం, విచక్షణా జ్ఞానం కలుగుతాయి.

యువకులు ముందుగా 'మంచి నియమావళి'కి విధేయులుగా తయారవడంలో శిక్షణ పొందుతారు. తరువాతనే వాళ్ళకు ఇది మంచిది అవునా కాదా అని తెలుసుకోవడం చేతనవుతుంది. తమంత తాము తెలుసుకోవడం కొంతకాలం పోయిన తరువాత గాని అభ్యాసం కాదు, అలవడదు. ముందుగా విధేయత అనేది నేర్చుకోక

పోయినట్లయితే అది మంచిదనే విషయం అతనికి ఎన్నడూ తెలిసిరాదు. అందుచేత అరిస్టాటిల్ శీలసంపదను పెంపొందించుకోవడం– దీని మంచితనం, అనే విషయాలను గురించి ఎక్కువ ప్రస్తావిస్తాడు. రాగభావాలు, కోరికలు, ఆలోచనా తీరులు సక్రమంగా ఉండడం అవసరం. వీటిని చక్కగా ఋజుమార్గంవైపు మళ్ళించాలి అంటాడు.

మొదటి మెట్టు ఏమిటి ?

శీలసంపద యొక్క మంచితనాన్ని అవగాహన చేసుకోడం ఎలా కుదురుతుంది ?

ఎవరైనాగానీ, సత్శీలసంపద పుణికి పుచ్చుకుని జన్మ ఎత్తరు. అంటే ఏ లక్ష్యము పుట్టుకతోనే రాదు. అలాగే దాని గురించి పదే పదే పాఠాలు విన్నంతమాత్రం చేత గూడా ఇది ఒనగూడదు. దీనికంతా ఎంతో శిక్షణ, అభ్యాసము, అవలంబన అవసరం.

శిక్షణ అనేది సాధ్యం అనే విషయం ముందు మనం గమనించగలగాలి.

రాగభావాలు, ఆలోచనలు, ఆకాంక్షలు – ఇవన్నీ అతి సహజమైనవి. ఇవి హేతువాదబద్ధమైనవి. అందుకనే హేతుబద్ధమైన రీతిలోనే వీటిని అవలంబన చేయవలసి ఉంటుంది.

రాళ్ళు రప్పలను మనం శిక్షణ ఇచ్చి పెంచలేము. అయితే కోపిష్టివాడిని – ఆ కోపం దుర్మార్గంవైపు మళ్ళించమనో లేక అధికారానికి వ్యతిరేకంగా ఉపయోగించ మనో శిక్షణ ఇవ్వవచ్చును.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. మన రాగభావాలు, ఆకాంక్షలు, ఉద్వేగాలు.... ఇలాంటివి వాటంతట అవి చెడ్డవేమీకాదు. మన వర్తనానికి అవి ముడి సరుకులు అంతే. వాటిని ఆసరాగా తీసుకునే మనం మంచివాళ్ళమో, చెడ్డవాళ్ళమో కావాలి. వాటిని మనం కావాలనుకున్న తీరుగా మలుచుకుందుకు అవకాశం ఉంది. అస్తవ్యస్తంగా ఉన్న లక్షణాన్ని ఒక స్థిరమైన అలవాటుగా తయారుచేసుకోవచ్చును. అంటే నైతికపరమైన మంచితనం అనేది, ఆత్మకు అలవాటు వంటి లక్షణం అన్నమాట. నిగ్రహం, సంయమనం, సౌకుమార్యం వంటి లక్షణాలలో శిక్షణ పొందడం వల్ల మనకు ధైర్యంగా, సాహసంగా, నీతిగా నిజాయితీగా వ్యవహరించటానికి తగిన స్తోమత వస్తుంది. అవినీతిగా, పిరికిగా రోజులు వెళ్ళదీయటానికి ఇష్టపడము. కనుక అలవాటు చేసుకున్నందువల్ల మంచితనం, ధైర్యం, సాహసం వంటి లక్షణాలు ఏర్పడటానికి అవకాశం ఉంది. దాని వల్ల నైతిక వర్తనం సక్రమరీతిని నడుస్తుంది. ఈ సుగుణాలు

మన ఆత్మ లక్షణాలుగా రూపొందుతాయి. మంచితనం తప్ప మరేమీ మనలో చోటు చేసుకోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే – మంచి పనులు – సక్రమమైన పనులు – పదే పదే చేయడం వల్ల, సత్శీలత ఏర్పడుతుంది.

అయితే మంచి లక్షణాలకు, మంచి పనులు – చెడుఅలవాట్లకు చెడ్డవానికి మధ్య అడ్డుగీత ఏమిటి ?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడంలో గ్రీక్ తత్త్వచింతన – వర్తనం అట్టడుగున ఉండిన సంప్రదాయాన్నే ఆశ్రయిస్తాడు అరిస్టాటిల్.

అదేమిటంటే –

మంచితనం అనేది ఆత్మ లక్షణం.

ఆరోగ్యము, స్వాస్థ్యత ఎలా శరీరానికి లక్షణాలో అంత సహజంగా ఆత్మకు 'మంచితనం' అనేది గూడా సహజ గుణం.

శరీరానికి వైద్యుడు, వ్యాయామ శిక్షకుడు ఎలాగో, ఆత్మకు ఆచార్యుడు, గురువు అటువంటివాడు.

ఈ రకమైన ఆలోచనే ప్లేటో, అరిస్టాటిల్ కూడా నొక్కి చెబుతారు. శరీరారోగ్యం అంటే దానిలో అంగాలుగా ఉన్న అన్ని భాగాలకు ఉన్న సమరసత, సమస్థితి.

శరీరంలో ఉష్ణం, శీతలం ఉంటాయి. అలాగే తడి, పొడి ఉంటాయి. పరస్పర సమర్థమైన ఈ లక్షణాలే శరీరానికి స్వాస్థ్యం కూరుస్తాయి. ఈ స్వాస్థ్యమే ఆరోగ్యం, పరిపూర్ణత.

వైద్యుడుగానీ, వ్యాయామ శిక్షకుడుగానీ ప్రయత్నం చేసేది ఈ విరుద్ధ లక్షణాలను సమశృతికి తీసుకు రావడమే. శరీరంలోని వివిధ భాగాలు ఈ సమరసత వైపు చూపు ఉంచి ఉండేటట్లుగా శిక్షణ ఇస్తారు వాళ్ళు.

ఈ సమస్థితికి భంగం వాటిల్లడమే, అనారోగ్యం; బలహీనత.

ఎక్కువ ఆహారం తీసుకున్నా, మరింత మోతాదులో వ్యాయామం చేసినా ఈ సమస్థితికి అంతరాయం ఏర్పడుతుంది. ఎక్కువ కాకూడదు, తక్కువ కాకూడదు. 'యుక్తత' అనేది ఇక్కడ పడికట్టు మాట.

అలాగే 'ఆత్మ' స్థితికి కూడా అన్వయం చేసుకోవాలి.

మానసిక లక్షణాలు – రాగ భావాలు, కోరికలు ఎక్కువైనా, తక్కువైనా ఆత్మ యొక్క ఆరోగ్యం గూడా దెబ్బతింటుందన్నమాట.

కనుక ఆరోగ్యాన్ని – శారీరకమైనా, మానసికమైనా – చక్కగా కాపాడుకోవలెను అంటే అన్ని పనులు ఎక్కువ, తక్కువలు లేకుండా ఎంతవరకు అవసరమో అంతవరకే చేయడం అవసరం.

అలవాట్లు అలవరచుకోవడంలో కూడా ఇదే ప్రమాణం.

చేయవలసిన పనులు ఎక్కువ శ్రమ, ప్రయత్నం లేకుండా సజావుగా సరళంగా చేయటానికి దారితీస్తాయి అలవాట్లు.

ఎక్కువ తక్కువలకు పోకుండా ప్రతి పనినీ దాని పరిమితమైన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని చేయగలగడం మనిషి అలవాటు చేసుకుంటే, కాలక్రమేణ అది 'సహజ లక్షణం' అయిపోతుంది.

ఈ సహజ లక్షణం అనుక్షణము మనను నడిపిస్తూ ఉంటుంది.

అంటే సత్శీలత అనే దాన్ని మనం ఇలా నిర్వచించుకోవచ్చును.

'ఆత్మ సమస్థాయిలో వ్యవస్థితం అయి అన్ని పనులను సమపాళ్ళలో చేయిస్తుంది. ఈ సమపాళ్ళ వెనక ఒక సక్రమ వర్తనం, సహజశీలత ఉంటాయి. అప్పుడే మనిషి విజ్ఞుడు అవుతాడు,

ఈ 'మధ్యే' మార్గాన్ని తయారు చేసుకోవడంలో ఎన్నో ఆనుపానులు ఉన్నాయి. సత్శీలత అంతా దీనిపైననే ఆధారపడి ఉంది.

ముందుమాట –

నైతిక వర్తనం, సత్శీలత అనేది – మన సంకల్పం, ఇచ్ఛ మీద ఆధారపడి ఉంటాయి.

అంటే, కేవలం మాటలలో, అభిప్రాయాలలో మంచితనం వైపు మొగ్గు చూపించడం చాలదు. బాహ్య వర్తనంతో సరిపెట్టుకుంటే చాలదు. వ్యక్తిగతమైన సంకల్పం, ఇచ్ఛా పూర్తిగా దీని మీదనే నిలచి ఉంటాయి. వీటికి అదే ఆయువుపట్టు. బాహ్యవర్తనం మీదనే అంతరంగ వర్తనమూ ఆశ్రయించుకు ఉంటుంది.

ఆత్మ సత్శీలత, మంచితనం అనేవి హృదయానికి సంబంధించిన ఆంతరిక విషయాలు. కేవలం బాహ్యవర్తనం మటుకే చూచి వీటిని నిర్ణయించుకోలేము.

'ఎంత అవసరమో అంత' అనే మాటను గూడా మనం చక్కగా అర్థం చేసుకోవాలి. మన ప్రతి రాగభావము, ఆలోచనా సరళి మన సత్శీలతను రూపొందిస్తాయి. ఒకటి ఎక్కువ మరొకటి తక్కువ అనుకోవటానిక వీల్లేదు. అన్నిటికీ సమాన అధికారం ఉన్నది.

వైద్యుడు ప్రమాణాలు నిర్ణయించినట్లుగా విజ్ఞుడు 'ఎంత అవసరం' అనే విషయం నిర్ధారించుకోవాలి. అందరికీ ఒకే ప్రమాణం పనిచేయదు.

ప్రతి మనిషి తన అవసరాలు, స్థితిగతులు ఆకళింపు ఆధారంగా ప్రమాణాలు ఏర్పరచుకోవాలి. అందరికీ అమలుకు రాగల ప్రమాణాలను ఒకరే నిర్ణయించి ప్రకటించటానికి కుదరదు.

ఒక మనిషి ఉన్నాడనుకోండి. పుస్తకాలు కొనుక్కుని చదవడం అతనికి అవసరం కావచ్చును. తన సంపాదనలో కొంత భాగాన్ని దీనికి వెచ్చించటానికి సిద్ధపడతాడు. 'ఎంతభాగం' అనేది అతని ఇతర అవసరాలను బట్టి, పరిస్థితులను బట్టి నిర్ణయం చేసుకోవాలి. సంపాదన అంతా పుస్తకాలకే ఖర్చుపెట్టటం ఎంత అవివేకమో, అలాగే అసలు ఏమీ వినియోగించకుండా ఉండడం కూడా తెలివితక్కువ తనమే. అందరికీ ఒకే నియమం తయారు చేసి, 'మూస'లో పోసి ఇవ్వలేము. తన సంపాదనలలో ఎంత భాగం పుస్తకాలకు వినియోగించడం యోగ్యము, యుక్తము అనేది – ప్రతి మనిషీ తనకు తాను నిర్ధారించుకోవాలి. ఈ నిర్ధారణలో ఎన్నో చిన్న చిన్న అంశాలు ఉంటాయి. అన్నిటికీ తగిన గమనం ఇవ్వాలి. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క రకంగా నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ఒక నియమం ఏర్పరచుకున్నాం గదా అని జీవితాంతం దానినే నడపాలనుకోగూడదు. ఎప్పటికప్పుడు తక్షణ అవసరాలనన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ఈ ప్రమాణానికి రావడం అవసరం అని అరిస్టాటిల్ నొక్కి చెబుతాడు.

అందుచేతనే – వివేకము, సత్శీలత ఒకదానితో ఒకటి జతపడి ఉంటాయి.

స్నానం చేసేటప్పుడు నీళ్ళు ఎంత వేడిగా ఉండాలి; అన్న విషయం నుంచి ప్రతి వివరంలోనూ ఈ మధ్యే ప్రమాణాన్ని జాగ్రత్తగా తీసుకోవలసి ఉంటుంది.

సత్శీలత ఉంటే తగిన వివేకం కూడా ఏర్పడుతుందని అరిస్టాటిల్ ప్రతిమారూ గుర్తు చేస్తాడు.

దేశకాల పరిస్థితులను బట్టి, న్యాయచట్టాలను బట్టి ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి.

మంచి నిర్ణయం మనం చేసుకున్న మంచి న్యాయసూత్రాలపైన ఆధారపడి ఉంటుంది.

ఇచ్ఛ లేక సంకల్పం కూడా ప్రవర్తనతో ముడిపడి ఉంటాయి.

అరిస్టాటిల్ ఈ సిద్ధాంతంలో తీసుకున్న జాగ్రత్త అంతా, జనం ప్లేటోను పెడర్థం చేసుకుని ఆయన మీదకు తప్పును తోస్తారేమోనని, ఉద్దేశ్యాలు మంచివే అయినా – అజ్ఞానం వల్ల, అవివేకం వల్ల సత్ఫలితాలను తీసుకురాకుండా పోతాయి. ఈ దురవస్థ ఏర్పడకుండా అరిస్టాటిల్ తగిన హెచ్చరికలు చేస్తూ ఉంటాడు.

మనుషుల ప్రవర్తన, వాళ్ళ సంకల్పం – వీటి పరస్పర ఆశ్రయం మనం గమనించగలగాలి. సంకల్పం అనే దానిని అనుసరించే ప్రవర్తన బహిర్గతం అవుతుంది. దీనినే మనం ఆమోదించడమో–నిర్ధారించడమో చేస్తాము.

మనిషి తనంత తాను పనిచేస్తున్నాడు. తన పనులకు తానే కారకుడు, బాధ్యుడు. తాము చేస్తున్న పనులకు తనకు ఏ మాత్రము బాధ్యత లేదని మనిషి వాదించ గలగటానికి రెండు భూమికలు ఉన్నాయి :

ఒకటి : భౌతిక అవసరం, ఒత్తిడి.

రెండు : అజ్ఞానం, తెలివి లేకపోవడం.

ఈ రెండు కారణాలలో  ఏది తలఎత్తినా, మనిషి తాను చేస్తున్న పనులకు తాను స్వచ్ఛందంగా కారణం అయినట్లు కాదు. అందుచేత అతడు ఆ పనికి కారణభూతుడు కాడు.

కాని నైతిక వర్తనం పట్ల అజ్ఞానం, తెలియదు అనుకోవడం, ఈ కారణాలకు ఆలంబనం కాదు.

న్యాయ చట్టాలు నాకు తెలియవు అనడం ఒప్పుకోదగిన కారణం కాదు. 'హత్య చేయడం తప్పు అని నాకు తెలియదు. అందుచేత అలా హత్య చేశాను. నేను నేరస్థుడిని కాను' అనడం కుదరదు. ఈ కారణం కక్కి వేసినందువల్ల హత్య చేసిన ఫలితాలను అనుభవించకుండా తప్పించుకుపోలేడు. అతడి నైతిక వర్తనం చాలా తక్కువ స్థాయిలో ఉన్నదనీ వాటి పట్ల అతడికి గౌరవం లేదనే ఈ సన్నివేశం తెలుపుతోంది.

సంకల్పం – ఉద్దేశ్యం – అనే దానికి రెండు నాలుకలు ఉన్నాయి : వివేకము, కోరిక.

కోరిక – అంటే మనం ఏదో ఉద్దేశ్యాన్ని మనసులో పెట్టుకుని, ఏదో ఫలితాన్ని ఆశిస్తూ ఆ పని చేస్తున్నామన్నమాట.

వివేకము – అంటే ఆ పనిని ఎంత నైపుణ్యంగా, చాకచక్యంగా చేయగలం అనే విషయమై అనేక రకాలుగా అంచనా వేసుకోగలగడం.

ఫలానా ఫలితం రావాలని నిర్ణయించుకున్నామంటే, ఆ ఫలితం రావటానికి అవసరం అయిన పరిస్థితులన్నిటినీ కదిలించడం, కదలబారేట్లు చేయడం మొదలు పెడతాము.

మన చేతిలో ఉన్న పరిస్థితులను కావాలనుకున్న పద్ధతిలో మలుపులు తిప్పడం కోసం ప్రయత్నం చేస్తాము.

అందుచేతనే, మనం చేసే పనులకు – ఫలితాలకు – మనమే బాధ్యులము, కర్తలము కూడా. అవి మంచివైనా, చెడ్డవైనా మన బాధ్యతలోను, కర్తృత్వంలోనూ ఎలాంటి మార్పు ఉండదు.

సత్శీలత విషయంలో పరిశీలన, వివరణ జరిపినట్లుగానే వివేకం విషయంలో గూడా కొంత విశ్లేషణ చేద్దాం.

మంచి పౌరుడుగా ఎన్నిక అవాలంటే వివేకంలో ఏ మంచితనాన్ని, సత్శీలతో జత చేయాల్సి ఉంటుంది అనే సంగతి పరీక్షించుకోవాలి మనం.

మధ్యేమార్గాన్ని నిర్ణయించటానికి తయారుచేసుకున్న సక్రమ నియమావళికి దారితీసే మంచి వివేకం అవసరం.

వివేకానికి ఎన్నో నైపుణ్యరీతులు. ఇవన్నీ రెండు తరగతులుగా విభాగం అయిపోతాయి.

ఒకటి – సిద్ధాంతపరమైన, ఊహలకు పరిమితం అయిన వివేకం.

రెండు – ప్రయోగశీలత అమర్చుకున్న వివేకం.

సిద్ధాంతపరమైన విజ్ఞానం – వివేకం అంటే, సృష్టిలో ఉన్న వస్తువుల పరస్పర సంబంధాలను గురించిన సూత్రాలు. ప్రకృతి నియమాలను గురించిన పరిజ్ఞానం.

అతి చిన్న సూక్ష్మాలలో పెద్ద పెద్ద సూత్రాలు  ఎలా నిబిడీకృతమై ఉన్నాయో తెలుసుకోవడం.

ప్రయోగశీలత అలవర్చుకున్న వివేకం అంటే – జీవితాన్ని సుఖమయం చేసుకోవటానికి అవసరం అయిన నైపుణ్యాన్ని ప్రజలందరికీ అందజేయడంలో కృతార్థులు కావడం.

మనిషికి ఏది మంచిదో తెలిసి ఉండడం మొదటి అంతస్తు.

పరిస్థితుల సమీకరణం చేసుకుని, ఆ పరిస్థితులలో ఏది జన సమూహానికి మంచిది అనేది చక్కగా బేరీజు వేయగలడం – రెండవ అంతస్తు.

సత్క్రమ వర్తనం అంటే ఏమిటో ముందుగా అతనికి తెలిసి ఉండాలి. తరువాత, పరిస్థితుల పరిణామాలన్నీ అరమరిక లేకుండా తెలియాలి. ఏ పనిచేస్తే ఏ ఫలితం వస్తుంది; ఆ ఫలితం మంచికి దారి తీస్తుందా లేదా – అని క్షుణ్ణంగా తెలియాలి.

అంటే – సిద్ధాంతపరమైన మంచితనం మాదిరే ప్రయోగశీలతకు చెందిన మంచితనం కూడా ఆవలంబనం అవుతుందన్నమాట.

రెండింటిలోనూ మనం చూడవలసిన – జాగ్రత్త తీసుకోవలసిన సంగతి ఏమంటే– కొన్ని ప్రత్యేకమైన విషయాలు సామాన్య సూత్రాలుగా నియమావళిగా రూపొందించడం.

అందుకనే ప్రయోగశీలత అనే పేరు దీనికి. ఒక పని జరగడం అనేది దీనికి ప్రాతిపదిక, కేవలం దానిని గురించిన ఊహాపోహలు కావు.

పని యొక్క ఫలితం. యదార్థతకు సంబంధించిన నియమావళి మీద ఆధారపడి ఉంటుంది, దానిని సమాశ్రయించుకు ఉంటుంది.

ఉదాహరణకు – ఈ పుస్తక రచన తీసుకుందాం.

పుస్తకంలో కొన్ని విషయాలు ప్రస్తావిస్తాం. ఆ విషయాలు అందరికీ మంచివై ఉండాలి; అందరినీ మంచివైపు దారితీసేట్లు చేయగలగాలి.

విషయములు – విజ్ఞానము అనండి, విషయాలు అనండి – అందరికీ అందుబాటులోనికి రావాలని ప్రయత్నం.

ఈ ప్రయత్నంలో ఫలితం ఏమంటే అందరికీ ఈ విషయాలు తెలియాలని.

అందరికీ మంచిని తీసుకువచ్చే విషయాలను, పదిమందికీ తెలివిడి చేయడం కోసం ఈ పుస్తకం వ్రాస్తున్నాం అనే నమ్మకం ఉండాలి.

ఇంద్రియాలు ఎలా తక్షణమే, సూటిగా విషయాలను గ్రహించగలుగుతాయో అలాగే మన సత్యమైన సంగతులను – యదార్థాలను – చురుకుగా ఉన్నవి ఉన్నట్లు చూడగలగాలి.

మానసిక నైపుణ్యం ఉన్న పౌరుడు – మనిషికి ఏది నిజంగా మంచిని తీసుకు వస్తుంది అన్న సంగతిని ఇట్టే కనుగొనగలగాలి. ఈ లక్షణం ఉన్నప్పుడే అతను పదిమందికీ మంచిని తీసుకురాగలుగుతాడు. మనిషిగా తన సామర్థ్యాలను ఒక్కుమ్మడిగా వెలికి తీసుకురావడం అంటే ఇదే. ఫలాన పనివల్ల, మంచి జరుగుతుంది. మంచి జరగవలెనంటే ఫలాన పనులే చేసి తీరవలె, అనే పరిజ్ఞానం, తీర్పు అతనికి ఏర్పడవలసి ఉంటుంది. ప్రయోగశీలత సంతరించుకున్న వివేకం అంటే ఇదే.

ఇంతవరకు మనం పరిశీలించి చూచుకున్న సమాచారం దృష్ట్యా ఉత్తమ జీవితం– మనిషికి సంబంధించినది– అంటే ఏమిటన్నమాట ? రాజ్యం అంతటికీ సంబంధించిన జీవితంతో సమరసంగా సమపాళ్ళలో కలిసి పోగలది.

రాజకీయ పరిజ్ఞానం ఉన్న జంతువు గదా మనిషి అంటే, రాజకీ వాతావరణానికి తగిన జీవితాన్ని గడప గలవాడు.

మంచి నైతిక శిక్షణ, విద్యల ప్రయోజనం ఏమిటంటే మనను మంచి పౌరులుగా, నిపుణులైన వ్యక్తులుగా తయారుచేయడం.

బహిరంగ కార్యకలాపాలు, రాజకీయ జీవితం మటుకే కాక మనిషికి ఇంకా ఉన్నతమైన, విస్తృతమైన జీవితం కూడా ఉంది.

వ్యవహార పరిపాలన అంతా – మనిషికి తగినంత విరామం తీసుకు రావటానికి ఉద్దేశించబడినది. ఉదాహరణకు –

నాగరికులైన మనుషులు యుద్ధానికి వెడతారు. అంటే వాళ్ళకు యుద్ధం చేయడంలో మక్కువగాని, ఆప్యాయతగానీ ఉన్నదని అర్థం కాదు. తమ దేశాన్ని సంరక్షించుకోవడం కోసం యుద్ధంలో చేరుతున్నారు, అంతే.

అందుచేత జీవితం యొక్క ఉదాత్తము, ఉన్నతము అయిన ఆదర్శం ఏమిటంటే– రాజకీయ వ్యవహారాలను నెత్తిన వేసుకుని తిరగడం కాదు, తమకున్న సమయ విరామాన్ని చక్కగా ఉపయోగించ నేర్చుకోవడం.

సమయ విరామాన్ని చక్కగా ఉపయోగించుకోవడం అంటే – మనకు మనమే యజమానులం కావడం.

ఇదంతా మనమీదనే ఆధారపడి ఉంటుంది; మన ఆంతరిక సరంజామా పైననే ఆశ్రయించుకు ఉంటుంది కాని పై దానిని దేనినీ కోరదు. మనకు మనం యజమానులం అవటానికి బాహ్య ఆడంబరాలు, వస్తువులు ఏమీ అవసరం లేదు. మన శక్తి సామర్థ్యాలను పరిపూర్ణంగా అమలులోనికి తీసుకురావాలి. వివేకవంతులుగా మన చాకచక్యాన్ని ఉపయోగించుకోగలగాలి. కులాసా అయిన – చురుకైన జీవితం అంటే అన్ని సుఖాలలోను పరమ పవిత్రం, అకలుషితం అయిన వానితో ముడిపడి ఉంటుంది.

నిజానికి ఇటువంటి జీవితంలోనికి మనం అప్పుడప్పుడు, అతి కొద్ది సమయం పాటు ప్రవేశిస్తూ ఉంటాము. అందుకు మన ప్రాపంచిక పరిస్థితులు అనుకూలించి నప్పుడే ఇటువంటి పని చేస్తాము. అటువంటి జీవితంలో భగవంతుడు నిరవధికంగా– ఏమీ అడ్డు ఆపు లేకుండా, ద్యుతి–ఖండన లేకుండా ఉంటున్నారు.

విచారమయమైన జీవితం – ఆలోచనామయమైన జీవితం – మన నికార్సయిన నిజమైన ఆత్మకు సంబంధించినది, అనే నిర్ణయానికి రావచ్చును. మనమూ ఇటువంటి జీవితంలో భాగం పంచుకుంటున్నాము. అనుభవాన్ని సంపాదిస్తున్నాము. అయితే కేవలం మనుషులుగా వర్తిస్తున్నప్పుడు మాత్రం ఈ 'అనుభవం' దక్కుతుందనలేము. మనలోని ఏదో 'దివ్యత్వం'ను కూడా ఆచరణ పరిధికి తీసుకు వచ్చినప్పుడే ఈ దివ్య అనుభవం మనకు దక్కుతోంది.

ఏమిటి ఈ 'దివ్య జీవనం' అని ప్రశ్న వేసుకున్నప్పుడు – అరిస్టాటిల్ తన Poetics అన్న పుస్తకంలో సమాధానాలు చెబుతాడు.

మంచి సాహిత్యం చదవడం; రసోత్పాదనకు ఉపకరించే పుస్తకాలు చదవడం, సంగీత శ్రవణం; లలిత కళలను ఉపాసించడం.

అయితే అరిస్టాటిల్ తప్పనిసరిగా చెప్పే అంశం ఏమిటంటే –

శాస్త్ర విజ్ఞానాన్ని అది తీసుకువచ్చే సుఖాలు, ఫలితాల కోసం కాకుండా, కేవలం దానికోసమే అభ్యసించడం. ముఖ్యంగా ప్రథమ తత్త్వశాస్త్రం, భౌతిక శాస్త్రం – ఇలాంటి విశ్వోత్పత్తి గురించి చెప్పే విషయాలు చదువుతూన్నప్పుడు మనకు ఉండవలసిన దృష్టి ఇది.

పాండిత్యం కోసం కృషి చేయడం, ఇప్పుడూ అధ్యయన శీలతను పెంపొందించుకోవడం – అనే పనులకు అరిస్టాటిల్ జీవితంలో ప్రథమ తాంబూలం ఇస్తాడు.

రాజ్యాంగాన్ని గురించి అరిస్టాటిల్‌కు ఉన్న అభిప్రాయాలు పరిశీలిద్దాం.

మనిషి సాంఘిక, రాజకీయ జీవి.

మనిషి తన శక్తి సామర్థ్యాలను వికసింపచేసుకోవాలంటే, ఉన్నతపర్చుకోవాలంటే అందుకు ఒకటే మార్గం. సమాజ జీవనంలో తగిన భాగం వహించడం, పాలు పంచుకోవడం.

'రాజ్యం' అనేది ప్రజల సౌకర్యం కోసం, వీలు కోసం ఏర్పాటు అయినది– అనే వాదాన్ని అరిస్టాటిల్ తిరస్కరిస్తాడు. ఏవో ప్రయోజనాల కోసం మనుషుల మధ్య ఏర్పాటైన ఒప్పందం వంటిది కాదు రాజ్యాంగం. విశ్వవ్యాప్తమైన మానవ అభిరుచులు, అభివృద్ధి పథకాలకు అనుగుణంగా రూపకల్పన జరిగినదే రాజ్యం.

మానవాళి ఎప్పుడూ తనంత తాను, ఒంటరిగా – ఇతరంతో ఎలాంటి సంబంధ బాంధవ్యం లేకుండా ఉండలేదు.

మనుష్యులు ఉన్నచోట ఏదో ఒక రూపంలో సాంఘిక వ్యవస్థ అవతరించే ఉంటుంది.

సాంఘిక వ్యవస్థ రూపనిర్మాణంలో మూడు అంతస్తులు ఉన్నాయి. అవి :

ఒకటి.... కుటుంబం.

రెండు... గ్రామ సముదాయం.

మూడు.... రాజ్యం.

మనకు తెలిసిన సంఘజీవన రీతులలో... వ్యక్తి కాదు మూల పదార్థం : కుటుంబమే.

మనుషులు కుటుంబాలుగా ఏర్పడి ఒక 'పెద్ద' యాజమాన్యం క్రింద నివసించడం అనేది మనం ఎరిగిన పద్ధతి.

భార్య–భర్త–పని చేసేందుకు ఒక సేవకుడు – ఇదీ ఇప్పటికి మనకు కనిపించే కుటుంబ వ్యవస్థ.

పిల్లలు పుట్టటంతోటే కుటుంబం పెరుగుతుంది; కుటుంబ సభ్యుల సంఖ్య ఎక్కువ అవుతుంది. కుటుంబంలో 'పెద్ద, చిన్న' అనే వ్యత్యాసాలు, తద్వారా వచ్చే ఇబ్బందులు మనం చూస్తున్నాం.

ఈ రకంగా గమనించినప్పుడు, మూడు రకాలైన సంబంధాలు అగుపిస్తాయి మనుషుల్లో.

1. భార్యాభర్తల సంబంధం.

2. తల్లిదండ్రులు పిల్లల సంబంధం.

3. యజమాని, సేవకుడు సంబంధం.

కుటుంబం గ్రామ సముదాయంలో ఒక భాగం. గ్రామంలోని కొన్ని కుటుంబాలు తమంత తాము వేరుగా ఉంటూనే – ఆ గ్రామ పెద్ద 'చేరిక' కింద వ్యవహరిస్తూ ఉంటారు.

కుటుంబాలు పరస్పర సహాయ సహకారాలను అందచేసుకుంటాయి; ప్రమాదాలు.... ఇబ్బందులు వచ్చినప్పుడు ఒకళ్ళకు మరొకళ్ళు బాసటగా నిలుస్తారు.

అయితే ఈ సంబంధాలు ఏమీ – మనుష్యులకు అత్యవసరం అయిన శాశ్వత విలువలను అందచేయవు.

అందరికీ అవసరం అయిన ఆహార పదార్థాలు ఒకచోట పోగుచేసుకుని ఉండాలి అంటే – అనేక కుటుంబాలవారు, గ్రామాలవారు తమ తమ సంపత్తును ఒకచోట చేర్చవలసి ఉంటుంది. వాటిని చుట్టూ గోడలు కట్టి రక్షించుకోవలసి ఉంటుంది.

రాజ్యం (State) అనేది ఇలా అవతరణ జరిగింది. దాని పుట్టుకకు ముందు ఉన్న సాంఘిక అవసరం ఇలాంటిది.

రాజ్యం తన పరిధిలో ఉన్న జనాంగానికంతటికీ దైహిక మానసిక అవసరాలను తీర్చటానికి పూనుకుంటుంది.

అందుచేత కుటుంబము, సముదాయము, రాజ్యం లోనికి ప్రవేశించినట్లే– రాజ్యం కూడా మరేదో పెద్ద 'రూపం'లోనికి చేరుకోదు. నాగరికత ఎంత ఉన్నత స్థాయికి వచ్చినప్పటికీ, 'రాజ్యం' తన రూపాన్ని అలాగే రక్షించుకుంటూ ఉంటుంది.

సాంఘిక పురోభివృద్ధికి ఇదే చివరి మాట.

ఏ నగరానికి ఆ నగరం రాజ్యంగా రూపొంది తన సంరక్షణ బాధ్యతలను తానే తీసుకోవడం అనేది – అరిస్టాటిల్ శిష్యుడు సామ్రాజ్యవేత్తగా తయారై ప్రపంచమంతా జయించటానికి సమకట్టినప్పుడు కూడా – అలాగే ఉండిపోవడం చారిత్రకంగా కాస్త విచిత్రము, విడ్డూరము అయిన విషయమే.

లౌకిక, రాజ్యాంగ విషయాల కంటె ఉదాత్తమైన విషయాలవైపు దృష్టి మరల్చవలెనని అరిస్టాటిల్ చెప్పిన విషయం మనం మరచిపోగూడదు. నాగరికమైన రాజ్యాంగ పరిధిలోనే మనిషి రసోత్పాదకమైన కార్యకలాపాలవైపు దృష్టి సారించ గలుగుతాడు. రాజ్యం యొక్క బాధ్యత ఏమంటే తన పౌరులందరకు ఇలాంటి ఉదాత్త, జీవనం గడపడం వైపు దృష్టి ఏర్పడేటట్లు చేయడం, ఆ రకమైన జీవనం గడపటానికి తగినంత సమయ విరామాన్ని ఇవ్వగలగడం, విరామాన్ని చక్కగా వినియోగించుకోగల సౌకర్యాలు కూర్చడం.

ఏతావాతా, అరిస్టాటిల్ అభిప్రాయాల ప్రకారం రాజ్యాంగం –రాజ్యం – యొక్క ప్రయోజనం ఏమంటే, పురజనులకు ఆధ్యాత్మిక, మానసిక ఉన్నతిని ఒనగూర్చడం, ప్రతి పౌరుడికి ఆధ్యాత్మికస్థాయి రాజ్యం ఒక సాధన మాత్రమే. గమ్యం కాదు.

దీని తాత్పర్యం ఏమంటే –

కొందరు మనుషులు, వారి వృత్తులు చూచుకుంటూనే తమ అవకాశాలను పరిపూర్ణంగా వినియోగించుకుని, ఉదాత్తమైన విరామ కార్యక్రమాలు చేపట్టాలి. ఇందుకోసమే రాజ్యం ఉన్నది, తతిమ్మా పౌరులు – వాణిజ్య వ్యాపారాలు తప్ప ఇంకేమీ పని చేయలేనివారు ఆ పనులు మటుకే చేసుకుంటూ తమ రాజ్యాంగ సంరక్షణకు, స్థిరతకు తోడ్పడుతూ ఉండాలి.

సంఘం కోసం శరీరశ్రమ చేస్తూ ఉండేవాళ్ళు కొందరు; వీరి శ్రమ ఫలితంగా మరి కొందరు సమయ విరామం చిక్కించుకుని ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కృషి చేయడం– ఇవీ సూత్రప్రాయంగా చెప్పుకోదగ్గ విషయాలు.

గ్రీక్ రాజ్య పరిస్థితుల దృష్టిలో చూచినప్పుడు – శ్రమచేసే వారందరూ బానిసలు.

అందుకోసం, అరిస్టాటిల్ బానిసతనాన్ని సమర్థించవలసిన అవసరం ఏర్పడింది. అప్పటి బానిసలను అప్పటి పరిస్థితులలో – దేశకాల ప్రమాణాలలోనే – చూడాలి మనం. బానిసలు అంటే – ఇంటిపని చేసేవాళ్ళు, వ్యాపారాలలో సహాయం

చేసే కొద్ది పనివాళ్ళు, తరువాత – పారిశ్రామిక రంగాలలో వచ్చిన బానిసతనం. అణగద్రొక్కడం అనేవి అరిస్టాటిల్ ఎరగడు. అతని కాలంలో ఆ పరిస్థితులు లేవు.

రాజ్య పరిపాలన పద్ధతులు మూడు రకాలుగా చెప్పాడు అరిస్టాటిల్.

1. ఏకచ్ఛత్రాధిపత్యం.

2. బహు నాయకత్వం.

3. ప్రజాస్వామ్యం.

ఏకచ్ఛత్రాధిపత్యంలో రాజ్యాంగ అధికారం, అంతిమ ప్రమాణం ఒక మనిషిలోనే చేరి ఉంటుంది. బహు నాయకత్వంలో ఈ అధికారం కొందరు పెద్దలు చేరి పంచుకుంటారు. ప్రజాస్వామ్యంలో మటుకు ప్రజలదే అధికారం.

మొదటి రెండూ – ఆస్తిపాస్తులు ఉన్న పరిపాలనాధికారం అయితే, మూడవది కేవలం బడుగు ప్రజల పాలన అన్నమాట.

ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ రాజకీయ అధికారాలు సమానంగా ఉంటాయి. తతిమ్మా వాటిలో ధనాధికులది పెత్తనం.

అరిస్టాటిల్ ఈ సూత్రాలు రెండూ తప్పేనంటాడు. ఎందుకంటే రాజ్యాల యొక్క నిజమైన ప్రయోజనం ఏమంటే– ప్రజలందరూ సుఖంగా ఉండడం, సుఖజీవనం గడుపుతూ ఉండడం, ఈ ఆదర్శాన్ని అవలంభించిన రాజ్యంలో – ఉత్తములైనవారు. వారు కొద్ది సంఖ్యే అయినా – తక్కువ మందే అయినా, వాళ్ళకు పూర్తి పౌరసత్వ హక్కులు ఉంటాయి. అత్యంత వివేకవంతుడు, నైతిక స్థాయిలో ఉన్నతుడూ అయినవాడు వాళ్ళలో ఉంటే అతడు 'రాజు' అవుతాడు. అలాంటి రాజ్యం, రాజ్యాధికారాన్ని గుత్తాధిపత్యంగా తీసుకున్న ప్రభుత్వం మాదిరి ఉండదు.

వ్యవసాయం చక్కగా జరుగుతుంది. ప్రజలకు కావలసిన ఆహార పదార్థాలు అన్నీ ఈ రాజ్యంలోనే దొరుకుతాయి. వస్తుసంపద కోసం ఇతర దేశాలపైన ఆధారపడ వలసిన నిమిత్తం లేదు. అందుచేత రాజ్యం ఎంత చిన్నదైనా స్వయం సమృద్ధమైనది. దాని విస్తీర్ణం మటుకు పురజనుల ఆధ్యాత్మిక భౌతిక అవసరాలకు తగినంతగా ఉండాలి. పురజనులు సరళమైన జీవనంతో సంతుష్టులై ఉండాలి.

వాణిజ్య అవసరాల కోసం ఓడరేవులు ఉన్నా, వీటి వల్ల నైతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా చూచుకోవాలి.

వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమలలో పనిచేసే వాళ్ళకు పూర్ణ పౌరసత్వం– అధికారం ఇవ్వకుండా జాగ్రత్తపడాలి. వీళ్ళు పాలన కార్యక్రమాలలో జొరబడకుండా చూచుకోవడం అవసరం. ఎందుకంటే, ఈ తరగతులకు చెందిన పౌరులు, ఆధ్యాత్మిక వికాసానికి తగినంత సమయం విరామం లేని వాళ్ళు గనుక, ఆ విరామాన్ని ఎలా ప్రజోపయోగకర కార్యాలకు వినియోగించాలో తెలియనివాళ్ళు గనుక పాలన చక్కగా చేయగలరని చెప్పలేము.

అరిస్టాటిల్ రాజ్యాంగ విధానం తీరు ఇది.

చిన్న రాజ్యం; చింతలు లేని రాజ్యం.

బాగా సంస్కారం పొందిన పౌరులు. ప్రజా శ్రేయస్సుకోసమే పరిశ్రమించేవారు.

జన సామాన్యానికి గొప్ప గొప్ప ఐశ్వర్యాలుండవు. కళలు, సాహిత్యం ఇటువంటి పరిశీలనలో ఉత్సాహవంతులు.

అరిస్టాటిల్ వ్రాసిన Politics లో రాజ్యాంగ విధానాన్ని వర్ణించడం ఒకటే ఉద్దేశ్యం కాదు. పౌరులకు నిజమైన రాజకీయ సలహాలు ఇవ్వడం, సంతుష్టిగా జీవించడం ఎలాగో చెప్పడం, పరిస్థితులతో సర్దుకుపోవడం గురించి ఈ పుస్తకంలో చాలా సంగతులు చెప్పాడు.

ఆదర్శవంతమైన పాలన లేకపోయినట్లయితే, పదిమంది పెద్దలు, ప్రజాస్వామ్యం– ఈ రెంటికీ మధ్యేమార్గంగా ఉండే రాజ్యపాలనను సూచించాడు అరిస్టాటిల్.

రాజ్యాంగవేత్త సిద్ధాంతపరమైన అస్తవ్యస్తాలతో కాలక్షేపం చేయవలసి వస్తుంది. ఆదర్శమైన పాలనలో మటుకే తాత్త్విక – పాలకుడు ప్రజల శ్రేయస్సుకు పనిచేయ గలుగుతాడు.

ఆదర్శమైన రాజ్యాంగం ఉండటం తప్పనిసరి. అప్పుడే విద్యా పద్ధతులు సవ్యంగా ఉండి పాలకుడు తత్త్వవేత్తగా రూపొందుతాడు.

రాజ్యాంగం చెడ్డగా ఉంటే – మంచి మనిషిగా రూపొందించే విద్యా విధానం పనికిరాదు; ఎలా ఉన్నా సరే ఈ రాజ్యాంగానికి విధేయులుగా తయారుచేసే విద్య కావలసి ఉంటుంది.

విద్య రాజ్యాంగబద్ధంగానే, దాని అధికారం కిందనే ఉండాలి. విద్య సార్వజనికంగా, నిర్బంధంగానూ ఉండాలి.

రాజ్యాంగాన్ని సమర్థించే పౌరులను కూడా తయారుచేయాలి గనుక, విద్య పాలకుల అధికారంలోనే ఉండాలనడంలో ఏమీ అపరాధం లేదు.

విద్యావిధానంలో అరిస్టాటిల్ తన గురువుగారైన ప్లేటోతో ఎక్కువగా భిన్నత, వ్యతిరేకత ప్రదర్శించలేదు. దాదాపు అదే విషయాలను తిరిగి వ్యక్తీకరించాడు.

మొదటి అయిదు సంవత్సరాలు పిల్లలను ఆటపాటలకే వదిలివేయాలి. పిల్లలను సేవకులతో ఎక్కువసేపు కలివిడిగా ఉండేట్లు చూడగూడదు. తక్కువ రకం అభిరుచులు, కొద్దిపాటి ఆలోచనలు సంక్రమిస్తాయి ఇందువల్ల. అయిదు–ఏడు సంవత్సరాల మధ్య పాఠశాలతో పరిచయం ఏర్పడాలి. ఏమైనా నిజమైన చదువు ఏడు సంవత్సరాల తరువాతనే ప్రారంభం కావాలి.

పాలనా వ్యవహారాలలోనికి వెళ్ళని సామాన్య జనానికి ఉండవలసిన చదువులు ఏమిటి ?

చదవడం – వ్రాయడం వచ్చి ఉండాలి.

చదువు మనస్సును చురుకుగా, తెలివిగా తయారు చేసేట్లు ఉండాలి.

జీవనోపాధికోసమే పనికివచ్చే చదువు సార్వజనికం చేయగూడదు.

అరిస్టాటిల్ సంగీతానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాడు. పిల్లలకు సంగీతం చెప్పించడం తప్పనిసరి. ఎందుకంటే అది వాళ్ళ మనసులను పదును పెట్టి రసాత్మకమైన విషయాలవైపు తీసుకుపోతుంది. విరామ సమయాన్ని చక్కగా గడపటానికి పనికి వస్తుంది. అంతేకాకుండా లలిత కళలన్నీ – ముఖ్యంగా సంగీతం – శీలసంపదను పెంపొందించడానికి ఉపకరిస్తుంది. ప్లేటో, అరిస్టాటిల్ ఇద్దరూ కూడా ఏదో చిన్న చిన్న వివరాలలో భేదించినా – సంగీతం మానసిక వికాసానికి తప్పనిసరిగా అవసరం అని అంగీకరించారు. లలిత కళలన్నింటిలోను అనుకరణకు వీలైనది సంగీతమే. లయలు, స్థాయిలు, స్వరాలు... ఇవన్నీ మనిషిలోని వైఖరులకు ప్రకృతికి అనుగుణంగా ఉంటాయి. దానిపట్ల మనుషులకు సహజ సిద్ధమైన అనుకూలత ఉంటుంది. మనిషిలో మార్పు రావటానికి త్వరితగతిని ఉపకరించేది సంగీతం – అంటాడు అరిస్టాటిల్.

గందరగోళంగా, మరీ అస్తవ్యస్తంగా ఉన్న సంగీతాన్ని స్కూలు పాఠాలలో నుంచే కాదు, జీవితంలో నుంచే తొలగించాలి అంటాడు ప్లేటో. ఎందుకంటే ఇది అవినీతికరమైన జీవితానికి పునాదులు వేస్తుంది. మనిషి మనసును కల్లోల పరుస్తుంది. ఆ కారణంగానే ఆయన విషాదాంత నాటకాలను (Tragedies) గూడా పరిష్కరించాలని చెప్పాడు.

అరిస్టాటిల్ మరో రకంగా అభిప్రాయపడతాడు. ఆయన ఉద్దేశ్యం ప్రకారం దైనందిన జీవింలో అనాహ్లాదకరమైన వస్తువు, ప్రాణ రక్షణావసరాలలో ఉపయోగకరం కావచ్చును. రోజువారీ భోజనంలో 'విషపదార్థాలు' అని తొలగించి వేస్తున్న కొన్ని వస్తువులు – అప్పుడప్పుడు మందులు లాగా వాడుతున్నాం గదా! అలాగే దారుణమైన సంగీతం ఒక్కోసారి ఆత్మకు ఉపయుక్తకరమైన పనులను చేస్తుందేమో – అంటాడు. అలాగే విషాదాంత నాటకాలు గూడా మనుషులలో భయం, భీభత్సం, తప్పు చేయగూడదనే దృష్టి తీసుకువస్తాయని ఆయన ఆశిస్తాడు.

మనిషి పరిపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడు, ఆహార విహారాలలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా సర్దుకుపోగలుగుతాడు. ఆత్మకు హాని జరుగదు. మామూలు రాగభావాలు – ఆశా పాశాలు  ఏమీ అపకారం చేయక పోవచ్చును. కాని ఇవే ఎక్కువగా పొంగిపోయి, బహిర్గతం కావటానికి మార్గం లేనప్పుడు హాని జరుగుతుంది. దీన్ని జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది. ఈ హాని నుంచి ఆత్మను కాపాడుకోవడం అవసరం. శరీరానికి విరేచనకారిలాగ, ఈ రాగభావాల విడుదలకు సైతం ఏదైనా ఉ పాయం కనిపెట్టవలసి ఉంటుంది.

మత పారవశ్యంతో మీదు మిక్కిలి ప్రవర్తిస్తున్న వాళ్ళను హెూమియో మాత్రలు ఇచ్చి సరిదిద్ద గలగడం జరుగుతోంది. అరిస్టాటిల్ ఈ ప్రక్రియనే మరింత విస్తరిస్తూ, ఇలాంటి వారికి 'గందరగోళమైన సంగీత ధ్వనులు' వినిపింపచేసి మామూలు మనుషుల మోస్తరుగా తయారు చేయవచ్చును – అంటాడు. ఈ రాగభావాలను వదిలించుకోకపోయినట్లయితే మామూలు జీవితం దుఃఖభాజనం అయిపోతుంది.

అయితే అరిస్టాటిల్ వెలిబుచ్చిన అభిప్రాయాలను తరువాతి ఆలోచనాపరులు, రచయితలు అంత చక్కగా అర్థం చేసుకున్నట్లు కనిపించదు.

అరిస్టాటిల్ కింగ్ ఓడిపస్ (King Oedipus) అనే నాటకాన్ని బాగా మెచ్చుకున్నాడు. దీని రచయిత సాఫోక్లిస్ (Sophocles). ఈ నాటకం మానవ జీవితంలో ఏవో అంతర్గత విలువలను చెబుతోందని కాదు ఆయన మెచ్చుకున్నది. నాటక సంవిధానం (plot) బాగున్నదనీ, ఇంతగా ఏ పత్తేదారి (Detective) రచన రూపకల్పన కాలేదని, ఒక మెలో డ్రమటిక్ సన్నివేశం విజయవంతంగా ఇందులో నిర్దేశితం అయిందనీని.

# పునరవలోకం

అరిస్టాటిల్ కొన్ని వందల రచనలు చేశాడు.

కొందరు నాలుగు వందలు అంటే, మరి కొందరు వేయిదాకా ఉన్నాయి అంటారు.

అయితే మనకు మిగిలినవి బహుకొద్ది మాత్రమే. ఇది కూడా శిష్యుల చేతుల మీదుగానే మనకు వచ్చాయి. చేయి ఎవరిదైనా అభిప్రాయాలు మాత్రం ఆయనవే.

పూర్వ సంప్రదాయాలను, తత్త్వవేత్తల అభిప్రాయాలను తనకు అవసరం అయినంత వరకే ఆమోదించి ప్రచారం చేశాడు అరిస్టాటిల్.

తనకు నచ్చని సిద్ధాంతాలు, తన మనసుకు నప్పనివి– అవి సాక్షాత్తు తన గురువువే (ప్లేటో) అయినా వాటిని ఖండించటానికి, తోసిపుచ్చటానికి జంకలేదు.

మొత్తం మీద 'సుఖజీవనం' పట్ల ప్లేటో అభిప్రాయాలను బాగా విస్తరించి ప్రచారంలోనికి తీసుకువచ్చాడు. సుఖజీవనం అయిన నిత్యానుష్టానంలోనూ ఉండింది. పరిస్థితులు తాను అనుకున్న రీతిగా అనుకూలంగా ఏర్పాటు కాకపోయినా, తాత్కాలికంగా నిరాశ, నిస్పృహలకు లోనైనా, చివరి వరకు తన అభిప్రాయాల ప్రచారం, ప్రసారం చేస్తూనే ఉండిపోయాడు. అనానుకూల పరిస్థితులలో సైతం వెనుకంజ వేయకుండా తాను నమ్మిన పనిని చేసుకుంటూ పోవడం గొప్ప విషయం.

భౌతికశాస్త్రం ఆయన పరిగణనలో విస్తృతమైన క్షేత్రంగా తయారయింది.

అయితే ఆయన అభిప్రాయాలు ఇప్పటికీ క్లిష్టంగానే, అర్థం అయి అవకుండానే ఉండిపోయినాయి.

మనసు భౌతిక పదార్థమే అన్నాడు అరిస్టాటిల్. అయినా ఆయన ఆత్మ, పరమాంశ ఉన్నాయనే చెప్పాడు.

అరిస్టాటిల్ నైతిక సిద్ధాంతాలన్నీ పైథాగరస్ నుంచి తీసుకున్నవే.

అర్థం చేసుకుందుకు క్లిష్టంగా ఉండే సిద్దాంతాలను రూపొందించాడు. ఎక్కువ భాగం శ్రోతల, చదువరుల ఆలోచనకే వదిలాడు. తార్కికంగా ఆలోచించడం ఎలాగో నేర్పాడు.

జీవిత చరమాంకంలో తన మీద అభియోగం వచ్చినప్పుడు అరిస్టాటిల్ ఆ దేశాన్ని వదిలి పారిపోయాడు. ఈ చర్యవల్ల మనం అరిస్టాటిల్ 'పిరికివాడు'

అనుకోగూడదు. ఏథెన్స్ నగరానికి చెందిన తత్త్వవేత్తను గూడా 'చంపివేశారు' అనే అపప్రథ రాగూడదని ఆయన అనుకున్నాడేమో!

ఏథెన్స్ నగర పాలన సూత్రాలలో ఒకటి ఉన్నది. ఎవరి మీదనైనా అభియోగం వచ్చినప్పుడు, ఆ మనిషి దేశ త్యాగం అయిపోవచ్చును. ఇది దేశద్రోహం కింద గాని, నేరంగా గాని భావించరు. అరిస్టాటిల్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు.

ఛాల్సిస్ (Chalcis) చేరుకున్న తరువాత అరిస్టాటిల్ జబ్బుపడ్డాడు.

డియొగెనస్ లార్డియస్ (Diogens Laerties) చెప్పిన ప్రకారం – అరిస్టాటిల్ తన జీవితాన్ని అంతం చేసుకుందామనే ఉద్దేశ్యంతోనే విషం తాగాడు.

ఎంత ప్రయత్నించినా, ఆయన సుస్తీ నయం కాలేదు. ఏథెన్స్ నగరం వదలిన కొన్ని నెలలకే జీవితం పరిసమాప్తి అయిపోయింది.

అదే సంవత్సరం, అలెగ్జాండర్ శత్రువులలో ప్రధానుడు డెమొస్తనిస్ (Demosthenes) కూడా విషం పుచ్చుకుని మరణించాడు.

పన్నెండు నెలల విరామంలోనే – గ్రీస్ దేశం తన పాలకుడిని తత్త్వవేత్తను కోలుపోయింది.

గ్రీస్‌దేశ తేజోరాశి సూర్యుడు క్రుంగిపోయాడు.

రోమన్ సూర్యుడు తల ఎత్తుతున్నాడు.

గ్రీస్‌దేశ వైభవం వేరు, రోమన్ ఉన్నతి వేరు. రోమన్లు అధికార లాలసకు, నిరంకుశత్వానికి ప్రతీకలు. గ్రీస్‌దేశపు ఆలోచనా సరళి, తత్త్వసంపద, విచారధార అక్కడ లేవు.

వేయి సంవత్సరాలపాటు యూరప్ ఖండమంతా చీకటి మరుగున పడిపోయింది.

కాలవ్యవధి గంభీరమైనది.

తత్త్వశాస్త్ర పునరుజ్జీవనానికి ప్రపంచమంతా వేచి ఉండవలసిన తరుణం వచ్చింది.

అరిస్టాటిల్ అస్తయమం అకాలంగానే జరిగినట్లు లెక్క. ఆయన తన ఆచార్యుడు ప్లేటో వలె కనీసం ఎనభై సంవత్సరాలైనా జీవించి ఉండలేదు. అయినా తరతరాలుగా అనేక రంగాల ఆలోచనాపరుల హృదయాలలో నిలిచి ఉంటాడు; నెలకొని ఉంటాడు.

**– సమాప్తం –**


మనుచరిత్ర
వసుచరిత్ర
ఆముక్తమాల్యద
కళాపూర్ణోదయం
శృంగార నైషధం
కుమార సంభవం
శృంగార శాకుంతలం
విజయ విలాసము
కాదంబరి
రఘువంశం
మేఘసందేశం
కాశీఖండం
క్షేత్రయ్య పదాలు
అర్థశాస్త్రము
కళలు
గీతాంజలి
దేశభక్తి గేయాలు
జయంతి పబ్లికేషన్స్
విజయవాడ-2
కన్యాశుల్కం